జనవరి 2వ సంచిక



ప్రత్యేక వ్యాసాలు:

- సమాజంలో స్త్రీల స్థితిగతులే నా రచనలకు ప్రేరణ!
- కాలేజీల్లో స్త్రీలకి సీట్లు కోటా అవసరమా (చర్చావేదిక)
- ఆరోగ్యానికి మంచి తిండి అలవాట్లు
- హేమమాలిని కూడా ఎం.పి. అవుతుందా!

కథలు:

* మనిషి మనిషికి చెప్పండి (పెద్దకథ)
* క్షోభ్యత
* విరితాలాపం
* చిన్నగీత- పెద్దగీత
* అసలయిన నాగరికత
* వసంతంలో హేమంతం

సీరియల్స్:

- ప్రగతి పథంలో
- బల్లికట్టు
- నన్ను వెళ్ళిపోనీరా!

ఒరులేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథములకెల్లన్!

ఎడిటోరియల్ అడ్వయిజర్: శివలెంక రాధాకృష్ణ ఎడిటర్: వీరాజీ ముద్రాపకుడు: ప్రచురణకర్త: శివలెంక నాగేశ్వరరావు

విజయవాడ 26-1-1990 శక సం. 1911 మాఘ మాసం 6వ తేదీ

టెర్రరిజంనుంచి పంజాబ్‌కు విముక్తి ఎప్పుడు?

లూధియానాలో భారత ప్రధాని శ్రీ వి.పి.సింగ్ భారీ ఎత్తున నిర్వహించిన అఖిలపక్ష మహాసభలో కేంద్ర హోంమంత్రి శ్రీ ముఫ్తీ మహ్మద్ సయీద్ ఒక మాట అన్నారు. "ఏడు సంవత్సరాలుగా నలుగుతున్న చిక్కు సమస్య పంజాబుని పరిష్కరించడానికి మావద్ద అల్లావుద్దీన్ అద్భుత దీపం లాంటిది ఏమీ లేదు" అయితే అతి తీవ్రంగా గాయపడ్డ పంజాబ్ స్థితిగతుల్ని మేం ఉపశమింపచేయడానికి ప్రయత్నం చేస్తున్నాము- అని కూడా కేంద్ర హోంమంత్రి అన్నారు! పది సంవత్సరాలుగా మనం జాతీయ గీతం పాడుకుంటున్నప్పుడు 'పంజాబు సింధు గుజరాత్ మరాఠా' అన్న చరణంలోని 'పంజాబ్' అనే మూడు అక్షరాలు మన హృదయాల్లో మాటల్లో చెప్పడానికి వీలులేని "చివుకు"మనే బాధను కలిగిస్తూనే వున్నాయి.

పంజాబ్ సమస్య ఒక యేడాది కొక యేడాది ముక్కలు ముక్కలుగా తెంపితేతప్ప తెగదేమోనన్న "దారం చిక్కులు ముడి"లాగా జటిలమైపోతూ వచ్చింది. అనివార్య పరిస్థితులలో తీసుకున్న నిర్ణయమే అయినా శిఖ్ఖు భీషణ వాదం 'బ్లూస్టార్' చర్యని సహించలేక పోయింది! దీనికి ప్రతీకారంగా దేశ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ ఆహుతి అయిపోయారు. పంజాబ్‌లోను ఢిల్లీలో పలు ప్రాంతాలలో కూడా 'శాంతి' కనీసం ఒక్క రోజు కూడా నిలదొక్కుకోలేని స్థితిలో అరాచక విధ్వంసకకాండలు చెలరేగుతూనే వున్నాయి. పార్లమెంటులో 'మందిమద ఆధిక్యత' కలిగిన కాంగ్రెస్ (ఐ) అధ్యక్షుడు దేశ ప్రధానమంత్రి బుల్లెట్‌ప్రూఫ్ కవచంతో దేశంలో తిరుగాడవలసి వచ్చింది. అఖిలపక్ష సమావేశాలు, బహుళపార్టీ మంతనాలు, శాంతియాత్రలు ఎన్నెన్ని జరిగినా, ఆనందపూర్ సాహిబ్ తీర్మానాన్నిగానీ, లోంగోవాల్ హత్యనికానీ సుర్జిత్‌సింగ్ బర్నాలా ప్రభుత్వ పతనాన్నిగానీ ఎవ్వరూ ఆపలేకపోయారు! అయిదు నదుల అమృతజలాలతో తడిసి నిత్యనూతన సస్యశ్యామలమై ప్రకాశిస్తూ దేశంలోని ఇతర రాష్ట్రాలకు అన్నభిక్ష పెట్టవలసిన 'పంజాబు మాత' తన గుండెలు చీల్చుకుంటూ ఈ దారుణ నిత్య సత్యాలై ప్రవహిస్తున్న రక్తపుటేరులకు విచలితయై రోదిస్తూనే వున్నది! "అయితే కేంద్రంలో పరిపాలనా యంత్రాంగాన్ని క్రొత్త ఫ్రంట్ చేతిలో పెట్టిన సగటు భారతీయుడు" పంజాబ్‌లో శాంతి పునరుద్ధరణకు అవసరమైన ప్రయత్నాలన్నీ ప్రారంభమవుతాయనే ఆశిస్తాడు! 'తదనుగుణంగానే నేషనల్ ఫ్రంట్ నాయకుడు, ప్రధానమంత్రి శ్రీ వి. పి. సింగ్ అప్పుడే రెండుసార్లు అఖిలపక్ష సమావేశాలకి తనవంతు చిత్తశుద్ధితో అభినందనీయమైన ప్రయత్నాన్ని చేశారు! లూధియానాలో జరిగిన అఖిలపక్ష మహాసభలో శిఖ్ఖు ఉద్యమకారులందరకి వర్తించే అనేక రాయితీలను ఆయన ప్రకటించారు. చివరికి సైనిక తిరుగుబాటులో మతకారణంగా భాగస్వాములైనవారికి కూడా విముక్తి, పునరావాసం కల్పిస్తామని హామీ యిచ్చారు. పంజాబ్‌లో ఆయుధాలు ధరించిన-ప్రాణాలకు తెగించిన 'ఉగ్రవాద దండు' సమస్య ఒక ఎత్తు అయితే, వారికి మద్దతునిచ్చి, తమ పబ్బం గడుపుకునే రాజకీయ టెర్రరిస్టు ధోరణులుకూడా లెక్కకు మించినన్ని గడచిన దశాబ్దంలో పడగలెత్తి బుసలు కొడుతూ 'గరళం' కక్కుతూనే వున్నాయి! వీటిని అదుపుచేయలేని స్థితిలో గత ప్రభుత్వం రాజ్యాంగాన్ని సవరించి మరీ అత్యవసర పరిస్థితిని విధించింది. శ్రీ వి. పి. సింగ్ యీ 59వ సవరణని ఉపసంహరించడం ద్వారా 'పుండు మీద కారం' చల్లినట్టుగా వుండే పరిస్థితిని పంజాబు ప్రజలకు తప్పించారు. శిఖ్ఖుమత భీషణ వాదులు కోరుతున్న 1984 నాటి అల్లర్లకు కారణమైన వారిని శిక్షిస్తామన్న నిర్ద్వంద్వమైన హామీని కూడా ఇప్పుడు కేంద్రం పంజాబుకి ఇచ్చివుంది. 'లూధియానా' అఖిలపక్ష మహాసభలో చప్పట్లు, ప్రేలుళ్లు వినిపించలేదు కానీ అదే సమయంలో పంజాబులోని ఇతర ప్రాంతాలలో టెర్రరిస్టుల దారుణ మారణ హింసాకాండ యధావిధిగా కొనసాగింది!

కాంగ్రెస్-ఐ పార్టీ ఈ సమావేశానికి కలిసిరాలేదని ఆక్షేపించిన శ్రీ వి. పి. సింగ్ సహచరులు తాము సకల మర్యాదలు లాంఛనాలు యిచ్చి సమావేశానికి హాజరు కమ్మని బుజ్జగించి మరీ పిలిచిన 'సిమరంజిత్‌సింగ్‌మాన్' వర్గం ఎందుకు హాజరు కాలేదో? చెప్పకపోవడం నిజంగా ఆశ్చర్యం కలిగిస్తోంది.

నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వంలో ప్రధానమంత్రితో సరిపోయేటంత పీట వేసుకొని కూర్చున్న 'శ్రీ దేవీలాల్' తాను మొదట ప్రకటించినట్టుగా 'తావూ' (పెదనాన్న) పాత్రని మహాభారతంలో 'శకుని' మాదిరిగా నిభాయిస్తున్నారనటానికి, యీ అఖిలపక్ష సమావేశానికి కాంగ్రెస్ రాకూడదని ఎలిగెత్తి చాటిన ఒక సందర్భమే చాలు!

విడిప్రతి వెల నాలుగు రూపాయలు!

ఆంధ్ర సచిత్ర వార పత్రిక

సంపుటం-82 స్థాపితం 1908 బొంబాయి : 1914 మద్రాసు సంచిక-23

వ్యవస్థాపకులు : దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

(1938-1972 సంపాదకులు : శివలెంక శంభుప్రసాద్)

ఆంధ్రపత్రిక ప్రెస్, గాంధీనగరం, విజయవాడ-3, ఫోన్‌లు : 75667, 61247, 61248

ఉప ప్రధాని కాంగ్రెస్‌ని రావద్దని హోంమంత్రిని రమ్మని కోరడం అసలే "కుంజర యూథము దోమ కుత్తుక జొచ్చెన్" అన్నట్లుగా అల్లాడిపోతున్న కాంగ్రెస్-ఐ పార్టీకి ఒక 'సాకును' ఫ్రంట్ నాయకత్వమే ఇచ్చినట్లు కాలేదా?

లూధియానా 'ర్యాలీ' జరుగుతూ వుండగానే 'సిమరంజిత్‌సింగ్‌మాన్' అసాధ్య మయిన ఎనిమిది కోర్కెలతో ఒక షరతుపత్రం ప్రధాని శ్రీ వి. పి. సింగ్‌కు అందజేయడం హడావుడిలో ఎవరూ మర్చిపోవలసిన విషయం కాదు. జనరల్ వైద్య హంతకుల్ని విడిచి పెట్టాలని శ్రీ మాన్ కోరడం పంజాబ్‌లో శాంతి స్థాపనకి దేశంలో రాజ్యాంగ బద్ధమయిన, చట్టయుతమైన పరిపాలనకి ఇది దోహదించడమా! పంజాబులోవున్న శిఖ్ఖు రాజకీయ పక్షాలన్నీ "యిప్పటికీ టెర్రరిస్టుల చేతిలో కీలు బొమ్మల"ని రాజకీయ పండితులంటున్నారు. ఇప్పుడీ 'మాన్' వర్గం 'మాన్‌నమస్ మై తేరా మెహమాన్' అన్నట్లుగా శ్రీ వి. పి. సింగ్‌కి తలకాయ నొప్పిగా పరిణమించే అవకాశముంది. అంచేత కాంగ్రెస్-ఐ పార్టీ కలసిరాకపోవడం చేతనే పంజాబ్‌లో శాంతి స్థాపన ప్రయత్నాలు సానుకూలం కావటం లేదని అంటున్న విదేశాంగమంత్రి 'శ్రీ ఐ. కె. గుజ్రాల్' ఆమాట అనేముందు శ్రీ మాన్ వర్గాన్ని ఇటువంటి సమావేశాలకి హాజరు పరిచే ప్రయత్నం చేయడం మంచిది. పాకిస్తాన్ సరిహద్దులు మీదుగా విద్రోహకర శక్తులు రాకుండా అరికట్టడం వెనుకటి కాంగ్రెస్ గవర్నమెంట్ చేయలేకపోయింది. ఆ పని శ్రీ వి. పి. సింగ్ గవర్నమెంట్ తక్షణ కర్తవ్యం ! అటు పిమ్మటగానీ పంజాబుకి టెర్రరిస్టుల భీషణ పిడికిలి నుంచి విముక్తి లభించదు! అంచేత పాకిస్తాన్-పంజాబ్ సరిహద్దుల్ని మూసెయ్యండి! ○

పదండి లోపలికి!

ఈవారం ప్రత్యేకం:

కథలు:

సీరియల్ నవలలు:



ముఖచిత్రం
"రాముడు కాదు రాక్షసుడు"లో
రాధ, సుమన్, భానుప్రియ

పై వారమే ప్రత్యేక వ్యాసం
ఊపిరితిత్తులకి వచ్చే వ్యాధులు

వ్యాసాలు, శీర్షికలు:

నక్సలైట్లకి పిలుపు!



తాజా కాలమ్

వీరాజీ

ఆ నాటకీయత లేదు. ఆ హావభావ ప్రదర్శనా ఆ ఆర్భాటం లేదు. ఆరుకోట్ల ఆంధ్రులు, ఆడపడుచులు మాటల మధ్య పదే పదే నలిగిపోలేదు. కాషాయంబర ధారి 'ఎన్టీఆర్'ని తలుచుకుంటూనే టీ. వి. ప్రేక్షకులు తెల్ల చొక్కా డాక్టర్ మర్రి చెన్నారెడ్డి 'సంగ్రాంతి' శుభాకాంక్షలని అందుకున్నారు.


డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తన గవర్నమెంట్ 'పాలసీని', తమ పద్ధతుల్ని అందరికన్నా ఎక్కువగా 'ఎన్జీవో'లకి నచ్చే విధంగా వివరించారు. పదే పదే ప్రత్యర్థి వర్గాన్ని తిట్టడం రాజకీయ నాయకులందర్నీ పీడించే జాడ్యం. కానీ ఆ పద్ధతికి చాలా హుందాగా డా. మర్రి చెన్నారెడ్డి స్వస్తి పలికారు. కేంద్రంలో 1978 లో ఆయన ముఖ్యమంత్రిగా వున్నప్పుడు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం లేదన్న సంగతి ఆయన గుర్తు చేశారు. మెమ్మెమ్మేలు, పెప్పెప్పేలు, చురకలు, మరకలు, వాతలు, కోతలు లేవు. సూటిగా, క్లుప్తంగా ప్రతీ సమస్యని డా. మర్రి చెన్నారెడ్డి స్పృశించారు. విశ్వవిద్యాలయాలు, విశ్వవిద్యాలయ స్వయం ప్రతిపత్తి గురించి చెపుతూ ఛాన్సలర్‌గా గవర్నరే వుండాలనీ, ముఖ్యమంత్రికా పదవితో పని లేదని అంటూ వృత్తి విద్యని ప్రోత్సహించే విద్యా పద్ధతులేవో త్వరలోనే రూపొందిస్తామని సాధ్యమైనంత అస్పష్టంగా చెప్పిన ముఖ్యమంత్రి చెన్నారెడ్డిని మనం నిందించలేం! ఇక్కడ వృత్తి విద్య అంటే "కుల వృత్తిని మించిన వృత్తి లేదు గువ్వల చెన్నా" అన్న మాటను ముఖ్యమంత్రి ఉటంకించారా? లేకపోతే వైద్య విద్య, ఇంజనీరింగ్ కోర్సులాంటి వృత్తి విద్యలు గురించి మాట్లాడారో స్పష్టం కాలేదు. వడ్రంగం, కంచరం, తాపీపని లాంటివి విద్యారంగంలో. చోటు చేసుకునే అవకాశాలు వస్తే కులాలకు ప్రాధాన్యత పోయి వృత్తి కళాకారులకు గుర్తింపు వస్తే "పని చేసే హక్కుని" వి. పి. సింగ్ గారు మళ్లీ కొత్తగా ఇవ్వక్కరలేదు. కానీ సంఘంలో అడుగడుగునా ఏర్పడి పోయిన కుల క్షేత్రాలని ఐక్యంగా కలిపే నవసమాజానికి మార్గాలు ఇప్పట్లో లేవనే అనుకోవాలి.

రాష్ట్రంలో ముఖ్యంగా తెలంగాణా ప్రాంతంలో 'నక్సలైట్ల' హింసాకాండను కేవలం శాంతిభద్రతల సమస్యగా కాకుండా పలువురు మేధావులు కోరుతున్న విధంగా ఒక రాజకీయ సమస్యగా పరిష్కరించుకోవాలను కోవడం డా. మర్రి చెన్నారెడ్డి నిగ్రహానికి నిదర్శనం. 'పోలీసుల ఎన్‌కౌంటర్ల' మీద ఆగ్రహించిన నక్సలైట్లు, 'నక్సలైట్ల ఆగడాల' మీద ప్రతీకారేచ్ఛతో రగిలిపోయిన పోలీసులు సాగించే పరస్పర పోరాటం, ప్రజా సమస్యా పోరాటం కాదని, ప్రజాస్వామ్య యుతమైన పద్ధతిలోనే యే ఆలోచనా ధోరణి గల పార్టీ అయినా కృషి చేయాలని నక్సలైట్లకి ప్రజలు, పత్రికలు కూడా ఎన్నోసార్లు విజ్ఞప్తి చేశారు. డా. మర్రి చెన్నారెడ్డి 'పీపుల్స్ వార్' గ్రూప్ నాయకులు లేదా వారి ప్రతినిధులు ఎవరు ముందుకొచ్చినా వారితో మాట్లాడతామని అసెంబ్లీలోనే ప్రకటించారు. నిర్బంధంలో వున్న నక్సలైట్ అనుచరుల్ని 'బెయిల్' మీద విడుదల చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి పిలుపుకి నక్సలైట్ నాయకులు విడి విడిగా కానీ, కలివిడిగా కానీ స్పందించినట్లయితే సంతోషించని తెలుగువాడుండడు!



ఎన్నికల సంస్కరణలు

కమిటీలు, నివేదికలు, పరిశీలనలు, పునఃపరిశీలనలు యివన్నీ కూడా మనం చేయలేని పనులు లేదా చేస్తే మన పీకకి చుట్టుకునే ప్రమాదం గల పనులు కొంతకాలం వాయిదా వేయడానికి ఆక్షేపణ లేని ఉపాయాలు. నేషనల్ ఫ్రంట్ గవర్నమెంట్ ఎన్నికల సంస్కరణ విషయంలో కూడా యీసారి అసెంబ్లీ ఎన్నికలు గడిచిపోయేదాకా కాలహరణం చేయడానికి పూనుకున్నట్లే కనిపిస్తోంది. 22 పార్టీలు క్రొత్త ఢిల్లీలో శ్రీ వి. పి. సింగ్ అధ్యక్షతన సమావేశం అయినపుడు భిన్నమైన అభిప్రాయాలు సహజంగానే వస్తాయి. తొమ్మిదిసార్లు సార్వత్రిక ఎన్నికలు జరిగినప్పటికీ అధిక సంఖ్యాకులు ఓటింగ్‌లో పాల్గొనే పద్ధతి మనదేశంలో సాధ్యం అవటంలేదు. కండబలం, కాసుబలం ఈ రెండూ రెండు



భారత్ క్రికెట్ జట్టులోకి
కొత్తగా చేరిన వెంకటపతిరాజు

గుర్రాల్లాగా ఓటింగ్ రథాన్ని లాక్కెళ్తున్నాయి. రిగ్గింగ్, రక్తపాతం ఎన్నికల దీపం క్రింద నీడలు. నల్ల ధనం ఎన్నికలకి శ్రీరామరక్ష. గుండాయిజం రాజకీయాలకి అంగరక్షకుడు. అధిక సంఖ్యాకులు నిర్భయంగా 'పోలింగ్ బూత్'కి వచ్చి ఓటు వేయగల అవకాశాలు ఎప్పుడు కలుగుతాయో అప్పుడే అసలైన, సిసలైన ఎన్నికల సంస్కరణలు అమలు జరిగినట్లు లెక్క. వాస్తవానికి కాంగ్రెస్-ఐ గవర్నమెంట్ ఓటింగ్ హక్కుని 18 సంవత్సరాల పిల్లకాయలందరికీ ఓటింగు హక్కు ఇవ్వడం ద్వారా ఒక ప్రధానమైన సంస్కరణ తీసుకువచ్చింది. అయితే మొన్నటి ఎన్నికలలో దొంగ వోట్లు పోలవడానికి యీ సంస్కరణ బాగా దోహదించింది తప్ప- అసలు యువత అంతా యింకా వోటర్లుగా నమోదు కానేలేదు. ఏ మార్పులు చేసినా 'వోటింగ్'లో వోటర్లు నిర్భయంగా అధిక శాతం వోట్లు పోలయ్యే విధంగా వుండాలి- కేడర్ అంటే "గూండాలు" కాని రీతి-వాలంటీర్‌లకి అయిడెంటిటీ కార్డులు యిచ్చే పద్ధతి కూడా మంచిదే! ముందు "కమిటీ" రానివ్వండి ఆనక చూద్దాం-

(16-1-'90)



శ్రీమతి ఇందిరాగాంధీ హత్యకేసులో ఐదేళ్ల కారాగారవాసం అనుభవించి జైలు నుంచి విడుదలైన శ్రీ సిమ్రంజిత్‌సింగ్‌మాన్‌కు స్వాగతం పలుకుతున్న అభిమానులు. గత ఏడాది జరిగిన సాధారణ ఎన్నికలలో అమృత్‌సర్ జిల్లా తరన్‌తరన్ నుంచి ఆయన లోక్‌సభకు ఎన్నికయ్యారు.

సీరియల్

ద్రౌపది

ప్రయాగ రామకృష్ణ



(గత సంచిక తరువాయి)

ఇంతవరకూ సాగిన కథ - 24 : ద్రౌపదితో ఖాండవప్రస్థం చేరిన పాండవులు నారదుని సలహాపై రాజసూయయాగం నిర్వహిస్తారు. మయసభలో తనకు జరిగిన పరాభవానికి ప్రతీకారంగా దుర్యోధనుడు జూదంలో పాండవుల సంపదను హరించి, ద్రౌపదిని నిండు కొలువులో అవమానిస్తాడు. తిరిగి అను ద్యూతంలో ఓడిపోయిన పాండవులు అడవుల పాలవుతారు. పన్నెండేళ్ల అరణ్యవాసానంతరం మారుపేర్లతో విరాటరాజు కొలువు చేరి అజ్ఞాతవాసాన్ని పూర్తి చేస్తారు. పాండవులు తనకు చేసిన ఉపకారానికి బదులుగా తన కూతురు ఉత్తరను - అభిమన్యున కిచ్చి వివాహం జరిపిస్తాడు విరటుడు.

ధర్మరాజు తనకు తానే వెళ్ళి జూదమాడాడా? కౌరవులందరూ కలిసి, బలవంతంగా ఆయన చేత ఆడించి మోసగించారా? చెప్పవేం?' అని అడిగాడు సాత్యకి బలరాముణ్ణి చూస్తూ బలరాముడు యీ మాటలకు నోరు మెదపలేదు

'నన్నడిగితే దూతల్ని పంపడం అనవసరం

తనకు న్యాయంగా రావల్సిన రాజ్య భాగం ఇమ్మంటున్నాడు ధర్మరాజు ఇచ్చారా సరే సరి! లేకపోతే అనుభవిస్తారు' అన్నాడు సాత్యకి ఆవేశంగా

ద్రుపదుడు కృష్ణుడి వైపు చూస్తూ 'అయినా దుర్యోధనుడితో మాట లేమిటి! గాడిదతో మృదువుగానూ, ఆవుతో కర్కశంగానూ ప్రవర్తించడం వివేకమేమో నువ్వే చెప్పు! మనం సేనలు సిద్ధం చేసుకుని పిలవదగిన రాజులందర్నీ సహాయం కోసం ఇప్పుడే పిలవడం మంచిది అంతగా మీరు కాదంటే మా పురోహితుణ్ణి దూతగా పంపేందుకు నాకేం అభ్యంతరం లేదు' అన్నాడు

'మీ మాటే నా మాట కూడా రాయబారానికి మీ పురోహితుణ్ణి పంపండి సంధి జరిగితే మంచిదే లేకపోతే అప్పుడు చూద్దాం' అని కృష్ణుడు విలాసంగా నవ్వాడు వెంటనే ద్రుపదుడి పురోహితుణ్ణి హస్తినాపురానికి ప్రయాణం కట్టించారు

'పాండవులు పడ్డ కష్టాలు లోకానికంతటికీ తెలుసు ఇప్పటికైనా వాళ్ళ తండ్రి భాగం వాళ్ళకిచ్చేయడం ధర్మం ప్రజా క్షయం కలుగుతుందనే ఉద్దేశంతో పాండవులు యుద్ధం వద్దనుకుంటున్నారు గాని మీకు భయపడి మాత్రం కాదు నా మాట వినండి పాండవుల బలం ఏడు అక్షోహిణులే అనుకోకండి భీమార్జున లిద్దరే కోటి అక్షోహిణుల పెట్టు అదీగాక దేవుడై పుట్టి మనిషిలా నటిస్తూ మహిమలు చేయిస్తున్న కృష్ణుడు వాళ్ళకు అండగా వున్నాడు తాను ఆయుదం పట్టకుండా, పరుష వాక్యం పలకకుండా ఆ మహానుభావుడు 'ఏమైనా చెయ్యగలడు' అన్నాడాయన

ఆ మాటలకు దృతరాష్ట్రుడి కొలువు కూటంలోని వాళ్ళందరూ ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు

'ఇంతకీ నువ్వెవర్ని బెదిరిస్తున్నావ్?' అన్నాడు కర్ణుడు ద్రుపద పురోహితుణ్ణి తినేటట్టు క్రూరంగా చూస్తూ

ఆయన నవ్వి, 'ఇందులో బెదిరించడమేముంది? అయినా పాండు కుమారులు తిరగబడితే మిమ్మల్ని ఓడించడం అంత కష్టమా? మీ శౌర్య పరాక్రమాలకు భయపడి, యుద్ధం చేయడం చేతకాకే వాళ్ళు ఇన్నాళ్ళూ వూరుకున్నారా?' అన్నాడు ఆ తరువాత క్షణమాగి '. మీ యిష్టం' అన్నాడు

'జూదంలో ధర్మరాజు ఓడాడు అన్నమాట ప్రకారం అరణ్యవాసం చేశాడు ఇందులో మేం చేసిన తప్పేమిటో అర్థం కావడం లేదు నాకు అజ్ఞాత వాసం పూర్తి కాకుండానే బయటపడి రాజ్యభాగం ఇమ్మంటూ విరటుణ్ణీ ద్రుపదుణ్ణీ తోడు చేసుకుని రాయబారం నడిపేందుకు వాళ్ళకు సిగ్గెట్లా లేదో' అన్నాడు కర్ణుడు

భీష్ముడికి కర్ణుడి ప్రేలాపన చికాకు కలిగించింది ముందుకు వంగి అన్నాడు '-చూడూ, నిన్నగాక మొన్న ఉత్తర గోగ్రహణ మప్పుడు మనల్నందర్నీ అర్జునుడొక్కడే గెలిచాడు ఇవేళ నువ్విక్కడ అతన్ని మాటల్తో గెలుస్తున్నావు అర్జునుడు గోవుల వెనకాల వచ్చినప్పుడే వాళ్ళ అజ్ఞాతవాస గడువు పూర్తయింది' అన్నాడు

కర్ణుడు ముఖం మాడ్చుకున్నాడు

అంతా నిశ్శబ్దం

ధృతరాష్ట్రుడు బాధ పడ్డాడు 'అయ్యో! కర్ణుడు చిన్నవాడు తెలీక ఏదేదో అన్నాడు పాండవుల్ని కలుపు కోడమే నాకు సమ్మతం మీరు వెళ్ళండి మీ వెనకాలే మా దూత వస్తాడు' అని ద్రుపద పురోహితుడికి వస్త్ర భూషణాలూ, కర్పూర తాంబూలాలూ ఇప్పించాడు తరువాత సంజయుడ్ని పిలిపించి ' దుర్యోధనుడికి మంచీ చెడ్డా తెలీక పరిస్థితి ఇంత వరకూ వచ్చింది ఇంతటైనా మనం వాళ్ళతో సఖ్యంగా లేకపోతే ఆడుకున్నంత తేలిగ్గా వాళ్ళు నా బిడ్డల్ని హత మారుస్తారు నువ్వు ఇప్పుడే ఉపప్లావ్యం వెళ్ళి పాండవులకు ప్రియం కలిగేటట్టు మాట్లాడిరా! ఎలాగైనా వాళ్ళు యుద్ధం తలపెట్ట కుండా చూడు' అని అర్థిస్తున్నట్టు అడిగాడు

సంజయుడు సరేనని బయలు దేరాడు

సంజయ రాయబారం

రథం ఉపప్లావ్యం చేరింది.

సంజయుడు రథం దిగి పాండవుల సౌధం వైపు నడిచాడు. అక్కడ బయట చాలా సందడిగా వుంది.

రకరకాల రథాలూ, రథాలకు పూన్చిన సకిలిస్తున్న గుర్రాలూ వాటి వెనకాల భటులూ, ఆయుధాలు ధరించిన యోధులూ వున్నారు. తను ఎవరో ఆయన చెప్పక మునుపే పరిచారకుడొకడు లోపలికి పరిగెత్తుకు పోయి 'ప్రభూ! ఎవరో మీ దర్శనం కోసం వస్తున్నారు' అని ధర్మరాజుకు చెప్పాడు. ధర్మరాజు అప్పుడు బంధు మిత్రులతో సమాలోచనలో వున్నాడు.

"వారెవరో కనుక్కుని సకల మర్యాదలతో తోడ్కొని రండి' అని ఆజ్ఞాపించాడు ధర్మరాజు. ఇంతలో సేవకులు సంజయుణ్ణి లోపలికి తీసుకొచ్చారు. ధర్మరాజు చేతులు జోడించి ఆయనకు నమస్కరించి ఉచితాసనం మీద కూర్చోబెట్టి 'మా పెద్ద తండ్రి ధృతరాష్ట్ర మహారాజూ ఆయన కొడుకులూ సుఖంగా వున్నారా?' అని' అడిగాడు.

'నాయనా! ధృతరాష్ట్రుడు మరీ పెద్దవాడై పోయాడు. ఇప్పుడు మీరు సుఖంగా వున్నారని విన్నాక కాస్త శాంతిగా వున్నాడు. తన కొడుకు చేసిన పనులకు మీరేవిధ గా ప్రతీకారం తీర్చుకుంటారో, ఏక్షణాన యుద్ధ మంటారో అని భయపడు తున్నాడు.

....యుద్ధ మంటే మాటలా చెప్పు. ప్రజలందరూ నాశనమై పోతారు. పైగా జయం ఎవరికి కలుగుతుందో చెప్పలేం. కనక కలహం మానమని చెప్పడానికి ఇంతదూరం వచ్చాను' అన్నాడు సంజయుడు.

"నిజం చెప్పు. కయ్యానికి కాలు దువ్వింది వాళ్ళా మేమా! వాళ్ళు చేసిన వన్నీ సహించాం. ఆ సంగతి మీ అందరికీ తెలుసు. ఇకముందు కూడా మేం అన్యాయంగా వాళ్ళ కేమీ హాని చెయ్యం. కాని మా భాగం రాజ్యం మాకు మర్యాదగా ఇవ్వాలి' అన్నాడు ధర్మరాజు. ఆయన ముఖం కోపంతో కొంచెం ఎర్ర బడింది.

'నాకు తెలుసు, నువ్విన్ని కష్టాలు పడ్డావంటే ఆ దుర్యోధనుడే దానికి కారణం. కాని అజాత శత్రువునని పేరు తెచ్చుకుని చివరకు బంధువుల్నీ గురువుల్నీ చంపే క్రూర కర్మానికి ఎందుకు పాల్పడతావ్?' అన్నాడు సంజయుడు.

ధర్మరాజు నవ్వి 'ఆ కితాబులే నాకు అపకారం చేశాయి. నా మంచితనమే నా మెడను సున్నాలా గుండ్రంగా చుట్టేసుకుని ఇన్నాళ్ళూ వూపిరాడ కుండా చేసింది. అయినా రాజులకు యుద్ధం ధర్మం కాదని ఎవరంటారు?' అన్నాడు.

సంజయుడు మాట్లాడ లేదు.



విద్యార్థులలో అశాంతి ఎందుకు?

ఎంతో కష్టపడి చదివి డిగ్రీ చేత బుచ్చుకొని ఉద్యోగాన్వేషణలో ఎదురయ్యే సంఘటనలు విద్యార్థులలో అశాంతికి కారణ మవుతున్నాయి. ఇంటర్వ్యూ సమయంలో తనకు రావలసిన ఉద్యోగం రికమండేషన్ తెచ్చుకున్న అభ్యర్థికి రావటం, తను చదువుకున్న చదువుకు సార్థకత చేకూరక నిరాశ చెందటం విద్యార్థుల్లో అశాంతిని కలుగజేస్తున్నయనటంలో సందేహం లేదు.

-ఎ. నాగయ్యనాయుడు,
(నెల్లూరు.)



ద్రౌపది

రాయబారం సానుకూల పడదనే అభిప్రాయానికి మాత్రం వచ్చాడు.

'కోపం విషం లాంటిది. అల్పులెవరూ దాన్ని మింగలేరని నిన్ను అర్థిద్దామని వచ్చాను.....' అని అక్కణ్ణుంచి బయలు దేర బోయాడు సంజయుడు.

'నిజమే, మింగగలిగినన్నాళ్ళు నా అంతట నేనే విషాన్ని మింగాను. అది నా అసమర్థ తనుకున్నారు. మాయలూ, మోసాలు చేతకావు కాబట్టే కౌరవులు ద్రౌపదిని తల పట్టి ఈడ్చినా వూరుకున్నాం, నిండు సభలో ద్రుపద రాజపుత్రికి వస్త్రాపహరణం చెయ్యబోయినా తలలొంచుకున్నాం. ఎంత నీచులు కాకపోతే తల్లి లాంటి వదినను పరాభవిస్తారు. అయినా గతాన్ని తవ్వుకోవడం అనవసరం., మర్యాదగా మా రాజ్యం మాకు ఇమ్మను. పోనీ మా ఆస్తంతా మాకు ఇవ్వడం ఇష్టం లేకపోతే మా అయిదుగురికీ అయిదు ఊళ్ళు ఇమ్మను. వున్నంతలో అనుభవిస్తూ సుఖంగా వుండే అలవాటు మా అమ్మ మాకు చిన్నప్పుడే చేసింది' అని కృష్ణుడి వైపు చూశాడు ధర్మరాజు.

అతి కష్టం మీద ఆవేశాన్ని అణుచుకున్నాడాయన.

'నన్నడిగితే యుద్ధం చెయ్యడమే మంచిదంటాను. మీరు ఒకళ్ళకు ఇచ్చే వాళ్ళేకాని ఒకరిని వేడుకునే వాళ్ళు కాదు' అని కృష్ణుడు ధర్మరాజుతో అని, వెంటనే సంజయుడి వైపు తిరిగి '.... ఈ సంగతేదో తేల్చడానికి నేనే హస్తినాపురానికి వస్తాను.

పాండవుల రాజ్యం పాండవుల కిస్తారో లేదో ఈ లోగా తేల్చుకోమను. ఆ తరువాత విచారించి లాభం లేదు' అన్నాడు నిర్మోహమాటంగా.

సంజయుడి మొహాన నెత్తుటి చుక్క లేకుండా పోయింది. వెంటనే తిరుగు ప్రయాణ మయ్యాడు.

హస్తినా పురానికి చేరేటప్పటికి ప్రొద్దు కుంకింది. హుటాహుటి ధృతరాష్ట్రుని దగ్గరకు వెళ్ళాడు.

పాండవుల మీది అక్కసంతా ఆయన మీద వెళ్ళగ్రక్కాడు.

'.... నువ్వేమో నీ కొడుకెంతంటే అంతే కాని మంచీ చెడ్డా ఆలోచించవు. దుశ్శాసనుడూ, శకునీ కలిసి ఆడిస్తుంటే నువ్వూ దుర్యోధనుడూ బొమ్మల్లా ఆడుతుంటారు. అయినా ఎంతమంది రాజులు బిడ్డల్ని కనలేదు కనుక! వాళ్ళందరూ కొడుకులు చేసే అకృత్యాలన్నీ సహించి వూరుకుంటున్నారా? లోకంలో ఎవరి నోట విన్నా నీ కొడుకు ప్రతాపం గురించే నాయే... తన దగ్గరకు నడిచి రాలేదు కదా అని కొండను చూచి తోడేలు హేళన చేసిందట! అలా వుంది నీ కొడుకు పరిస్థితి. ధర్మరాజు మెత్తని పులి అతను లేచాడంటే ఆపడం మీ తరంకాదు. పాపం పుణ్యం అన్నీ నీ మీదే పెట్టాడు. నిదానంగా ఆలోచించుకో. వివరాలన్నీ రేపు చెబుతాను. ఇప్పటికే బాగా ప్రొద్దు పోయింది' అని విసవిస వెళ్ళిపోయాడు.

ధృతరాష్ట్రుడి గుండెలో రాయి పడింది ఆయనకా రాత్రి కంటికి కునుకు రాలేదు.

-రాయబారం బెడిసింది బెడిసిందని సంజయుడికి కోపంగా వుంది. ఆ కోపమంతా తన మీద చూపించి వెళ్ళాడు. ధర్మరాజేమన్నాడో రేపు చెబుతాడట. ఏం చెబితేనేం, ఫలితం తెలిసిపోయింది. యుద్ధం తప్పదు.

కళ్ళ నీళ్ళ పర్యంత మయ్యాడు.

ముళ్ళకంప ల్లాంటివి ఏవేవో ఆలోచనలు మనస్సుని గుచ్చుకోవడం మొదలు పెట్టాయి.

ఆ బాధను భరించలేక విదురుడికి కబురంపాడు. ఆయన వచ్చి శయ్య పక్కనే కూర్చున్నాడు.

'నిద్ర రావడం లేదు. మనస్సంతా చికాకుగా వుంది. శరీర మంతా బాధగా వుంది. నిప్పుల్లో పొర్లినట్టుగా వుంది. పక్క మీద పడుకుంటే...' అని గద్గదంగా ఆవేదనగా అన్నాడు ధృతరాష్ట్ర మహారాజు.

విదురుడు భరించ లేక పోయాడు.

తన మాటకు విలువ లేదని తెలిసి కూడా తనకు తెలిసినవీ తోచినవీ కొన్ని మంచి మాటలు చెప్పాడు విదురుడు. 'ఎలాగో రాజ్యం చేతికి చిక్కింది కదా అని పాండవుల భాగం కూడా నువ్వే కాజెయ్యాలని చూడకు. కాలం సంగతి తెలీక ఎరమింగిన చేపలా అవుతుంది నీ పని' అన్నాడు.

ఆ చివరి మాట ధృతరాష్ట్రుని కర్ణశూలంలా గుచ్చుకుంది.

ఆ మాట తప్పించి ఎన్ని మాటలు చెప్పినా వింటాడు. కాని, పాండవుల రాజ్యం తిరిగి వాళ్ళకు ఇచ్చెయ్యమంటేనే పేచీ!

'లౌకిక విషయాలేవీ వద్దు, పారమార్థిక విషయాలేవైనా చెబ్దూ' అని అసలు సమస్య నుంచి దూరంగా పారిపోవడానికి ప్రయత్నించాడు ధృతరాష్ట్రుడు.

విదురుడుకి ఇంక చెప్పడం ఇష్టం లేక 'అవేవీ నాకు తెలీదు. నాకు తెలిసిందల్లా అందరూ కలిసి మెలిసి వుండాలను కోవడం. అది నీకెలాగో చేదనిపిస్తుంది' అంటూ లేచాడు.

ధృతరాష్ట్రుడు మాట్లాడలేదు. విదురుడే అన్నాడు.

'వున్నది కొంచె మైనా పంచుకుని అనుభవించడం. కష్టాలను ఓర్చుకోవడం, శత్రువైనా సరే చెయ్యి చాచి అడిగితే కాదనకుండా ఇవ్వడం మంచివాళ్ళ లక్షణాలు. నీ కొడుక్కి గుణాలన్నీ వున్నాయో లేదో నువ్వే ఆలోచించుకో'

ధృతరాష్ట్రుడు నిర్లక్ష్యంగా మొహం పెట్టాడు.

'.... నీతి మార్గం తప్ప కుండా బ్రతకడం ఉత్తమం. బాహు బలంతో సంపదలు సంపాదించుకుని బ్రతకడం మధ్యమం. నీతి తప్పి సంపాదించడం నైచ్యం' అని వెళ్ళిపోయాడు విదురుడు.

ఇది జరిగిన గంటకే ఠక్కున తెల్లవారింది.

ధృతరాష్ట్రుడు సంజయుడి కోసం ఎదురు చూస్తున్నాడు.

రోజూటికంటె ముందరే ఆ రోజు కొలువు తీర్చాడు మహారాజు. భీష్మ... పెద్దలూ కురు కుమారులూ అందరూ వచ్చారు.

సభా భవనం కిటకిటలాడుతోంది.

కాసేపటికి ద్వారపాలకు డొకడు లోపలికి పరుగెత్తు కొచ్చాడు.

గ్రుడ్డిరాజు తలెత్తాడు.

సంజయు డొస్తున్నాడన్న సంగతి చెప్పి వాడు వెళ్ళిపోయాడు.

సంజయుడు సభలోకి వచ్చి ఇంకా అందర్నీ పలకరించకమునుపే 'ధర్మరాజేమన్నాడు?' అని ధృతరాష్ట్రుడు అడిగాడు.

-"సత్యానికి నిలబడి, కష్టాలకోర్చి కోపాన్ని లోలోపల అణుచుకుని బ్రతికాం. ఇన్నాళ్ళూ. అది ఇప్పుడు బయటపడి ఎండుటాకుల్లాంటి కౌరవుల్ని కాల్చి పారేస్తే తప్ప యుధిష్ఠిరుడంటే ఏమిటో

తెలీదు వాళ్ళకి. నరుడు రథికుడై, నారాయణుడు సారథై వస్తున్నారని చెప్పు' అన్నాడు ధర్మరాజు నాతో.

"పాండవులతో యుద్ధం వస్తే కౌరవులందరూ నాశనం కాక తప్పదు. నా మాట విని వాళ్ళతో సంధి చేసుకోండి. వాళ్ళడిగిన అయిదూళ్ళు వాళ్ళ కివ్వండి" అన్నాడు సంజయుడు.

ఆ మాటలకు దుర్యోధనుడు పెద్దగా నవ్వాడు. 'అయిదూళ్ళిస్తే చాలని బ్రతిమాలాలు కుంటున్నారు. పాపం. ఏం ఖర్మ మొచ్చిందట" అని ఎగతాళి చేశాడు.

"ఏమైనాసరే యుద్ధం చేసి తీరతాను. సూదిమొన మోపినంత నేల కూడా ఇచ్చేదిలేదు" అని చెప్పి అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

ధృతరాష్ట్రుడు ఆందోళనగా 'ఏం చెయ్యాలి ఇప్పుడు' అన్నాడు.

సభలోని వాళ్ళెవరూ మాట్లాడలేదు.

'భగవంతుడు ఎలా నడిపిస్తే అలా నడవ వల్సిందే! విధి బలీయమైంది' అని తనలో తానే గొణుక్కుంటూ కదిలి వెళ్ళాడు గ్రుడ్డిరాజు.

కృష్ణ రాయబారం

"బావా! కౌరవులతో పోరు లేకుండా మా రాజ్యం మేము అనుభవించేటట్టు చెయ్యి. కురు వృద్ధ బాంధవులను చంపామన్న అపవాదు రాకుండా మాకు ఏ పాపం అంటకుండా రక్షించేభారం నీది. హస్తినాపురానికి వెళ్ళి ఎలాగైనా సంధి జరిగేటట్టు చూడు" అని ధర్మరాజు కృష్ణుణ్ణి వేడుకున్నాడు.

చిరునవ్వు నవ్వాడు కృష్ణుడు.

అన్నదమ్ములందరూ కౌరవులతో సంధి కావాలనే కోరారు. ఒక్క సహదేవుడు తప్ప.

కృష్ణుడు కూడా వాళ్ళ మాటకే మెత్తబడ్డాడు.

అది చూసి సహదేవుడికి ఒళ్ళు మండింది.

"బావా! అక్కడ దుర్యోధనుడు కత్తి పిడిమీద పిడికిలి బిగించి సింహాసనంమీద కూర్చునుంటే ఇక్కడ మీ కీ ఆలోచనలు ఎలా వస్తున్నాయి?"

ఇంత దైన్యం ఎందుకు ఆవరించింది మిమ్మల్ని!"

అయిదూ ళ్ళిమ్మని మీరు అడగడం, వాళ్ళివ్వ ననడం సిగ్గుగా లేదూ! అలాంటి కూడు తినకపోతే ఏం? అసలు ధర్మానికీ అధర్మానికీ సంధేమిటి?' అని ఒక క్షణం ఆగాడు.

అన్నలందరూ దిగ్భ్రాంతులై చూస్తున్నారు.

కృష్ణుడు మౌనం వహించాడు.

"...ద్రౌపదికి జరిగిన అవమానంగానీ, కురు సభలో భీముడు చేసిన ప్రతిజ్ఞ కానీ, యెవరికీ గుర్తున్నట్టు లేదు' అన్నాడు సహదేవుడు.

అందరూ తలలు వంచుకున్నారు.

ఓ మూల నిల్చుని ద్రౌపది ఇదంతా వింటోంది.

"గుర్తు లేకేం. గుర్తున్నా పట్టించుకోవల్సిన అవసరం లేదనుకునుంటారు" అంది.

ఆమె మొహం కోపంతో ఎర్రబడింది.

'వరంవల్ల పుట్టాను. యాగగుండం నుంచి ఉద్భవించాను. భరతవంశంలో అడుగుపెట్టి పాండు మహారాజు కోడలినయ్యాను. పాండవుల్ని చేపట్టాను. పరాక్రమవంతులైన బిడ్డల్ని కన్నాను. నువ్వు సుభద్రకంటే కూడా నేనంటే ఎక్కువ వాత్సల్యం, గౌరవాలు చూపిస్తావు. అలాంటి నన్ను రాజసూయ యాగంలో అవభృధ స్నానం చేసి శుచియైన కురులు పట్టి ఈ ఐదుగురు వీరమూర్తులూ చూస్తుండగా ఒక నీచుడు సభకు ఈడ్చుకొచ్చాడు. కులాంగనను ఇలా ఎవరైన చేస్తారా?' అని తటాలున లేచి ముడి విడి కాలనాగంలా జారిపడిన వెంట్రుకల్ని ఎడంచేతో ఎత్తి పట్టి "దుశ్శాసనుడు పట్టి ఈడ్వగా సగం తెగి మిగిలిపోయిన వెంట్రుక లివి" అని భోరున ఏడ్చింది ద్రౌపది.

కాస్సేపటికి కొంచెం సంబాళించుకుని, వెక్కి వెక్కి తెరలు తెరలుగా మాట్లాడటం మొదలు పెట్టింది.

కృష్ణునికేం చేయటానికి తోచక నిలబడి చూస్తున్నాడు.

"...ఆ ఇంటి పెద్ద కోడలిననే గౌరవమైనా లేకుండా అప్పుడు నన్ను దాసిగా చేసారు. ఇప్పుడు నువ్వు సంధి చేస్తే మళ్ళీ ముష్టిదానిలా వాళ్ళ పంచకే చేరుతాను. నా మొగుళ్ళు ఊడిగం చేస్తారు, నేను కోడరికం చేస్తాను' ద్రౌపది ఒక క్షణం ఏడుపు దిగమ్రింగుకుని ఏదో ఆలోచిస్తున్నట్టు మౌనంగా వుండిపోయింది.

భర్తలు చేస్తున్న సంధి ప్రయత్నాలు

చూస్తున్నకొద్దీ ఆమె గుండె బ్రద్దలవుతోంది. కళ్ళు ఊటబుగ్గ లవుతున్నాయి.

"కృష్ణా! ఈ వెంట్రుకలు పట్టి ఈడ్చిన దశ్శాసనుని శరీరం ముక్కలు ముక్కలై యుద్ధ రంగంలో చెల్లాచెదురుగా పడి వుండటం చూస్తే కాని నా అవమానాగ్ని చల్లారదు. దుర్యోధనుని శవాన్ని నేను కళ్ళారా చూడందే భీముని బాహు బలం గానీ, అంత పెద్ద గాండీవం ధరించిన అర్జునుని పరాక్రమంగానీ యెందుకు. తగలెయ్యనా? నిప్పును ఒళ్ళో కట్టుకున్నట్టు ఇంత పగనీ ఇన్నేళ్ళూ మనస్సులో పెట్టుకున్నాను" అని పెద్దగా ఏడ్చింది ద్రౌపది.

ఓదార్చటం యెలాగో యెవరికీ తోచనంతగా ఏడ్చింది.

కృష్ణుడి మనసు కరిగింది.

చెల్లెల్ని ఓదార్చి 'తల్లీ! ఎందుకలా గుండెలు పగిలేలా ఏడుస్తావు? నేనున్నానుగా! శత్రు సంహారంచేసే భారం నాది.

రేపు నీలాగే కౌరవుల భార్యలూ, బిడ్డలూ ఏడుస్తుంటే నవ్వుతూ చూసే కుసంస్కారం నీకు లేదు కానీ, ఆ కాలం దగ్గర కొచ్చింది.

ఏడవకు, నా తల్లి కదూ! ఉజ్వల పుణ్యలక్ష్మీ వైభవాలతో వున్న పాండవుల్ని త్వరలోనే చూస్తావు నువ్వు అని అభయ మిచ్చాడు.

ద్రౌపది మనస్సు కలతదేరింది.

'ఉదయమే బయలుదేరు బావా! నీ నక్షత్రం రోహిణి. రేపు రేవతీ నక్షత్రం.

నీకు చంద్ర తారబలాలు బాగున్నాయి' అన్నాడు ధర్మరాజు.

కృష్ణుడు సరేనన్నాడు.

–ప్రొద్దున్నే ప్రయాణం.

దారకుడు రథం సిద్ధం చేశాడు.

ద్రౌపది

సుగ్రీవ, మేఘ, పుష్ప, వలాహకాలనే గుర్రాలను రథానికి కట్టారు.

గరుడధ్వజం రథంపైన రెపరెపలాడింది. మంగళ తూర్యారావాలు మధ్య మాధవుడు రథమెక్కాడు.

జగన్నాథరథం కదిలింది.

* * *

కృష్ణుడు హస్తినకు వచ్చాడన్న సంగతి వూరూవాడా తెలిసిపోయింది. రాజమార్గాన రథం వెళ్తుంటే ప్రజలంతా సౌధాగ్రాలెక్కి గోపాలమూర్తిని చూశారు. కొందరు పూలు చల్లారు, మరి కొందరు దండాలుపెట్టారు.

కృష్ణుణ్ణి చూసిన కొందరు కన్నెపిల్లలకు ఒళ్ళు ఝల్లుమని, చిరు చెమటలు ముత్యాల్లా పుట్టుకొచ్చాయి.

'రాక్షసి రొమ్ముల పాలతో పాటు ప్రాణాలు కూడా తాగిన ప్రౌఢబాలుడు ఇతనేనట'

'చాణూరుణ్ణి చంపిన జగజెట్టి ఈ మహానుభావుడేట'

'కంసుణ్ణి చంపి, తండ్రి వసుదేవుడికి పట్టాభిషేకం చేసిన ప్రభువు ఈయనే' 'పారిజాతం తెచ్చి సత్యకోరిక తీర్చిన రసిక రాజు ఇడుగో'

'వెన్నతో పాటు గోపాంగనల వలువలు కూడా దొంగిలించిన గ్రంథసాంగుడట'

'తన పాద పద్మాలు మోపి, వేదాల శిరస్సులకు పరిమళం కూర్చే జగదీశ్వరుడు ఈయనే' అంటూ ఒకరి నొకరు తోసుకుంటూ మదనగోపాలుణ్ణి చూశారు.

రాజమందిర ద్వారంలో ప్రవేశించి, కక్ష్యాంతరాలు గడిచి, ఏనుగు మొగసాలలో రథం దిగాడు కృష్ణుడు.

అప్పటికే అక్కడ ధృతరాష్ట్రుడు వున్నాడు. కృష్ణుడు ఆదరంగా చేతులు చాచి ఆయనను కౌగలించుకున్నాడు. ధృతరాష్ట్ర కుమారులు దేవకీ సుతుడ్ని బంగారు సింహాసనం మీద కూర్చోపెట్టి అతిథి మర్యాదలన్నీ చేశారు. వాళ్ళు ఇచ్చిన గంధమాల్యాది పదార్థాలన్నీ అంగీకరిస్తున్నట్టే సంతోషం ప్రకటిస్తూ అన్నీ పక్కన పెట్టాడు.

దుర్యోధనుడు అంతా గమనిస్తూనే వున్నాడు.

కృష్ణుడు లేచి 'మేం వెళ్తొస్తాం' అనేసరికి దుర్యోధనుడూ, కర్ణుడూ ఆయన వైపు విస్మయంగా చూశారు.

కృష్ణుడు నవ్వి, విదురుణ్ణి తీసుకుని రథమెక్కాడు.

ధృతరాష్ట్ర కుమారులు ఏం చెయ్యాలో – చదరంగంలో తరువాత ఎత్తు ఏం వెయ్యాలో ఆలోచిస్తూ నిలబడ్డారు.

అంతలో రథం కనుమరుగైంది.

'ముందు కుంతీదేవిని చూద్దాం' అన్నాడు కృష్ణుడు. విదురుడు సరేనన్నాడు.

ఇద్దరూ ఆమె మందిరానికి వెళ్లారు.

మాధవుణ్ణి చూస్తూనే కుంతి కళ్ళ నీళ్ళు పెట్టుకుంది.

'నీ కొడుకులు సుఖంగా వున్నారు. నువ్వేం వాళ్ళని గురించి విచారించకు.' అని కృష్ణుడు ఆమెను ఓదార్చాడు.

ఏడుస్తూనే మధ్య మధ్య కన్నీళ్ళను చీర చెరగుతో తుడుచుకుంటూనే కర్మధర్మ చక్రవర్తికి సకలోపచారాలూ చేసింది.

ఎత్తయిన పీఠం మీద కూర్చోబెట్టి పళ్ళు తినిపించింది, తియ్యని పానియాలు తాగించింది.

'నీ శిక్షణలో పెరిగిన నీతిమంతులు నా బిడ్డలు కోటిమంది కొలిచి తిరుగుతూంటే సుఖంగా వుండేవారు.

ఇప్పుడా అడవుల్లో ఎలా వున్నారో ఏమో నా కట్టెను ఇక్కడ పెట్టి నా మనస్సు తీసుకు వెళ్ళిపోయారు.

తండ్రిలేని బిడ్డలు. తల్లి కూడా లేకుండా ఎలా బ్రతికారో చివరికి ఆ విరటుడి దగ్గర సేవకులు కూడా అయ్యారు'

కుంతీదేవి కళ్ళల్లో సముద్రాలు ప్రవహించాయి.

'నువ్వు మరీ అంత అధైర్య పడితే ఎలా?'

'లేదు నా యనా నువ్వున్నావనే కొండంత ధైర్యంతో వున్నాను. నా బిడ్డలు సుఖంగా వున్నారా? ద్రౌపది ఎలా వుంది? కొడుకులకంటే కూడా నాకా బంగారు తల్లి ఎక్కువగా సేవలు చేసేది. నా కోడలికి నిండు సభలో అంత అవమానం జరిగినా ఓర్చుకున్న రాతిగుండె నాది. విదురుడొక్కడు తప్ప 'అయ్యో అది తగదని' వారించేవాళ్లే లేకపోయారావేళ' అని కుంతి కుళ్ళి కుళ్ళి ఏడ్చింది.

(ఇంకా వుంది)

బాబీ కలలు



చాలా సంవత్సరాలు కనుమరుగై తిరిగి బొంబాయిచేరిన ఒక నాటి మేటి నటి పర్వీన్‌బాబీ కలల ప్రపంచంలో మునిగి తేలుతోందట.

తనను అమితాబ్ హత్య చేసేందుకు ప్రయత్నించాడని యిటీవల పత్రికాముఖంగా తెలియజేసిన పర్వీన్-బచ్చన్ చెర నుంచి తప్పించుకోవటానికి కాబోలు హోస్టన్ వెళ్లి అజ్ఞాతంగా యిన్నాళ్ళూ కాలం గడిపింది.

అమెరికాలోనే కాదు మొత్తం యూరోప్‌లోనే తాను మంచి పర్సనాలిటీ గల మనిషినని చెప్పుకుంటోందట. ఇన్నాళ్లూ అజ్ఞాతంగా వుండి శరీరాన్ని బాగా పెంచేసిందట. ఇదివరకటిలా సినిమాల్లో యిప్పుడు ఈ బారీకాయంతో సూపర్‌స్టార్‌లాగా వెలగాలంటే మాటలా? ఏమో మరి పర్వీన్ మాత్రం పిచ్చి కలలు కంటోందట!



న్యాయచట్టం ప్రశ్నలు-జవాబులు

అడ్వొకేట్: **బి.భాస్కరరావు** ఎం.ఎ.,ఎల్.ఎల్.బి.

విరజశ్రీ, అయిజ (మహబూబ్‌నగర్ జిల్లా)

ప్రశ్న: మా అత్తగారు నిరక్షరాస్యులు. ఆమె భర్త, సంతానం లేదని మరో పెళ్లి చేసుకొని అత్తగారిని వాళ్ల బంధువుల ఇంట వుంచాడు. అక్కడ నుండి వాళ్లు మా ఇంటికి పంపడానికి నిరాకరిస్తున్నారు. వెట్టిచాకిరి చెయ్యించుకుంటున్నారు. కనుక మా అత్తగారిని తీసుకొని రావడమెలా? జీవనభృతికి సంబంధించిన వివరాలు తెలుపగలరు.

జవాబు: మీ అత్తగారు బ్రతికివుండగా ఆమె భర్త రెండవ వివాహము చేసుకొనడం భారతీయ శిక్షాస్మృతిలోని 494 సెక్షన్ ప్రకారం నేరము అవుతుంది. ఏడు సంవత్సరముల వరకు కారాగార శిక్ష విధించవచ్చును. హిందూ వివాహ చట్టము (1955) లోని 5వ సెక్షన్ ప్రకారము భార్య బ్రతికి వుండగా, భర్త మరియొక వివాహం చేసుకున్నప్పుడు ఆ వివాహము చెల్లదు. మీ అత్తగారి భర్త రెండవ వివాహము హిందూ సాంప్రదాయము ప్రకారము చేసుకున్నట్లు తెలుస్తున్నది. కనుక మీ అత్తగారి భర్త రెండవభార్య భారతీయ శిక్షాస్మృతిలోని 494 సెక్షన్ క్రింద నేరము చేసినట్లు అవుతుంది. కాని ఆ వివాహము చెల్లని యెడల అది నేరముకాదు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 1988లో సుదర్శనరావు కేసులో ఒక తీర్పు చెప్పింది.

తిరుపతిలో 1977లో సుదర్శనరావు హిందూ సాంప్రదాయములో చంద్రమాణిక్యమ్మను వివాహం చేసుకున్నాడు. 1983 ఏప్రిల్ 21 తేదీన సుదర్శనరావు అతని తండ్రి కల్సి మాణిక్యమ్మను కొట్టి ఇంట్లో నుండి వెడలకొట్టారు. 1983 జూలై 4వ తేదీన సుదర్శనరావు అట్లూరి లక్ష్మిని కృష్ణాజిల్లాలోని తెలుగరావుపాలెంలో హిందూ సాంప్రదాయములో వివాహం చేసుకున్నాడు. ఈ విషయం మాణిక్యమ్మకు సెప్టెంబరు 4వ తేదీన తెలిసింది. అందుచేత సుదర్శనరావు, లక్ష్మికూడా 1984 ఫిబ్రవరి 21వ తేదీన అలినెక్కి పాలెంలో ఇస్లాం మతంలోనికి మారిపోయి మోసిన్ ఆలీ ఇంట్లో ముస్లిం సాంప్రదాయ ప్రకారము వివాహం చేసుకున్నారు. మాణిక్యమ్మ లాయరుద్వారా నోటీసు పంపించింది. కాని సుదర్శన్‌రావు సలీమ్ మహమ్మద్ అని పేరు పెట్టుకొని లక్ష్మి లైలాభానుగా మారిపోయి నోటీసుకు జవాబు పంపించారు. మాణిక్యమ్మ అవనిగడ్డ మేజిస్ట్రేట్ కోర్టులో కేసు పెట్టింది. మేజిస్ట్రేట్ విచారణ చేసి సుదర్శనరావు, లక్ష్మికూడా భారతీయ శిక్షాస్మృతిలోని 494 సెక్షన్ క్రింద నేరము చేసినట్లు నిర్ణయించి ఇద్దరికీ ఒక సంవత్సరము కారాగారశిక్ష విధించి, వెయ్యి రూపాయిలు జరిమానా విధించారు. ఇద్దరు సెషన్సు జడ్జీకి అప్పీలు పెట్టుకున్నారు. సెషన్సుజడ్జీ మొదట సుదర్శనరావుకు, మాణిక్యమ్మకు న్యాయ సమ్మత్తముగా వివాహం జరుగలేదని తీర్పు చెప్తూ శిక్షను రద్దు చేశారు. మాణిక్యమ్మ ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు అప్పీలు చేసుకున్నది. హైకోర్టు సుదర్శనరావుకు మాణిక్యమ్మకు వివాహం జరిగినట్లు తీర్పు చెప్పింది. కాని రెండో వివాహం న్యాయ సమ్మతంకాదు. ఎందుచేతనంటే సప్తపది జరిగినట్లు రుజువుకాలేదు కనుక. అంతేకాకుండా ఇద్దరు ఇస్లాం మతంలోనికి మారిపోయి ముస్లిం సాంప్రదాయం ప్రకారం వివాహం చేసుకున్నప్పటికి వారు నమాజువంటి ముస్లిం పద్ధతులు పాటించకుండా హిందూ దేవాలయాలు సందర్శిస్తున్నారు. కనుక ఈ వివాహం కూడ న్యాయసమ్మతం కాదు. కనుక సుదర్శనరావు, లక్ష్మి 494 సెక్షనుక్రింద నేరం చెయ్యలేదు అని 1988లో హైకోర్టు తీర్పు చెప్పింది.

కాబట్టి మీ అత్తగారు కోర్టులో కేసు పెట్టవచ్చును. రెండవ వివాహం చట్ట సమ్మతముగా జరిగినప్పుడు శిక్షనుంచి తప్పించుకొనలేరు. ఇక మీ అత్తగారికి క్రిమినల్ ప్రొసిజర్ కోడ్‌లోని 125 సెక్షన్ ప్రకారం కోర్టు జీవనభృతి మంజూరు చేస్తుంది. పెద్ద మనుష్యులను తీసుకొని వెళ్లి మీ అత్తగారిని పంపమని అడగండి. తర్వాత కోర్టులో కేసు పెట్ట వచ్చును.

జి. ప్రకాశరావు, మలిగాం (గౌహతి)

ప్రశ్న : శ్రీమతి సువర్ణగారి భర్త సీనియర్ ఇంజనీర్‌గా డ్యూటీలో మరణించిన కారణంగా కంపెన్సేషన్ గురించి పిటిషన్ పెట్టమని సలహా ఇచ్చారు. కంపెన్సేషన్ చట్టము ప్రకారం నెలసరి వేతనము వెయ్యి రూపాయలకు మించకూడదు. అందుచేత వర్క్‌మెన్స్ కంపెన్సేషన్ చట్టము వర్తిస్తుందా?

జవాబు : వర్క్‌మెన్స్ కంపెన్సేషన్ చట్టములోని "వెయ్యి రూపాయలు" అన్న పదాలు 1-7-1984 నుండి తొలగించివేస్తూ సవరణ చేశారు. కనుక ఈ చట్టము వర్తిస్తుంది.

ఆంధ్రసచిత్ర వారపత్రిక

న్యాయ చట్టం-ప్రశ్నలు జవాబులు

ప్రశ్న: ....

పేరు: ....

పూర్తి చిరునామా: ....

....

కుక్కలున్నాయి జాగ్రత్త!

మెట్ల బాబూరావు

అదే ఇల్లు అవునో కాదో అనుకుంటూ జేబులో ఉన్న అడ్రసు కాయితాన్ని తీసి మరో సారి చూసాను.

గేటు మీదున్న ఇంటినెంబర్, కాయితం మీద రాసున్న అడ్రసు ఒకటే అని తేల్చుకున్నాను మొత్తానికి.

హైదరాబాద్... ఎండాకాలం... మిట్టమధ్యాహ్నం... గంట నుంచి ఎడతెరపి లేకుండా తిరిగితే ఈ ఇంటిని పట్టుకో గలిగాను.

శరీరం మీద చెమట పిల్లఏరులా ప్రవహిస్తోంది.

నాలిక పిడచకట్టుకు పోతోంది.

చెప్పులు పాదాలకి అప్పచ్చుల్లా అతుక్కుపోయాయి.

అరిగిన చెప్పులు... నలిగిన బట్టలు... కళ్లలోని ఆందోళన చాలేమో నేను ఆడపిల్ల తండ్రినని చెప్పుకోవటానికి.

గేటు తలుపు ఎంత ఆలోచించి తయారు చేయించారో ఏమో? గేటు ఎలా తీయాలో అర్థం కావటం లేదు. చాలా గమ్మత్తుగా ఉందనిపించింది.

ఆ కాస్సేపటికే... పెళ్లికొడుకుల ఇంట్లోకి ప్రవేశించాలంటే ముందు వీధి గేటు తలుపులు ఎలా తీయాలో నేర్చుకోవటం ముఖ్యమనుకున్నాను.

ముందు బోలెడు ఖాళీ స్థలం.. ఇల్లు లోపలికి ఉంది.

అక్కడ్నించే పిలుస్తే బాగుండదని గేటుని నెమ్మదిగా కొట్టాను.

ఎటువంటి జవాబు లేదు.

గేటుని మళ్లీ కొట్టాను... ఈ సారి కాస్త గట్టిగా.

ఈ సారి చప్పుడుకి... గేటు దగ్గిరే నిలబడే ఉన్న నన్ను చూస్తూ గట్టిగా అరుస్తోంది మేడమీద నుంచి కుక్క.

కుక్క.... అమ్మో కుక్కే.. కుక్కలంటే నాకు చచ్చేంత భయం. అవి రోడ్డుమీద కనిపిస్తేనే చాలు ఆమడ దూరంలో ఉండే నేను... ఇప్పుడు కనిపించి అరుస్తుంటే నా గుండె ఒక్కసారి ఆగినట్లనిపించింది.

గేటు చప్పుళ్ళకి కాకపోయినా కనీసం కుక్క అరుపులకైనా ఎవరైనా వస్తారేమో అని ఆశగా ఇంటివైపే చూస్తూ నుంచున్నాను.

లాభం లేదు. ఇంట్లోనుంచి ఎటువంటి జవాబు రాలేదు.

తాళంవేసి ఇంట్లోవాళ్లు బయటకెళ్లినట్లు ఆనవాలు ఏమీకనపడటం లేదు. నా గొంతు చాలా పీలగా పక్కవాడికి కూడా వినపడనంత నెమ్మదిగా ఉంటుందంటుంది మా ఆవిడ.

ఇప్పుడు నేను "ఏమండీ" అనిపిలిచిన పిలుపు మా ఆవిడగారు విని ఉంటే ముక్కున వేలేసుకునేది సమయం వచ్చినప్పుడు మా ఆయన కూడా గార్దభంలా అరవగలడని.

మరి కుక్క మొరుగులే పని చేసాయో?

నా చేతుల చప్పట్లో...

నా నోటి పిలుపో...

మాడ్రన్ గేటు శబ్దమో...

ఏవి పని చేసాయో తెలీదు కాని అదేదో డిటెక్టివ్ పిక్చర్లో కనిపించినట్లు రెండంటే రెండు కళ్లు ఓ కిటికీలో నుంచి క్రిందకి చూడటం నేను గమనించాను. ఇహ నేను మాత్రం ఎటువంటి శబ్దం చేయదలుచుకోలేదు.

మేడమీదున్న కుక్క మాత్రం సీరియల్ నవల్లా అరుచుకు పోతోంది.

ఇంతలో ఒకాయన గదిలోనుంచి తలుపు తీసుకుని బయటకు వచ్చాడు.

"లక్ష్మణరావుగారిల్లు ఇదేనా" గేటు దగ్గర్నుంచె గట్టిగా అరిచాను ఆయన్ని ఉద్దేశిస్తూ.

అక్కడ్నించే లోపలికి రమ్మన్నట్లు చేతో సైగ చేసాడు.

ఆయనే ఉంటే... అన్నట్లు గేటు ఎలా తీయాలో తెలిసి ఛస్తే నేనే లోపలికి వెళ్లి ఉండే వాణ్నిగా.

గేటు తియ్యటం రావటం లేదని సైగ చేస్తూ గేటుని ముందుకి వెనక్కి రెండుసార్లు తోసాను.

ఈ ప్రాక్టికల్స్ ఇందాకే చాలాసార్లు అయ్యాయని బహుశా ఆయనకి తెలిసే ఉండకపోవచ్చుని.

కుక్క పలకరింపులో ఎటువంటి మార్పు లేదు.

కాస్సేపటికి ఓ కుర్రాడు బహుశా పేదేళ్లుంటాయేమో... విసుగ్గా మేడదిగి చక చకా నడుస్తూ గేటు దగ్గరికి వచ్చాడు. పని పిల్లాడిలా ఉన్నాడు. చేతిలో తాళం చెవుల గుత్తుంది.

అప్పటిదాకా నేను చూడనేలేదు. గేటు వెనక వైపు తాళం ఒకటి వేసే ఉందని.

రెండు మూడు ప్రయోగాలు చేసి గేటుకి వేసి ఉన్న తాళాన్ని తీసాడు. దుర్భేద్యమైన కంచుకోట సింహద్వారం తెరుచుకున్నంత ఫీలింగ్ కలిగింది నాలో.

ఇందాక చేతులో సైగలు చేసినాయన కాస్త ముందుకు వచ్చినట్లున్నాడు.

సముచితంగా ఆహ్వానించటంలో శునకరాజు ఏ విధమైన లోపం చేయటం లేదు. గుండె దిటవు చేసుకుని నెమ్మదిగా అడుగులు వేస్తున్నాను.

అంతే... కుక్క ఒక్కసారి పై నుంచి మెట్లు దిగి అరుస్తూ నా దగ్గిరకి వచ్చేస్తోంది. నా పై ప్రాణాలు పైనే పోయాయి.

'నో రోవర్... నో... నెమ్మదిగా అన్నాడు పైనే నుంచుని అతను.

ఫరవాలేదు.... మళ్ళీ చేతోనే పైకి రమ్మన్నట్లు సైగ చేస్తున్నాడు.

యజమాని మాట ఏ మాత్రం ఖాతరు చేయక కుక్క నా దగ్గిరకి వచ్చేసింది.

పిల్లఏరులా ప్రవహిస్తున్న చెమట ఇప్పుడు సెలయేరులా పొంగిపోతోంది.

చంటాడు తాయిలం నాకుతున్నట్లు నాలికతో నా చొక్కాని, ప్యాంటుని నాకుతూ నన్ను మెట్లు ఎక్కనిస్తోంది రోవర్.

ఎలాగైతే మెట్ల పర్వం అయిందనిపించాను.

నేను పైకి రాంగానే ఆయన గదిలోపలికి దారి తీసాడు.

నేనూ ఆయన్నే అనుసరించాను.

కుర్చీని చూపించి కూర్చోండని సైగ చేసాడు.

ఇందాక కుక్కని చూసి నేను భయపడుతుంటే 'నో రోవర్ నో' అన్నాడు మూగవాడనటానికి వీలులేదు. మాటలే ఇంత పొదుపుగా ఉన్నాయి. మరి... అనుకున్నాను ఆయన వంకే చూస్తూ.

కుక్క గది బయట బాస్కీటు వేసుకున్నట్లు భైఠాయించింది.

ఇంతకీ ఎవరు మీరు? ఏం పని మీద వచ్చారన్నట్లు మొహం పెట్టాడు ఆయన.

నోటితో కాక మొహంతో మాట్లాడగలడని పించింది ఆయన్ని చూస్తుంటే.

వచ్చిన సంగతి క్లుప్తంగా చెప్పి 'కాస్త మంచి నీళ్లిప్పిస్తారా' అన్నాను ఇక దప్పిక ఆపుకోలేక.

మొహం తుడుచుకుందామని వేబులోనుంచి కర్చీఫ్ తీస్తే అది అప్పుడే నీళ్లలో తడిపినట్లయింది

'అమ్మాయి జాతకం తెచ్చారా'?


ఆయన ప్రశ్నలో

అమ్మాయి కర్త

జాతకం కర్మ

తెచ్చారా క్రియ అన్నట్టు అనిపించింది ఆయన స్వరం

ఇలాంటి ప్రశ్నలు ఈ మద్యన అడపాదడపా ఎదురౌతున్నాయి కాబట్టి ముందే జాగ్రత్తపడ్డాను క్షణంలో జేబులోనుంచి క్సెరాక్స్ తీయించిన అమ్మాయి జాతకం తాలూకు కాయితం ఒకటి బయటికి లాగాను



అది ఇంకా ఆయన చేతిలో పడనేలేదు 'ఫొటో తీసుకొచ్చారా? అన్నాడు మళ్లీ

"ఇదే ఊరు కదా! తమరు ఒకసారి చూడ్డానికి వచ్చిపోతే బాగుంటుంది అయినా ఫొటోలో సరిగ్గా తెలీదు కూడా" అన్నాను పిడచకట్టుకున్న గొంతుతో

'అదేం మీరు చెప్పక్ఖర్లేదు మాకూ తెలుసు!" అన్నట్టు నుదురు చిట్లించాడు

"ఒసేయి! ఓసారి ఇలారా"! కంగారుగా బాసింబట్టు వేసుకుని కూర్చున్న కుర్చీ ఒక్కసారి లేచి నిలుచుంది ఆ కేకకి

బహుశా భార్యని కాబోలు పిలిచింది పాపం చెవిటిదేమో? అనుకున్నాను జాలిపడుతూ

ప్రత్యక్షమైతే దేవత లంటారు!

ఉన్నట్టుండి వెలుస్తే విగ్రహం అంటారు!

కేక విని వస్తే వియ్యపురాలంటారేమో అనిపించింది ఆ క్షణంలో

ఈయనగారికేక ఇంకా లోపలిదాకా పోనేలేదు ఆవిడగారు గుమ్మం దగ్గిర ప్రత్యక్షమైంది

చింతపండు చౌక ధరల్లో అమ్మిన రోజుల్లో పుట్టిందో ఏమో నల్లగా, లావుగా కళాయి పెట్టి కడిగిన బూర్లె మూకుడులా- రోట్లో వేసిన పొత్రంలా ఉంది.

ఆవిడగారు ప్రత్యక్షం అవంగానే కుర్చీ మళ్ళీ చతికిలబడిపోయింద

"ఆయన పలానట మనబ్బాయి కోసం

వచ్చాడు!" వచ్చాడు పాపం మనింటికి వచ్చాడన్నట్లుంది ఆయన పరిచయ వాక్యాలు

ఆవిడగారు నన్ను నఖశిఖ పర్యంతం చూస్తుంటే నాకు ఏదోలా అనిపించింది

"నమస్కారమండీ" అన్నాను

ఆవిడ అదేమి పట్టించుకోకుండా ' అమ్మాయి ఏం చదివిందన్నారు?" అంటూ ఓ దీర్ఘం తీసింది

"బి ఎ పాసయిందండీ" అన్నాను నమ్రతగా

"మా అబ్బాయి ఇంజనీర్! తెలుసనుకుంటాను ధీమాగా అంది

మౌనంగా ఆవిడవంకే చూస్తూ తలూపాను

"మీరేం చేస్తుంటారు? మళ్ళీ ఆవిడగారి ప్రశ్న

ఎలక్ట్రిసిటీ బోర్డ్‌లో ఎకౌంటెంట్ నన్నాను జవాబుగా

"చీ!చీ! అందావిడ

నాతోపాటు ఆయన కూడా ఆవిడవంక ఆశ్చర్యంగా చూసాడు ఏమిటన్నట్లు

బాధగా, బరువుగా తిరుగుతున్న ఫ్యాన్ కాస్త ఆగిపోయింది కరెంట్ కోతకి

ఇంతకీ ఆవిడగారు చీదరించుకుంది నా ఉద్యోగానికా, ఆగిపోయిన ఫ్యాన్ గురించా, నాకు బోధపడలేదు

గాలి ఆడటం లేదు పైగా గొంతు తడారి పోయింది లాభం లేదనుకుంటూ "కాస్త మంచినీళ్ళివ్వండీ ప్రాధేయపడుతున్నట్లడిగాను ఆవిడ వంక చూస్తూ

"ఒరే మల్లిగా" అంటూ ఓ అరుపు అరిచింది

"అమ్మాయి ఎక్కడ చదివింది- ఈ ఊర్లోనేనా? అని మళ్ళీ మొదలెట్టింది

అమ్మాయి బయోడేటా అంతా వల్లించాను ఇహ మల్లిగాడు వచ్చినట్లే మంచినీళ్ళు తెచ్చినట్లే అనుకుంటూ

"మా అబ్బాయికి పిల్ల అందంగా ఉండాలి- గ్రాడ్యుయేట్ అయి ఉండాలి ఉద్యోగం కావాలి ఇంకా ' కంఠస్తం చేసిన సీస పద్యంలా చెప్పుకు పోతోందావిడ

నేనున్నా లేనట్లే అని ఈ పాటికి మీకు తెలిసే ఉంటుందన్నట్లు పిచ్చిగా నా వైపే చూస్తున్నాడాయన

"కంపెనీవాళ్ళే ఫారెన్‌కి పంపిద్దా మనుకుంటున్నారు బహుశా ఈ సంవత్సరంలో వెళ్ళొచ్చు ఈ లోపలే పెళ్ళి చేసేద్దా మనుకుంటున్నాం దేనికో ఉపోద్ఘాతంగా ఉంది ఆవిడ మాట

"చాలా సంతోషం అబ్బాయి ఉంటే ఒక్కసారి పిలుస్తారా అన్నాను

"వాడికేవో ఫారెన్ పరీక్ష లున్నాయి చదువుకుంటున్నాడు అన్నాడాయన కలగ చేసుకుని


పరీక్షలుంటే బయటికి రాడా ఏమిటి ? తల్లిచాటు బిడ్డేమో పాపం మళ్ళీ ఆ విషయం నేనేమి అడగలేదు

"మీరు అమ్మాయిని చూడటానికి ఒకసారి దయచేస్తే నానుస్తూ అన్నాను

"నిన్ననే చింతలపూడి వాళ్ళొకళ్ళు వచ్చారు ఆ అమ్మాయి ఫొటో అదీ బానే ఉంది అవును మొన్న వచ్చిన వాళ్ళెవరండీ ' అంది పరధ్యానంగా ఉన్న భర్తని ఉద్దేశిస్తూ

"ఏమో నాకేం తెలుసు? అసలెవరైనా వచ్చారా అన్నట్లు తెల్ల మొహం వేస్తూ పెళ్ళాం వంకే చూస్తుండిపోయాడాయన

ఆ క్షణంలో తలుపు దగ్గిరే మౌనంగా కూర్చున్న కుక్క కూడా ఆశ్చర్యంగా యజమానురాలి వంక చూస్తున్నట్లనిపించింది



"అమ్మాయి ఏం ఉద్యోగం చేస్తోందన్నారు?" మెళ్ళో గొలుసుని సవరించుకుంటూ అడిగిందావిడ

ఇంటి దగ్గిర్లో- స్కూల్లో టీచరుగా పని చేస్తోందన్నాను!

"ఎన్నాళ్ళనుంచో ! కళ్ళు అదోలా తిప్పుతూ అంది

"ఓ రెండేళ్ళనుంచీ అన్నాను

"జీతం ఏమాత్రం ఇస్తారో?"

భార్య వేసిన ఈ ప్రశ్నకి కుతూహలంగా గడ్డం ముందుకు వంచాడు ఇంటాయన

"నాలుగొందల దాకా

కాస్సేపు మౌనం బహుశా భార్యాభర్త లిద్దరూ నెలకి నాలుగొందలైతే రెండు సంవత్సరాలకి ఎంత సంపాదించి ఉంటుందో అని లెఖ్ఖ కడుతున్నారేమో అనిపించింది

"అబ్బాయి ఫారెన్ వెడతాడు కదా! మరి అమ్మాయి కూడా వెళ్ళాల్సి వస్తుంది ఒక్కతే కూతురంటున్నారు అబ్బాయితో పాటు అమ్మాయి కూడా వెళితే మీకేం అభ్యంతరం ఉండదు కదా!

స్థాణువులా ఆవిడవంకే చూస్తున్నాను

అప్పుడే వీళ్ళబ్బాయితో మా అమ్మాయి పెళ్ళయిపోయినట్లు- అల్లుడు అమ్మాయినిఫారెన్‌కి తీసుకెళ్ళి పోయినట్లు ఆ కాస్సేపట్లో ఓ సినిమా రీలు నాముందు తిరిగి పోయినట్లయింది

ఊహాలోకం లోంచి తేరుకుని "ఇందులో అభ్యంతరం ఏముంటుందండీ! పెళ్ళయిన తరువాత అమ్మాయి అబ్బాయితోనే కదా ఉండాల్సింది" అన్నాను సంతోషంగా

గాంధీగారిలా అమాయకంగా నవ్వినట్లుంది ఆయన మొహం

"ఏమండీ! మీరు ఆ విషయం కూడా చెప్పండి కొరకొరా భర్త వంక చూస్తూ అంది

భార్య చెప్పిన ప్రతిదానికి మాటిమాటికి ఉలిక్కి పడితే బాగుండదని గంభీరంగా లేచి ప్రక్కనే టేబుల్ మీదున్న పుస్తకాన్ని తీసుకుని రెండు పేజీలు తిప్పాడు

ఏమిటో ఈ విన్యాసాలు నాకు అంతుపట్టటం లేదు

"అయినంపూడి పెంటపాడు పిఠాపురం ఎరుకలవాడ పత్తివాడ కత్తివాడ- కాకినాడ అంటూ వాళ్ళబ్బాయిని కొనటానికి ఎవరెవరు ఎంతెంత మందొచ్చారో రేట్లతో సహా ఓ పట్టికను చదివి వినిపించాడు

ఆయనవంక చూస్తుంటే నాకే జాలేసింది కనీసం నాకోసం కాకపోయినా ఆయన కోసమైనా ఆ మల్లిగాడెవడో మంచినీళ్ళు ఇప్పటికైనా తప్పక తెస్తాడని ఆరాటపడ్డాను

"ఇంకా ఏ సంబంధం కుదుర్చుకోలేదను కోండి మీక్కూడా తెలుస్తే మంచిదని ఆ పట్టిక

ఆయనగారు వినిపించా రన్నట్లు మొహం పెట్టిందావిడగారు

"మీరమ్మాయిని చూడటానికి వస్తామంటే ఎల్లుండి దశమి మంచి రోజు ఏర్పాటు చేస్తానన్నాను నమ్రతగా

"మేం రావటం- అమ్మాయిని చూడటం ఆ విషయాలు తర్వాత మాట్లాడుకుందాం ముందు వ్యవహారాలు కూడా మాట్లాడుకుంటే " ఏఏ సిట్యుఏషన్‌లో ఎలా ఎలా మాట్లాడాలో అన్న విషయంలో భార్య దగ్గిర బాగా శిక్షణ పొందినట్లున్నాడాయన

"ఆస్తిపాస్తుల గురించి కూడా కాస్త చెప్తే బాగుంటుంది చేతిలోని బంగారు గాజులను సరి చేసుకుంటూ అంది

నా ఆశ్చర్యానికి అంతే లేకపోయింది అమ్మాయి గురించి సంబందాలు వెదకటం ఈ మధ్యనే మొదలెట్టాను ఆశ్చర్యం ఇప్పటివరకూ ఎవరూ ఇంత డైరెక్టుగా ఈ ప్రశ్న వేయలేదు ఒక్కొక్క చోట ఒక్కొక్క అనుభవం కాని కాని ఇది మరీ వింతగా ఉంది ఈ విదంగా కూడా మాట్లాడేవాళ్ళు, ప్రశ్నించే వాళ్ళుంటారా? నమ్మలేక పోతున్నాను కాని ఇది నిజం నా స్వీయ అనుభవం కాదని ఎలా అనగలను! వినలేదని ఎలా చెప్పగలను?

వాళ్ళిద్దరితో పాటు బయట కూర్చున్న కుక్క కూడా నేనేం చెబుతానో అని చెవులు నిక్కరించుకుంది

ముసుగులో గద్దులాట ఎందుకండి అందరికి ముందే చెబుతున్నట్లు ఈయనకి కూడా చెప్పవలసింది చెప్పండి చేతులో భర్తకి సౌంజ్ఞ చేసింది

"ఆయన నోటితో చెబుతాడా, మొహంతో చెప్తాడా' ఆసక్తిగా ఆయన వంకే చూస్తున్నాను

ఆవిడగారి ప్రశ్నకి నేను జవాబిద్దామనుకుంటుండగానే

"చూడండి' కనీసం రెండు లక్షలైనా ఇవ్వగలిగితే మనం మిగతా విషయాలు మాట్లాడు కోవచ్చు' నిక్కచ్చిగా అన్నాడాయన 'అంతేకదూ' అన్నట్లు భార్యవంక చూస్తూ


కుండ బద్దలు కొట్టినట్టన్నాడో- నాబుర్ర బద్దలు కొట్టినట్టన్నాడో నాకు తెలీదు కాని అనుకోకుండా, ఊహించని విషయం వింటేగాని, చూస్తేగాని నోరు మూగ పోతుందంటారు ఇప్పటి నా పరిస్థితీ అదే అయింది

రెండు నిమిషాల దాకా నోట్లో నుంచి మాటే రాలేదు

రె రె రెండు లక్షలే నత్తి గొంతుతో గొంతు పెగిలింది అదృష్టవంతుణ్ని ఇంకా మూగవాణ్ని కాలేదనుకుని సంతోషించాను

"ఏమిటి ఏమిటలా అయిపోతున్నారు' కాసింత కంగారు ప్రదర్శించారు ఆ పుణ్యదంపతులు

అమిత ధనవంతుడైన మైక్



వినోదం కోసం పాప్ సాంగ్స్ పాడి ప్రముఖ పాప్ సింగర్‌గా పేరుబడిన మైకేల్ జాక్‌సన్ ప్రపంచంలోనే ధనవంతుడైన వినోదకారుడు అవుతున్నాడు తన పాప్ సాంగ్స్ కార్యక్రమాల ద్వారా 1989 సంవత్సరంలో 65 మిలియన్ డాలర్ల ఆదాయాన్ని సంపాదించాడట.

1988-89 లో ఈ కార్యక్రమాల వల్ల అతనికి 125 మిలియన్ డాలర్ల ఆదాయం లభించింది. కేవలం వినోదం మీదే యింత ఆదాయం సంపాదించి ధనవంతులైనవారు 40 మంది వున్నారట. ఈ ధనవంతుల జాబితాలోకి రాక్ మ్యూజిక్ సింగర్స్ కూడా చేరి పోతున్నారు

31 సంవత్సరాల వయసులోనే యింత ఆదాయం సంపాదించి ఖ్యాతి గడిస్తున్నాడంటే మైకేల్ పాప్ సాంగ్స్‌ను జనాలు ఏ విధంగా ఆదరిస్తున్నారో విదితమవుతుంది

గాయకులతో పాటు కార్టూనిస్టులు, ఆటగాళ్ళు కూడా ధనవంతుల లిస్టులోకి ఎక్కి పోతున్నారట. మరి జనం విరగబడి చూస్తుంటే వాళ్ళు ధనవంతులు కాకపోతారా?!

"అబ్బే! ఏం లేదండీ! నేను రాకూడని చోటికి వచ్చానేమో? ఒక్కసారి గ్గాడ్రేజి కుర్చీలో నుంచి లేచాను

ఇంతకీ మీరు విషయం చెప్పనే లేదు ఆవిడ కూర్చొ మంటుందో, తరుముతోందో నా కర్థం కావటం లేదు

"చెప్పండి! మీరెంత ఇవ్వగలరో మామిడిపళ్ళ బండివాడు అడుగుతున్నట్లడిగాడు ఆయన

రేటు విషయం దేవుడి కెరుగు నేను కాస్సేపు అక్కడుంటే పిచ్చాణ్నయినా అవుతానేమో నా నోట్లో నుంచి మాటలు రావటం లేదు ఒక్క దణ్ణం పెట్టి వడివడిగా బయటకు అడుగులు వేసాను

కుక్క తాపీగా కూర్చుని ఉంది కనీసం లేవను కూడా లేవలేదు బాగా అలవాటయిన వాణ్నిలా నన్ను చూస్తోంది

బ్రతుకుజీవుడా అన్నట్లు మెట్లు దిగుతున్నాను

"మాటల్లోపడి మర్చిపోయా, మీరు మంచినీళ్ళు కూడా తీసుకోకుండా పోతున్నారు లోపలికి రండి సావధానంగా మాట్లాడుకుందాం ఆయన రెండు మెట్లు దిగినట్లున్నాడు ఆవిడగారు దిగటానికి ప్రయత్నిస్తోంది

ఇందాక ఇంట్లో ప్రవేశించినప్పుడు కుక్క కనిపిస్తే అది అరుస్తూ నన్ను కరుస్తుందను కున్నాను పాపం అదేమి చేయలేదు నన్ను గదిలోకి దింపి బైట కాపు కాచింది

కాని కాని ఇప్పుడు వీళ్ళు లోపల్నించి బయటకు దాని సహాయం లేకుండానే తరుముతున్నారు

గేటు తలుపు తీసుకుని ఎలాగైతే బయట పడ్డాను

కాలికి ఏదో గట్టిగా తగిలింది

చెక్క బోర్డు తలక్రిందులుగా పడిఉంది

వంగి చేత్తో పైకి తీసాను

బోర్డుమీద కుక్కలున్నాయి జాగ్రత్త అని రాసుంది లోపలికి వచ్చేటప్పుడు నేను అది క్రింద పడున్నట్లు కూడా గమనించ లేదు చెక్క తాకిడికి వేలు నెప్పిగా ఉంది

ఒక్క కుక్క ఉన్నా "కుక్క లున్నాయి జాగ్రత్త అని బహువచనం ఎందుకు వాడతారో ఇప్పుడు నాకు అర్థమైంది ఈ ఇంటి గేటు దగ్గిర "మనుష్యులున్నారు జాగ్రత్త అనే బోర్డు పెడితే సరిగ్గా సరిపోతుందేమో అనిపించి గేటుకి తగిలిద్దామనుకున్న బోర్డుని అక్కడే క్రింద పడేసి వెనక్కి చూడకుండా వడివడిగా ముందుకు అడుగులు వేసాను

●

ఈవారంలో మీ యోగం

26–1–1990 శుక్రవారం మొదలు
1–2–1990 గురువారం వరకు

మేషం :– 'గురుడు' త్వరలో మీకు ఆశీస్సు లివ్వనున్నాడు ప్రజా రంగాన ప్రసిద్ధి ఏర్పడనున్నది రాహు కేతు గ్రహాలు అనుకూలింపనున్నారు ఆదాయమందు అభివృద్ధి, యత్న కార్యసిద్ధి రాజకీయాలందు మేలున్నది స్త్రీలకు అన్ని రంగాలలో అభివృద్ధికరమైన మార్పులు రానున్నవి

వృషభం :– వస్తు వాహన సేకరణకు అనుకూల సమయం కళారంగాన ప్రసిద్ధి రానున్నది పదిమందిలో మీ మాటకు గౌరవం రానున్నది ఆదాయమున్నది సుఖ శాంతులున్నాయి 'గురుడు' అనుకూలుడు స్త్రీలకు వృత్తి రీత్యా అనుకూలం ఉద్యోగమందు అనుకూలం

మిధునం :– రాజకీయ రంగాన మేలున్నది మీ మాటకు అదిక గౌరవదాయక వారం కళా సాహితీ రంగాన ప్రసిద్ధి రానున్నది విద్యావేత్తల సహాయమున్నది వృత్తి రీత్యా పెంపు చేకూరనున్నది గ్రహించాలి స్త్రీలకు ఒకానొక కుటుంబ సమస్యతో సతమతం కానున్నారు సభా మర్యాద యున్నది

కర్కాటకం :– ఆదాయమున్నది 'శని' గ్రహాశీస్సు లున్నాయి నల్లని వస్తు విక్రేతలకు మేలున్నది ఇంటా బయటా ప్రసిద్ధి యున్నది వృత్తియందు అనుకూల్యత, ఆదాయవృద్ధి వలన 1990 ప్రారంభాన్నుండియే 'బాగుండు'నని గ్రహింపగలరు స్త్రీలకు సర్వాభీష్టసిద్ధి

సింహం :– రాజకీయమందు అనుకూలం ప్రజ్ఞావంతుల సహాయమున్నది వృత్తియందు రాణింపు, ఉద్యోగమందు పెంపు- నూతన మిత్రులవలన ఏదో మేలు చేకూరుట గమనింపతగిన అంశం స్త్రీలకు వృత్తి వికాసం, చలన చిత్ర రంగాభివృద్ధి, దనలబ్ధి

కన్య :– 'అర్ధాష్టమ శని' బాద క్రమంగా తగ్గనున్నది వ్యాపారాభివృద్ధి అనుకూల మిత్ర సమాగమం వ్యాపారాన అనుకూలం విద్యావేత్తల సహాయం, తద్వారా మేలున్నది స్త్రీలకు సర్వ రంగాలలో అభివృద్ధికరమైన మార్పులు రానున్నది గ్రహించాలి

తుల :– 'శని' మాట గురుడు 'బాగ్యాన అత్యంత అనుకూలదాయకులు ధనలోపం లేదు వ్యాపారస్తులకు- పంపిణీదారులకు, నిర్మాతలకు లాభప్రదాయకం శుభ సమయం వృత్తి యందు వికాసం స్త్రీలకు కొందరకు నూతనోద్యోగ ప్రాప్తి స్థితియందు పెంపు

వృశ్చికం :– అభివృద్ధికరమైన మార్పులు రానున్నవి అయినా, అష్టమ గురుని బాద యున్నది సభా గౌరవ మున్నది ప్రజా రంగాన ప్రసిద్ధి యున్నది చలన చిత్ర రంగాన ప్రసిద్ధి ఏర్పడనున్నది నిర్మాతలకు మేలైన సమయం స్త్రీలకు శుభదాయకం వృత్తియందు పెంపు

ధనుస్సు :– 'రాశి స్థితుడు 'శని' క్రమంగా మీకు మేలు చేయనున్నాడు వారాంతాన ఏదో మేలు చేకూరనున్నది కళా సాహితీ రంగాన ప్రసిద్ధి ఏర్పడనున్నది చలన చిత్ర రంగాన అనుకూలత చేకూర నున్నది అదికారమందు వృద్ధి యున్నది స్త్రీలకు సభా మర్యాద, దన వృద్ధి, వృత్తియందు మేలు గ్రహించాలి

మకరం :– ఇంకా 'శని' బాద తప్పలేదు వేరు విదంగా యిబ్బంది లేదు గాని, అదిక వ్యయానికి గురి కాక తప్పదు ఇరుగు పొరుగు వారి గొడవలు రాకుండా చూచుకోండి ప్రసిద్ధుల పరిచయం ఏర్పడుతుంది స్త్రీలకు ఆట పాటల్లో ప్రావీణ్యమున్న వారికి లాబదాయకం

కుంభం :– 'శని' అనుకూలుడు ఇంట శుభం జరుగవచ్చు దూర బాంధవుల నుండి బంధు మిత్రులు రానున్నారు అయినవారి స్నేహం లాభదాయకం జాయింటు వ్యాపారస్తులకు అనుకూల సమయం అదిక లాభ ప్రదాయకం స్త్రీలకు ముఖ్య వ్యవహారాలందు పెంపు చేకూరనున్నది గ్రహించాలి

మీనం :– గురు, శని, శుక్ర, రవి గ్రహాలు అనుకూలత వలన ఉద్యోగ వృత్తులందు పెంపు చేకూరనున్నది రాజకీయ రంగాన ప్రవేశించారుగా! అది లాభ ప్రదాయకమే ప్రజా సేవయే ధ్యేయంగా పెట్టుకోండి ముందుకు సాగిపోవుటకు ఆస్కారమున్నది స్త్రీలకు శుభకార్యాలో చనలు, వృత్తి వికాసం, సుఖానందం

విద్వాన్ కోట సత్యారంగయ్యా శాస్త్రి

యువతీ యువకుల కోసం
"జాగృతీ కిరణ్" కొత్త శీర్షిక

నేనేం చదవాలి?

కూపన్

ఆంధ్రసచిత్ర వారపత్రిక
నేనేం చదవాలి?

ప్రశ్న: ....

....

పేరు: ....

చిరునామా: ....

....

....



మీరు ఇప్పుడు పరీక్ష ప్యాసై పోయాక ఏం చెయ్యాలన్న అనుమానం రావొచ్చును. 10 తర్వాత 12 తర్వాత, డిగ్రీ తర్వాత మీరేం చేయాలో సలహాలు యిచ్చే ప్రత్యేక కొత్త ప్రశ్నలు-జవాబులు శీర్షిక సచిత్ర వారపత్రికలో ప్రారంభిస్తున్నాము. కూపన్ కూడా ఇచ్చాము.

–ఎడిటర్

సూపర్ హీరో

మన్నెం శారద

(గత సంచిక తరువాయి)

ఇంతవరకూ సాగిన కథ - 1 : అనతికాలంలోనే బిజీ హీరో అయిన విజయేంద్ర కాల్‌షీట్లకోసం నిర్మాతలు పడిగాపులు కాస్తుంటారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు అయిన తల్లి నిఖిలేశ్వరి కొడుకు విజయాల్ని చూసి మురిసిపోతుంటుంది. విజయేంద్రతో కలిసి యింటికి రమ్మని కొత్త హీరోయిన్ జయలతను ఆహ్వానిస్తుంది నిఖిలేశ్వరి.

కారులో నుండి ముందు విజయేంద్ర దిగేడు. అతని వెనుక జయలత, ఆవిడ తల్లి కాబోలు భారీకాయంతో దిగేరు.

జయలత దూరం నుండే చేతులు జోడించింది.

నిఖిలేశ్వరి ప్రతి నమస్కారం చేస్తూ నిలబడి "రండి, రండి" అంది.

జయలతని చూడగానే రాగిణి కనురెప్పలు పైకి లేచేయి.

'ఈ పిల్ల మొన్ననేగా తెరకు పరిచయమైంది. అప్పుడే పెద్ద హీరోతో చేతులు కలిపేసిందా?' అనుకొంది మనసులోనే.

"నమస్కారం" అంది లేచి నిలబడి నవ్వుతూ.

"కూర్చోండి" అన్నాడు విజయేంద్ర నవ్వుతూ.

"ఊరికే కూర్చుంటే మా పొట్టలెలా గడుస్తాయి? మాకు ఆహారం కావాలి!" అంది రాగిణి.

"ఈకొత్తమ్మాయి గురించి మంచి ఇంటర్వ్యూ రాయండి. నాల్గు సినిమాలన్నా దక్కుతాయి" అంది నిఖిలేశ్వరి.

"బాగా చెప్పేరు. ఎవరో ఇద్దరు ఏదో పత్రికవాళ్ళమని వచ్చి ఆకాశానికి ఎత్తేస్తామని మరీ అరడజను ఫొటోలు తీసుకొని యిక పత్తా లేరు! మాయదారి లోకం!" అంది జయలత తల్లి ఆయాసంగా .

"డబ్బు కూడ ఏమైనా?...."

"ఆ! అది లేకుండాను మొహం ఎవరు చూస్తారు లెండి."

"అయితే ఇంతకీ వాళ్ళు జర్నలిస్టులూ అయివుండరు. వాళ్ళ చేతిలో పత్రికా ఉండి వుండదు" అన్నాడు విజయేంద్ర గమ్మత్తుగా భుజాలెగరేసి నవ్వుతూ.

ఆవిడ నోరావలించి "అలాంటి "జర్నలిస్టులూ" అనే మోసగాళ్లు వుంటారా?" అంది.

"జర్నలిస్టులేకాదు నిర్మాతలు, దర్శకులూ అందరూ వున్నారు ఈ మహానగరంలో! కూటికోసం కోటి విద్యలని కొత్తగా వచ్చే వాళ్ళని మోసం చేస్తూ బతుకుతుంటారు. ఈ బాపతు మొదట్లో నాకూ తారసపడ్డారు. నా అదృష్టమేమిటంటే వేషాల కోసం నేను ప్రయత్నించలేదు. అవే నా వెంటపడ్డాయి!" అన్నాడు చమత్కారంగా.

జయలత మాత్రం విజయేంద్ర ఎదుట కూర్చోడానికే భయపడినట్లు కూర్చుంది.

నిఖిలేశ్వరి ఆ విషయం గమనించి "నువ్వు మాట్లాడటంలేదు. నటనంటే నీకెలా ఇష్టం ఏర్పడింది! చదువు ఏమైనా కొన్నావా?" అనడిగింది.

బదులుగా జయలత తల్లి జవాబు చెప్పసాగింది.

"డాక్టరవ్వాలని అమ్మాయి ఉబలాటమండి. కాని ఏక్టరయింది" అంది పాన్ తిన్న గారపళ్ళన్ని బయటపెట్టి నవ్వుతూ!

"ఈ జవాబు విని విని ప్రేక్షకుల తలకాయలు అరిగిపోయేయ్! అమ్మాయి ఎం.బి.బి.ఎస్. ఏ సంవత్సరంలో మానేసింది?" అనడిగేడు విజయేంద్ర నవ్వుతూ.

దాంతో జయలతతోపాటూ వాళ్ళమ్మ మొహం కూడా మాడిపోయింది.

"ఏదీ, టెన్త్ చదువుతుండగానే ప్రయివేటు చెప్పే మాస్టారు అమ్మాయి అందం చూసి వాళ్ళ బామ్మరిది సినిమాలు తీస్తాడంటూ అతనికి పరిచయం చేసేడు. ఆయన ఈ నిర్మాతకి చెబితే- అలా హీరోయిన్ వేషం వచ్చేసింది" అందావిడ.

అంతలోకి నాయర్ టీపాట్, కప్పులు ట్రేలో తెచ్చి అక్కడ పెట్టేడు.

నిఖిలేశ్వరి అందరికి "టీ" అందించింది.

"మొదట్లో మీరు వేషాలకి ట్రయ్‌చేసి పైకి రాక, మీ అమ్మాయికి తర్ఫీదు ఇచ్చి ఆమె ద్వారా మీ కోరిక తీర్చుకోవాలని ప్రయత్నిస్తున్నారని విన్నాను" అంది రాగిణి టీ సిప్ చేస్తూ.

ఆ మాటకి జయలత తల్లి మొహం చిరచిర లాడింది.

"మాయదారి సంత. కాకినాట్లో మాదెంత ఘోషా కుటుంబమో భోగందాని చెరువు దగ్గర అడిగితే తెలుస్తుంది. సినిమాలో వేషమేంటి, సినిమాలే చూసెరగం" అంది కోపంగా.

"కాని అరణ్యవాసం సినిమాలో సీతకి అశోకవనంలో కాపలా కాసే రాక్షస స్త్రీలలో మీరూ ఒక వేషం వేసినట్లు....."

"ఇవేం మాటలండి ఇంటికి పిలిచి..." అంది ఆవిడ కాస్త కోపంగా నిఖిలేశ్వరి వైపు చూస్తూ.

"రాగిణీ! వాళ్ళు మనకి అతిథులు. నేను ఆహ్వానిస్తే వచ్చిన వాళ్ళు. మీకు ఇంటర్వ్యూ చేయాలనిపిస్తే వారింటికి వెళ్ళి చేయండి" అంది మెత్తగానే.

"సారీ! అలవాటయిపోయింది" అంది రాగిణి.

టీ తాగేక "విజయ్, అమ్మాయికి ఇల్లు చూపించు" అంది నిఖిలేశ్వరి.

విజయ్ లేచి నిలబడి "రండి" అన్నాడు జయలతతో.

"నేను కూడా రావొచ్చా?" అడిగింది రాగిణి చొరవగా.

"రండి" అన్నాడు విజయ్.

"మీరంతా చిన్నవాళ్ళు. మీరు మా ఎదుట ఏం మాట్లాడుకుంటారు! అందుకే

విజయేంద్ర రూమ్‌లో కబుర్లు చెప్పకోండి” అన్నది నిఖిల.

వాళ్ళు వెళ్లగానే “అమ్మాయి ఈ వేళ భయం కొద్దీ చాల ఓకులు తిన్నది. ఎక్కడ హీరోకి కోపం వచ్చి ఈ పిల్లని తీసెయ్యమని చెబుతాడోనని భయపడి చచ్చేను. ఏదో రాక రాక వచ్చిన వేషం! దయుంచి ఆపని చెయ్యొద్దని బాబుకి చెప్పండి. ఈ సంగతులు ఏవి విన్నా ఆ పేపరు పిల్ల రాసేస్తుంది. అదే నా భయం!” అంది జయలత తల్లి వగరుస్తూ.

నిఖిలేశ్వరి అభయమిస్తున్నట్లుగా నవ్వి “ఫర్వాలేదు ఆ విషయం తెలిసే నేను ఆ అమ్మాయిని ఇంటికి తీసుకురమ్మన్నాను. కాస్త చొరవగా మాట్లాడుకుంటే ఆ భయం పోతుంది. రేపు చూడండి, ఎంత బాగా ఫస్టు టేకే ఓ.కే చేస్తుందో!” అంది.

ఆవిడ కళ్ళు పెద్దవి చేసి “అంటే....?” అంది ఆశ్చర్యంగా.

“ఈ సినీరంగంలో ఎవరూ పెద్ద, చిన్న అని లేదు. రోజులు కలిసొస్తే ఒకరు ఆకాశంలో వుంటారు! మరొకరు నేలమీద. ప్రేక్షకులు కాదంటే ఆకాశం నుండిపాతాళంలోకి జారిపడ్తారు. విజ్జు ఈ ఫీల్డునే నమ్ముకొన్న మనిషికాదు: బాగా చదువుకొన్నాడు. అనుకోకుండా ఈ రంగం అతన్ని ఆహ్వానించింది. బిజీ అయిపోయేడు. కాదన్న రోజు పక్కకి తప్పకొంటాడు. ఆ మాత్రానికి పొట్టపట్టుకొని వచ్చిన ఏ తారల్ని అతను చులకనగా తీసెయ్యడు” అంది.

బదులుగా జయలత తల్లి నిఖిలేశ్వరికి చేతులు జోడించింది. “ఇంత పెద్ద మనసుతో అందరూ ఆలోచిస్తే సమస్యలే వుండవు తల్లీ!” అంది.



“రండి, మనం కూడ వెళ్లి వాళ్లేం చేస్తున్నారో చూద్దాం” అంది నిఖిల.

వాళ్లు పైకి లేస్తుండగానే వాళ్లు ముగ్గురూ నవ్వుతూ కబుర్లు చెప్పకొంటూ ఎదురొచ్చేరు.

“చూశారా, మీ అమ్మాయిలో భయం పారిపోయింది. రేపు మావాణ్ణి బీట్ చేసేస్తుంది నటనలో” అంది నిఖిల.

"అదే నాభయం కూడా!" అన్నాడు విజయేంద్ర తల్లి భుజమ్మీద తల వుంచి.

బదులుగా అందరూ నవ్వుకున్నారు.

ఆ రోజు అందరూ అక్కడే భోంచేసేక తమ కారులోనే వాళ్లని సాగనంపింది నిఖిల.

* * * *

"పీయూష కనబడటం లేదేంటి?"

తల్లిప్రశ్నకి కొంచెం చిత్రంగా చూసి "అమెరికా వెళ్లిందమ్మా వాళ్లక్కగారింటికి. వచ్చే నెలలో వచ్చేస్తుంది" అన్నాడు విజయేంద్ర.

"మరి ఉత్తరమైనా రాయలేదు."

బదులుగా తల దించుకొని ముసిముసిగా నవ్వేడు విజయేంద్ర.

"ఎందుకు నవ్వుతున్నావు?"

"రోజుకు మూడుసార్లు టెలెక్స్ చేస్తుంటే ఉత్తరాలెందుకు?"

ఆవిడ కొడుకు వైపు ఆశ్చర్యంగా చూసి "మూడు సార్లు ఫోన్ చేస్తుందా? ఎప్పుడూ?" అంది.

"నువ్వు తిట్టకూడదు మరి!"

"ఉహూ!"

"రాత్రి పన్నెండు గంటలు కొక సారి, పొద్దుట నాలుగ్గంటలకి, మధ్యాహ్నం షూటింగ్ బ్రేక్‌లో."

ఆవిడ విస్తుపోయినట్లు చూసి "అందుకేనా ఈ మధ్య నీకళ్లు నిద్రలేమితో ఎర్ర బారుతున్నాయి. అన్ని కబుర్లేముంటాయి." అంది ఆశ్చర్యంగా.

"తనే వాగుతుందమ్మా! నేనొక్కొక్కసారి రిసీవర్ని పక్కకి పెట్టి నిద్రపోతాను కూడా" అన్నాడు విజయేంద్ర బుద్ధిమంతుడికి మల్లే.

"నీ సంగతి తెలీనట్టు నాకే చెబుతున్నావా? దేనికైనా ఒక హద్దుండాలి. రేపు పెళ్లి కావాల్సిన పిల్ల! ఏ పత్రిక వాళ్లన్నా మీ ఇద్దరి గురించి లేనిపోనివి రాస్తే నీసంగతి కేంగాని ఆడపిల్ల, అందులోనూ పెద్దింటి పిల్ల, ఆ పిల్ల భవిష్యత్తు ఏమవుతుందోనని నా భయం! రాత్రికి ఫోనొస్తే నన్ను పిలువు. నేను మందలిస్తాను" అంది నిఖిలేశ్వరి.

"అది కాదమ్మా"

"ఏది కాదు?"

"అదే తను...తను...నేను...నేను..."

నిఖిల వస్తోన్న నవ్వునాపుకొంది.

"ఏమిట్రా తను...నేను...ఇలాగే చెబుతున్నావా సినిమాలో డైలాగులు!" అంది చిరుకోపం ప్రదర్శిస్తూ.

"ఆ! డైలాగంటే గుర్తొచ్చింది. జయలత నిన్న బ్రహ్మాండంగా ఏక్ట్ చేసేసింది. నాకన్నా వేగంగా స్టెప్స్ వేసింది. నీకు ప్రత్యేకంగా వచ్చి థాంక్స్ చెబుతానంది." అన్నాడు విజయేంద్ర టాపిక్ మార్చడానికి ప్రయత్నిస్తూ.

"ఎందుకట?"

"నీవు ఆరోజు ఇంటికి పిలిచి ఉత్సాహపరచక పోతే మర్నాడసలు నాతో నటించలేక ఈ ఊరు నుండే పారిపోయేదట!"

"నేనడుగుతున్నది పీయూష గురించి"

విజయేంద్ర గత్యంతరం లేనట్లు చూసి "నీకు...నీకు...చాల రోజుల్నుండి.. చెప్పాలనుకొంటున్నాను."

"ఏమని?"

"అదే..పీయూష..పీయూష..నన్ను లవ్ చేస్తోందమ్మా" అన్నాడు గబాగబా తన బాధ్యత పూర్తయినట్లుగా.

నిఖిలకు నవ్వు తన్నుకొచ్చింది. కొడుకు మొహం చూస్తుంటే సినిమా కొక హీరోయిన్ చొప్పున నడుములు పట్టుకొని నటించి...ప్రేమించి హీరోయిజం చూపించే కొడుకు నిజజీవితంలో ఆ టాపిక్ వచ్చేసరికి సిగ్గు పడటం... చెప్పలేక తికమక పడిపోవడం చూస్తే ఆమెకి తమాషాగా అనిపించింది.

"పాపం, అయితే నువ్వు ప్రేమించటం లేదన్నమాట!" అంది సానుభూతిగా.

ఆ మాట మాత్రానికే కంగారుపడిపోయేడు విజయేంద్ర.

"నేను...నేనంటే...అదే...నిన్నడిగి చెబుతానన్నాను."

"నేను వద్దంటే..." అర్థోక్తిగా చూసింది నిఖిల.

వెంటనే కంగారు పడిపోతూ "నువ్వు... నువ్వలా అనవుగా అమ్మా! నువ్వు... చాలా మంచిదానివి!" అన్నాడు ఠక్కున ఆమె వడిలో తలపెట్టి పడుకొంటూ.

నిఖిల నిర్మలంగా నవ్వి, అతని ఉంగరాల జుత్తులో చేతులు దూనిపి "నా పిచ్చివిజ్జూ, నేను పొగడ్తలకి, లంచాలకి లొంగే రకాన్ని కాదని నువ్వు మరచిపోతున్నావు." అంది.

వెంటనే విజయేంద్ర కళ్లలో భయం తొంగిచూసింది.

"అంటే...నీకు పీయూష...నచ్చలేదా?"

"నచ్చలేదు."

"ఎందుకని?"

"ఆ పిల్ల పౌడరు కూడా రాసుకోదు. నేత చీరలే కడుతుంది కానిడ్రెస్‌లు ఏవీ వేసుకోదు. నగలు పెట్టదు. పొడుగాటి ఒక్క జడే వేసుకుంటుంది. అందుకని"

విజయేంద్ర తల్లివైపు అసంతృప్తిగా చూశాడు. కళ్లలో దిగులు తొంగిచూసింది.


"అమ్మా...!" అన్నాడు మెల్లిగా.

ఆరడుగుల ఎత్తున్న పాతికేళ్ల కొడుకు అలా డీలా పడికూర్చోవడం నిఖిలకి జాలిని కల్గించింది.

"సరే! ఇక పడుకో! రేపు ఆలోచిద్దాం. రాత్రి ఫోనొస్తే నన్ను పిలువు! నీ ఆరోగ్యం పాడుచేస్తూ అర్ధరాత్రులు ఫోన్‌చెయ్యొద్దని మందలిస్తాను."

"సరేనమ్మా" అన్నాడు విజయేంద్ర దిగులుగా. అతని మొహం చూస్తే నిఖిలకు జాలేసింది.

అయిష్టమైనా తన మాట తీసెయ్యని



కొడుకుని చూస్తే ఆమెకి ఎంతో ఆనందం కల్గుతుంద.

ఆమె లేచి గది బయటకి రాబోతుండగా అతని గదిలో ఫోను మోగింది.

విజయేంద్ర ఎగిరినంత పని చేసి రిసీవర్ అందుకున్నాడు.

నిఖిల గుమ్మం దగ్గరే నిలబడిపోయింది.

"హోయ్!" అని నాలిక్కొరచుకొని "ఆ! అవును.

ఇప్పుడెందుకు ఫోను చేసినట్లు? నాకు నిద్ర డిస్టర్బ్ అవుతుందని అమ్మ కోప్పడుతోంది!" అన్నాడు ఎక్కడలేని గాంభీర్యం తెచ్చుకొని.

నిఖిల మెల్లగా అతని దగ్గర కొచ్చి నోటి మీద వేలుంచుకొని అతని దగ్గర రిసీవర్ అందుకొని పీయూష మాటలు వినసాగింది.

"ఆంటీ ఎప్పుడూ అలా అనదు. నువ్వే నేను స్టేట్స్ వచ్చేక మారిపోయేవు. మొన్న వి. సి. ఆర్.లో నీ కొత్త పిక్చరొకటి చూశాను. ఎందుకో తెలుసా! మాట్లాడవేం! సరే నీ మట్టి బుర్రకి అంత మాత్రం అర్థమవుతుందా! ఇంత దూరం నుండి నిన్ను అర్జెంటుగా చూడాలంటే అంతకన్నా మార్గం ఏముంది! తీరా చూస్తే....ఛీ! ఛీ! ఛీ! ఆ హీరోయిన్‌తో నీ కుప్పిగంతులు, కౌగిలింతలు, నేను లేనుకదా అని రెచ్చిపోయి ఏక్ట్ చేసినట్లున్నావు. నా కెంత జెలసీ వేసిందో తెలుసా? మీ మగాళ్ళు అంతే! ప్రేమా దోమా అని వెంటబడి మరో ఆడది కళ్ళ పడగానే మరచిపోతారు! నేనింత వాగుతుంటే జవాబు చెప్పవేం!"

"వాడు సినిమా హీరో! వేలకొద్దీ అభిమానులుండటం సహజం! మధ్యలో నీ పెత్తనం ఏంటి?" నిఖిలేశ్వరి గొంతు వినగానే పీయూష గుర్తుపట్టి కెవ్వున అరచింది.

"ఆంటీ, మీరా! మీరు....అంతా విన్నారా? ఓ మై గాడ్!" అంది కంగారుగా.

"విన్నాను. ఒక అల్లరి అమ్మాయి నా కొడుక్కి రోజు మూడుసార్లు ఫోనుచేసి వాడి ఆరోగ్యం చెడగొడుతుంటే కాపలా కాయాల్సిన బాధ్యత నాకుంటుందికదా మరి!" అంది.

పీయూష వెంటనే సిగ్గుపడుతూ "మీ అబ్బాయి అంత సుకుమారుడా ఆంటీ ఫోను చేస్తేనే కంది పోడానికి!" అంది కొంటెగా.

"అనే అంటున్నారు సౌత్‌లోని ఆడపిల్లలంతా. నువ్వొక్కర్తివే మూడుసార్లు ఫోనుచేస్తే తక్కిన కోట్లమంది అమ్మాయిలు ఎప్పుడు మాట్లాడుతారు! వాళ్ళకో ఛాన్స్ ఇవ్వాలి కదా!" అంది నిఖిల నవ్వు నాపుకొంటూ.



ధర్మేంద్ర కుర్రచేష్టలు

ముసలితనం వస్తున్నా యింకా కుర్రోడినే అంటున్నాడట ధర్మేంద్ర గతాన్ని నెమరేసుకుంటూ. ఎంతోమంది కుర్రవారు సినిమారంగంలోకి అడుగుపెడుతుంటే ఈ పాతకాలం వాళ్లని ఎవరు పట్టించుకుంటారు.

కుర్రచేష్టలు పోని ధర్మేంద్ర యిటీవల పూనమ్‌తో చెట్టా పట్టా లేసుకొని బయల్దేరాడట. ఈలోపు పూనమ్‌కు ఎవరు కంట బడ్డారో ఏమో ధర్మేంద్ర చేయి విడిపించుకొని అటువైపు పరుగెత్తిందట. ఖంగుతిన్న ధర్మేంద్ర తన కుర్రతనం గురించి ఆలోచిస్తూ ముక్కు మీద వేలేసుకొని నిలుచుండిపోయాడట.

"యూ....ఆంటీ! నువ్వుకూడా నన్నే డిపిస్తున్నావుకదూ! ఆ కొత్త హీరోయిన్‌తో మీ అబ్బాయి ఎంత క్లోజ్‌గా ఏక్ట్ చేసేడో చూశారా! అది మీకు బావుందా! మీ అబ్బాయి చెడిపోతాడని భయం లేదా మీకు!" అంది ఏడుపు గొంతుతో పీయూష.

పీయూష ఉక్రోషం చూసి నిఖిలకి నవ్వొస్తోంది.

తల్లి ధోరణికి విజయేంద్ర ఆశ్చర్యపోతున్నాడు. అయినా ఏం చేయలేక నిస్సహాయంగా నిలబడి చూస్తున్నాడు.

"ఎందుకు చెడిపోతాడు. అంత నేచురల్‌గా ఏక్ట్ చేయడానికి నేనే దోహదం చేసేను. ఆ అమ్మాయి రోజూ మనింటికి వచ్చి విజయేంద్రతో చనువుగా తిరిగేట్లు నేను రమ్మని ఆహ్వానించేను. చాలా మంచి పిల్ల! బాగుంటుంది కూడా!" అంటూ కవ్వించింది నిఖిలేశ్వరి.

వెంటనే ఫోను పెట్టేసినట్లు క్లిక్ మన్న శబ్దం!

నిఖిలేశ్వరి నవ్వుతూ "అలిగినట్లుంది" అంటూ రిసీవర్ క్రెడిల్ చేస్తుంటే "ఏంటమ్మా, పీయూష ఫోను పెట్టేసిందా?" అనడిగేడు.

ఔనన్నట్లుగా తలూపింది నిఖిలేశ్వరి.

"ఎందుకమ్మా అలా టీజ్ చేసేవు? తనేడుస్తుందేమో!" అన్నాడు విజయేంద్ర నొచ్చుకున్నట్లుగా.

"ఏడుపుదేనికి, విషయం చెప్పొచ్చుగా! చూస్తుండు ప్రొద్దుటే ఫోనొస్తుంది. మీ అబ్బాయిని ప్రేమిస్తున్నానని చెబుతుంది చూడు!" అంటూ నవ్వుతూ "గుడ్‌నైట్" చెప్పి తన గదిలోకి వెళ్ళిపోయింది నిఖిలేశ్వరి.

3

"నా పేరు కరంచంద్‌గాంధి. గాంధీకి నాకు ఎటువంటి చుట్టరికం లేదు. అసలు నేను గాంధీని చూడలేదు కూడ!"

"నన్నేం చేయమంటారు? మీరెవరో నాకు తెలియదు" అంది నిఖిలేశ్వరి ఓపిగ్గా.

"అందుకే ఇంత ఉపోద్ఘాతం! నేను కనీసం ఏ గుజరాతీనో కూడ కాదు. గుంటూరు జిల్లాలోని ఓ కుగ్రామం మాది. ఇంతకీ నేను మీ కెందుకు ఫోన్ చేసానో చెబుతాను. మీరీపాటికే ఎంతో టెన్షన్ ఫీలవుతూ వుండొచ్చు. ప్రస్తుతం నేను కమీషనర్ ఆఫ్ పోలీసుగా పనిచేస్తున్నాను. అంతేకాదు మీ అబ్బాయితో చనువుగా తిరిగే పీయూషకి నేను తండ్రిని." అన్నాడతను ఫోనులో.

ఆ మాట వినగానే అంతసేపూ ఆమె మొహంలో బిగిసిన కండరాలన్నీ సడలి ఆమె పెదవులపై చిరునవ్వు పొడసూపింది.

"మీరా! నమస్కారం" అంది నవ్వుతూ.

"నమస్కారం. మూడు నెలలుగా మీతో మాట్లాడాలని తెగ ప్రయత్నిస్తున్నాను. కుదరలేదు. మీరు చూస్తూనే వున్నారుగా దేశంలో ఏమూల ఏం జరిగినా మా డిపార్టుమెంటునే ఆడిపోసుకుంటారు. మిడ్‌టెర్మ్ ఎల

'పిరవి'కి ఛార్లీ ఛాప్లిన్ అవార్డు

ప్రముఖ మళయాళ చిత్రం 'పిరవి'కి ఛార్లీ ఛాప్లిన్ అవార్డు లభించింది.

ఎడిన్‌బర్గ్‌లో జరిగిన చిత్రోత్సవంలో పాల్గొన్న ఈ చిత్రం హాస్య బ్రహ్మ ఛాప్లిన్ అవార్డుకు ఎన్నికైనట్లు నిర్వాహకులు ప్రకటించారట.

ఈ చిత్ర దర్శకుని దర్శకత్వ ప్రతిభ ఈ అవార్డు వచ్చేందుకు కారణమైంది.

ఈ ఏడాది ఈ చిత్రం ఐదు ఆస్కార్ అవార్డులను గెలుచుకున్న విషయం పాఠకులకు తెలిసినదే.

క్షన్స్, నక్సలైటు గొడవలు, మతకలహాలు, విద్యార్థుల స్ట్రయిక్‌లు....ఇలా అనేక గొడవల్లోపడి....ఇంటి విషయాలే పట్టించుకోవడానికి క్కుదర్లేదు. అంతలోకే మా అమ్మాయి చెయ్యి దాటి పోయిందన్న విషయం మా పెద్దమ్మాయి యు. ఎస్. ఏ. నుండి ఫోను చేసి చెప్పేవరకూ తెలియలేదు" అన్నాడతను.

ఆ మాటతో నిఖిలేశ్వరి నొసలు ముడి పడింది. "అంటే మీ ఉద్దేశ్యం!" అంది గంభీరంగా.

బదులుగా అతను నవ్వి "అయ్ మీన్ మా బేబి రోజుకు మూడు సార్లు ఫోన్లు చేసి మీ అబ్బాయితో మంతనాలు సాగిస్తుందని నిన్ననే తెలిసింది. చూశారా, దేశంలో ఏ మూల ఏం జరిగినా కనిపెట్టగల పోలీసాఫీసర్నయివుండి కూడ నా కూతురు ప్రేమలో పడిందన్న విషయాన్ని కనిపెట్టలేకపోయేను." అన్నాడు.

"ప్రేమా?"

"అవును. వయసులో వున్న యువతీ యువకులు ఎక్కువ కాలాన్ని ఒకరితో ఒకరు మాట్లాడుకోడానికి వినియోగించడాన్ని ప్రేమే అంటారు. అంతేకాక బేబి నిన్న ఫోనులో వాళ్ళ అక్కచేత నన్ను మీతో మాట్లాడమని చెప్పించింది."

ఆమాట వినగానే నిఖిలేశ్వరి మొహం వికసించింది.

"నేను అనుకుంటూనే వున్నాను" అంది చిరునవ్వుతో.

"వాట్! మీరుకూడా అనుకున్నారా! అంటే ఈ సంగతి మీకుకూడా తెలుసన్న మాట!"

"విన్ననే గ్రహించేను. పీయూష మూడు నెలలు క్రితం అతని ఫాన్‌గా మాకు పరిచయ మయ్యింది. మిగతా ఫాన్స్ మాదిరి కాక ఆమె విజయేంద్రపట్ల చూపించే అభిమానం నన్ను అనుమానానికి గురి చేసింది. అందుకే మా అబ్బాయిని నిలవేసి అడిగేను. దాంతో విషయం బయట పడింది."

"ఇలాంటి విషయాలు బొత్తిగా అఫీషియల్ మాటర్స్‌లా మనం ఫోన్లో మాట్లాడుకోవడం బాగుండదనుకుంటాను. ఆడపిల్ల తండ్రిని నేనే మీ ఇంటికి రావాలని మీరను కోకపోతే మీరు సాయంత్రం మా యింటికి రాగలరా!

నిఖిలేశ్వరి ఇబ్బందిగా ఆలోచించింది.

"మీ కభ్యంతరమైతే నేనే వస్తాను. కాని... ఇక్కడికి మీ రొస్తేనే మీకు కాబోయే కోడలి కుటుంబ వివరాలు బాగా అర్థమవుతాయి. ఆస్తి, అంతస్తు, మంచి చెడు, సభ్యత, సంస్కారం అవగాహన చేసుకోగల్గుతారు. ఏమంటారు?"

"మీరు చెప్పేది నిజమే! కాని పీయూషని చూస్తేనే గ్రహించవచ్చు ఆ సంగతులన్నీ! అయినా నేను వస్తాను. ఆస్తి అంతస్తులు చూసుకోడానిక్కాదు. అంతరంగాలు విప్పి మనసారా మాట్లాడుకోటానికి! ఏమంటారు?" అంది నిఖిలేశ్వరి తిప్పికొడుతున్నట్లుగా.

"అవునవును. సరిగ్గా సాయంత్రం ఆరు గంటలకి ఎదురు చూస్తుంటాము మీ ఆగమనంకోసం! ఉంటాను. నమస్కారం!"

నిఖిలేశ్వరి ఫోన్ క్రెడిల్ చేసి సోఫాలో కూర్చుని ఆలోచించసాగింది.

రాత్రి తన మాటలు పని చేసి వెంటనే పీయూష అక్కగారితో తండ్రికి ఫోను చేయించినట్లుంది. మొత్తానికి గడుసుపిల్లే! అనుకొంది మనసులోనే అభినందిస్తూ. ఈ సంగతి షూటింగ్ నుండి రాగానే విజయేంద్రకి చెప్పాలా, లేక పోతే ఇప్పుడే స్టూడియోకి ఫోను చేసి చెప్పాలా అని కాస్సేపు ఆలోచనలో పడింది. ప్రొద్దుటే కాస్త బింకం చూపించాలని కాబోలు పీయూష ఫోను చెయ్యలేదు.

ఏది ఏమైనా వాళ్ళిద్దర్నీ కాస్త ఉడికించాలంటే అప్పుడే చెప్పక పోవడమే మంచిదని పించిందామె మనసుకి. అలా అనుకోగానే ఆమెకి స్థిమితం చేకూరింది.

వెంటనే తన ఆఫీసు ఫైల్సు చూసుకొంటూ నిముషాలమీద ఇంటి విషయాలు మరచి అందులో మునిగి పోయింది.

** ** ** **

ఆరోజు క్లబ్‌డాన్సర్ నీత కాలు బెణకడంతో ఆమెతో కలిసి విజయేంద్ర నాట్యం చేయాల్సిన షూటింగ్ మధ్యలో ఆగిపోయింది. షూటింగ్ పేకప్ చెప్పడంతో అతను హుషారుగా మేకప్ రూమ్‌లో కెళ్ళి మేకప్ కడిగేసుకొంటుండగా "మీరలా తోసుకొని లోపలికి రాకూడదు. కావాలంటే ప్రొద్దుటే రండి." అంటూ విదిలిస్తూ అరుస్తున్నాడు పి.ఏ. ప్రసాద్.

"నేనేం ఆశించి రాలేదయ్యా ఒక్కసారి అతగాణ్ణి చూస్తాను. అదివరలో ఇతను నా దగ్గర కొచ్చినట్లు గుర్తు. ఆ సంగతి గుర్తు చేసి...."

"వచ్చే వాళ్ళంతా ఇలానే వస్తారు వంకలేవో చెప్పి. ఎప్పుడంటే అప్పుడు అభిమానుల్ని పంపిస్తే ఆయనకి క్షణం రెస్టు వుండదు" అన్నాడు పి.ఏ. విసుక్కుంటూ.

"నేను అభిమానిని కానయ్యా. పెద్దవాణ్ణి. మళ్ళీ మళ్ళీ జనాన్ని తోసుకొని రాలేను. ఒక్కసారి చూడనివ్వు. ఆయన కాదంటే వెళ్ళిపోతాను."

ఆ మాట వినగానే విజయేంద్ర అద్దం ముందు నుండి లేచి నిలబడి తలుపుతీసి బయటకి చూసేడు. పొట్టిగా బట్టతలతో, భుజమ్మీద 'హరేరామ, హరేకృష్ణ' అని వున్న పసుపురంగు శాలువాతో, నీటికావి పంచెతో వున్న ఆ వ్యక్తిని తానిది వరకు చూసినట్లు స్ఫురించక పోయినా, అతని పెద్దవయసుని, వేడుకోలుని మన్నించి "మిస్టర్ పి.ఏ., లెట్ హిమ్ మీట్ మీ" అన్నాడు లోనికి నడుస్తూ.

వెంటనే అతని కళ్ళు ఆనందంతో మెరిసేయి. "వయసులో చిన్నవాడివి, ప్రస్తుతం వున్న హోదాని బట్టి నమస్కరించాలి! కాని పెద్దవాళ్ళు అలా చేస్తే ఆయుః క్షీణం అంటారు. నువ్వింకా గొప్పవాడివై ఎన్నో అవార్డులు అవీ పొందాలని మనసారా ఆశీర్వదిస్తున్నాను" అన్నాడతను కొద్దిగా వణుకుతూ.

"కూర్చోండి." అన్నాడు విజయేంద్ర వినయంగా.

అతను సోఫాలో కూర్చుని "ఎండలో పడి బస్సెక్కి వచ్చేను కాసిని మంచినీళ్ళు... ఇప్పిస్తారా!" అన్నాడు ముఖానికి పట్టిన చెమట శాలువాతో తుడుచుకొంటూ.

విజయేంద్ర బాయ్‌ని పిలిచి మంచి నీళ్ళు తెప్పించి ఇచ్చేడు.

అతను మంచినీళ్ళు తాగి గ్లాసు పక్కన పెడుతూ "ఈ నీళ్ళలాగే నువ్వుకూడ చల్లగా వర్థిల్లాలి! ఇంతపైకొచ్చినా ఎంత వినయం, ఎంత నమ్రత! గట్టిగా రెండు చొక్కాలు,

రెండు లాగుల్లావుంటే విడిసి పడి పోతున్నారు ఈ కాలపు కుర్రాళ్ళు! నేను సినిమాలు చూడనుగాని నువ్వంటే పడిఛస్తారట కదా పసిపిల్లలు కూడ!" అన్నాడు మూతి తుడుచుకొంటూ.

విజయేంద్ర చిన్నగా నవ్వి "నా సినిమాలు చూడకుండా నన్ను కలుసుకోవాలని ఎందు కనుకున్నారో తెలుసుకోవచ్చా!" అనడిగేడు.

"అదే చెప్పబోతున్నాను. స్వార్థం లేని తనువుండదని అర్థం లేని పదముండదని అంటారు. మూడేళ్ళక్రితం నువ్వోసారి మా ఇంటికొచ్చేవు."

"నేనా?"

"అవున్నువ్వే! నేను కూడ నమ్మలేని విషయమే అంది. అయితే మూడేళ్ళ క్రితం నువ్వు సినీనటుడు కాదు. మా అబ్బాయి స్నేహితుడిగా స్కూటర్ చెడిపోతే వాడితో కలిసి మా ఇంటికొచ్చి మజ్జిగ తాగేవు."

"మీ అబ్బాయి....?"

"కరుణాకర్, వాడికిలేంది కూడ అదే!"

"వ్వాట్! కరుణాకర్ మీ అబ్బాయా! ఆ! నా కిప్పుడు గుర్తొస్తోంది. మీరు జాతకం... ఎస్... మీరు నాచెయ్యి చూసి నేను చాల కీర్తి, డబ్బు గడిస్తానని... సన్మానాలు... బిరుదులూ పొందుతానని... అవునవును... మిమ్మల్ని ఎక్కడో చూశానని... చాల సార్లు అనుకున్నాను. చెప్పండి. మీ జాతకం నిజమైంది కదూ!" ఆనందంగా అన్నాడు విజయేంద్ర.

"ఆ సంగతి నువ్వే చెప్పాలిబాబూ! ఆ రోజు నే చెప్పింది నిజమైంది... నాకేమిస్తావని దురాశతో అడగటానికి రాలేదు నేను. ఏదో పెద్దలు నేర్పించిన శాస్త్రాన్ని నమ్ముకొని పొట్టపోసు కుంటున్న మధ్యతరగతి మిధ్యాడంబరాల మధ్య నలిగిన నిరుపేదని నేను. ఆడపిల్లల పెళ్ళిళ్లు చేసి ఆఖరి మెట్టుమీద నిలబడ్డాను. వాడికిదేం పట్టదు. ఓ ఉద్యోగం లేదు. పని లేదు పాటలేదు. ప్రస్తుత పరిస్థితుల్ని ఆకళింపు చేసుకొనే అవగాహన, ఎదురొడ్డి నిలిచే స్థయిర్యమూ లేవు. నిన్ననే తెలిసింది ఒక్కప్పుడు నువ్వు మావాడి స్నేహితుడివని. అడగందే అమ్మయినా పెట్టదంటారు. నాకు డబ్బు, దస్కం అక్కర్లేదు. వాణ్ణి పిలిచి రెండు మందలించి ఈ స్టుడియోల్లో పనికి పెట్టించు బాబూ! అదే పదివేలు! గాలికి గాలిపటంలా కొట్టుకుపోతున్నాడు" అన్నాడు వేదనగా.

"మీ పేరు?"

"జాతకరత్న జానకిరామయ్యంటారు"

"ఈ వయసులో మీరు రాకపోతే వాణ్ణే పంపలేకపోయేరా? నన్నంత మరచిపోయేడా ఇడియెట్!" అన్నాడు విజయేంద్ర.

"ఆ మాటంటే నువ్వే పైపైకి ఎదిగి పోయేవని... గుర్తున్నా గుర్తు పట్టవని వెధవ మాటలు చెప్పేడు. వాడికి లోకజ్ఞానముంటేగా నిండుకుండ తొణకదని!"

విజయేంద్ర వెంటనే బ్రీఫ్ కేస్‌లోంచి చెక్ బుక్ తీసి పదివేలకి రాసి అతని కందిస్తూ "ప్రస్తుతానికిదుంచండి. కరుణాకర్‌ని పంపిస్తే నేను వాడికి ఉద్యోగం చూసి పెడతాను" అన్నాడు ప్రేమగా.

జానకి రామయ్య ఆ చెక్‌ని అందుకో లేదు.

విజయేంద్రవైపు చూస్తూ "వద్దు నాయినా ముసిలోడికి అహం జాస్తి, అనుకోకపోతే ఒక మాట చెబుతాను" అన్నాడు.

"చెప్పండి!"

"నేను ఎవరికి జాతకం చెప్పినా తీసుకొనేది రూపాయి పావలాయే! నీకు చెప్పిన జాతకం నా అదృష్టం కొద్దీ నిజమైంది కాబట్టి

పదకొండు రూపాయిలు తీసుకొంటాను. నిజానికి నేను చెప్పిన వేళా విశేషం మంచిదో, నీ అదృష్టమే నిన్ను లాక్కొచ్చి ఇంతఎత్తున కూర్చోపెట్టిందో తెలియదు కాని... నువ్వు కరుణాకర్‌ని దారిలో పెడితే అదే పదివేలు, పది లక్షలు! వస్తాను" అంటూ పైకి లేచేడతను.

విజయేంద్ర చెక్ లోపల పెట్టుకొని పదకొండు రూపాయలు తీసిచ్చేడు.

దాన్ని జేబులో పెట్టుకుంటూ "వస్తాను నాయనా! నూరేళ్లు లక్ష్మి సరస్వతుల మాటున జీవించు" అంటూ బయటికి సాగిపోయేడాయన.

అతను వెళ్తున్న వేపే చూస్తూ నిలబడ్డ విజయేంద్రని గమనించి "అవకాశం ఇస్తే ఇలాగే అడుక్కుతినే వాళ్ళంతా చేరి మీ సైమును, డబ్బుని కరకజ్జంలా నమిలి తినేస్తారు సార్! ఇలాంటి వాళ్ళని ఎలవ్ చెయ్యకూడదు"అన్నాడు పి.ఏ.

విజయేంద్ర అతనివైపదోలా చూసి "అందరూ అలా వుండరు మిస్టర్ పి.ఏ. నేను రాసిన చెక్ తిరగ్గొట్టి అతనే నాకన్నా ధనికుడని నిరూపించుకున్నాడు. డబ్బుకోసం ఏ దగా పనైనా చేసే నీచుల మధ్య అక్కడక్కడా ఇలాంటి గొప్పవారు కూడ వుంటారు కాబోలు!" అన్నాడు.

"వ్వాట్! పదివేల రూపాయల చెక్ తిరగ్గొట్టేడా! అయితే ఇంకా పెద్ద ఎత్తులో వున్నాడన్నమాట! ఇలాంటి బూటకపు పెధవల్ని నమ్మకండి సార్!" అన్నాడు పి.ఏ.

"అకారణంగా ఎవర్నయినా తిట్టడం నాకు నచ్చని పని! షూటింగ్ కాన్సిలయిందిగా కారు తియ్యమనండి. ఇంటికెళ్ళిపోదాం!" అన్నాడు విజయేంద్ర.

"కాని...సర్... కాని....."

"ఏంటో సరిగ్గా చెప్పండి" అన్నాడు విసుగ్గా విజయేంద్ర.

"చెబుతాను. అప్పటికీ వీలుకాదంటే కాదన్నాను. కాని ఆవిడ ఒప్పుకుంటేగా! ఒకటే పస! ఏడ్చినంత పనిచేసింది. ఈరోజు ఆవిడ పుట్టిన రోజట! మీరు రాకపోతే చేసుకోదట!"

"ఎవరండీ ఆవిడ! ఏంటి మీ గోల!"

"అదే డాన్సర్ సీత! మిమ్మల్ని ఎలాగైనా లంచ్‌కి తీసుకురమ్మంది"

ఆ మాటకి విజయేంద్ర విస్తుపోయినట్లు చూసి "వాళ్ళింటికి నేనా? మీకు మతిపోయిందా?" అన్నాడు కోపంగా.

"ఆ మాటకూడ అన్నాను. వింటేగా!" అన్నాడు పి.ఏ.

"ఇప్పుడేగా ఆవిడ కాలు బెణికిందని షూటింగ్ కాన్సిల్ చేయించి ఇంటికి వెళ్ళింది. బర్త్‌డే ఎలా చేసుకుంటుంది. కనీసం నన్ను మాటవరసకి కూడ ఆహ్వానించలేదు. మీతో ఎలా చెప్పింది?" అనడిగేడు విజయేంద్ర.

"మీరలా అడుగుతారని కూడ చెప్పేను. మిమ్మల్నిక్కడ పిలిస్తే ఆ డైరెక్టర్‌గాణ్ణి, మిగతా ఏక్టర్స్‌ని పిలవాలి. అందుకని మీకు చెబుతున్నాను అంది. పైగా ఒకవేళ మీరు రానంటే ఆవిడ ఆ డిజప్పాయింట్‌మెంటుకి తట్టుకోలేదట! అందుకని ఎలాగైనా మిమ్మల్ని తీసుకొచ్చే బాధ్యత నాదని మరీమరీ చెప్పింది" అన్నాడు పి.ఏ.

ఆ మాట విని విజయేంద్రకి నిలువెల్లా మండింది.

"నేనావిడకి అంత ఆప్తుణ్ణేమీ కాదు డిజప్పాయింట్ కావడానికి, కాలు బెణికిందని అబద్ధమాడి ప్రొడ్యూసర్ల సొమ్ముని వృథా చేయించే నటులంటే నాకు గిట్టదు. ఇంటికి పదండి" అంటూ కారెక్కి కూర్చున్నాడు విజయేంద్ర.

ఆ దెబ్బకి పి.ఏ. మొహం వడదెబ్బ తిన్నట్లు మాడిపోయింది. తమ హీరోని ఎంత కష్టపడి పార్టీకి తీసుకొచ్చిందీ వర్ణించి వర్ణించి సీత దగ్గర్నుండి తృణమో ఫణమో కాజెయ్యాలన్న అతని ఆశ పూర్తిగా అడుగంటింది.

డ్రైవర్ పక్కన కూర్చొని "ఇంటికి" అన్నాడు కసిగా.

విజయేంద్ర కళ్ళుమూసుకొని ఆలోచిస్తున్నాడు.

"పీయూషకి బాగా కోపం వచ్చినట్లుంది, ఫోన్ చెయ్యలేదు. ఇప్పుడెళ్లి తనే చేయాలి! ఇండియాకి త్వరగా వచ్చేయమని చెప్పాలి! ఈ రొటీన్ నుండి కాస్తంత దూరం తీసుకెళ్ళి మనసుకి హాయి కల్గించేది పీయూష మాత్రమే!" అనుకున్నాడు మనసులో.

(ఇంకా వుంది)

క్రీడారంగం క్విజ్

(1) కరెన్సీ నోటుమీద ముద్రించబడిన క్రికెట్ క్రీడాకారుడు ఎవరు?

(2) 11 యేళ్ళ వయస్సులోనే 'ఇంటర్నేషనల్ మాస్టర్' అయిన బాలిక ఎవరు?

(3) స్త్రీల సింగిల్స్‌లో, మిక్స్‌డ్ డబుల్స్‌లో "గ్రాండ్‌శ్లామ్" సాధించినది ఎవరు?

(4) ఏషియన్ స్నూకర్ ఛాంపియన్‌షిప్ గెలుచుకొన్న మొదటి భారతీయుడెవరు?

(5) ఒలింపిక్స్‌లో 'అథ్లెట్స్' తరపున ప్రమాణం చేసిన ప్రథమ మహిళ ఎవరు?

(6) తమ మొదటి టెస్ట్‌లోనే సెంచరీలు సాధించిన, మన దేశానికి చెందిన తండ్రీ కొడుకు లెవరు?

(7) 'సునీల్ గవాస్కర్' తన మొట్ట మొదటి ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ ఎప్పుడు, ఎక్కడ ఆడాడు?

(8) టెస్ట్ క్రికెట్‌లో ఎనిమిది వేల కన్నా ఎక్కువ పరుగులు సాధించిన వాళ్లెవరు?

(9) ఆధునిక పెంటథ్లాన్‌లో ఉండే పోటీలు ఏమిటి?

(10) వరల్డ్‌కప్ ఫుట్‌బాల్‌ను మొట్ట మొదటిసారి గెలుచుకున్న దేశం ఏది.

జై.కి

(జవాబులు ఈ సంచికలోనే)

మొటిమలు గిల్లుతూ వుంటాను అదెలా పోతుంది?



సరి "కొత్త" శీర్షిక

హల్లో డాక్టర్! నేనేం చెయ్యాలి?

డా. కొత్త రవీంద్రబాబు

బాలాజీ, తిరుపతి

ప్రశ్న: నోవాల్జిన్ వలన దురద, మంట- హస్తప్రయోగం అలవాటు వలన అంగం చిన్నదై వంగిపోయింది.

జవాబు: దురదకు ఇన్‌సిడాల్ బిళ్ళలు ఉదయం, సాయంత్రం వాడండి. మనసు ప్రశాంతపరచుకుని న్యూనత పోగొట్టుకోండి. వివాహం మీ సమస్యకు పరిష్కారమవుతుంది.

పి. జగన్నాధరావు, గజపతినగరం, వి.జిల్లా

ప్రశ్న: మా పాపకు గుండె ఆపరేషన్ తర్వాత మాటలు పోయాయి. తర్వాత క్రమేపి కొన్ని మాటలు మాట్లాడుతున్నది.

జవాబు: శరీరారోగ్యం మెరుగుపరచి స్పీచ్ థెరపిస్ట్‌ను సంప్రతించండి.

సి. జోగేంద్ర ప్రసాద్

ప్రశ్న: దెబ్బ తగిలి చెవిమీద కాయ కాసింది.

జవాబు: దెబ్బతర్వాత వచ్చే కీలాయిడ్‌కు మందులుండవు. ఆపరేషన్ అనవసరం.

టి. రామయ్య, సిర్పూర్ కాగజ్‌నగర్

ప్రశ్న: నాకు 17 సంవత్సరములు. రొమ్ములు పెరిగాయి.

జవాబు: సర్జన్‌ను సంప్రదించి ఆపరేషన్ ద్వారా సరిచేయించుకోండి.

డి. కృష్ణారెడ్డి, మదనపల్లి

ప్రశ్న: దృష్టిదోషం ఎక్కువై పెద్ద పవర్ అద్దాలు వాడుతున్నాను.

జవాబు: ఎక్కువ పవర్ అద్దాలు వాడే బదులు కాంటాక్ట్ లెన్స్‌లు వాడవచ్చు. కంటి డాక్టరుగారినడగండి.

ఎస్.ఎ. ఖాన్, జగ్గయ్యపేట.

ప్రశ్న: ఒంటరిగా వున్నప్పుడు నగ్నంగా స్వరతి జరుపుకోవాలనిపిస్తుంది.

జవాబు: న్యూనత పోగొట్టుకోండి. ఒంటరిగా వుండవద్దు. తగినంత వ్యాయామం చేసి చక్కగా చదువుకుంటూ, మనసు ప్రశాంతంగా వుంచుకోండి.

రవికుమార్, గుంటూరు

ప్రశ్న: ఇంద్రియపుష్టికి మందు చెప్పండి.

జవాబు: మీ వయసెంతో చెప్పలేదు. డాక్టరుగారిని సంప్రదించండి. అవసరమైతే మందులు వాడుతారు.

ఎస్. రవి, విజయనగరం :

భయం బెరుకు. న్యూనతాభావం.

సైకియాట్రిస్ట్‌ను సంప్రదించండి. డెప్సొనిల్ 25 మిల్లీగ్రాముల బిళ్ళలు రెండు నెలల పాటు ఉదయం సాయంత్రం వేసుకుంటే ప్రయోజనం వుంటుంది.

ఎ. సూర్యచంద్రరావు, పెద్దాపురం :

అరచేతులు అరికాళ్ళలో చెమట నీరసం.

ఒకసారి మూత్ర పరీక్ష చేయించుకుని మధుమేహ వ్యాధిలేని సంగతి నిర్ధారించుకోండి. బాసిటాన్ ఫోర్ట్ బిళ్ళ రోజుకొకటి వేసుకోండి.

ఎం. ఎస్. ప్రసాద్, గుంటకల్:

మర్మావయవంపై పుండు వున్నది.

నడిచే మరమనిషి

నాలుగుకాళ్లపై నడిచే మొట్టమొదటి 'మరమనిషి'ని కొరియా శాస్త్రవేత్తలు కనుగొన్నారట.

ఈ మరమనిషిని వైజ్ఞానిక సాంకేతిక అధునాతన సంస్థ (కొరియా) ప్రొఫెసర్ ప్యాన్ చుంగ్ నామ్, ఆయన బృందం కలిసి రూపొందించారు.

గతంలో రూపొందించిన మరమనుషులు అటు యిటు కదలిక లేనివి కాగా యిప్పుడు రూపొందించిన మరమనిషి ఒక మీటరు ఎత్తు, 60 కిలోల బరువు వుంటుంది.

అణు విద్యుత్ కేంద్రాలలో ఏదైనా మరమ్మత్తు వస్తే ఈ మరమనిషిని ఉపయోగించ వచ్చునట. ప్రాణహాని కల్గించే ప్రేలుడు పదార్థాలను పట్టుకోవటానికి కూడా యిది ఉపయోగపడుతుంది.

డాక్సీ ఐ గొట్టాలు ఉదయం ఒకటి సాయంత్రం వొకటి పది రోజుల పాటు వాడండి.

ఎన్. రాజిరెడ్డి, ములుగు:

మొటిమలు గిల్లుతుంటాను.

మొటిమలు గిల్లితే ఒకోసారి ప్రమాదం కల్గవచ్చు. టెట్రాసైక్లిన్ 250 మిల్లీగ్రాముల గొట్టం రోజుకొకటి వేసుకోండి. అయిదారు నెలల పాటు.

పి. సుగుణ, రాజమండ్రి:

వయసు 18 సంవత్సరాలు. జుట్టు వూడుతున్నది.

జెబెక్స్ రోజుకో బిళ్ళ చొప్పున నెల రోజుల పాటు వాడి చూడండి. ఫలితం వుంటే మాత్రలు మరికొన్ని నెలలు వాడండి.

సి. ప్రకాశ్, సికింద్రాబాద్:

శీఘ్ర స్కలనం అవుతుంది.

రతి సమయంలో మనసును ప్రశాంతపరచుకోవడం, ఉద్రేకం తగ్గించుకోవడం వలన ఉపయోగం వుంటుంది. మానిక్స్ రోజు పడుకోబోయేప్పుడు అయిదు గొట్టాలు వాడండి రెండు నెలలపాటు.

కె.వై.కె. రావు, అవనిగడ్డ:

నాకు తొడలపై దురద పొక్కులు. జాలింలోషన్ వలన ప్రయోజనం కలుగలేదు.

గ్రిసోఒడి గొట్టాలు రాత్రి ఒకటి చొప్పున ఇరవై రోజులు వాడండి.

పి. గణేష్, గుంటూరు:

వివాహమైంది రెండేళ్ళపాటు సంతానం వద్దనుకున్నాము.

మీ శ్రీమతికి లూప్ వేయించండి. లేడీ డాక్టరుగారిని గాని గవర్నమెంటు హాస్పిటల్‌లో ఫామిలీ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌లో గాని సంప్రదించండి.

సి. నారాయణ, సికింద్రాబాద్ :

కొందరకు పెళ్ళి అవగానే పిల్లలు పుట్టరెందుకు.

అందుకు కొంత మందిలో యాదృచ్ఛికంగాను మరి కొందరిలో (దంపతు లిరువురిలో) శారీరక లోపమూ కారణం కావచ్చు.

పి. కె. కుమారి, విజయనగరం :

మనసులో భయం చెడ్డ ఆలోచనలు వస్తవి.


డెప్సొ డయాజ్ ప్రతిరాత్రి ఒకటి చొప్పున వేసుకోండి.

కారు చాలా స్పీడుగా దూసుకొస్తున్నదల్లా... హఠాత్తుగా రెండు కుదుపులు యిచ్చి టక్కున ఆగిపోయింది.

కారులోంచి డ్రైవర్ దిగి....పరుగున కారుముందుకెళ్లి బోనెట్ ఎత్తి ఆ చీకట్లోనే తడుముతూ....ఎక్కడ లోపముందో వెతుకుతున్నాడు.

అప్పుడు సమయం అర్ధరాత్రి పన్నెండయింది. కానీ వెన్నెల వెండి వర్షంలా వుండి పరిసరాలు స్పష్టంగానే కనిపిస్తున్నాయి.

ఆ కారులోంచి తండ్రీ, కూతుళ్లిద్దరూ దిగారు. ఆయనొక రిటైర్డ్ ఐ.జి. వారి అమ్మాయి



పేరు హరిత. అంతవరకూ కారులో కూర్చుని కూర్చుని విసుగెత్తినట్టుంటే కారు ఆగిపోగానే దిగి....రిలాక్స్‌డ్‌గా నిలుచుంది. ఆయన మాత్రం సిగార్ వెలిగించుకుని డ్రైవర్ ప్రక్కకి వెళ్లి నిలబడ్డాడు యింజన్ వైపు చూస్తూ!

హరిత పరిసరాలను చుట్టూతా చూస్తూ గమనించింది. కారు సరిగ్గా స్మశానం ముందాగింది. స్వతహాగా ధైర్యస్థురాలైనా ఎందుకో ఆమెకి వణుకు సన్నగా పుట్టుకొచ్చింది. దూరంగా సమాధులలోంచి ఏదో తెల్లగా లేస్తున్నట్లు కదులుతూ కనిపించింది. తల విదిలించుకుంటూ దృష్టిమార్చి వెన్నెల నీడలున్న చీకట్లోకి చూస్తూ నిలుచుంది. ఇంతలో వీపుమీద చల్లగా ఏదో స్పర్శ... తగిలింది.

హరిత వెన్నులోంచి జర్రున చలి పుట్టుకొచ్చింది. అంత చలిలోనూ చెమట్లు పడుతున్నాయి. యింతలో - ఎవరిదో చెయ్యి భుజంమీద బలంగా పడటంతో వెనక్కి తిరుగుతూ చూసింది.. ..అంతే !



వెంటనే ఆమె పెట్టిన కేక ఆ ప్రాంతమంతా ప్రతిధ్వనించింది!

మరుక్షణం తనని పట్టుకున్న ఆ ఆకారం చేతుల్లోనే స్పృహ తప్పిపడిపోయింది!

చివరిసారిగా....ఆమె విన్న శబ్దం...“చందనా! చందనా!!” అని ఎవరో పిలవటం! అంతే !

****

“ఎవర్నువు?” గద్దించాడాయన.

“నా పేరు... సూర్య” గొణిగాడా యువకుడు.

“మా అమ్మాయి నీకు ముందే తెలుసా? అంత అర్ధరాత్రి అక్కడేం పని నీకు? చందనా! చందనా! అన్నావు ఎవరు?...”

“నేను మీ అమ్మాయిని పట్టుకున్నందుకు సారీ. కానీ నేనామెని నా చందన అనుకున్నాను. నేను అనుకోవటమేమిటి? ఈ ఊళ్లో ఎవర్నడిగినా చెబుతారు. మీ అమ్మాయి, చందన ఒకటేనని...కావాలంటే ఫొటో చూడండి....” అంటూ ఓ అమ్మాయి ఫోటో తీసి చూపించాడు. అచ్చం హరితలాగానే వుంది. వేషం మాత్రం డిఫరెంట్‌గా వుంది. హరిత చూడీదార్‌లో....ఆ అమ్మాయి చీరలో.... అదే తేడా.

హరిత కూడా ఆ ఫోటో చూసి ఆశ్చర్యపోయింది!

“ఎవరీమె?....” అనడుగుతూ తెల్లటి లాల్చీ, పైజామా వేసుకున్న అతణ్ణే చూస్తూ...“అయితే నిన్నరాత్రి సమాధుల మధ్య నువ్వేనా కనిపించింది....?” అడిగింది.

“అవును....నేనే ఆ దౌర్భాగ్యుణ్ణి.”

“ఎందుకు అక్కడున్నావ్? నిజం చెప్పు అసలేమిటీ మిస్టరీ...”

ఓ క్షణం ఆగి చెప్పాడు - "చెబుతాను - నాగురించి అంతా చెబుతాను. నా చందనా ఎవరో....ఎలా నాకు దూరమయిందో కూడా చెబుతాను...." అంటూ వివరంగా తన కథనంతా చెప్పసాగాడు.

****

సూర్య మంచి ఫోటోగ్రాఫర్. అడ్వర్‌టైజ్‌మెంట్‌లకు పని చేస్తాడు. ఆ ఊర్లో మంచి లొకేషన్స్ వున్నాయని తెలిసి షూట్ చేసేందుకు వచ్చి అనుకోకుండా చందనని చూసి బోల్తాపడ్డాడు.

చందనా అతి సాధారణమైన కుటుంబంలో పుట్టిన అమాయకురాలు. కానీ అద్భుతమైన సౌందర్యం ఆమెది. అందాల పోటీల్లో నిలబెడితే మిస్ యిండియాగా కూడా సులభంగా సెలక్టవుతుంది !

సూర్య ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. కొద్ది కాలంలోనే ఆ పరిచయం ప్రేమగా, విడదీయరాని అనుబంధంగా తయారయింది. ఒకరి నొకరు విడిచి వుండలేని పరిస్థితికొచ్చారు. చందనకి తండ్రి లేడు. తల్లి మాత్రమే వుంది.

****

ఒకరోజు అనుకోకుండా చాలా దారుణమైన సంఘటన జరిగింది. ఆ ఊరి ప్రెసిడెంట్ చందనని చూశాడు....వెంటనే మనసు పడ్డాడు. అతడు మనసుపడ్డాడంటే.... ఆ అమ్మాయి ఎవరైనా సరే ఆ రాత్రికి అతని మహల్లో అతని బెడ్ రూంలో సర్వనాశనమై వాడిపోవాల్సిందే. అది అందరికీ తెల్సిన విషయమే. కానీ ఎదురు చెప్పలేరు.... అంత దుర్మార్గుడ

చందనా!... చందనా!...

తడు.

చందన విషయంలో ఏర్పాట్లు మరి కొంచెం వేగంగా జరిగిపోయాయి. అతను, వాళ్ల అమ్మకి పదివేలిచ్చి చందనని కొనుక్కున్నాడు. ఆ తల్లి డబ్బును చూసి ఆశపడి సగం, అతడి దుర్మార్గాన్ని చూసి సగం భయపడి లొంగిపోయింది. చందనని బలవంతంగా మహల్‌కి ఎత్తుకొనిపోయారు.

ఆ విషయం కొంచెం ఆలస్యంగానైనా తెలుసుకున్న సూర్య....మహల్‌కి నేరుగా వెళ్లి చందనని రక్షించుకున్నాడు.

అప్పుడే....నిర్ణయించుకున్నాడు ప్రెసిడెంట్ - సూర్యని బలం కంటె.... తెలివి ఉపయోగించి నొక్కేయాలని. అప్పుడే, అతని మస్తిష్కంలో ఓ ఆలోచన రూపు దిద్దుకుంది.

అప్పటికి మాత్రం ఏమీ జరగనట్లు వుండిపోయాడు.

ఆరోజు రానే వచ్చింది. సూర్య ముఖ్యమైన పనిమీద వైజాగ్ వెళ్లాడు. తిరిగిరావటానికి మూడు రోజులుపట్టింది. తిరిగి వచ్చేసరికి... ఊళ్లో అడుగుపెట్టగానే అతనికి విన్పించిన పిడుగులాంటి వార్త!

"చందన చచ్చిపోయింది - అదీ ఆత్మహత్య చేసుకుని..." అన్నదే.

****

"ఇదీ జరిగిన కథ క్లుప్తంగా. అంతే తెలుసునాకు....చందన అసలు ఎందుకు ఆత్మహత్య చేసుకుందో, అసలెలా చనిపోయిందో ....అసలెందుకు చనిపోయిందో, ఆ పరిస్థితులేమిటో...నా కిప్పటికీ అర్థం కాకుండా వున్నాయ్! నాకా విషయాలు చెప్పేందుకు ఆమె చనిపోవటం చూసిన మనిషి ఒక్కరూ లేరు....."

"మరి చందన శవం ఏమయిందట?"

"కాల్చి బూడిదచేసి, బూడిదని సమాధిచేసి....సమాధి కట్టించేశారు...."

"ఎవరు?"

"ఊరివాళ్లే...."

"అలా ఆ పని వాళ్లచేత చేయించిందెవరు?" పోలీస్ బుర్ర చురుకుగా పని చేస్తోంది రిటైర్డ్ ఐ.జి. ఆఫీసర్‌లో.

"అది చెప్పేవాళ్లే వుంటే యింకేం? చెబితే వాళ్ల ప్రాణాలుండవు..."

"మీరెవరిని సస్పెక్ట్ చేస్తున్నారు... మిస్టర్ సూర్యా?"

"ఇంకెవర్ని? ఈఊరి ప్రెసిడెంట్‌నే... వాడే నీచుడు...."

"నీచుడు కాక మరో పేరేమైనా ఉందా?"

"ఉంది.

ఏకాంబరం..." అంటారంతా.

"అద్సరే....మీరా సమాధులమధ్య అంత అర్థరాత్రి వరకు ఏం చేస్తున్నారు.?" హారిత అడిగింది.

సూర్య విషాదంగా నవ్వి..."ఏం చేస్తాను? నా చందన సమాధి దగ్గర కూర్చుని, ఆమెతో మాట్లాడి నిద్రవుచ్చి వస్తున్నాను - అంటే మీకు నవ్వు వస్తుందనుకుంటాను -

కాని నాకిదే దినచర్య..

హారిత చలించిపోయింది. అతనామెని ఎంతగా యిష్టపడ్డాడో తెలిసి ఆశ్చర్యపోయింది. లోకంలో యిలాంటి వాళ్లు కూడా వుంటారా? అన్పించింది. ఎందుకంటె ఆమె చూసిన ప్రపంచం చాలా చిన్నది.

"మనమిక వెళ్లిపోదామా డాడీ...." అంది హారిత కొంతసేపటికి.

ఐ.జి. సిగార్‌లోంచి పొగపీలుస్తూ..."నో బేబీ! మనమెళ్లిపోతే ఈ సమస్య యింతటితో ఆగిపోదు. రేపు మరో అమ్మాయి బలి అవుతుంది. వాణ్ని అరెస్ట్ చేయాలి. అదీ అతను నేరం ఒప్పుకునేలా చేయాలి.... అదీ తన నోటి ద్వారా తానే చెప్పుకునేలా చేయాలి...ఏ మర్డరర్ మస్ట్ బి ఫినిష్డ్."

"ఎలా?" సూర్య అడిగాడు.

"దానికో ప్లాన్ వుంది." అని ఫోన్ దగ్గరకెళ్లి....తనకు తెలిసిన డి. యస్.పి.కి

రచయిత పరిచయం

తృతీయ బహుమతి రు. 700/-లు పొందిన కథ "చందనా! చందనా!" రచయిత డా. మునీర్ అహమద్ అన్సారీ వెటర్నరీ డాక్టర్. "విధాత" వీరి కలం పేరు. పుట్టింది, పెరిగింది గిద్దలూరులో. సంవత్సరం క్రిందటే తిరుపతిలో వెటర్నరీ సైన్సుడిగ్రీ పూర్తిచేసి ప్రస్తుతం ఒక సాంఘిక సేవా సంస్థలో వెటర్నరీ డాక్టరుగా పని చేస్తున్నారు.

"విధాత" తండ్రిగారు రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న ఆర్మీ ఆఫీసరు. తండ్రి స్మృతి గుర్తొచ్చినప్పుడు పడే ఆవేదనలో ఆయన కథలు, కవితలు రాస్తుంటారట.



తన తొలి కథ "చందనా! చందనా!"కి బహుమతి లభించడం తనకి చాలా సంతోషంగా వుందంటున్నారు.

కొంతమంది పోలీసులుతో రమ్మని కోరి..... ఫోన్ పెట్టేశాడు!

****

సూర్య యింట్లో అందరూ సమావేశమయ్యారు.

హారితని చూసిన ఒకరిద్దరు...."దెయ్యం కాబోలు దెయ్యం" అని సణుగుతూ భయపడి దూరంగా పారిపోతూంటే...

ఐ.జి.కి నమ్మకం కలిగింది హారిత, చందన పోలికల్లో ఒకేలా వుండేవారని.

రిటైర్డ్ ఐ.జి.కి యిప్పుడు తన ప్లాన్ మీద గట్టి నమ్మకం ఏర్పడిపోయింది. అందరికీ తన ప్లాన్‌ని మరోసారి వివరించారు.

"ఇందులో హారిత పాత్ర చాలా ఎక్కువగా ఉంది. ఆమె తన వర్క్ బాగా చేయగలిగితే ప్లాన్ సక్సెస్ అవుతుంది." అందుకని ఆమెకి ఏం చేయాలో పదే పదే వివరించి చెప్పాడు.

"సో....మన యీ ప్రోగ్రామ్ అంతా అర్ధరాత్రి పన్నెండుగంటలకు ఏకాంబరం మహల్లో జరుగుతుంది. సరిగ్గా పన్నెండున్నరకు నేను హారితని తీసుకుని కార్లో మహల్‌ని చేరుకుంటా."

అందరూ తలలూపారు.

టేప్‌రికార్డర్‌లు, భయంకరమైన సౌండ్స్ వున్న టేప్స్...లాంటి సరంజామా అన్నీ సిద్ధం చేశారు

ఆ రోజు అమావాస్య యాదృచ్ఛికంగా జరిగింది.

****

ఏకాంబరం తాపీగా గుర్రుపెడుతూ హాయిగా నిద్రపోతున్నాడు.

హఠాత్తుగా మెలకువ వచ్చింది అతనికి. మళ్లీ నిదురపోయే సమయంలో విన్పించిందా శబ్దం!

ప్రక్కనే...అతని సమీపంలోనే....

ఏదో జంతువు గురక పెడుతున్నట్టుగా వుంది. ఉలికిపడి లేచాడు ఏకాంబరం. బెడ్‌లైట్ కాంతి సరిపోవటం లేదు. లేచి లైట్ స్విచ్ నొక్కాడు. ఆ రూం అంతా వెలుగుతో నిండిపోయింది.

అంతలో కర్టెన్స్ వెనుక ఏదో కదలిక....

ఏకాంబరం సంశయిస్తూనే వెళ్లి కర్టెన్ ప్రక్కకి తొలగించాడు.

ఓ అస్థిపంజరం అతని మీద పడటంతో - ఏకాంబరం భయపడి భయంకరంగా కేకేశాడు. ఎందుకో అతనిలో ధైర్యం సన్నగిల్లుతోంది. అదే సూర్యకు కావాల్సింది. అంతవరకు తాము అనుకున్నట్టు జరిగింది ఆ తర్వాత విచిత్రమైన సంఘటనలు ఎవరూ చేయకుండానే జరిగిపోయాయి!

హఠాత్తుగా గాలి అలలు అలలుగా ఆ గదిలోకి దూసుకొచ్చింది. ఎక్కడి వస్తువులు అక్కడ పడిపోయాయి. సోఫాలయితే గిర్రున తిరిగి ఎగిరి అద్దాల కిటికీలకు తగిలి భళ్లున అద్దాలు పడిపోవటంతో.... ఎవరో విసిరేసినట్లుగా బయట పడిపోయాయి. హోరుమని గాలి చీలుస్తున్న చప్పుడు.

తాము అరేంజ్ చేసిన వాటికన్నా ఎక్కువ ఎఫెక్ట్స్ అన్నీ ఎలా వచ్చాయో ఎవరికీ అర్థం కావటం లేదు కానీ ఎవరికి వాళ్లు జరిగేది చూస్తున్నారు.

ఏకాంబరానికయితే భయం ఎక్కువయిపోయింది. అతని మంచం గాలి తాకిడికి జరుగుతూ వెళ్లి గోడకు గుద్దుకుని ఆగిపోయింది. అంతలోనే భయంకరమైన అరుపులూ, వికటాట్టహాసాలు విన్పించాయి. ఒక్కసారిగా వందలకొద్దీ క్రూర మృగాలు అరిచినట్లుగా కర్ణకఠోరమైన శబ్దం. తలుపులన్నీ మూసుకుపోయాయి -

అప్పటికి పరుగెత్తుకొచ్చిన పని మనుషులూ, వాచ్‌మెన్‌లు వచ్చి తలుపులు బాదుతున్నారు. సడెన్‌గా కరెంట్ పోయింది.

సూర్య ఆశ్చర్యపోయాడు. తీగలు యింకా కట్ చేయకుండానే పవర్ కట్ కావటం ఎలా జరిగింది?

ఏకాంబరం వణికిపోతున్నాడు. అతని

మాస్కో ఫిల్మోత్సవ్‌లో కొరియా నటికి అవార్డు



16వ మాస్కో అంతర్జాతీయ ఫిల్మోత్సవంలో ఉత్తమనటి అవార్డు కొరియా నటికి లభించింది.

కాంగ్-సు-యోన్ అనే 23 సంవత్సరాల ఈనటి 'అజే అజే బారా అజే' (రా, రా, పైకిరా) అనే చిత్రంలో చూపిన నటనకు గుర్తింపుగా ఈ అవార్డు బహూకరింప బడింది.

ఇది కాంగ్‌కు వచ్చిన రెండవ అంతర్జాతీయ అవార్డట.

1987లో జరిగిన 44వ వెనీస్ అంతర్జాతీయ ఫిల్మోత్సవంలో ప్రదర్శించిన 'స్సిబాజీ' (సరోగేట్ మదర్) అనే చిత్రంలో ఆమె చూపిన నటనకు గుర్తింపుగా ఉత్తమనటి అవార్డు తొలిసారిగా లభించింది.

బౌద్ధ సన్యాసిని పాత్రలో కాగ్ నటించిన 'అజే, అజే' చిత్రం ఈ ఫిల్మోత్సవంలో సంచలనం సృష్టించింది.

తన తల్లి ప్రియుడు మానభంగం చేయటంతో జీవితంమీద విరక్తిచెంది బౌద్ధ సన్యాసినిగా మారిన యువతికథే ఈ 'అజే అజే'.

ప్రపంచంలో జరిగే ఫిల్మోత్సవాలలో అత్యంత ప్రతిష్ఠాకరమైన ఉత్సవాలలో ఒకటైన ఈ మాస్కో ఫిల్మోత్సవం 1959లో ప్రారంభమైంది.

తాష్కెంట్, రష్యాలలో కూడా ఈ చిత్రం ప్రదర్శించేందుకు ఏర్పాట్లు జరుగు తున్నాయి.

సియోల్‌లో జన్మించిన కాంగ్ 10 సంవత్సరాల వయస్సులో 'బ్లడ్‌నాట్స్' అనే చిత్రంలో ధరించిన పాత్ర చిత్రసీమలో ఆమెకు పేరు సంపాదించి పెట్టింది.ఆ తర్వాత దాదాపు 30 చిత్రాలలోను, టెలివిజన్ డ్రామాలలోను ఆమె నటించింది.

ఈ అవార్డులు ముందు ముందు తన బాధ్యతను మరింత పెంచాయని కాంగ్ అన్నారు.

ఇమ్ క్వాన్ టేక్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఫ్రాన్సులో జరిగే నాంటెస్ మూడవ కాంటినెంటల్ ఫిల్మోత్సవంలో కూడా ఈ చిత్రం పాల్గొనబోతున్నది.

జన్మలో యిలాంటి పరిస్థితి ఎదురవటం యిదే మొదటిసారి. బహుశా ఆఖరుసారి కూడా నేమో? ఎందుకంటే యిక బ్రతుకుతాననే నమ్మకం అతనిలో సన్నగిల్లింది. అతని చేతులు రెండూ స్తంభానికి చుట్టుకుని వున్నాయ్. హఠాత్తుగా గాలి తగ్గింది. తుఫానులా వీస్తున్న గాలి ఆగిపోయింది.

సడెన్‌గా నిశ్శబ్దం ఆవరించింది.

ఏకాంబరం స్తంభం వదిలి గది తలుపులవైపు అడుగులు వేస్తుంటే.... విన్పించిందా చప్పుడు ఘల్లు....ఘల్లు..... మంటూ.

తనని నెమ్మదిగా ఎవరో సమీపిస్తున్న భావన.

కానీ చీకట్లో ఏమీ కనిపించట్లేదు.

"ఎవరూ?" గొంతు కీచుమంది ఏకాంబరానికి.

సమాధానం లేకుండా నవ్వు విన్పించింది.....

"ఎవరది?...." యింకా భయం తగ్గలేదతనిలో.

మళ్లీ నవ్వు ఈసారి భయంకరంగా......

"నేనేరా....." ఆ గది ప్రతిధ్వనించింది.

"నేనే....అంటే?!" కొంచెం ధైర్యం తెచ్చుకుని అడిగాడు ఏకాంబరం.

"హి....హి....హి....హి...." అతి భయంకరంగా వుందా నవ్వు.

"నువ్వు చంపి పాతిపెట్టిన చందనని...."

ఏకాంబరం ఏదో అనబోయేంతలో - ఒక బలమైన హస్తం అతణ్ని ఎత్తి మూలకు విసిరేసింది. నుదురు చిట్లిందతనికి.

లేస్తూ....అటూ యిటూ చూశాడు. ఏమీ కన్పించలేదతనికి. ప్రాణభయంతో పరుగెత్తబోయాడు.

చందనా!... చందనా!...

అంతలోనే కరెంట్ వచ్చింది. గదంతా వెలుగుతో నిండిపోయింది.

ఒక్కసారిగా లైట్లన్నీ వెలిగేసరికి వెలుగు చూడలేక కళ్ళుమూసేసి...అలవాటు పడ్డాక నెమ్మదిగా కళ్ళు తెరచి గదంతా కలియ చూశాడు. సామానులన్నీ చిందరవందరగా వున్నాయి. నేల మీద రక్తం చుక్కలు చుక్కలుగా కారి వుంది.

తడిమి చూశాడు. నిజంగా రక్తమే.

అంతలోనే హుమ్మంటూ శబ్దమయింది.

ఏకాంబరం అటు చూశాడు-అక్కడి దృశ్యాన్ని చూడగానే ఎంతో కఠినాత్ముడైన వాడైనా... ఏకాంబరానికి గుండెలు జారిపోయాయి.

అక్కడ-

చందన జుట్టు విరబోసుకు ...హ్హా హ్హా మని నవ్వుతూ నిలబడి వుంది!

సూర్య ఆశ్చర్యపోతున్నాడు-పన్నెండున్నరకి రావాల్సిన హరిత ఏంటి అప్పుడే వచ్చేసింది? అయినా....ఎంత గొప్పగా యాక్ట్ చేస్తోంది? నిజంగా అతనికే భయమేస్తోంది ఆమెని అలా చూస్తుంటే...చందనే వచ్చిందా? అన్నట్టుంది.

అంతవరకూ ఆ గదికి ప్రక్కగా వుండే గదిలో వున్న సూర్య మెల్లిగా ఏకాంబరం గదిలోకి వచ్చేశాడు.

అప్పటికే టేప్ ఆన్ అయి తిరుగుతూ వుంది.

ఏకాంబరం వణికిపోతూ అడుగుతున్నాడు...."నువ్వా....నువ్వా....."

"నేనేరా చందనని...."

"నువ్వు చచ్చిపోయావుగా.."

"అవును? నువ్వే చంపావు కదా! కాని నిన్ను కూడా నాతో తీసుకుపోదామని వచ్చాను.

"లేదు. నేనేమి చేయలేదు. నన్ను వదిలిపెట్టు నిన్ను చంపింది నేను కాదు పొరపాటైంది. నన్ను క్షమించి వదిలెయ్యి" నిలువెల్లా కంపించిపోతు అన్నాడు. అతని గొంతు తడారిపోయింది. దండాలు పెడుతున్నాడు.

"నిన్నా....తుచ్ఛుడా! బ్రతికున్నప్పుడు నన్ను పొందలేక....చచ్చాక నా శవాన్ని ఛీ! ఛీ! నీలాంటి నీచుణ్ణి బ్రతకనిస్తానా!"

సూర్యకు అంతు బట్టడం లేదు.

హరిత తండ్రి ప్లాన్ ప్రకారం....ఆమె దెయ్యంలా నటించి అతను చేసిన నేరాన్ని అతని తోనే చెప్పించటం...కానీ ఈమె తనే జరిగిన విషయాలన్నీ చెప్తూ...అతని చేత ఒప్పిస్తోంది.

ఈమెకిన్ని విషయాలు ఎలా తెలుసు?

అసలెవరీమె? హరితేనా? లేక చచ్చిపోయిన చందనా? సూర్య వళ్లు జలదరించింది.

"ఏదో తెలియక అలా చేశాను. ఇక నా జన్మలో ఏ ఆడపిల్ల జోలికి పోను. నన్ను వదిలెయ్యి....ప్లీజ్...." ఏకాంబరం ఏడుస్తున్నాడు.

చందన నవ్వుతూ....అతన్ని సమీపించసాగింది.


ఏకాంబరం "హెల్ప్....హెల్ప్" అంటూ అరుస్తున్నాడు.

అంతవరకు ప్రక్క గదిలో వున్న డి.ఎస్.పి. అతని బలగం టెన్షన్‌ని ఆపుకోలేక బయటికి వచ్చి ఆ గదికి వున్న అద్దాల తలుపుల్లోంచి చూస్తూ నిల్చున్నారు. వాళ్లలోనూ ఆశ్చర్యం!

ఏకాంబరాన్ని సమీపించిన చందన అతణ్ని పట్టుకోబోయింది. భీకరంగా అరుస్తూ అతణ్ని గోడకేసి విసిరేసింది. అతను వెనక్కి వెనక్కి పరుగెడుతూ గోడను తాకి తల్లక్రిందులై పడిపోయాడు.

సూర్య అదిరిపోయాడు-బిక్కచచ్చిపోయాడు.

ఏమిటీమె....యాక్ట్ చేయమంటే హత్య చేసేసింది. వాడు క్రిందపడి సఫా...అనుకొని అందరూ ఆశ్చర్యంలోంచి తేరుకోకముందే ఆ గది తలుపులు తెరచుకుంటూ జుట్టు విరబోసుకున్న హరిత ఆ గదిలోకి అడుగు పెట్టి....భయంతో కేకలు వేసింది. దాంతో యిందాకా వచ్చిన చందన ఈ చందన ఒక్కరు కాదని తేలిపోయింది అందరికీ-ఆ వచ్చింది నిజంగా దెయ్యమేననిపిం



చిందింది!

*** *** *** *** *** ***

"మీకెందుకంత లేటయ్యింది."

"ఏం చెయ్యను? హారితను కారులో తీసుకువస్తుంటే...సడన్‌గా స్పృహ కోల్పోయింది. ఆమె కోలుకుని వచ్చేసరికి ఇక్కడ అరుపులు అవీ వినిపించాయి. విషయం ఏమిటని అడిగితే బయట పని మనుషులు చెప్పారు. లోపల చందన భూతం వుందని" ఆ తర్వాత చెప్పిన వాళ్ళు కూడా హారితను చూసి పారిపోయారను కోండి అంటూ షాక్ నుంచి తేరుకొనే నవ్వు నవ్వాడాయన.

"అయితే ఆ వచ్చింది నిజంగా చందనే అన్న మాట"

"అందుకే కాబోలు టేప్‌లో ఏకాంబరం మాటలు రికార్డ్ అయ్యాయి. కాని చందన మాటలు రికార్డు కాలేదు." డి.ఎస్.పి. అన్నాడు టేప్ అఫ్ చేస్తూ.

"ఎనీ హౌ మనం వచ్చిన పని అయిపోయింది. ఇక వెళ్ళిపోదాం! పోయే ముందు ఒక చిన్న ప్రపోజల్ చెయ్యాలనుకుంటున్నా...." అని తన కూతురు హారిత వైపు చూస్తూ... "నాకు సూర్య నచ్చాడు. నా కూతురికీ ఇతనికి మ్యారేజ్ సెటిల్ చేద్దామనుకుంటున్నాను. ఏమంటావమ్మా..." అంటుండగానే....హారిత లేచి వేగంగా వెళ్ళి సూర్యను గట్టిగా కౌగలించుకుని గాఢంగా ముద్దుపెట్టుకుని బయటికి నడిచింది.

ఆ విచిత్రమైన సంఘటనని ఆశ్చర్యంతో అందరూ చూస్తుండగానే మళ్ళీ లోపలకి వచ్చింది హారిత....

"ఎవరు డాడీ ఆ అమ్మాయి అచ్చం నాలాగే ఉంది! నా గుండెలు జల్లుమన్నాయి."

"మైగాడ్! ఇప్పుడు బయటికి వెళ్ళింది నువ్వు కాదా!"

"నో డాడీ....నేనిప్పుడె చందన గెటప్ చేసుకొని బట్టలు మార్చుకుని వస్తున్నాను" అన్నది.


"అయితే....ఆమె?!"

"చందనే" ఎక్సయిటింగ్‌గా అన్నాడు సూర్య. ఆమె నా చందన. అనుమానం లేదు... నా చందనే. సూర్యతో మరుక్షణం అందరు బయటికి పరుగెత్తారు.

కానీ-అక్కడెవరూ లేరు!!

చందనా? చందనా! అన్న సూర్య కేక మాత్రం నలుదిక్కులా ప్రతిధ్వనించింది.

○



బట్టతల అని బెంగపడకండి!

బట్ట తల వల్ల అనేక ఉపయోగాలున్నాయని, అది చూసి బెంగపడాల్సిన పనిలేదని, అదొక వరంగా భావించమని చెప్తున్నారు అనేక మంది నిపుణు లు.

నెత్తి మీద జుట్టు మొలిపిస్తామని యిచ్చే ప్రకటనల్ని చూసి మోసపోవద్దని కూడా వారు అంటున్నారట.

మనిషిలో సెక్స్ హోర్మోన్లు ఎక్కువగా ఉత్పత్తి అయినట్లయితే సహజంగా జుట్టు వూడిపోతుందని, అందువల్ల తొందరపడి ఏ మందులూ ఉపయోగించరాదని లండన్‌లోని నిపుణు లు కొంత మంది తెలియజేస్తున్నారు.

జుట్టు వూడినంత మాత్రాన విచారించవలసిన పనిలేదని దానివల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని వారు చెప్తున్నారు. పత్రికల్లో పడే ప్రకటనలను చూసి డబ్బుని, సమయాన్ని వృధా చేసుకోవద్దని కూడా వారు సలహా యిస్తున్నారు. రకరకాల ఔషధాలను వాడటం ద్వారా మనకు కావలసిన ప్రయోజనం చేకూరకపోగా యితర రకాలైన జబ్బులకు లోను కావలసి వస్తుందట.

మహిళలకి యిష్టం?

ఈ బట్ట తలవల్ల కలిగే ప్రయోజనాలను సూచిస్తూ-అనేక మంది మహిళలు బట్టతల వాళ్లనే ఎన్నుకోవడం కూడా జరుగుతుందంటున్నారు. బట్టతల గల వారిలో సెక్స్ హోర్మోన్లు ఎక్కువగా వుంటాయన్న నమ్మకమే అందుకు కారణం కాబోలు! ఇదీబాగానే ఉంది. అలా అని కావాలని జుట్టు తీయించుకుంటే మాత్రం మహిళలు ముందుకు రారు సుమా!

జుట్టు పెరిగిపోతున్నట్లయితే దానికయ్యే ఖర్చు లెక్కలేనిది కదూ! ఆ జుట్టే లేదనుకోండి ఎంచక్కా నూనెల ఖర్చూ తప్పుతుంది, క్షుర కర్మ ఖర్చూ తగ్గుతుంది, దువ్వుకునే శ్రమా తప్పుతుంది! బట్టతల వుంటే రకరకాల టోపీలు ధరించి హాయిగా, వుషారుగా షికారు వెళ్లిపోవచ్చు.

తన బట్టతల చూసి ఎంచక్కా హాయిగా నవ్వుకుంటున్నాడో చూడండి ఫొటోలోని కుల్ భూషణ్ ఖర్బందా.

○

యువతా! కవితా!

సత్యం వద

అవకాశవాదమనే
ఇటుకలు పేర్చి
స్వార్థమనే
సిమెంటు కూర్చి
కట్టిన
అబద్ధాల గోడని
నిజమని
భ్రమింపజేయాలనుకోవడం
క్షుద్రం!
కుండ
బ్రద్దలు కొట్టినట్టు
నిజం చెప్పినప్పుడు
కుండ ఛిద్రమైనా
నిజం మాత్రం
భద్రం!!

-"సింహం"

ప్రకృతి – వికృతి

నిశ్శబ్దంగా సాగిపోయే కాలయంత్రం–నీవు 'కీ' ఇవ్వకపోయినా ఆగిపోదు
చల్లబడిపోయే సూర్యుడిని నీ బ్లాస్ట్ ఫర్నేస్‌తో వేడి చేయలేవు
ఉప్పొంగే సముద్రాలను నీరాడార్‌తో ఆపలేవు
గతి తప్పే భూమిని నీశాటిలైట్‌తో సరిచేయలేవు
ఎన్ని చినుకులు నిన్ను తాకకే నేలరాలుతున్నాయి
ఎన్ని సౌగంధికాలు నీవు ఆఘ్రాణించకనే వాడిపోతున్నాయి
ఎన్ని శరద్రాత్రులు నీ దృష్టి సోకకే సాగిపోతున్నాయి
ఎన్ని మడుగులను చేర్చి కడలిని చేశావు
ఎన్ని బండలను కూర్చి కొండలను చేశావు
ఎన్ని చెట్లను నీ సంరక్షణలో పెంచావు
ప్రొద్దుటే పచ్చని కొమ్మను విరిచావు దంతధావనానికి
స్వేచ్ఛావిహంగాన్ని కూల్చావు భోజనానికి
పూబాలల బ్రతుకు చిదిమావు శృంగారానికి
నీకు పనికి రాని వాటిలో ప్రకృతిని దుర్గంధభూయిష్ఠం చేశావు
ఇక ప్రకృతిపై నీ హింసను ఆపు
ముందు తరాలకు చెరగని, చినగని ప్రకృతి చిత్రాన్ని అందివ్వు!

–సుజనేంద్ర

అగాధం!

ఛీత్కారాలతో
ఛీకొడుతుంది
మనసు పడని
మగువ!
ఛీ! ఛీ!! అన్నా
వెంటపడుతూ
వదలనంటుంది
దారిలో పడ్డ ఆడది!!
అందుకే ఆడదాని మనసు
అంతుబట్టని అగాధం.

- ఆదిరెడ్డి మావుళ్ళు



గాంధీతాత!

తాత యనుచు తండ్రి తండ్రిని. తండ్రిని
పిలువవచ్చు జనులు వినగవచ్చు
ధరణి జనుల కెల్ల తాతవీ వనియంద్రు
కారణంబదేమి గాంధీతాత!

అమ్మయనగ ముగ్గురమ్మలగన్నమ్మ
మామయనగ చందమామ వో లె
తాతయనగ గాంధీ తాత యేననుమాట
ఖ్యాతి కెక్కెనేడు గాంధీతాత!

మట్టిలో నమున్న మాణిక్య రాశిని
వెలికి దీసి సాన వెట్టినావు
కాంతి వీడకుండ కలకాలమును నిల్పు
గతిని చూపుమయ్య గాంధీతాత!

–ఎం. పి. జానుకవి

ఆకలి

లేని వాడికి
తిండి కలిగితే
తీరును కడుపు ఆకలి!
ఉన్న వాడికి
కడుపు నిండినా
తీరదు డబ్బు ఆకలి!

–సాదు నారాయణ

కులం?

అందమైన యువతీ యువకులనడిగితే
మీదే కులమని అన్నారట ప్రేమికులమని!
అంటరాని అమాయకులైన గ్రామస్తులనడిగితే
మీదేకులమని అన్నారట శ్రామికులమని!
అనాదిగా అక్కడే నివసిస్తున్న పుర ప్రజలనడిగితే
మీదేకులమని అన్నారట స్థానికులమని!
అదేమిటి? అలా అంటున్నారని అడిగితే
మీదేకులమని అన్నారట! లో కులమని జవాబు!

–పూర్ణిమ

గొప్ప దానవు


నేనున్నానంటావ్
ఒకనాడూ నా కంటికి కనిపించవ్
నీవు లేవు అని నేను వాదించాలనుకుంటే
అందరూ అంటున్నారు నువ్వున్నావని
చెడు చేస్తే నన్ను నిందిస్తారు

మంచి చేస్తే నీవే మంచిదానవని
నిన్నే శ్లాఘిస్తారు.
వేదనా, బాధ ఓర్చేది నేను

గాయమయిందని పొగిడేది నిన్ను
కంటికి కనిపించిన నాకు లేని పేరు
కనిపించని నీకే వుంది
"మనసా" నీ వెంత గొప్పదానవు!

–బత్తుల అప్పలరాజు

జలుబు పోయిందే!



యూకిలిప్టస్ చేరి
వున్న అమృతాంజన్
కోల్డ్ రబ్ చంటిపాపల
లేత చర్మాలకు
ఎంతో సున్నితమైనది.
తల్లి యొక్క చల్లని
స్పర్శలాగా....



అమృతాంజన్

కోల్డ్ రబ్

జలుబుల నుంచి శీఘ్రనివారణ

HTA 7351

ప్రశ్నావళి

— కె. రామలక్ష్మి

సోమయాజులు సోదరులు, హైదరాబాద్.

* ఇటీవల కథలు రాయడం ప్రారంభించిన వారి రచనల మీద మీ అభిప్రాయం ఏమిటి?

తక్షణ రచన, తక్షణ కీర్తి ప్రాతిపదికగా రాసేవారి రచనలు- తక్షణం చదివి తక్షణం 'స్పందించేసి' తక్షణం ఉత్తరాల ద్వారా తెలియచేస్తున్న పాఠకలోకం వుండగా నాలాంటి 'ఛాందసురాలి' అభిప్రాయం అడగడం- నన్ను వెక్కిరించడంగా భావించాలా స్వామీ?

ముత్యం రమాదేవి, బళ్ళారి.

* విధి అంటే ఏమిటి? మీరు నమ్ముతారా?

మన అపజయాలకు ఏదో కారణం వుండాలి కనుక దాన్ని 'విధి' కింద తోసేస్తాం. నాకు నా లోపాలు కొట్టొచ్చినట్టు తెలుస్తాంటే- విధి మీద కెందుకు నెట్టడం? నేను నమ్మను.

* ఆరుద్రగారి పాటలో మీకతి యిష్టమైనపాట ఏది?

రెండుమూడున్నాయి- 'ఎవరు కన్నారు ఎవరు పెంచారు' ఈ మౌనం. ఏటిలోని కెరటాలు... (యింకా కూడా వున్నాయి. జ్ఞాపకం చేసుకుంటే...)

జి. శ్రీరామమూర్తి.

* ప్రాణం పోవడం ఆయుష్షుతీరడం... కాని సైన్సు అభివృద్ధి చెందాక- సగటు మనిషి ఆయుష్షు పెరిగింది అని శాస్త్రజ్ఞులు అంటున్నారు. మీరేమంటారు?

సైంటిఫిక్‌గా వివరిస్తారు కనుక శాస్త్రజ్ఞులని నమ్మాలి. ఆరోగ్యావకాశాలు పెరిగాక చావురేటు తగ్గక మానదు కదా. అందుకే ముదుసలుల సంఖ్య ఎక్కువ అవడం వారి సమస్యలూ ఎక్కువ అవడం చూస్తున్నాం యిప్పుడు.


కె. శృతి, కంభంపాడు.

* రచయిత్రి అవ్వాలని వుంది. ఎలా అవ్వాలి? ఏం చెయ్యాలి?

రాయడమే. దాన్ని పత్రికలకు పంపడమే- వేస్తే గెలుపు. వేయకపోతే- అనుభవం- మళ్ళీరాయడమే. (దగ్గిర దారి వుందట-రాయింపించి వేయింపించుకోడానికి. ఆ మార్గం నాకు తెలియదు. మీరే తెలుసుకోవాలి. లంచంలాగా యిది పబ్లిక్‌గా తెలియదు కదా?)

* ఒక మనిషిని ప్రేమించడానికి ఒక లిమిటు వుంటుందంటారా?

ఎలా చెప్పడం శృతీ! రెండు కేజీలు ప్రేమించు మూడు కిలోలు ప్రేమించు అని చెప్పలేం కదా! కొందరు చచ్చేలా ప్రేమిస్తారు. ప్రాణాంతకంగా ప్రేమిస్తారు. గుడ్డిగా ప్రేమిస్తారు. కొందరేమో ప్రేమిస్తున్నట్టే వుంటారు. కాని దాని తాలూకు కట్టడి పిసరంతైనా వాళ్ళమీద వుండదు! అంచేత- చేసుకున్న వారికి- చేసుకున్నంతా! అని చెప్పకోవాలి మరి.



జి.వి.ఎస్. రావు, హైదరాబాద్.

* పిల్లలని కోప్పడినా కొట్టినా ఫలితం వుండడంలేదు. మంచిగా చెప్పితే- అసలు లాభం వుండడం లేదు- ఏం చెయ్యాలి?

ఈ నాటి విద్యా విధానం మూర్ఖంగా మోపుతున్న భారం వల్ల వాళ్ళలా తయారవుతున్నారని పిస్తుంది, నాకు. తప్పు సరిచేయడం మంచిదేగాని ప్రోత్సహించడం బాగా పని చేస్తుంది పిల్లల విషయంలో.

టి.హెచ్. వెంకటేశ్వర్లు, టి.హెచ్. మల్లేశ్వరరావు, అమరావతి.

* కాలేజీల్లో చదివే విద్యార్థిని చదువుతున్నది ఎందుకురా అంటే, కట్నం కోసం అంటున్నారు. మీ అభిప్రాయం?

నేను మీ మాట నమ్మితే కదా? కట్నం చదువులు చదివే వాళ్లు చాలా తక్కువే వుంటారు. కాని దుర్గంధంలాగా చాలా విస్తార ప్రాప్తి వుంటుంది వాళ్లకి- అంతే.

* టీనేజి వయస్సుపై?

డేంజరస్ ఏజ్. తల్లిదండ్రుల ప్రతిమాటకీ పెడర్థం తీసే వయస్సది. అతిజాగ్రత్తగా అటు పెద్దలూ- యిటు చిన్నలూ త్వరగా దాటేయవలసిన సమయం.

డి. శ్రీకాంత్, చీరాల.

* ఆధునిక రచయితల వలన నేటి యువత ముందుకు వెళ్ళుచున్నదా? లేక వెనుకకా?

మూడడుగులు ముందుకి. ఐదడుగులు వెనక్కి అని చెప్పకోవచ్చు. రచన వేగంతో పరుగెత్తడం- కాస్తాగేసరికి ఎంత 'పారిపోయింది'ను కుంటూ వెనక్కి చూడడం- అటు గమ్యం దూరం. ఇటు వెనక్కు వదిలిన బాటా దూరం... ప్చ్, ఎవరి కష్టాలు వాళ్లవి!

కడార్ల రాజేశం, జగిత్యాల.

ప్రేమించాలంటే ఏం చెయ్యాలి?

*ఇన్ని తెలుగు సినిమాలు చూస్తూ యింకా ఈ పాఠం ఒంటపట్టలేదంటే- నమ్మలేకుండా వున్నాను!

ప్రేమించుకున్న వారిలో చివరకు మిగిలేది ఏమిటి?

*పుట్టెడు బాధ్యతలు- పెళ్లి చేసుకుంటే. మళ్లీ ప్రేమించడానికి బోలెడు ఛాన్సు- పెళ్లి చేసుకోకుండా వుంటే!

కొత్త సీరియల్ ప్రారంభం!

లవ్ గేమ్

చల్లా సుబ్రహ్మణ్యం

"నవ్యా!!"

కారు మేఘాల్లోంచి - మెల్ల మెల్లగా బయట పడుతున్న నిండు చందమామలా నెమ్మదిగా తలెత్తిందామె.

కిటికీలోంచి ఓ వెన్నెల కిరణం ఆమె ఎర్రని పెదవులమీద పడి తళుక్కున మెరిసింది.

బయట కురుస్తున్న వెన్నెలకన్నా చల్లగా ఉన్న ఆమె చూపుల్లో తడిసి ముద్దయి– పులకించిపోతూ పట్టుకుంటే కందిపోతుందేమో నన్నంత భయంతో – ఆమె భుజాల మీద చేతులు వేశాడు స్వాగత్.

పట్టు చీరె చల్లగా తగిలిందతని చేతులకు.

'నేనెంత అదృష్టవంతుణ్ణి.'

విల్లులా వంగిన ఆమె కనుబొమల మధ్య చిరు చెమటతో మెరుస్తున్న సింధూరాన్ని చూస్తూ అన్నాడతను.

ఆమె పెదవులు అలవోకగా కదిలి చిరునవ్వు నక్షత్రం ఆమె పెదవులమీద మెరిసింది.

ముగ్ధుడై ఆరాధనగా చూస్తున్నాడామెను.

నెమ్మదిగా తన హృదయానికి హత్తుకున్నాడు.

మంచానికి తోరణాలుగా కట్టిన మల్లెపూలు తుళ్లి పడ్డాయి. సిగ్గు పడిన చంద్రుడు పిల్ల మేఘాన్ని ముసుగేసుకున్నాడు. అగరొత్తులు తమ పరిమళాన్ని మత్తుగా గదంతా వ్యాపింప జేస్తున్నాయి.

"ఇదే సినిమా అయితే హాయిగా పాట పాడుకునేవాళ్ళం."

ఆమె చెవిలో గొణిగాడతను.

అతని గుండెలమీద తల ఆన్చి, అతని లాల్చీ గుండీలు తిప్పుతూ నవ్వింది.



"ఇలా గుండీలు తిప్పుతూ నవ్వడం ఏదో సినిమాలో చూసినట్టు గుర్తు" అన్నాడు

ఆమె చప్పున ఆ పని మాని చిరు కోపంతో చూసిందతన్ని

"కోపంతో ఉన్న నిన్ను చూడ్డం ఇదే తొలిసారి!" అన్నాడు.

ఆమె పక్కున నవ్వి,

"నా నవ్వు చూడ్డం కూడా ఇదే తొలిసారా?" అంది

"కాదు. నవ్యకు మరో పేరు నవ్వు" అన్నాడతను

"అయితే స్వాగత్‌కు మరో పేరేమిటో చెప్పండీ" అంది

అతని మాటలకు ఆమెలో సిగ్గు, బిడియం నెమ్మదిగా తొలగిపోతున్నాయ్

అతను రెండు క్షణాలు ఆలోచించి అన్నాడు

"ప్చ్! నువ్వే చెప్పాలి"

"స్వగతం"

అతను పకాల్న నవ్వి ఆమె చెంపమీద ముద్దు పెట్టుకుని-

"మొత్తానికి ఎమ్మే తెలుగువని పించావ్" అన్నాడు

ఆ ఇంటిమీదున్న మామిడికొమ్మమీద కోయిల కూసింది

"ఏమిటి పిల్చావ్?' అన్నాడతను.

"నేనా?" ఆశ్చర్యంగా అంది.

"నువ్వు కాదా? సారీ కోయిల కూస్తే నువ్వనుకున్నాను" అన్నాడు

ఆమె మురిపంగా నవ్వింది.

ఆ నవ్వుని చూసి ముగ్ధుడై చప్పున ఆమె పెదవులను గాఢంగా ముద్దు పెట్టుకున్నాడు ఆమె చేతులు అతని మెడ చుట్టూ పెనవేసుకున్నాయి ఆమె చేతి గాజుల గల గలలు అతనికి చిట్టిబాబు వీణానాదంలా వినిపించింది.

"జీవితంలో నా తొలి ముద్దిది" అన్నాడు.

నవలా నయాగరా

చల్లా సుబ్రహ్మణ్యం



నవయువ విప్లవ నవలా రచయితగా పేరుపొందిన శ్రీ చల్లా సుబ్రహ్మణ్యం "పవిత్ర పాపి" ద్వారా ఆంధ్రపత్రిక పాఠకులకు సుపరిచితులే. "క్యాబరే డాన్సర్", "అరణ్య నేత్రం", "నక్షత్ర సమరం" మొదలైన వైవిధ్యం గల నవలల ద్వారా తెలుగు పాఠకుల ప్రశంసలు మిక్కుటంగా అందుకున్న శ్రీ చల్లానుయీ రోజు కొత్తగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. తెలుగు పాఠకులకు ఆయన రచనలు చదువడం అంటే మహదానందం. రచనలో వేగం, సస్పెన్స్ వుండే రచన చేయాలన్నదే ఆయన ధ్యేయం. అదే దృక్పథంతో వేరొక క్రొత్త కోణంలో యువత మనసులలో చిరు సంచలనం చేయగలిగిన ఆయన నవల "లవ్ గేమ్" పాఠకులకు అందిస్తున్నాం. తినడానికి ముందు రుచి చెప్పడం ఎల? మీరే చదువుతారుగా!

"నాకు కాదు" అందామె తలదించుకుని.

ఆశ్చర్యంగా చూశాడామెను.

"మా అక్క కూతుర్ని నేను చాలా ముద్దులు పెట్టుకున్నాను" అంది నవ్వుతూ.

"మర్చిపోయాను. నేనూ పదహారేళ్ళ మా అక్క కూతుర్ని బోల్డు సార్లు ముద్దుపెట్టుకున్నాను."

ఆమె కోపంగా చూసింది.

"అరె... మళ్ళీ మర్చిపోయాను. నా కసలు అక్కే లేదు. కూతురెలా ఉంటుంది? సారీ..." అన్నాడు.

పెద్దగా నవ్వింది నవ్య.

"మైగాడ్! టైమంతా మాటల్లోనే గడిపేస్తున్నాం. ఎంత దారుణం?" అన్నాడు కంగారుగా.

"మరి సినిమాల్లోలా పాటలు పాడుకుందా మంటారా?" సన్నగా నవ్వుతూ అంది.

"వద్దు. మాటలూ పాటలూ అయిపోయాయి. యాక్షన్ మొదలు పెడదాం" అన్నాడు ఆమెను బలంగా కౌగిలించుకుని.

అతని కౌగిలిలో ఒదిగిపోతున్న ఆమెను అలాగే రెండు చేతుల్లో ఎత్తి బెడ్ మీదకు చేర్చాడు.

ఆమె రెండు చేతుల్తో ముఖం కప్పుకుంది. అతడు ఆమె చేతుల్ని తప్పిస్తూ—

"మరీ అంత ఓవర్‌గా సిగ్గుపడ కూడదు" అన్నాడు.

"మీరు మరీ ఓవర్ యాక్షన్ చేయ కూడదు" అంది చిన్నగా.

"అలాగే డైరెక్టర్‌గారూ" అన్నాడు ఆమె పెదవులు అందుకుంటూ.

ఆమె చేయి పక్కనే ఉన్న లైట్ స్విచ్‌ను నొక్కింది.

గదిలో వెన్నెల చల్లగా పరచుకుంది. చంద్రుడు మేఘాల చాటునుంచి తొంగి చూస్తున్నాడు.



అతను చంద్రుణ్ణి చూపిస్తూ,

"ఈరోజు దాన్నేమంటారో తెలుసా?" అన్నాడు.

తెలీదన్నట్టు తలూపింది.

వెన్నెల్లో పచ్చగా మెరుస్తున్న ఆమె ముఖాన్ని, శరీరాన్ని తన్మయంగా చూస్తూ, ఆమెమీదికి ఒరుగుతూ అన్నాడు—

"హనీమూన్"

పక్కున నవ్విందామె.

చంద్రుడు అలిగి మళ్ళీ మేఘాల ముసుగేసుకున్నాడు.

మల్లెపూలు సిగ్గుతో చితికిపోయాయి.

★ ★ ★ ★ ★

"లేడీస్ అండ్ జెంటిల్మెన్..."

వినీలాకాశంమీద రాజహంసలా తేలిపో తున్న బ్రిటిష్ ఎయిర్‌వేస్ వారి విమానంలో ఎనౌన్సర్ గొంతు తీయగా వినిపించింది.

ఉలిక్కిపడ్డాడు స్వాగత్. కమ్మని కలను నిర్దాక్షిణ్యంగా చెడగొట్టిన ఎనౌన్సర్ని కసిగా తిట్టుకోబోయి అంతలోనే ఆమె చేసిన ఎనౌన్స్‌మెంట్‌కి ఆనందంగా నవ్వుకున్నాడు.

సరిగ్గా భూమికి మూడువేల అడుగుల ఎత్తున- వినీలాకాశంలో హంసలా-

నీలి మేఘాల మీదుగా- తనగమ్యం వేపు వేగంగా వెళ్తోంది బ్రిటీష్ ఎయిర్‌వేస్ విమానం.

"లేడీస్ అండ్ జంటిల్మెన్! విదిన్ ఫ్యూమినిట్స్ వి ఆర్ గోయింగ్ టు ల్యాండ్ ఎట్ బాంబే ఎయిర్‌పోర్ట్. ఆన్ బిహాఫాఫ్ బ్రిటిష్ ఎయిర్‌వేస్ వి థాంక్యూ వన్ అండ్ ఆల్!" తియ్యగా పలికింది ఎనౌన్సర్ కంఠం.

"బాంబే వచ్చేస్తోంది. నీ మనసు మారదా దిలీప్?"

"ప్రేమంటే ప్రేరేపిస్తూ మట్టి కరిపించేది. నా నిర్ణయం మారదు దీపా!"

"హు! ఎంత ఖటిన హృదయం నీది?"

"ఖటిన కాదు. కఠిన హృదయం అనాలి."

"హు! వ్యాకరణం తెలిసినవాడివి. నా మనసులో వాక్యులతని అర్థం చేసుకోలేవా?"

"వాక్యులత కాదు. వ్యాకులత అనాలి."

"అలాగే అంటాను. నీ తిరుమానం ఏమిటో చెప్పు."

"తిరుమానం కాదు. తీర్మానం."

"హు! వాక్యాల్లో తప్పులు దిద్దేవాడివి. నీ పరవర్తనాన్ని దిద్దుకోలేవా?"

"పరవర్తనం కాదు. ప్రవర్తన అనాలి."

"నువ్వెలా అంటే అలాగే అంటాను. నా మాట కూడా కొంచెం అలపించు-"

"అలపించు కాదు. ఆలకించు అనాలి."

"అలాగే! బాంబే వచ్చేలోగా నన్ను పెళ్లి చేసుకుంటావని మాటివ్వు..."

"పెల్లి కాదు. పెళ్లి అనాలి-"

"నేను అనను-"

"ఎందుకని?"

"నువ్వంటే నాకసహ్యం-"

"దీపా!"

"చెప్పేది వినకుండా ప్రతి మాటలో తప్పులు పట్టే- నీలాంటి తప్పుడు వెదవను చేసుకుని ఏ ఆడది సుఖపడగలదు?"

"వెదవ కాదు. వెధవ అనాలి-"

"షటప్!!"



తల తిప్పి వెనక్కి చూశాడు స్వాగత్.

లండన్ హీత్రూ ఎయిర్‌పోర్టులో ఫ్లైట్ టేకాఫ్ తీసుకున్నదగ్గర్నుంచీ వాళ్ళిద్దరిదీ ఇదే వరస.

చిన్నగా నవ్వుకుని చేతిలోని షిడ్నీ షెల్డన్ నవలను మూసి ఒళ్ళు విరుచుకుని మేఘాల్ని చూడసాగాడు.

"ఎక్స్‌క్యూజ్‌మీ..." తల తిప్పి చూశాడు.

అవతల పక్క కిటికీ దగ్గర కూర్చున్న వ్యక్తి వినయంగా తన వేపే చూడడం గమనించి-

"యస్....." అన్నాడు స్వాగత్.

"ఆ నవల చదివేశారా మీరు?" అతి వినయంగా వంగి మరీ అడిగాడు.

"చదివాను. ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు స్వాగత్.

"ఇఫ్ యుడోంట్ మైండ్- ఆ నవల ఖరీదెంతో చెబితే దానికి డబుల్ 'పే' చేస్తాను. ఆ నవల నాకిస్తారా?"

"మీరేమీ 'పే' చెయ్యక్కర్లేదు. తీసుకోండి-"

నవ్వుతూ అతనికిచ్చాడు నవలని.

అతను అపురూపంగా దాన్ని తీసుకుని కళ్ళకద్దుకున్నాడు.

"షిడ్నీ షెల్డన్ అభిమానా మీరు?" నవ్వుతూ అడిగాడు స్వాగత్.

"అభిమానం కాదు- పిండాకూడూ కాదు. నేనో తెలుగు రచయితను. ఈయన లేటెస్ట్‌గా రాసిన నవలిది. ఇంకా ఇండియా రాలేదు- అంచేత-"

విసురుగాఅతని చేతిలోని నవలని లాక్కున్న స్వాగత్-

"సారీ బ్రదర్! నీ కేసు నాకర్థమైంది. తెలుగు పాఠకుల క్షేమం కోరేవాడిని గనుక ఇంత దారుణం చేయలేను-" అన్నాడు.

ఆ వ్యక్తి చిన్నబుచ్చుకుని దిగులుగా అన్నాడు.



'కళారతన్' ప్రాణ్

చిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక స్థానాన్ని ఏర్పరచుకుని క్యారెక్టర్ నటుడిగా స్థిరపడిపోయిన ప్రాణ్ 50 వసంతాలు పూర్తి చేసుకున్నాడు.చాలా మందికి తెలియని ఈ విషయాన్ని ఢిల్లీలోని పంజాబ్ కళా సంఘం వారు తెలుసుకొని ఒక కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రాణ్‌కు 'కళారతన్' అవార్డునిచ్చి సత్కరించారు.

ప్రముఖ నిర్మాతలు-ఓంప్రకాష్, యాష్ చోప్రాలకు, నటుడు జితేంద్రకు-'కళాభూషణ్' అవార్డులు బహూకరించారు.

'ఈశ్వర్'లో నటించిన విజయశాంతి కూడా ఈ సంఘం వారి అవార్డు స్వీకరించిందట.

లవ్ గేమ్

"నాకివ్వకపోతే సరే! మరే రచయితకూ ఇవ్వనని ప్రమాణం చేయండి!"

అంతలో ఎయిర్‌హోస్టెస్ వచ్చిందక్కడికి.

స్వాగత్ చిన్నగా నవ్వి-

"బ్రింగ్ మి ఎ కాఫీ ప్లీజ్!" అన్నాడు.

"విత్ ప్లెజర్!" అంది ఎయిర్‌హోస్టెస్ అందంగా నవ్వుతూ.

"నో విత్ షుగర్ అండ్ మిల్క్ ప్లీజ్!" అన్నాడు స్వాగత్.

ఫకాల్న నవ్వి- "యూ ఆర్ ఫన్నీ!" అందామె.

"ఈజిట్! అయితే ఓ ప్రశ్న అడుగుతాను చెప్తారా?" అన్నాడు స్వాగత్.

"విత్ ప్లెజర్!"

"ప్రపంచంలో కాలాన్ని గొప్పగా పాడుచేసేదేది?"

"బ్రిటిష్ ఎయిర్‌వేస్!" అందామె నవ్వుతూ.

"నో- లవ్ ఎట్ ఫస్ట్ సైట్!" అన్నాడు స్వాగత్.

పెద్దగా నవ్వి వెళ్ళిపోయింది ఎయిర్‌హోస్టెస్.

"నీ మనస్సు మార్చుకోవా దీపా?"

"సారీ దిలీప్! ప్రేమంటే ప్రేతకళతో మనిషివి బయపెట్టేది..."

"బయపెట్టడం కాదు. భయపెట్టడం..."

"షటప్!"

వెనక్కి తిరిగి చూశాడు స్వాగత్.

దీప అనబడే అమ్మాయి- ముఖం కందగడ్డలా చేసుకుని బయటకు చూస్తోంది. దిలీప్ అనబడే అబ్బాయి ముఖం వేలాడేసుకుని దిగులుగా కూర్చున్నాడు.

పక్కకి చూశాడు.

ఆ తెలుగు నవలా రచయిత- షిడ్నీ షెల్డన్ పుస్తకం వేపు గుటకలు మింగుతూ ఆశగా చూస్తున్నాడు. మనసులోనే నవ్వుకుని జేబులోంచి తన మామగారు రాసిన ఉత్తరాన్ని తీసి మూడువందల ముప్తయ్యవసారి చదువుకున్నాడు స్వాగత్. మనసు అతను ప్రయాణం చేస్తున్న విమానంలా మేఘాల్లో తేలిపోతోంది. తీయని పులకింతలతో అతని శరీరం నిలువునా జలదరించింది.

దానికి కారణం అతని మావగారి దస్తూరి కాదు.

ఆ ఉత్తరంలోని సారాంశం.....


చిన్నగా నవ్వుకున్నాడతను.

"మిమ్మల్ని ఫ్లైట్ ఎక్కిన దగ్గర్నుంచీ చూస్తున్నాను. మీరెందుకిలా మీలో మీరే నవ్వేసుకుంటున్నారు?" అడిగింది ఎయిర్‌హోస్టెస్.

"ఈరోజు రాత్రి నేను గొప్పఅడ్వెంచర్ చేయబోతున్నాను." నవ్వుతూ అన్నాడు స్వాగత్.

"ఈజిట్? అయితే ఎవరెస్ట్ శిఖరం ఎక్కబోతున్నారా?"

అందంగా నవ్వుతూ అడిగింది ఎయిర్‌హోస్టెస్.



చర్" కాఫీ సిప్ చేసి అన్నాడు.

"పోనీ- బే ఆఫ్ బెంగాల్‌ను ఈదబోతున్నారా?"

అందమైన తన వీలికళ్ళను తిప్పుతూ అంది ఎయిర్‌హోస్టెస్.

"దటీజ్ సింపుల్- అంతకన్నా పెద్ద ఎడ్వంచర్"

"పంజాబ్‌లో రాత్రి పన్నెండుగంటలకు రోడ్ మీద తిరగబోతున్నారా?"

"కాదు. అంతకంటే గ్రేట్ ఎడ్వంచర్!"

"మైక్ టైసన్‌తో బాక్సింగ్ చేయబోతున్నారా?"

"యూ ఆర్ సోనియర్.... చాలా దగ్గరగా ఆలోచిస్తున్నారు. ఇంకొంచెం."

"రెస్లింగ్!"

"దాదాపు దగ్గరకొచ్చారు. ఇంకొంచెం ముందుకు రండి."

ఆమె రెండు క్షణాలు ఆలోచించి- ఆ తర్వాత అంది.

"నో నావల్ల కాదు. మీరే చెప్పండి!"

ఖాళీ అయిన కప్ ప్యాడ్ మీద పెట్టి అన్నాడతను చిన్నగా నవ్వుతూ.

"ఈరోజు నా ఫస్ట్‌నైట్...."

కొన్ని క్షణాలు అతనన్నది ఆమెకర్థం కాలేదు.

ఆ తర్వాత-

తెల్లటి ఆమె ముఖం ఎర్రగా మారిపోయి- సిగ్గుతో నవ్వుతూ-

"యు ఆర్ నాటీ!" అంది.

"థాంక్యూ...."

ఎయిర్‌హోస్టెస్ వెళ్ళిపోయింది.

నవ్వుతూ పక్కకు చూశాడు స్వాగత్.

రచయిత తన చేతిలోని నవలని చూసి పెదవులు తడుపుకుంటున్నాడు. అతన్ని చూసి జాలిగా నవ్వుకున్నాడు స్వాగత్.

"ఫ్లైట్ ల్యాండ్ కాబోతోంది. సీట్ బెల్ట్ కట్టుకోండని" ఎనౌన్స్‌మెంట్ వినిపించడంతో-



కత్తిరింపుచిత్రం ఎమ్ శ్రీకాంత్ ఆనంద్

"నా ప్రేమను నువ్వు అంగీకరించకపోతే నేను సీటు బెల్ట్ కట్టుకోను దీపా!"

"కట్టుకోకపోతే ఛావు!"

"ఛావు కాదు చావు అనాలి!"

"షటప్!"

విమానం మెల్లగా ల్యాండ్ అవసాగింది.

* * *

"ఒరేయ్... సూర్యం... సూరీ... రేయ్... సూరిగా..."

ఇంటి పైకప్పు నుంచిరెండు పెచ్చులూడిపడడం గమనించి కంగారుగా వంటగదిలోంచి హాల్లోకొచ్చింది సావిత్రి.

అక్కడే-

వెల్లకిలా పడ్డ స్టూలుమీద ఓ కాలుదానికి నాలుగడుగులు దూరంలో పక్కకి పడిపోయి కుర్చీలో ఇరుక్కుపోయి మరో కాలు- చేతినుంచి మెడ మీదుగా కరెంట్ వైర్లు చుట్టుకుని- నేలమీద బోర్లాపడి- అరుస్తున్న సుందరమూర్తిని చూసి కెవ్వున కేకేసింది సావిత్రి.

"నోర్ముయ్! అలా అయిందానికీ- కాని దానికీ కెవ్వున కేకవెయ్యొద్దని నీకు లక్ష సార్లుచెప్పాను. వింటేనా? అవునే- అసలు నీకు మొగుడంటే గౌరవం, భక్తి, వినయమూ విధేయత ఉండేడిస్తేగా పేరుకు సతీసావిత్రివి! బుద్ధులన్నీ శూర్పణఖ బుద్ధులు..." భర్త మాటలకు అలవాటు పడిన సావిత్రి అతని మాటల్ని ఏ మాత్రం పట్టించుకోకుండా కంగారుగా.

"ఏవిటండీ ఈ ఘోరం?" అనడిగింది.

"అలా కుర్చీలో తాపీగా కూర్చో.. చెప్తా..."

"ఏవండీ..."

"లేకపోతే ఏవిటే... సాక్షాత్తూ మొగుడు- ఇలా రెండుకాళ్లూ రెండు విధాలుగా ఇరుక్కుపోయి చిత్రవధ అనుభవిస్తుంటే- ఏం జరిగిందో ఇలా నేలమీద పడుకుని చెప్పాలా? చెపుతానే- అలనాడు ఆ సావిత్రి మొగుడి ప్రాణాలకోసం యముడితో పోరాడితే- ఈనాటి ఈ సావిత్రి ప్రాణాలొకవేపు పోతుంటే మీటింగ్ పెట్టబోతోంది. అసలు నిన్నని..."

వెంటనే కంగారుగా అతని రెండు కాళ్ళూ బయటికి తీసి అతని చేయి పట్టుకుని నెమ్మదిగా నిల్చోబెట్టింది సావిత్రి. బాధగా నడుము పట్టుకున్నాడు సుందరమూర్తి.


"ఏవిటండీ? నడుం పట్టేసిందా? బాధగా ఉందా?" కంగారుగా అడిగింది.

"అబ్బే- చాలా సరదాగా ఉంది. డాన్స్ చేయనా?"

"అయ్యో... ఎంతమాట?"

"లేకపోతే నడుం విరిగి నేను ఛస్తుంటే- పట్టేసిందా? బాధగా ఉందా? అంటూ

కాలాతీత మైన గ్లామర్



దేవానంద్‌ను చూస్తుంటే కాలానికి, వయసుకు లొంగని నటుడా! అనిపిస్తుంది. అరవైలలో కూడ ఇరవైలాగా వుండి, అంత చలాకీ గానూ పని చేయగలడు.

తారలను చేసే శక్తి

అతడు క్రొత్త అనేది ఎక్కడుంటే అక్కడకు అయస్కాంతంలా ఆకర్షింప బడతాడు. అతడు సినీ పరిశ్రమకు పరిచయం చేసిన క్రొత్త ముఖాలు ఎన్నో. సినీ పరిశ్రమలో చాలా కొద్ది మందికి మాత్రమే తెలిసిన 'తారలను సృష్టించటం' అనే ప్రక్రియ లోని సుళువులు, మెలకువలు అతనికి కరతలామలకం. అందుకే ఎంతో మంది క్రొత్త వారిని పరిశ్రమకు పరిచయం చేశాడు. వారిలో ఏ కొద్ది మందో తప్పిస్తే, అంతా సినీ పరిశ్రమను ఒక వూపు వూపిన వారే.

క్రొత్త వారితో నటింపచెయ్యటం అతడి దృష్టిలో సులభం. ఎందుకంటే ఆమె లేక అతను ఫలానా క్యారెక్టరుకే బాగుంటారు అనే ముద్ర ఏమీ వాళ్ల మీద వుండదు. కాప్లెక్స్‌తో ప్రాబ్లముండదు అంటారు.

గ్లామర్ కింగ్

ఆయన చేతిలో ఒక క్రొత్త అమ్మాయి, ఒక మ్యాజీషియన్ చేతిలో ఒక గ్లామర్ క్వీన్ సృష్టింప బడినట్టు తయారవుతుంది. జీనత్ అమన్, టీనా మునిమ్, నటషా, రిచాశర్మ, వీళ్లందర్లూ అతను పరిశ్రమకు పరిచయం చేసిన వాళ్లే.

పట్టుదల ఎక్కువ

'స్వామి దాదా' అనే చిత్రంలో క్రిస్టిన్ – ఓ– నీలి అనే అమెరికన్ బాలిక చేత నటింప చేయటం ఒక యజ్ఞం అంటారాయన. ఆ పాపకు భాష, భావం అర్థమయేటట్టు చెప్పటం, ఆమె బాధ పడకుండా



చూడటం అన్నీ తనే చేశాడు. ఆ అనుభవం చాలా తమాషాగా వుండేది అంటారు దేవానంద్.

జీనత్ అమన్‌ను హరేరామ హరేకృష్ణలో పరిచయం చేసినపుడే అనుకున్నాను ఆమె గొప్పనటి అవుతుందని అంటారు.

జహీదా అతని చిత్రం ప్రేమ్ పూజా'లో వాంప్

నటుడు దేవానంద్

పాత్ర వేసింది

తన కొత్త చిత్రం 'అవ్వల్ నంబర్'లో ఏక్తా అనే నూతన నటిని పరిచయం చేశారు ఆమె అసలు పేరు ఆరతిశర్మ ఆమె తన మొదటి పబ్లిక్ అప్పియరెన్స్ అవ్వల్ నంబర్ సెట్స్ మీద ఇచ్చింది అతడూహించినట్లుగానే మొదటి చూపులోనే అక్కడకు వచ్చిన అందరినీ ఆకట్టుకుంది 'నా



హీరోయిన్లంతా తమదైన ప్రత్యేక ప్రేక్షకులను సృష్టించు కుంటారు' అంటారాయన

అందమైన అమ్మాయి కావాలంటూ వెతుకుతూ కాలం వ్యర్థ పుచ్చను నా పాత్రకు సరిపడుతుందా లేదా అనేది చూస్తాను ఆ అమ్మాయిలో వుండే అందాలను ఇంకా బాగా ఆకర్షణీయంగా చూపించటానికి ప్రయత్నిస్తాను ఏమైనా లోపాలు ఆ అమ్మాయిలో వుంటే అవి మేకప్ ద్వారా, లైటింగ్ ద్వారా కవర్ చేస్తాను అంటారు దేవానంద్ పర్సనాలిటీ దృష్టిలో వుంచుకుని, ఆ పాత్రకు నప్పుతుందా లేదా అని చూసి తీసుకుంటాను అందుకే వారు బాగా పేమ్‌లోకి వచ్చిన తరువాత కూడ వాళ్ల ఇమేజ్ పోదు ఏక్తా ఒక లోయర్ మిడిల్ పామిలీ నుండి వచ్చిన యువతి ఆమెకు ఒక పేదరాలి కూతురి పాత్ర ఇచ్చాను ఆ పాత్ర మేనరిజమ్స్ అలవాట్లు, హావభావాలు అన్నీ ఆమె స్వంతమే అందుకే ఆ పాత్ర సహజత్వంతో వెరైటీగా వుంటుంది

బికినీల అన్వేషణ

బికినీస్ వేసుకునే పాత్రకు నటి కావాలంటే ఒక మంచి బీచ్‌లో అలాంటి అమ్మాయి కోసం వెతుకుతాను నేను పాత్రకు ప్రాముఖ్య మిస్తాను కాబట్టే వారు ఆ తరువాత కూడ నిలదొక్కు కుంటారు అంటారు దేవానంద్

ఆయన భార్య కల్పనా కార్తీక్‌ను

చేతన్ ఆనంద్ పరిశ్రమకు పరిచయం చేశాడు కాని దేవానంద్ ఆమె చిత్రాలకు వేటికీ దర్శకత్వం వహించలేదు బహుశ ఆమె చిత్రానికి దర్శకత్వం వహించటం కంటె ఆమె జీవితానికి దర్శకత్వం వహిద్దామనుకుని వుంటాడు ○



సినిమాయాక్టర్ అడిగినట్టు- నాజూగ్గా అడక్కపోతే కాస్త నడుంపడితే నీ సొమ్మేం పోతుందనీ-?"

"అసలా కుర్చీ ఎందుకెక్కారు?"

"కుర్చీ ఎక్కలేదు. స్టూలెక్కాను."

"మరి కుర్చీలో కాలెందుకు ఇరుక్కుపోయింది?"

"కుర్చీమీద స్టూలేసుకుని- ఇదిగో ఈ బల్బ్ అక్కడ పెడదామని ట్రై చేశానంతే! వెధవది ఈ ఇంట్లో మనుషులకే నేనంటే గిట్టదనుకున్నాను గానీ- వస్తువులక్కూడా నా గాలి పడదని ఇప్పుడు తెలుసుకున్నాను-"

భర్త చేతికీ- మెడకీ చుట్టుకున్న వైర్లు తీసేస్తూ-

"సూర్యానికి చెదితే వాడు పెట్టే వాడు కదా! మీకెందుకిలాంటి పన్లు?" అంది సావిత్రి.

"ప్రొద్దుట్నుంచీ లక్షసార్లు చెప్పాను వాడికి- అవతల అల్లుడొచ్చే టైం అయింది. ఇల్లంతా దయ్యాలకొంపలా ఉంది. కాస్త ఆ బల్బ్ అక్కడ ఫిక్స్ చేసి చావరా అని. వాడి టెన్నిస్ ఏమిటో వాడి గొడవేమిటోగానీ- ఇల్లు పట్టించుకొని చావడు గదా? అసలీ కొంపలో నా స్థానమేమిటో అర్థమైచావడం లేదు. అలనాడు ఆ శ్రీరామచంద్రమూర్తి

లవ్ గేమ్

తండ్రి మాటను జవదాటక- అరణ్యవాసానికి..."

"కాసేపిలా కూర్చోండి. కాఫీ తీసుకొస్తాను...." అతన్ని కుర్చీలో కూర్చోబెడుతూ అంది సావిత్రి.

"కూర్చుని తీరిగ్గా కాఫీ తాగే టైమెక్కడ చచ్చిందే- అవతల ముహూర్తం దగ్గరకొచ్చేస్తోంది. ఇవతల అల్లుడు లండన్ నుంచి రాబోతున్నాడు. అవతల పన్లన్నీ ఎక్కడివక్కడే ఉన్నా య్! ఇవతల కాఫీలు తాగుతూ కబుర్లు చెప్పమంటున్నావ్. అవతల...." ఆవేశంగా కంగారుగా తిరుగుతూ పక్కనే నేలమీదున్న బల్బ్‌ని తన్నాడు.

అది భళ్ళున పగిలి గదంతా పెంకులు పడ్డాయి.

కెవ్వుమంది సావిత్రి.

"అలా కెవ్వు కెవ్వుమని అరవొద్దని నీకెన్నిసార్లు చెప్పాలి? అయినా ఈ బల్బ్ ఇక్కడ పెట్టిన ఏబ్రాసీ వెధవెవరు?"

ఆవేశంగా అరిచాడు సుందరమూర్తి.

"ఇందాక మీరే పెట్టారిక్కడ.."భయంగా అంది సావిత్రి.

గతుక్కుమన్నాడు సుందరమూర్తి.

"ఆల్‌రైట్ పెట్టానే! పెడితేమాత్రం నేనలా ఆవేశంగా తిరుగుతుంటే అక్కడ బల్బుంది- ఆవేశపడకండి అని చెప్పొచ్చుగా? అంటే ఆ బల్బు నేను తంతానని- ఆ పిమ్మట ఆ బల్బ్ తాలూకు గాజుపెంకులు నా కాలుకు గుచ్చుకోవాలనీ- ఆ తర్వాత నేను షుగర్‌పేషెంట్‌ని గనుక ఆ గాయం మానక- అలాగే-"

"ఏవండీ!" కోపంగా అరిచింది.

"మిమ్మల్ని మీరు ఎన్ని తిట్టుకున్నా సహిస్తానుగానీ- నా ఐదోతనాన్ని కించపరిస్తే నేను భరించలేను. జాగ్రత్త!" విసురుగా అంది.

"ఏమిటమ్మా! ఏమైందీ?"

అప్పుడే అక్కడికొచ్చిన పెద్దకూతురు మీనాక్షి అడిగింది.

పరిస్థితి అంతా వివరంగా చెప్పింది సావిత్రి.

"నీకెందుకునాన్నా ఇవన్నీ- నువ్వు కంగారుపడి మమ్మల్ని కంగారుపెడతావ్. అలా పేపర్ చదువుకుంటూ కూర్చో నువ్వు. పన్లన్నీ అవే అయిపోతాయి.." అంది మీనాక్షి.

సుందరమూర్తి కోపంగా 'హు!' అని విసురుగా గదిబయటకొస్తూ అక్కడే గుమ్మంలో ఉన్న బాల్చీని తన్నాడు.

అది పెద్ద శబ్దం చేసుకుంటూ నేలమీద దొర్లుకుంటూ పోయింది.

సుందరమూర్తి మరింత కోపంగా-

"ఇది ఇక్కడెవరు పెట్టారు?" అన్నాడు.

"ఇందాక స్నానం చేసి నువ్వే పెట్టావ్ నాన్నా!" చెప్పింది మీనాక్షి.

"అబద్ధాలాడకు. నేను బాల్చీ ఇక్కడ పెట్టాను..." అన్నాడు. అసలు బాల్చీ ఉన్న స్థలానికి అరడుగు దూరం చూపెడుతూ.

"అబ్బా... అక్కడున్నా అదీ దారే గనుక తన్నేవాడివి. నీకీ చాదస్తం ఎప్పుడొదులుతుందో " అని తలకొట్టుకుంటూ వెళ్ళిపోయింది మీనాక్షి.

"హు!" అని బుసకొట్టి బయటికొస్తుండగా ఎదురైంది తల్లి మహాలక్ష్మమ్మ.

"అబ్బాయీ సుందరం..." అంది.

"హు..." అన్నాడు.

"అల్లుడు తప్పకుండా ముహూర్తానికి వస్తాడంటావా?"

"హు..."

"తంతి కూడా ఇచ్చాడన్నావుగా? వస్తాడులే.. ఒకవేళ రాకపోతేనో....?"

"హు...మళ్ళీ ఇంకోసారి పెట్టుకుందాం" అన్నాడు సుందరమూర్తి.

"ఆదిలోనే హంసపాదు మంచిదికాదురా అబ్బాయి..."

సుందరమూర్తికి చిర్రెత్తుకొచ్చింది.

మోకాలికి తగిలిన ఇత్తడి బకెట్ దెబ్బ ఇంకా జివ్వుమంటోంది.

"దానికి నన్నేం చేయమంటావ్- అది అతని శోభనం. ఇంకొకరిచేత జరిపించలేం గదా?" అన్నాడు కోపంగా.

"హవ్వ! హవ్వ! అవేం పాడు మాటల్రా! కన్నతండ్రి కూయవలసిన కూతలేనా అవి?" అందామె నొచ్చుకుంటూ.

"హు!" అని కోపంగా బుసకొట్టి విసుటుగా బయటికెళ్ళాడు సుందరమూర్తి.

ఇంట్లో జరుగుతున్న సందడికి దూరంగా-

తన గదిలో ఒంటరిగా కిటికీదగ్గర కుర్చీలో కూర్చుని బయటికి చూస్తూ ఆలోచిస్తోంది నవ్య.

తన గురించి ఇంట్లో జరుగుతున్న హడావుడిని నిశ్శబ్దంగా గమనిస్తోందామె.

స్త్రీకి జీవితం ప్రారంభమయ్యేది శోభనం తోటేనట!

ఎక్కడో చదివిన వాక్యం గుర్తొచ్చి నవ్వుకుందామె.

కాలేజీ తెలుగు క్లాసులో తాను ప్రబంధాలు టీచ్ చేసినప్పుడు స్టూడెంట్స్ కళ్ళల్లోని

లవ్ గేమ్

ఉత్సుకతను గమనించి తాను మనసులోనే నవ్వుకునేది.

శృంగారం!!!

పెద్దన్న- చేమకూర వేంకటకవి- శ్రీనాథుడు-ముద్దుపళని-మొదలైనవాళ్ళంతా ఆరాధించి ఆస్వాదించిన శృంగారరసం-

ఆమె మనస్సులో ఏ స్పందనా లేదు- ఏ అనుభూతీ లేదు.

మనస్సంతా ఖాళీగా- శూన్యంగా- ఏదోగా-

అప్పుడు ప్రవేశించారు ఆమె స్నేహితురాళ్ళు నలుగురు-

గలగల పారే సెలయేరులా- నవ్వుతూ- తుళ్ళుతూ-

నవ్య లేచి నవ్వుతూ ఆహ్వానించింది.

"రాత్రి జరగబోయేదాన్ని డ్రీమ్ సీక్వెన్స్‌లో ఊహించుకుంటున్నావా?" అంది లావుగా బొద్దుగా కళ్ళజోడు పెట్టుకొనిఉన్న లావణ్య.

"తినబోతూ రుచులడగడం దానికి అలవాటు లేదు తెలుసా?" సీరియస్‌గా అంది సన్నగా ఉన్న హరిత-

"ఇన్నాళ్లూ తాను బోధించిన ప్రబంధ కావ్యాల్లోని శృంగార ఘట్టాల్ని ప్రత్యక్షంగా అనుభవిస్తూ మాటలు మర్చిపోతోంది పాపం...." అంది సుజాత.

"అనుభవిస్తుందో- లేక ఆ పద్యాలన్నీ టీకా-తాత్పర్యాలతో మొగుడికి లెసన్ తీసుకుంటుందో-"

పక్కున నవ్వారంతా.

నవ్య చిన్నగా నవ్వింది.

"ఓ చిన్న రిక్వెస్టోయ్!" అంది లావణ్య.

ఏవిటన్నట్టు చూసింది నవ్య.

ఒకే మనసు

నీకున్నది ఒక్క మనసే
మరొక మనసు నిన్ను పెనవేస్తే?
అయినా మనసులు రెండుకావు
అప్పుడూ నీకున్నది ఒక్క మనసేకదా!

నీ మనిషి నీ మనసు తెలిసి
నీ మనసుతో స్నేహంచేస్తే?
ఆ మనసు, నీ మనసుతో చేరినా
అప్పుడూ నీకున్నది ఒక్క మనసేకదా!

– యం. వి. రామచంద్రమూర్తి

"ఏం లేదు- ఈ రాత్రి నువ్వు మీ ఆయన్తో మాట్లాడిన మొదటి మాట ఏమిటో నాకు రేపు చెప్పాలి"

"నేను చెప్పనా? ఐలవ్‌యు" అంది సుజాత.

"ఇది ఎమ్మే తెలుగు చేసింది. ఇంగ్లీషులో ఎందుకంటుంది?" అంది హరిత.

"ఎందుకంటే మొగుడు లండన్ నుంచి వస్తున్నాడు గనుక!"

" అయితే ఈ రాత్రి వీళ్ళిద్దరూ ఇంగ్లీష్‌లో ప్రేమించుకుంటారా?"

కిలకిలా నవ్వేశారంతా.

అప్పటికి ఆ గదిముందు పదిసార్లు పచార్లు చేసిన వ్యక్తిని చూసి అడిగింది సుజాత. నవ్యకూడా అతన్ని గమనించింది.

"ఎవరే అతను దొంగ చూపులు చూసుకుంటూ తిరుగుతున్నాడు?"

" అతను మా అక్క మొగుడు. ఆ వేషానికి తగ్గట్టు అతని పేరుకూడా మన్మధరావే!" అంది నవ్య.

పదకొండోసారి దొంగచూపులు చూసుకుంటూ వస్తున్న మన్మధరావుని చూసి చిన్నగా విజిల్ వేసింది హరిత.

మన్మధరావు హఠాత్తుగా ఆగి- లోపలికి తొంగిచూసి-

"ఎవరూ ఈల వేసింది?" అన్నాడు.

"నేనే!" అంది హరిత.

"మీరా? ఇంకెవరయినా రౌడీపెధవేమో ననుకున్నాను"- అన్నాడు ఓ అడుగు గదిలో వేసి- మరో అడుగు బయటుంచి.

"కాదు నేనే! రౌడీవెధవల్ని చూసినప్పుడు ఈలవేయడం నా హాబీ!" అంది హరిత.

లోపలికేసిన కాలు తీసి బయటపెట్టాడు మన్మధరావు.

"ఇంకా మీ హాబీలేమిటి మేడం?" గుమ్మానికానుకుని నిలబడి అన్నాడు.

"దొంగచూపులు చూసే మగాళ్లని ఎడమకాలి చెప్పుతో కొట్టడం..."

"ఐసీ... కుడికాలు ఎందుకు ప్రిఫర్ చేయరు?"

"అలాంటి దౌర్భాగ్యులకు కుడికాలుపయోగించడం ఇష్టంలేక-"

అదిరిపోయాడు మన్మధరావు.

"ఇంకా చెప్పమంటారా?" అంది హరిత-

"హి-హి-హి- వద్దులెండి...అర్థమైంది-" అని వెళ్ళిపోయాడు మన్మధరావు.

"బాగా బుద్ధిచెప్పావ్!" అంది నవ్య.

"కాస్సేపు నిద్రపోవే పాపం... రాత్రంతా జాగారం తప్పదుగా?" అంది లావణ్య.

"అవునవును... ఇదే నీ ఆఖరి



అబ్రహంకు దిలీప్ 'నో'

టి.వి సీరియల్ 'బైబిల్'లో అబ్రహం పాత్రకు గతంలో ఎన్నికైన
దిలీప్‌కుమార్ యిప్పుడు ఆ పాత్రను పోషించటంలేదు ఈ సీరియ
ల్‌లో ప్రధాన పాత్ర అయిన 'అబ్రహాం'గా ముస్లిం మతస్థుడయిన
యూసఫ్‌ఖాన్‌ను ఎంపిక చేశారు, సరిగ్గా ఆ పాత్రకు న్యాయం చేకూ
రుస్తాడన్న ఉద్దేశ్యంతో తను నటించే పాత్రవల్ల ముందు ముందు
వివాదాలేవీ రాకుండా వుండేందుకే తాను ఆ పాత్ర నుంచి విరమిం
చుకున్నానంటున్నాడు దిలీప్

కాని ఆ సీరియల్‌లో ఏదో పాత్రలో కనిపించి ఆహ్లాదాన్ని చేకూ
ర్చాలని కోరుతున్నారట దిలీప్ అభిమానులు మరి అందుకు దిలీప్
ఏమంటాడో?

ఒంటరి నిద్ర!" అంది సుజాత.

"వద్దు. పగలు నిద్రపోయే అలవాటు లేదు నాకు-" అంది నవ్య.

"ఇంత పగలేమిటి రాత్రేమిటి? ఎప్పుడు టైం దొరికితే అప్పుడే!"అంటూ కన్నుగీటింది హరిత.

అంతా పకాల్న నవ్వారు.

నవ్య తలదించుకుంది.

"నాకో చిన్న డౌట్!"అంది హరిత.

"ఏమిటది?" అంది లావణ్య.

" వీళ్లాయన లండన్‌నుంచి వస్తున్నాడు కదా? ఫామిలీ ప్లానింగ్ అమలుపర్చుతారా ఈ రాత్రి?"

"ఛీ! శుభమా అని శోభనం రోజు ఫామిలీ ప్లానింగ్ ఏమిటి?" అంది సుజాత.

"నేనయితే ఆచరిస్తాను బాబూ!" అంది హరిత.

"శోభనం రోజు ఫామిలీ ప్లానింగ్ ఆచరించడానికి ఏం చేయాలో నేను చెప్తాను-" అంది లావణ్య.

"చెప్పు... ఎలా?"అన్నారు హరిత-సుజాత ఉత్సాహంగా.

"ఒకర్నొకరు చూసుకుంటూ...."

"ఊ.... చూసుకుంటూ...."

"గుటకలు మింగుతూ దూరంగా పడుకోవడమే!"

నవ్వుల్తో ఆ గది ప్రతిధ్వనించింది.

ఆ రాత్రి-

గదిలోకి పంపబోయేముందు బామ్మ మహాలక్ష్మమ్మ కళ్లొత్తుకుంటూ చెప్పింది.

"చూడు తల్లీ! ఈ రాత్రితో నీ జీవితం తొలిమలుపు తిరుగుతుంది. ఈ మలుపులో తొట్రుపడకుండా అడుగు వేయాలి. ఈరాత్రి నీ జీవితంలో కొత్త అనుభవాల్ని చవిచూస్తావ్- కొత్త జీవిత రహస్యాలు తెలుసుకుంటావ్- వాటిని సరిగ్గా ఆకళింపు చేసుకుని అవగాహన చేసుకుంటే జీవితాంతం మొగుడు నీవాడు అవుతాడు. లేకపోతే మొగుడు మగాడిగానే మిగిలిపోతాడు జాగ్రత్త!"

నాయనమ్మ మాటల్ని మౌనంగా వింది నవ్య.

అమ్మలక్కలు వెంటరాగా నవ్య అడుగులో అడుగు వేసుకుంటూ శోభనం గదివేపు బయల్దేరింది.

తెల్లటి పట్టుచీర- జడని చుట్టిన పూల మాలతో అసలే అందంగా ఉండే నవ్య ఆ అలంకరణలో రతీదేవిలా ఉంది.

ఆమె గుండె వేగంగా కొట్టుకుంటోంది.

ఏదో చెప్పలేని ఉద్విగ్నత ఆమెను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. చిరుచెమటతో ఆమె ఫాలభాగం ట్యూబ్‌లైట్ కాంతిలో బంగారంలా మెరుస్తోంది.

ఆమె గదిలోకి అడుగుపెట్టింది.

వెంటనే గది తలుపులు వెనకనుంచి మూసుకున్నాయి.

కళ్ళెత్తి అలవోకగా చూసింది.

ఉదయం నుంచి ఆ ఇంట్లో బామ్మ- నాన్న- తల్లి- అక్క వగైరాలంతా పడిన హడావుడి- చేసిన సందడికి ప్రతిరూపంలా ఉందా గది.

పందిరిమంచం చుట్టూ వెండి దారాల్లా పూలు వేలాడుతున్నాయి. మంచంమీద తెల్లని కొత్తదుప్పటి- ఎంబ్రాయిడరీ చేసిన దిండు గలీబులు- మంచం పక్క టీపాయ్‌మీద స్వీట్స్- పండ్లు-పాలు- ఓమూలగా వెలుగుతున్న అగరొత్తులు-

ఆమె నవ్వుకుంది నిర్వేదంగా- నిస్తేజంగా-నిర్లిప్తంగా-

ఎక్కడో మనస్సు అట్టడుగు పొరల మధ్య- నిక్షిప్తమైన యుగాలనాటి స్తబ్ధత క్రమంగా కరిగిపోతూ లావాలా మారి-

ఆమె మనస్సును కాల్చివేస్తూ- గుండెను మండిస్తూ-

అతను మంచంమీద అటుతిరిగి కూర్చున్నాడు.

ఓ ఆవేశపు తరంగం ఉవ్వెత్తున ఎగసిపడిందామె హృదయంలో.

ఒక్క అడుగు ముందుకేసింది-

కాలి గజ్జెలు ఘల్లుమన్నాయి-

చేతి గాజులు గలగలమన్నాయి.

అతను మెల్లగా వెనక్కి తిరిగిచూసి లేచి నిల్చుని- చిన్నగా నవ్వుతూ- నెమ్మదిగా ఆమెదగ్గరకొచ్చాడు.

ఆమె అతన్నే చూస్తోంది-

సిగ్గుగా- ప్రేమగా- మత్తుగా- ఆప్యాయంగా- అనురాగంగా కాదు- ఆమె కళ్ళలో ఏ భావమూ లేదు. కాదు..... అతనికి కనిపించలేదు.

అతను ప్రేమగా నవ్వుతూ ఆమె భుజం మీద చేయివేసి-

"నవ్యా!" అన్నాడు.

అంతే-

విసురుగా చెయ్యెత్తి అతని చెంప ఛెళ్ళుమనిపించి- పట్టరాని ఆగ్రహంతో - ఆవేశంతో వణికిపోతూ అందామె.

"యూ.....బాస్టర్డ్!"

(ఇంకా వుంది)

కథల కాణాచి

ష్న దణ్ణం

శ్రీజలసూత్రం రుక్మిణీనాథ్

"ఏమే, రామసీతా–"

దొడ్లో గాడి పొయ్యి దగ్గర నుంచుని కనకమ్మ అంది యీ పిలుపు గదిలో వున్న రామసీతకు వినబళ్లేదు "ఊహూఁ రింగురంగా అంటూ ఏం జేస్తోందో' అనుకుంది "యిదీ మంచిదే అది చూడకుండా వుంటేనే మంచిది నరుడికంట నల్లరాయైనా పగులుతుందిట ఎవరి కళ్ళు ఎలాంటివో అనీ అనుకుంది కళాయిలో పులుసు తెర్లుతోంది కరేపాకు, కొత్తిమీరీ ఎప్పుడేసినా వెయ్యవచ్చు సువాసనకేగా ఆకాశానికేసి మెడ ఎత్తింది చేతులు జోడించింది నమస్కరించింది "నారాయణమూర్తీ, తండ్రీ! నీవు చల్లగా చూసి అబ్బాయికి పేరు వస్తే– అంది యింతలో అలికిడి అయ్యింది కోడలు వస్తూందల్లే వుంది అనుకుని చేతులు దించింది రామసీత వొచ్చి నిలుచుంది శాంతంగా బంగారు బొమ్మలాగా

"అప్పుడనగా పిలిస్తే యిప్పుడా అమ్మా రావడం?"

వినబళ్లేదు అత్తయ్యా!

బాగానే వుంది కరేపాకూ అదీ తీసుకురా

కత్తీ కరారీనా" – నవ్వింది

పులుసులో కొత్తిమీరీ, కరేపాకు వెయ్యడం అంటే ఆంజనేయులుకు గిట్టదు వాటి కతను కత్తీ కరారీ అని పేరు పెట్టాడు

'ఊ' అంది కనకమ్మ ఎప్పుడూ ఇది ఇంతే భగవంతుడికి దణ్ణం పెట్టుకోవడానికి కూడా వీల్లేక పోతోంది ఎల్లాగూ ఆలిస్యం చేసే మరీ వచ్చింది కదా! దేముడికి దణ్ణం పెట్టుకున్నాకే రాకూడదూ? కాస్త ఏమన్నా నోరు తెరిచి అందో 'అత్తగారు ముండమ్మో' అంటారు సదేలే అనే వాళ్లకు నోరు వాయీ వుందీ? ఇంతకూ దేముడికి దండం పెట్టుకోవడం పూర్తి కానేలేదు మాయదారి తల్లివచ్చి మొదటికి తెచ్చింది

నారాయణమూర్తీ, తండ్రీ! నువ్వు చల్లగా చూసి ఇవాళన్నా అబ్బాయికి పేరు అదీ కలిసి వొస్తే – సత్యన్నారాయణవ్రతం చేయిస్తాను ' అనంది

రామసీత కరివేపాకూ, కొత్తిమీరీ తెచ్చింది

అత్తగారు చెంపలు వేసుకోవడం రామసీత చూచింది ఎందుకు చెంపలు వేసుకుంటోందో తెలీలేదు వోవేళ తను పిలిస్తే, వెంటనే రాక, కొత్తిమీరీ కరేపాకు అవీ తెమ్మని చెబితే గానీ తేలేదని కోపమేమో అనుకుంది

'ఏం అత్తయ్యా అలా వున్నారూ' అంది

కనకమ్మ మాట్లాడలేదు

యివాళే నాటకం ఆంజనేయులు మురావాళ్ళు ఆడుతున్నారు రామసీతకు ఈ నాటకాలంటే గిట్టదు తరతరాలా శిష్టాచార సంపన్నులయిన వారి యింట్లో పుట్టింది ఆమె ఆమెకు నాటకంలో తన మొగుడు వేషం వేస్తాడంటే ఏమిటోగా వుంది శుభ్భంగా తిని కూచోక లేనిపోని యీ వేషాలు ఎందుకు? అయినా అయిన యింటి వాళ్ళు నాటకాల్లో వేషాలు వేస్తారూ? "ఆయన లేడూ, నాటకాల్లో వేషాలు వేస్తాడే, ఆయన పెళ్లాం' అంటే ఎంత అప్రతిష్ట? అయినా తన కెందుకు? నోరు మూసుకు ఊరుకుంటే సరి అనుకుంది

ఆయన్ను సగం ఈవిడే చెడగొట్టేది నీ నాటకాలేమిటో నీ గోలేమిటో – లైట ఏమన్నా చెయ్ – యింటి మీదికి మాత్రం తీసుకురాకు అని ఈ విడేమన్నా అంటుందా? ఉఁహుఁ అబ్బాయి స్నేహితులంతా దేముళ్లే వాళ్లొచ్చేది కొంప మీద పడి నానాగత్తరా చేసి పోయేదీనూ పెద్దది కదా తను, 'యిదేమిటి'– అన్నదా ఏమన్నా? నవ్వుతూ చూస్తూ ఊరుకుంది వొచ్చిన వాళ్లలో వో కుంక–

ఆంటీ! మీ ఆవిడ చీరలూ, నగలూ తేరాదూ అనంటాడూ? తన చీరలూ, నగలూ మాట వాడనవచ్చా? ఉఁ తన కెందుకు? చూస్తూ వూరుకుంటే సరి

'అత్తా'! అత్తా'!'

పక్కయింటి వాళ్ల పిల్లవాడు తన కోసమే

దా!

రామసీత ఆ పిల్లాడికి ఎదురెళ్లింది సరాసరి మాలిమిగా వొచ్చాడు ఆ అబ్బాయి

వొస్తూనే – అత్తా! నే నోటడుగుతా చెప్తావూ? అన్నాడు రామసీత తల ఊపింది

తలూపితే కాదు లేదు అనకూడదు

– తలూపింది మళ్లీ ఆమె

కాదు' అనకూడదు

– నవ్వింది

నవ్వుతా వేమమ్మా ఊఁ–

అసలేమిటో తెలీక పోయె ఊరికే, ఏమిటో చెప్పకుండా వుంటే మరింత నవ్వొస్తోంది ఆమెకు

నిజంగానే నమ్మా!

చెప్పూ మరి

ఇవాళ మన వూర్లో ఏమిటో చెప్పుకో'

రామసీత కర్థం కాలేదు 'తెలీ'దంది

శ్ ఇంతేనా? నే చెప్పనా?'

ఊఁ

నాటకం'

మనసుకు కాస్త హుషారు కావాలన్నప్పుడు పిల్లల దగ్గరుంటే చాలు. నవ్విస్తారు కాని, వాళ్లే ఓ అప్పుడు తమకు తెలీకుండానే సూటిగా గుచ్చినట్టు మాట్లాడి గిలగిల లాడిస్తారు

పని పిల్లల్లో ఈ ఇది మరీనూ పసివాడు నాటకం పేరెత్తక పోతే హాయిగా ఉండేది పసివాడికి లాలన జరిగేది తనే నాటక ప్రస్తావన తెచ్చివుండేదేమో కూడానూ హృదయశాంతికోసం పిల్లాడే ముందు నాటకం మాట తెచ్చేసరికి రామసీతకు మనసొకలా గయింది తన యిది వాడి దగ్గర వెళ్ల బుచ్చుటం దేనికి, దానిమీద చివికి, చివికి గాలివాన కావడం దేనికీ అనుకుంది ఆమె ఏమయినా తను యీ నాలుగ్గడియలూ చూస్తూ ఊరుకుండ దలుచుకుంది

ఊఁ

అదేమిటత్తా, ప్రశ్నానికీ ఈ ఊఁ' అంటావ్? నవ్వుతూ మాట్లాడవేం?

రామసీత నవ్వింది

అమ్మయ్య! నాటకానికి తీసికెళ్తావన్న మాటే–

పసివాడి దోరణి బోదపడింది వాడూ నాటకం చూడటానికి ఇదవుతున్నాడు తనేం చెప్తుందీ? చూస్తూ వూరుకుంది

ఏమత్తా తీసుకెళ్ల వుటమ్మా అత్తా!

అల్లాగే

నిజంగానా?

పసివాడు రాముడు నమ్మలేక పోయాడు కష్టసాధ్యం ఐనవరం తేలిగ్గా వస్తే ఎవరైనా సరే, తొందరగా నమ్మలేరు

రామసీత తలూపింది

ఇంతలో గబ గబా ఆంజనేయులు ఇంటికి వచ్చాడు కొండలు పిండి కొట్టిస్తూన్నట్టు వొచ్చాడు సావిట్లో అతనికి రామసీత కనిపించింది ప్రక్కన రాముడూ వున్నాడు

'మా అమ్మేదీ–? అన్నాడు ఆంజనేయులు

దొడ్లో వున్నారు అంది ఆమె

ఆంజనేయులు సరాసరి దొడ్లోకి వెళ్లాడు కనకమ్మ వంటంతా పూర్తి చేసుకుంది స్నానం చెయ్యబోతోంది

"అమ్మా వంటైందా?

"ఆహా"

"వంట మాటకేంగానీ, చిక్కొటి వచ్చి పడ్డదే

కనకమ్మ తలెత్తింది

"చీరెలు రెండు కావాలమ్మా కాసిని నగలూ కావాలి

"దాన్నడుగు నన్నడగుతావేం

"సడేలే' అది ఇవాళ చెపితే వినేటట్టుందీ

రామసీతకు ఈ మాటలు వినబడ్డాయి సరాసరి వొచ్చింది

"అల్లాగే- ఏం కావాలో తీసుకోండి"

అంజనేయులు తెల్లబోయాడు ఇవ్వ సంటుందనీ, రగడ జరుగుతుందనీ ఆలోచిస్తూ వొచ్చాడతను ఏమాట మీద ఏ మాట విసరాలో అసలు రగడ ఎలా జరుగుతుందో అదంతా అతను తనలో తాను ఊహించుకున్నాడు అదంతా మబ్బులు తేలిపోయినట్టు తేలిపోయింది

"పద అన్నాడు

రామసీత తన కావిడిపెట్టి తీసింది పక్కకు తప్పుకుంది కొర్నాటి చీరా, ఉప్పాడ చీరా, మరో పట్టు చీరా తీసుకున్నాడు పెట్టి అంతా కెలికాడు పెట్టి మూతపెట్టి వచ్చాడు

"మెళ్లోవి కూడా ఇస్తావా? అన్నాడు

"దాందేముందీ, తీసుకోండి

పేచీ వొస్తుందనుకున్న చోట పేచి రాకపోవడం ఎంతో నిరాశను కలిగిస్తుంది ఎంతో ప్రేమైనా వుండాలి కావలసినంత అసహ్యం అన్నా వుండాలి పేచీ రాకపోవడానికి అసహ్యంతో బార్య ఇస్తే తను తీసుకుంటాడా?

"మరైతే నువ్వుకూడా పెందరాళే తెములు అన్నాడు భార్యతో అతను

రామసీత మాట్లాడ లేదు

"నిన్నే-

ఆమె తలెత్తింది

"నాటకానికి నువ్వు రావా?

"అత్తయ్య కూడా వస్తున్నారా?

"ఏమో!

"నేను, అత్తయ్య ఇంట్లో వుంటాం లెండి

"నువ్వు రావాలి

తను చేసే పని బార్య చూడాలి, సంతోషించాలి, తన్ను మెచ్చుకోవాలి, తనకు ఆమె ప్రోత్సాహం ఇవ్వాలి అని కోరుకోని మనిషి వుంటాడా? అంజనేయులు ఆ ఉద్దేశ్యంతో నే అన్నాడు

రామసీత మాట్లాడలేదు

"నిన్నే-

ఈసారి అతని గొంతులో ప్రేమ మ్రోగింది భర్త గనుక దబాయించినట్టు అన్నాడు గానీ

"నేను రాను



"ఏం"

"రాను."

"ఊఁ"

"ఏ మాటలండీ ఇవీ? మొగుడు వేషాలేస్తుంటే పెళ్ళాం వచ్చి చూస్తుందీ? చూడొద్దూ?"

"నిక్షేపంగా చూడొచ్చు"

"దానికేం గానీండి. అందరూ పోతే ఇల్లు–"

"మా అమ్మ వుంటుందిగా? యీ మాటలకేం గానీ– నాన్నకపెందరాళే తెములు"

"అవిణ్ణి ఒక్కోత్తనూ వుంచమని పోవడం బాగుండదు కానీ నా మాట వినండి"

"పోరాదుటే– వాడు అంత ఇదిగా రమ్మంటుంటే–" అని అందుకుంది కనకమ్మ.

"నేను వెళ్ళనండీ అత్తయ్యా"

"బాగానే ఉంది" అన్నాడు అతను.

"ఇంతేనమ్మా. ఆడముండలు ఎప్పుడూ ఇంతే. అన్నయ్యను పోయిన కాల్చుకు తినలా? ఎక్కడికి పోతై బుద్ధులూ" అంది కనకమ్మ. ఈ సంబంధం మేనరికం.

"మా అమ్మేం గుడిశేటిది. పది శేటిదీ కాదు– ఆ బుద్ధులు వొచ్చి నేను చెడిపోవటానికి. అవిడేం వేలు పెట్టి వొప్పించుకోలేదు. పరువుగానే వుంది. ఇంతకూ అవిడ నీకేం పరాయిది కాదు. సాక్షాత్తూ అన్న పెళ్ళాం" అంది రామసీత.

"ఆ. అన్న పెళ్ళామే– మేనరికానికి ఓ పట్టున వొప్పుకుందా మా తల్లి! అయినా ఇప్పుడవన్నీ ఎందుకు?"

"అన్నీ అనేదిన్నీ. ఎవరో అంటున్నట్టుండేదిన్నీ. ఇప్పుడవేం నే తీసుకురాలేదు–"

రామసీత ఈ మాటలు ఇంచుమించుగా ఏడుస్తూనే అంది.

"నాకెందుకు. దానిష్టం. దాని మొగుడిష్టం" అని కనకమ్మ చక్కాపోయింది.

రామసీత అక్కడే నుంచునుంది. దానిష్టం. దాని మొగుడిష్టం. నాకెందుకు అనుకున్నది తను రాకపోతేనేం? వొచ్చి సప్త పితాళ్ళకూ పెట్టకపోతేనేం? కడుపు భగ్గున మండింది. ఆడది. మండి మాత్రం ఏం చేస్తుంది? తన వాళ్ళెవరూ లేని చోట తను నిలబడి వుండాలి, బతకాలి. తన వాళ్ళెవరూ లేకేం? అవటానికి మేనత్తా, మేనత్త కొడుకూనూ. అంతా తన వాళ్ళే కోడలయింది గనుకా, పెళ్ళామయింది గనుకానూ ఈ మాటలన్నీనూ. మేనత్త కదా అని ఏమన్నా వెనకేసుకి వచ్చిందా? పెట్టవలసిన మంగళ హారతులన్నీ పెట్టి వదిలింది కాని.

ఆంజనేయులుకి ఏమి తోచలేదు. సరే అన్నాడు. బరువుగా బైటికి వెళ్ళాడు. తీసిన చీరలూ అవీ మంచం మీదే వున్నవి.

ఆంజనేయులూ, స్నేహితులూ వచ్చారు. నాటకాల మాటలే చెప్పుకుంటూ భోం చేశారు.

భోజనాలు కాంగానే ఆంజనేయులు గదిలోకి వెళ్ళాడు. మంచం మీద రామసీత పడుకొని వుంది. లోపల్లోపల ఏడుస్తోంది.

"నిన్నే–"

తలెత్తలేదు. ఆమె బయట ఏడిగా చూపించే వినయం గదిలో చూపబడదు.

"నా మాట వినవూ"

"నే విన్నండీ!"

"నిజం?"

".........."

"రావూ నాటకానికి?"

".........."

"నీ ఖర్మ–"

ఆంజనేయులు వెళ్ళిపోతున్నట్టు నటించాడు.

"ఖర్మే మరి–"

ఆంజనేయులు ఇక ఆగలేక పోయాడు. బైట స్నేహితులు కాచుకున్నారు. వాళ్ళేమనుకుంటారు?

"లే అన్నం తినులే"

రామసీత అట్లాగే పడుకుంది. ఆంజనేయులు నించునే వున్నాడు. గదిలో నించోడం చిరాగ్గా వుంది. భార్య పడుకుని మాట్లాడుతుంటే తాను నుంచుని మాట్లాడటం పురుషుడికో సరదా, ఎప్పుడు? తను కోరుకున్నప్పుడు. విశాలమానవత్వం చిలకల్లే వచ్చి వాలుతుందే అప్పుడు. కోపం వచ్చినప్పుడో– ఎందుకూ ఆ మాట?

రామసీత కాలి పట్టా గొలుసు మెరుస్తోంది. చీలమండలకు పైగా ఆమె కాలు పట్టుకొని ఎత్తి వొదిలేశాడు. తక్కుమంది. మంచం పట్టికు కొట్టుకుంది. రామసీత ఏడుపు దిగమింగ లేక పోతోంది.

"లే– అన్నం తినూ"

రామసీత మాట్లాడలేదు.

"ఆంజనేలూ!"

వాకట్లో స్నేహితులు. ఆంజనేయులు చీరలూ, అవీ తీసుకున్నాడు. వెక్కి వెక్కి ఏడుస్తూ మొహం చాటు చేసుకున్న భార్య కేసి చూడకుండానే వెళ్ళిపోయాడు.

రామసీత ఆ రాత్రి అన్నం తినలేదు. అలిగి పస్తు పడుకుంది.

"ఇంతమంది తినగా లేంది నీవు రావేమే" అని అత్తగారు అనిపోయింది.

ఆ రాత్రి నాటకం అభాసు అయింది. గొడ్ల పాకను హాలు చేశారు ఆడారు. ఆంజనేయులు బలవంతం మీద ఆడిస్తున్నాడు ఈ నాటకాలు. అతనికి నాటకాలు ఆడించడం సరదా. రంగేసుకుని తనుంచటం, మాట్లాట్టం, పోజులు పెట్టడం ఇవన్నీ అతన్ని ఉత్సాహపరుస్తవి. ఎప్పటికయినా స్థానం నరసింహారావంత కావాలని అతని ఉద్దేశ్యం. ఆ పల్లెటూర్లోనే నలుగుర్ని పోగుచేసి, నలుగుర్ని రప్పించి నాటకాలు ఆడుతున్నాడు. మొదట్లోనే హంసపాదు, మొదటి నాటకమే మట్టి కొట్టుకు పోయింది.

ఆ పాత నాటకాలే కావడం, వాటినైనా చక్కగా ఆడలేక పోవడం, రోజూ ప్రత్యక్షమయ్యే వాళ్ళే కావడం, అన్నింటి కన్నా వీటి మీద అసహ్యం పెరగడం– ఇలాంటి కారణాల వల్ల అవి ఎక్కి రావడం లేదు. అతను చిన్నప్పుడు బస్తీలో చదువుకున్నాడు. ఇతని చదువుల కోసం కాపరం బస్తీ కెక్కింది. కొడుకు చదివి ప్రయోజకుడౌతున్నాడన్న ఉబలాటం ఏ తల్లికుండదు? కనకమ్మకూ వుంది" వాడికేమే మహారాజు. తను సుబ్బరంగా ఇంత తింటాడు. నలుగురికి పెడ్తాడు. చాపా చెడ్డా చదరకు లోటుండదు అన్న ధీమా వుండేది ఆవిడకు. ఇది కాస్త దాచుకునేది కూడా కాదు. నలుగురిలోనూ అనేసేది. నలుగురూ విని ఏమనుకుంటారో అని ఆమె అనుకునేది కాదు. భోంచేసి, టక్కున వక్కపలుకు కొరుకుతూ, కిరీటం సవరించుకుంటూ ఆవిడ ఈ మాట అంటుంటే– ఆమెకు మహేంద్ర పదవి వొరిగినట్టుండేది.

ఆంజనేయులుకు ఉండేది ఇది. పైగా తల్లి కూడా అంటోంది. వొళ్ళు వంచి చదవక పోతేనేం– తను ఫైన్ కాగలడు. అయినా వెధవ చదువు. ఎప్పుడూ పుస్తకాలు రుబ్బటం మాత్రం– ఛీ! అతనికి చేతకాదు. ఒరిజినల్‌గా థింక్ చెయ్యాలి. అంతేకానీ, రుబ్బి పరీక్షలు ప్యాసు కావడం అంటే అతనికి నామర్దా. గేమ్సు ఫీ కట్టినందుకుగాను, అతను దాన్ని

అపర్ణాసేన్ 'సతి'లో షబ్నా

ప్రముఖ దర్శకురాలు అపర్ణాసేన్ దర్శకత్వంలో తయారైన 'సతి' చిత్రం మాంట్రియల్ ఫిల్మోత్సవానికి వెళ్లిందట.

చిత్రం విడుదలకు నోచుకోకముందే మాంట్రియల్ ఫిల్మోత్సవంలో ప్రదర్శనకు వెళ్లిందంటే దర్శకురాలి ప్రతిభ ఏపాటిదో వూహించుకోవచ్చు.

ఈ చిత్రంలో ప్రముఖ నటి షబ్నా అజ్మీ నటించిందట.

షబ్నా - అపర్ణాసేన్‌ల కాంబినేషన్‌లో తయారైన ఈ చిత్రం మాంట్రియల్ ఫిల్మోత్సవంలో అందరి ప్రశంసలు పొందగలదనటంలో సందేహం లేదంటున్నారు. మరి మనదేశంలో ఎప్పుడు విడుదలవుతుందో?

ఒక్క దణ్ణం

సార్థక పరిచే వాడు. రోజూ ఫుట్‌బాల్ ఆడో, మరేమన్నా చేసో దెబ్బ తగిలించుకు రావటము, ఐదో ఫారం పట్టించుకోకమూ పరిపాటి అయింది. మూడు నాలుగేళ్ళు చదువు గుంట పూలు పూసింది "చావ చెడ్డా చదరు" అన్న ధీమా పెరిగింది. చివరికి పేకాటలో మునిగితేలి, ధూమ యజ్ఞంలో నిష్ణాతుడై రోగాలు తగలడం తరువాయిగా మళ్ళీ స్వగ్రామం చేరాడు. సైకిలు ఎప్పగలడు. మళ్ళీ అతకగలడు. పేకాటలో మంచి ఫామేధా సప్తయజ్ఞం చేసినట్లు ధూమయజ్ఞం చేయగలడు.

స్వగ్రామం వచ్చేకే ఆంజనేయులు ఔపోసన కార్యం జరిగింది. రామసీత కాపరానికి వచ్చింది. మొదట్లో మేనమామ ఏమంటాడో అని అతను అనుకునేవాడు. కాని, పిల్ల నిచ్చుకున్న తరువాత మేనమామ మామగారైనాడు. భూమ్మీద అల్లుళ్ళు మామగారిని గౌరవించడం అపురూపం. గనుక, అతను మామగార్ని సమాన ఛాయలో జమకట్టి భయభక్తుల్ని విడి చేసేవాడు. ఖుషీగా తిని తిరుగుతుండేవాడు.

ఈ పరిస్థితిలో రామసీత కాపురానికి వొచ్చింది.

తన అన్న తన మొగుణ్ణి తేలిగ్గామాట్లాడుతుంటే రామసీతకు మొదట్లో గమ్మత్తుగా వుండేది. తరువాత్తరువాత అన్న అబద్ధాలాడుతున్నాడనుకునేది. చివరికి ఇంత ఘోరకలి ఉందనుకునేది. సహజంగా మొగుడి పక్షమ్మే అయింది. తను మొగుడు పక్షం మాట్లాడటం బాగుండదు కనుకా, సిగ్గు సహజంగా అలుముకుని వుండేది గనుకా ఆమె పెదవి విప్పి మాట్లాడేది కాదు. కాని, మనస్సు మాత్రం మొగుడి పక్షమే వుండేది.

తీర కాపరానికి వొచ్చాక చూస్తే ఇది. చీట్లపేక ఆడటంలో తన మొగుడు మునిగి తేలి వుంటే ఆమెకు కష్టం వేసింది. ఇంట్లో పదిమంది వున్మాయి జగ్గాయి గాళ్ళను చేర్చి వాళ్ళతో అంతూ పొంతూ లేకుండా పడివుంటే ఆమె మనసు ఒకలాగయింది. సొంత మేనత్త అయి కూడా, అత్తగారు అల్లా వుంటే ఇంకా కొట్టినట్టు అయింది. చివరికి నాటకాల్లో వేషం వేస్తానని మొగుడు అన్న రోజున తల తీసేసినట్టు అయింది. అన్నగారు అన్న మాటల్లో ఒక్కటీ అబద్ధం లేదు. తెలీక తను అన్నను నానా మాటలు అంది.

నాటకం పూర్తి అయిన మర్నాడు ఆంజనేయులు తనలో తాను లేదు. ఓడిపోయిన బిక్కకోపం అతనికి వచ్చింది. అంతుచూద్దామని నిశ్చయించుకున్నాడు. ఏమయినాసరే ఇందులోనే తను ఫైన్ కావాలి. యిదేం తక్కువదా? తెలీక తన భార్య వద్దంటూందికాని వెధవ మంకుపట్టు పట్టుక్కూర్చుని నాటకానికి రాలేదు గాని, వచ్చివుంటే అదీ తనతో కలిసేదే.

ఓ నిద్ర తీసి లేవాక, రామసీత దగ్గరికి వొచ్చింది.

"తింటానికి ఏమన్నా తేనా?"

రామసీత ఎంతో ముద్దుగా అడిగింది. ఆంజనేయులు ఈ ముద్దును అర్థం చేసుకున్నాడు. సంతోషంతో అతని కళ్ళు సగం మూతలు పడ్డాయి.

"ఏమున్నై?" అన్నాడు.

"అటుకులు పాలల్లో వేశా"

ఆంజనేయులు కళ్ళు ఎగరేశాడు. 'తే' అన్నాడు.

హంస నడిచినట్టు నెమ్మదిగా నడిచి వెళ్ళింది రామసీత. తీసుకొచ్చింది. మంచానికి ఆనుకుని కింద కూచుంది.

"దా" అన్నాడు ఆంజనేయులు.

రామసీత నవ్వింది. నెమ్మదిగా అటుకుల్ని కాస్త కాస్త తీసి అతని నోట్లో పెట్టింది. అటుకుల గిన్నె తను తీసుకున్నాడు. నిశ్శబ్దంగా, నెమ్మదిగా తిన్నాడు. ముద్దులైనా కాస్త తనకి పెడ్తాడనుకుంది రామసీత. ఒక్కసారి చురుగ్గా చూచింది. ఆంజనేయు లిదేమీ గమనించనే లేదు. నెమ్మదిగా సిగరెట్టు తీసి అంటించాడు.

"ఇవి మానకూడదండీ!"

ఆంజనేయులు నవ్వాడు. 'పిచ్చిబొందా, నీ మాట నేను వింటానుటే' అన్నట్టు అర్థమయింది ఆమెకు.



టి.వి. సీత (దీపిక), టి.వి. ద్రౌపది (రూపాగంగూలీ) నువ్వు అపవిత్రురాలివంటే నువ్వు అపవిత్రురాలివని ఒకరిమీద ఒకరు ధ్వజమెత్తుతున్నారట.

సీత x ద్రౌపది

'రామాయణ్' సీరియల్ ప్రసారం అవుతున్న సమయంలో సీత బాగా పాప్యులర్ కావటం, రూపాగంగూలీ ఆ స్థాయికెదగక పోవటం తెలిసిన విషయమే. అప్పుడు పైస్థాయిలో వున్న దీపిక- రూపాను చిన్న చూపుచూసేదట.

ఇప్పుడు బాగా పాపులర్ అయిన ద్రౌపది (రూపా) కాల్షీట్లు లేక ఖాళీగా వున్న సీత (దీపిక)ను చూసి పరిహసిస్తోందట.

ఈ రెండు పాత్రలు (ద్రౌపది సీత) చాలా వైవిధ్యమున్నవి అని యిద్దరూ సరిపెట్టుకోవటం లేదు సరికదా తాను సీతాదేవిరూపంలో వున్న పవిత్రురాలినని, కౌరవులచేత అవమానింపబడిన ద్రౌపది అపవిత్రురాలని అంటోందట దీపిక.

దీపిక వ్యాఖ్యకు ఒళ్లుమండిన రూపా-రావణుడి దగ్గర వున్నప్పుడు ఏమైందో సీత పవిత్రత అని మాటలతో కక్ష తీర్చుకుందట.

ఒకరిమీద ఒకరు ఆడిపోసుకోవటం మాని వెండితెర మీద కనబడేందుకు ఎందుకు ప్రయత్నించరు వీళ్లిద్దరూ అంటూ గోల



పెడుతున్నారట పెద్దలు. మరి ఎన్నాళ్లిలా వీళ్లిద్దరూ ఒకరిమీద ఒకరు కత్తులు దూసుకుంటారో?

నెమ్మదిగా ఖాళీ గిన్నె తీసుకుని లోపలికి వెళ్ళింది.

* * * * * *

"నేను వినయపూర్వకంగా రొట్టె కోసం వేడుకున్నా. నాకో రాయి లభించింది. ఆంగ్ల జాతి బల ప్రయోగానికి మాత్రమే లొంగుతుంది. భారత జాతికి తెలిసిన ప్రజా శాంతి ఒక్కటే. అది పెద్ద ఖైదు. భారతదేశం ఒక పెద్ద కారాగృహం. నేనీ బ్రిటిషు శాసనాన్ని ధిక్కరిస్తాను. వైస్రాయి కోరే శాంతి, విసుగు పుట్టించే శాంతి. ఆ నిర్బంధ శాంతి మూలంగా భారత జాతి కూపిరాడుట లేదు" అని గాంధీజీ వ్రాశారు.

దండీయాత్ర తప్పనిసరి అయింది. తన వెంట వచ్చే పాదచారులతో దండియాత్ర సాగింది.

ఊరూరా సభలు జరిగై. స్త్రీలు, పురుషులు, పసిబిడ్డ బాలాడీ కదిలారు. తఖీలీలు వడుకుతూనే సభలకు వొచ్చేవారు. లాఠీ దెబ్బలు తిన్నారు. "స్వరాజ్యం కావాలా? ఐతే ఇదిగో లూటీ" అని పోలీసులు ప్రజల్ని పలకరించేవారు. స్త్రీలు, పురుషులు ఉద్యమంలో కెళ్లారు. ఉప్పు తెచ్చారు. తాళ్ళు కొట్టారు. పికెటింగ్ చేశారు. అరెస్టయ్యారు. జైళ్ల కెళ్లారు. భారత భూమిలో దాదాపు డెబ్బయియిదు వేల మంది శ్రీకృష్ణ జన్మస్థానాన్ని అలంకరించారు. తిరిగి వొచ్చారు. ఉప్పు సత్యాగ్రహంలో దేశ జీవనంలో నే మార్పు వచ్చింది.

గాంధీజీ హరిజనుల కోసం ఉద్యమించాడు. అవీ రోజులు.

రామసీతకు గర్భం వొచ్చింది. కడుపుతో వుంటే కాకైనా అందంగా వుంటుందంటారు. రామసీత అసలే అందగత్తె ఏమో మరింత అందంగా వుంది.

ఆంజనేయులులోనూ మార్పు వచ్చింది. అతను రాట మొకటి ఇంటికి తెచ్చాడు. రోజూ పేపరు తెప్పిస్తున్నాడు.

ఇంట్లో శాంతి వాతావరణం వస్తోంది. అప్పుడప్పుడు పేపర్లో పడ్డ జరిగిన విషయాలు ఆమెకు చెప్తుండేవాడు. రామసీత నమ్మేదికాదు. కాని మొగుడి గొంతికలో నిబ్బరం, నిశ్చలత్వం చూచి నిజమే కాబోలు అనుకునేది.

ఆంజనేయులు రాటం వొడుకుతాడు. హరిజనులను చూచి దూరంగా తప్పుకోడు. వాళ్లను ఊత తిట్లు తిట్టడు. మనిషి మారుతున్నాడు. చాటుగా ఓనాడు "వాళ్లను అలా పూసుకు తిరగవచ్చు" అనడిగింది మొగిడ్ని రామసీత.

"ఏం వాళ్ళు మాత్రం మనుషులు కారూ?"

"మనుషులు కాదన్నానా, వాళ్లను ముట్టుకోకూడదుగా."

"అవన్నీ అబద్ధాలు. గాంధీగారు ఏం చెప్పారు?"

"ఆ పటంలో వున్న అయనేనా" అంది.

పటం నిదానంగా చూచింది.

రామసీత చాలాసేపు నిదానంగా ఆలోచించింది. అప్పట్నుంచి పాలేరు కుర్రాళ్లనూ, చాకలిదాన్ని ఎవర్నీ కోప్పడ్డం, కసరటం మానుకుంది.

ఆంజనేయులు హరిజనుల్ని గుళ్లలోకి రానివ్వాలని నలుగురితో అనడం ప్రారంభించాడు. నలుగురూ తలో మాట అన్నారు. నలుగు రైదుగురు చేసావులే నిర్వాకం కట్టిపెట్టు అని సలహా ఇచ్చి చక్కాపోయారు. యాదవ ముసలం పుడుతుందన్నారు శాస్త్రులుగారు.

ఆంజనేయులు విడిచిపెట్టలేదు.

భగవద్గీత తెచ్చాడు. చూపించాడు. శాస్త్రుల్లుగారేమన్నారంటే "ఇదంతా నిజమే. ఈ యుగంలో మాట కాదిది" అన్నారు. బహు నెమ్మదిగానే అన్నారు.

"ఐతే ఎందు కిది" అని నేల్నెట్టి కొట్టాడు ఆ పుస్తకాన్ని ఆంజనేయులు.

దాంతో శాస్త్రులు చక్కాపోయాడు.

"పెద్దవాడితో నీ కెందుకురా" అంటూ కనకమ్మ వచ్చింది.

"పెద్దతనం దక్కించుకుంటేనే పెద్దతనం నిలుస్తుంది" అన్నాడు ఆంజనేయులు.

"బిడ్డా పాపా కలవాళ్లం భగవత్‌గీతను నేల్నెట్టి కొట్టొచ్చురా" అన్నది ముసలావిడ.

రామసీత కడుపుతో వున్నప్పటినుంచీ యింట్లో తొట్టి మంచం వేసినట్టుగానే అనుకుంటోంది ఆవిడ. ఆంజనేయులు శాంతించి మళ్లీ రాటం దగ్గరికి వెళ్లాడు. పది పోగులన్నా తీయలేకపోయాడు. ఆసు తీసుకొచ్చాడు. ఎనభై పోగులూ పోసి ముడి వేస్తూ కూచున్నాడు. కనకమ్మ పక్క ఇంటికి పెత్తనానికి వెళ్ళింది. రామసీత వచ్చి పక్కనే కూచుంది. ఆంజనేయులు తలెత్తి చూచాడు.

"వాళ్లను గుళ్లలోకి రానివ్వాలా?" అంది.

"వాళ్లకు మాత్రం దేముడు కాదూ"

"రానిస్తే విగ్రహం మైల పడిపోదూ"

"మనిషి వొస్తే విగ్రహం మైలపడుతుందటే పిచ్చిదానా? యివన్నీ మనం పెట్టుకున్న అడ్డంకులు. మనుషులందరూ ఒకటే, అందరికీ అన్ని నీళ్ళు వుండాలి" అన్నాడు.

రామసీత ఆలోచిస్తూ కూచుంది. నిజమే కష్టం సుఖం అందరికీ ఒకటే.

"ఐతే అందరూ గుళ్లోకి పోవచ్చా".

"ఆ".

చిలప పూర్తి అయింది. నెమ్మదిగా ఆసు నుంచి చిలప తీశాడు. బరువు నిట్టూర్పు విడిచాడు. "నేనోటిచెప్తా వినవే- మనం పోవచ్చు కదా గుళ్లల్లోకి? రోజు పోతున్నామటే? మనం పోం, పోతానన్న వాణ్ణి పోనీం" అన్నాడతను.

"పోకేం పోతున్నాంగా ముక్కోటికి".

"ముక్కోటి శివరాత్రీనూ! మిగతా రోజులో....?" నవ్వాడతను లేచాడు. రామసీత లేచింది. బుడ్లలో చమురు పొయ్యాలి. సందె కసవు వూడ్వాలి. బుడ్లలో చమురు పోస్తూ ఆలోచించుకుంటోంది. "మనం వెళ్లొచ్చు గదా గుళ్లల్లోకి? రోజు వెళుతున్నామటే-" అన్నమాట రామసీత చెవుల్లో మోగుతోంది.


ఇక నుంచీ శుక్రవారం అమ్మవారి గుళ్లోకి వెళ్లాలి.

కనకమ్మ వచ్చింది. సందె కసవు వూడ్చి ముగ్గులు వేసి వుంది. తను వేస్తుందిగా. నెలలు వస్తున్నాయి కదా. ఏం అంత తను వెయ్యకపోతే? "అంత తొందరేమొచ్చిందమ్మా రానా, వెయ్యనా?" అంది. రామసీత తలెత్తి చూసింది.

"శుక్రవారం శుక్రవారం గుళ్లోకెళదామా అత్తయ్యా" అంది.

"వెళ్లినట్టే వుంది. అంత మాత్రం గీత కూడానా? మనబోటి వాళ్లకు కైలాసం" రామసీత యీ మాటా శ్రద్ధగా వింది.

అవును. అన్నయ్య ఇదే అన్నాడు. "గుడీగిడి



మీరు పొండి నేను చేలోకి పోతా నాకు చేనే దేముడు అంటాడు అన్నయ్య.

స్నానం చేసి వొళ్ళు తుడుచుకుంటుంటే మరొకటి తట్టింది.

"అసలు గుళ్ళోకి వెళ్ళకపోతేనేం? జరగదా? ఇప్పుడు మాత్రం అందరూ వెళుతున్నారా?దేముడు ఏమన్నా చేస్తే? ఏమిటో నమ్మా. నాకెందుకొచ్చింది? అనుకుందిమళ్ళీ. ఉతికిన చీర, రెవికతో వచ్చి మిఠాయి పొట్లంలాగా కూర్చుంది. ఆలోచన సాగుతూనే వుంది.

వాళ్ళు మరీ అసహ్యంగా వుంటారు. మురికి వోడుతూ వుంటారు. పది చీరలు లేకపోతే తను మురికి వోడుతూనే వుంటుంది. ఈ మాట తోచగానే ఆమె మనసు జలదరించింది. యిహ ఇది ఆలోచించుకోకూడదనుకుంది.

ఆంజనేయులు వొచ్చాడు. భార్యాభర్తలిద్దరూ ఏకపంక్తిన భోజనం చేశారు. గర్భిణి అయినప్పటి నుంచి రామసీత మొగుడితో పాటే అన్నానికి కూచుంటోంది. అన్నం తిని గదిలోకి వెళ్ళింది. నిద్ర పట్టలేదు. సాయంత్రం వచ్చిన పేపరు చదువుకుంటున్నాడు ఆంజనేయులు.

"ఏమండీ, గుళ్ళలోకి వెళ్ళకపోతేనేమండీ!"

"ఏం వెళ్ళకపోతే-" అన్నాడు పరధ్యానంగా.

"ఇతే గిరిజనులకు గుళ్ళు తెరవకపోతేనేం?"

"అమ్మయ్యో అది చేసి తీరాలి".

"దరిద్రులకు అన్నం బట్టా తృప్తిగా వొచ్చేట్లు చేస్తే చాలదా?"

ఆంజనేయులు ఇది ఆలోచించలేదు. భార్య కొత్తగా మాట్లాడుతోందనిపించింది. అతనేమి సమాధానం చెప్పలేదు. ప్రోత్సాహకరంగా మాట్లాడబట్టి, కాస్సేపు చూచి రామసీత అటు తిరిగి పడుకుంది.

రాత్రి అంతా నిద్ర పట్టలేదు. తెల్లారింది. అన్నా, వొదినా వొచ్చారు. చలిమిడీ అదీ తెచ్చారు. పురిటికి తనని తీసికెళ్ళడానికి వచ్చారు. అన్ననూ, వొదిన్నీ చూడగానే రామసీత మొహం చాటంతయింది. విచ్చిన పెద్ద చామంతి పూవులా వుంది ఆమె.

వొదినగారూ, పక్క ఇంటి ఆవిడా సూడిదలు నలుగురికీ పంచారు. ప్రయాణం. తల్లి "నాదేముంది నాయనా, మీ ఇష్టం, మీ బావ యిష్టం". అంది- కొడుకు నాదేముంది. మీ చెల్లెలి యిష్టం, మీ మేనత్త యిష్టం" అన్నాడు. వొచ్చుందాలతో ఆ రోజుకి ప్రయాణం చెడింది.

"ఏమండీ"

ఆంజనేయులు తలెత్తి చూచాడు.

"మిమ్మల్నే"

"ఏం"

"మిమ్మల్ని విడిచిపెట్టి వెళ్ళటం అంటే ఏమిటో గా వుందండీ!" అంది రామసీత.

అమితాబ్‌తో నీలమ్



'బి' గ్రేడ్ చిత్రాల్లో నటించకూడదనుకున్న నీలమ్‌కు ఏదైతే తాను సంపాదించాలనుకున్నదో అది సాధ్యపడిందట యిప్పుడు. అమితాబ్ బచ్చన్, మిధున్ చక్రవర్తిలతో రెండు చిత్రాల్లో నటిస్తోందట. అంతకు ముందు 'బిల్లో బాద్‌షా' చిత్రంలో నిర్మాత తనను మోసం చేశాడని, గోవిందకు యిచ్చినంత అవకాశం కూడా తనకు యివ్వలేదని ఆరోపించిన నీలమ్ మరి ఈ 'ఎ' గ్రేడ్ చిత్రాల్లో ఏ విధంగా నటిస్తుందో వేచి చూడాలి!

ఆంజనేయులు నవ్వాడు. ఆ నవ్వు గమ్మత్తుగా వుంది.

"ఏం నవ్వుతారు" అంది.

"లోపల వెళ్ళాలనేమో తొందరున్నా, పైకి పై పై ప్రేమలూనూ".

రామసీత మనసు చివుక్కుమంది. తను ఎంత ప్రేమగా అడిగిందో అంత ప్రేమగా అతను వుంటే అయ్యో రాతా! స్త్రీ పురుషులు కోరుకొనేది ఇదే. సామాన్యంగా లభ్యం కానిది ఇదే.. వెళుతూ కూడా నొప్పి తోటే వెళ్ళాలని రాసుంది కాబోలు అనుకుంది. వొచ్చిన వూహను ఆమె మింగింది.

"ఈ మాటలకేం కానీండి-"

"అంత వచ్చి అబద్ధాలా?"

రామసీత ఏమీ అనలేదు. హరీ లేదచ్యుతా లేదన్నట్టు వూరుకుంది. ప్రేమ వుంటే ఏమన్నా అనవచ్చుగాని ప్రేమ కరువైన చోట 'ఆ' అంటం అన్యాయం. 'నారాయణా' బూతు మాటే.

"ఏమండీ తీరుబడైనప్పుడు నన్ను చూడటానికి రారూ?" అంది మళ్ళీ.

"ఎప్పుడూ నాకు తీరుబడేగా!"

లాభంలేదు. ఎత్తు ముదురుతోంది. రామసీత కట్టి పెట్టింది. రామసీత ప్రయాణం అయింది. వెళుతూ వెళుతూ గాంధీ బొమ్మ దగ్గర ఆగింది. ఆ బొమ్మను చూస్తుంటే ఆమెకు ఏదో శాంతంగా వుంటుంది. దరిద్రనారాయుడి బొమ్మను తీసుకెళ దామనుకుంది. తరువాత వేరే కొనుక్కోకూడదా అని అనుకుంది. నిద్రపోతున్న మొగుణ్ని లేపి చెప్పింది. అతను నిద్ర మత్తులోనే తల వూపాడు. అత్తగారితో చెప్పింది. "సుఖంగా వెళ్ళి లాభంగా రామ్మా" అంది. మళ్ళీ గదిలోకి వచ్చింది. మొగుడు లేస్తాడనీ, కొంత దూరం వస్తాడనీ, అనుకున్న ఇది రాత్రే పోయింది. మళ్ళీ చెప్పి రావటానికి వెళ్ళింది లేపింది.

వెళుతున్నా" అంది ముద్దుగా.

అతను తలెత్తి సరే అన్నాడు. ఆమె చిన్నపుచ్చుకుంది. నవ్వుతూ సంతోషంగా పుట్టింటికి వెళ్ళే ఇది తనకు లేదు అనుకుంది.

"గాంధీగారి పటం తీసికెళ్ళనా?" అంది. లేచి "వొద్దు నాకు ఉండాలి అంటాడనుకుంది."

"ఊ" అన్నాడు మొగుడు.

పటం దగ్గరికి వెళ్ళింది. "ఇక్కడే ఉండనీ, వేరే కొనుక్కుంటాలే అనుకుంది. బండి ఎక్కింది. బండి కదిలింది.

"అత్త వెళుతోంది. అత్త వెళుతోంది అంటూ రాముడు ప్రక్కింటి వారబ్బాయి నాలుగడుగులు వచ్చాడు.

★ ★ ★ ★

రామసీత చురుకైన పిల్ల. కిలకిలా నవ్వుతుంది. అన్యాయం అని తోస్తే ఎంత వారినయినా ఉన్న మాట అనేస్తుంది. ఎంత ఆకాశం విరిగి మీద పడుతున్నా తొణకదు. కలుపుగొట్టుతనంగా వుంటుంది. అలాంటిది బండి కదిలాక కూడా స్తబ్బుగా వుండేటప్పటికి వొదినగారు ఆశ్చర్యపడింది.

"అత్తవారింట్లో చాలా మారావమ్మా!" అన్నదామె రామసీతను. రామసీత నవ్వింది.

"నేను గ్నాపకం వున్నానటమ్మా?" అన్నాడు బండి తొట్లోంచి నాంచారి.

"ఎందుకు జ్ఞాపకం ఉండర్రా" అంది.

"కోడె దూడ పెద్దదయిందా?" అంది.

"ఆ"

"ఏరా అన్నయ్యా-" అంది అన్ననుద్దేశించి. మళ్ళీ ఆగింది.

"ఏమిటీ-" అన్నాడు అన్న.

"అబ్బే ఏంలేదూ" అంది.

అన్నా వొదినా మొహాలు మొహాలు చూచుకున్నారు.

పుట్టింటికి చేరింది. "రామసీతొచ్చింది, రామసీతొచ్చింది" అని నలుగురు అమ్మలక్కలూ

అనితారావు ప్రతిభ

తమ క్రీడాకారుల ప్రతిభను చూసి కోచ్‌ల ముఖాలలో ఆనందం వెల్లివిరియటం సహజమే. కాని తన కోచ్ ముఖంలో ఆ నవ్వు మాయం కాకుండా ప్రతిభను చూపగల క్రీడాకారిణి అనితారావుట.

5.2" అడుగుల ఎత్తువుండే ఫుట్‌బాల్ ఛాంపియన్ అనితారావు ప్రతిభ కోచ్‌రాల్ఫ్ ఎంజెల్ మెయర్‌ను సంతృప్తి పరుస్తోంది.

దాదాపు తన జీవితంలో సగభాగాన్ని ఫుట్‌బాల్ ఆటకే అంకితం చేస్తున్న రావ్ హైస్కూలు స్థాయి నుంచే తన ప్రతిభను కనబరుస్తోంది. ఈమె ప్రతిభనుచూసి మెచ్చి ఎంజెల్ మెయర్ ఆమెను తనశిష్యురాల్ని చేసుకున్నాడు.

తన శిక్షణలో మంచి క్రీడాకారిణిగా చేసియిప్పుడామె ఆటలో చూపే నేర్పరితనాన్ని చూసి ఆనందంగా నవ్వుకుంటున్నాడు.

ఫుట్‌బాల్‌నే కాకుండా ఈమె టెన్నిస్ కూడా ఆడగలదట. సబర్బన్‌సౌత్ కాన్ఫరెన్స్ టైటిల్‌ను కూడా గెలుచుకుంది.



ఈ రెండు ఆటల్లోనూ చాలా తేడాలున్నప్పటికీ, ఒకే విధమైన ఉత్సాహాన్ని చూపిస్తానంటోంది. టెన్నిస్ ఆటను అఫెన్సివ్‌గా ఆడుతానంటూ, ఈ ఆటలో వ్యక్తిగతమైన ఒత్తిడికి లోనుకావాల్సి వుంటుందని, కాని ఫుట్‌బాల్ ఆటలో జట్టును దృష్టిలో వుంచుకోవాల్సి వుంటుందని అనితారావు తన మాటల్లో చెప్తోంది.

తాను ఎత్తుగా లేకపోయిన కారణంగానే బాస్కెట్‌బాల్ పట్ల ఒక విధమైన అయిష్టత చూపుతున్నానని, రెండు ఆటలు (అంటే ఫుట్‌బాల్, టెన్నిస్) ఆడుతూ వుండే తాను మరో ఆటమీద దృష్టి మళ్లించటం అంతతేలికైన పనికాదని, అయినప్పటికీ కృషి చేసి, దానిలో కూడా ప్రతిభ చూపేందుకు ప్రయత్నిస్తానంటోంది ఉత్సాహమే ఊపిరిగా తలచే 'అనిత' ఆనందంతో!

ఇటువంటి ఉత్సాహవంతులైన క్రీడాకారులు వుంటే కోచ్‌లకు ఎప్పుడూ ఆనందమే మరి!

చేరారు.

రామసీత వచ్చిప్పటి నుంచీ పనిపాటల వాళ్లను ఏమన్నా మాట అనదు. అననీదు.

చాకలామె రోజువారి వుతుక్కు వచ్చింది. "ఏమే-" అని వొదిన పిలిచింది. వెంటనే వెళ్లింది రామసీత. "వాళ్ళూ మనలాంటి వాళ్లే వొదినా. ఎందుకలా అంటావ్-" అంది. వొదినా, చాకలామె ఇద్దరూ తెల్లబోయారు.

చాకలామె బట్టలు తీసుకు వెళ్లిపోయాక వొదినగారు దొడ్లోపడి రుంజుకుంటోంది.

"ఏమన్నావే ఏమిటే?" అని తల్లి అంది.

"ఏమీ అనలేదే-"

"ఏమో మరి దొడ్లోపడి సణుక్కుంటోంది" అంది ఆమె.

రామసీత నేరుగా దొడ్లోకి వెళ్లింది.

"ఏమమ్మా నేనేమన్నాననీ-" అంది.

"నేను మాత్రం ఏమన్నానమ్మా"

"వాళ్ళూ మనలాంటి వాళ్లు అన్నందుకేనా ఇంత ఇదీనూ" అంది రామసీత.

"దాం దుంప తెగిరి! దాన్ని ముందు పెట్టుకొని అంటేగానీ తోచటల్లేదటమ్మా"

"........"

"ఇక మళ్లీ అనగలమా. అలుసుకామటమ్మా, నువ్వు చెప్పు"

"మాట అనగాలేంది, అలుసౌతామనేనా అమ్మా" అంది రామసీత.

"పురెక్కించకు తల్లీ. ఇప్పటికే వాళ్ల కళ్లు నెత్తిమీదికొచ్చె. నీబోటి వాళ్లు కూడా కలిస్తే" అందామె.

"మడి కట్టుకొని మంచి నీళ్లు తెచ్చుకుంటున్నాసరే. కాస్త దూరంగా పొండ్రా అంటే - అమ్మో, వాళ్లు వింటారా? ఎదురు నవ్వుతారు. నీ దారిన నీవు పోమ్మా అంటారు" అంది వొదిన. వాళ్ల పల్లదనం చూచావా అన్నట్టు.

"పాపం" అంది రామసీత.

"ఈ ఇది సాయంత్రందాకా నలుగు పడింది. పెద్దలు నలుగురు అలా అనకూడదని రామసీతనే కోప్పడ్డారు.

పాలేళ్ళు, చాకలామె మొదలయిన వాళ్లు ఆమెతో కష్టాలు, సుఖాలు చెప్పుకునేవారు. చిరుగుల చీరతో పాలేరు నాంచ పెళ్ళాం కూతురు వస్తే తన చీరల్లో కాస్త గట్టిది చూచి ఇచ్చింది. నల్లరాయిలాంటి వాళ్ల ఎదాన కొట్టిందని ఆరోజు మాట పడిందామె. "ఇస్తే ఇచ్చావులే మీరు కూడా ఇవ్వరాదూ" అంది.

క్రమక్రమంగా నెలలు నిండుతున్నాయి. "నీకెందుకు, నువు కూచోవే" అన్నా, పనిలో కొచ్చేది. "కూరలు తరగడమైనా సరే చేస్తాను. ఊరికే కూర్చుని తింటం తప్పుకాదూ" అనేది.

మొగుడు చూడ్డానికి రాలేదు. ఉత్తరమన్నా రాయలేదు.

వోసారి రమ్మని రాయిద్దామని ఆమె చాలా అనుకుంది. ఎటూ పోయి ఎటు వచ్చి వికటిస్తుందో అనీ అనుకుని ఊరుకుంది.

మొగుడు ఒక్కసారన్నా వచ్చి మనసారా మాట్లాడితే చాలా సంతోషించేది. నిజమే, కొన్ని ప్రాణులు సంతోషించడానికీ, సుఖపడటానికీ పుట్టవు. సుఖానికై వెంపరులాడుత్తై గాని, సుఖం అనేది దక్కదు. ఆరాటమే మిగులుతుంది.

మొగుడు ఉత్తరం ముక్క రాయడని తేల్చుకుంది.

తాను రాద్దామని నిశ్చయించుకుంది. తప్పేంలేదుకదా. మొగుడికి పెళ్లాం రాయడం తప్పా? ఉత్తరం ఎల్లా రాయాలో తోచలేదు. ఎలా ప్రారంభించాలో ఎంత సేపటికీ అంతు పట్టలేదు. ఎల్లాగో అల్లా నాలుగు బంతులు రాసింది. పాలేరుచేత పోస్టులో వేయించింది. ఎన్నాళ్లకూ సమాధానం రాలేదు. లాభం లేదనుకుంది.

రామసీత ప్రసవించింది. మొగపిల్లాడు. తల్లి పోలికే అంటే తల్లి పోలికే అన్నారందరూ. తనకూ అట్లాగే వుంది. ఐనా పెద్ద నెలలో గుడ్డును చూసి ఎలా పోలికలు చెప్పడం? పిల్లాణ్ణి చూస్తున్నకొద్దీ చూడబుద్ధి పుడుతోంది. ఆ చిట్టి ముండ గుప్పిళ్ళు బిగపడతాడు. వొళ్ళు సాగదీసుకుంటాడు. బుల్లి నోరుతో కళ్ళు మూసుకుని ఏమిటో వెతుకుతాడు. మొగపిల్లాడు పుట్టాడని ఆంజనేయులుకు కబురు చేశారు. అతను రాలేదు. కాని వెళ్లినవాళ్లు అతను మళ్లీ నాటకాల్లో పడ్డాడని, యీమధ్యనే నాల్గెకరాలు అమ్మాడనీ వార్త మోసుకొచ్చారు. పెద్ద పురిటి బాలింతరాలు రామసీత యిది విని ఉన్నది కాస్త క్షవరం ఐపోతోందని మధన పడింది.

"పోతే పోయింది. ఆయన కుదురుగా వుంటే" అనుకుంది.

నెల పురుడు వెళ్లింది. ముత్తవతల్లి బిడ్డడికి చేతికి వొత్తులూ అవీ చేయించి పెట్టింది. తండ్రితో శతపోరి రామసీత కొడుకు మొలకు గజ్జెలు చేయించింది. గుడ్డ టోపీ, చొక్కా తొడుక్కుని పసివాడు తొట్లో గిలక్కాయలు చూచి సంబరపడుతున్నాడు. ఓరోజు మధ్యాహ్నం భోజనాలు చేసి ఆడవాళ్లందరూ సావిట్లో కూచున్నారు. లోకాభి రామాయణం విడిపడ్డది. ప్రవాహం వెళ్లి వెళ్లి ఆంజనేయులు మీదికి వెళ్లింది.

"ఇప్పటికైనా వొచ్చాడేమో చూచావా?" అంది రామసీత తల్లి. ఆవిడా పెద్దదయింది. పచ్చగా, పార్వతీదేవిలాగుంటుంది. పొద్దున్నే ఆమె ముఖం చూచినా చాలు, పాపాలు పరిసిపోతయ్యంటారు అందరూ. ఆవిడ కెప్పుడూ ఇదే దిగులు. ఒక్క కొడుకూ, వొక్కత్తే కూతురునూ. దేముడి దయవల్ల కలిగిన యింట్లో పుట్టి కలిగిన యింట్లోకే

వొచ్చింది. పుట్టింటివారు ఆమెకు పసుపూ, కుంకం కింద నాల్గెకరాలు కూడా యిచ్చారు. కొడుకు నలుగురితో పాటు సంసారం చేస్తున్నాడు. మొగుడు ఏమీ తక్కువవాడు కాదు. నాలుగట్టాలు నలుగురికి చెప్పి అవుననిపించుకున్నవాడే ఒక్క కూతురుంటే - అది యిల్లా తయారైంది.

దాని కడుపున గూడా ఓ కాయ కాచిందిగదా అని సంతోషించింది ముసలమ్మ. అల్లుడు తడిసిన నులక్కుక్కలాగా ఎప్పుడూ బిర్ర బిగిసే వుంటాడు. అదో వినపన కొయ్య. రామసీత అక్కడే కూచుని పిల్లాడికి ఊలు టోపీ కుడుతోంది.

నెమ్మదిగా "అమ్మా!" అంది.

తల్లి తలెత్తి చూచింది. ఎంత సేపటినుంచో మాట్లాడని రామసీత నోరు విప్పేసరికి తల్లీ, వొదినా ఆమె కేసే చూచారు.

"నా పెళ్ళప్పుడు ఏమయిందే?" అంది. ముసలమ్మకు అర్థం కాలేదు. ఆవిడ శూన్యంలోకి చూస్తోంది. ఆమె ముఖాన పెద్ద కుంకుమబొట్టు మెరిసింది. తల్లిని తాను అడిగేది అర్థం కాలేదనుకుంది రామసీత.

"మేనరికం నీవు వొద్దన్నావా?" అనడిగింది రామసీత.

పార్వతమ్మకు చిత్రం వేసింది. తన కూతురు తనను నిగ్గ తీస్తోంది. మంచో, చెడో జరిగిపోయిన సంగతిని అసలు వాళ్ళు అందులో తమ బిడ్డలు వొచ్చి నిలవేసి అడిగితే జవాబు చెప్పడం కష్టం.

"ఎందుకే యిప్పుడవన్నీను" అంది. ఆవిడకు పాత కథ కళ్ళముందు తిరుగుతోంది. తాంబూలాలు ఆ రోజున పుచ్చుకుంటారు. తనకు సుతరామూ ఈ. మేనరికం యిష్టం లేదు. 'మా అక్కయ్య' అన్నాడు తన భర్త. అప్పావధాన్లుగారంటే ఆ ప్రాంతాల్లో పేరెన్నికగన్న మనిషి. చిన్నప్పుడు ఆయన కనకమ్మ అక్కగారింట్లో వుండి తింటూ వేదం చదువుకున్నాడు.

"మా అక్కయ్య వుసూరుమంటుంది" అన్నాడాయన.

"పిల్ల ఉసూరుమనదూ" అంది తను.

కాబోయే అల్లుడు వీధి అరుగుమీద ఎవర్నో యిద్దరు ముగ్గుర్ని చేర్చాడు. తువ్వాలా తలకు చుట్టాడు. బీడీ అంటించాడు. నాటకాల్లో పద్యాలు పాడుతున్నాడు. అప్పుడు నేలను నాకే వార గోచీ, వల బనీనూ, బనీను కనబడేట్టు సన్నని చొక్కా, నుదురుమీద పడే క్రాపింగూ, లుంగ చుట్టి ఉత్తరీయం మెడను వేసుకోడమూ, ఎంతెంత వాళ్ళనూ లుస్కారించి మాట్లాడ్డమూనూ అయ్య పని-అప్పావుధాన్లుగారు కాస్సేపు మాట్లాడలేదు.

"చదువూ సంధెలు లేకపోతే పోయింది. కుదురైనా లేదు గదా" అంది తను.

ముసిలాయన ఆలో చన్లో పడ్డాడు.

అరుగుమీంచి ఝామ్మని పద్యం మోగుతోంది.

"ఈ, కుండలి నన్ను దా గరిచె
కౄరత నింక మనంగ జాలనో
అంద జయాన!"


"వీధిలోకి వెళ్ళి అల్లుణ్ణి దర్శనం చేసుకు రండి. రేపు కాళ్ళు కడిగి నెత్తిన చల్లుకుందురు గాని!" అంది.

అవధాన్లుగారు ఉక్కిరి బిక్కిరైనారు.

"ఎప్పుడో మీ అక్కయ్య ముక్కుల్లో చీమిడి తీసేసిందని– కడుపున పుట్టిన బిడ్డ గొంతుక పిసుకుతారుటండీ!" అంది.

ఇంతలో రామసీత అక్కడికి వొచ్చింది. "రా అమ్మా!" అని తండ్రి కూతుర్ని వొళ్ళోకి తీసుకున్నాడు తల నిమిరాడు.

కళ్ళల్లోకి చురచురా చూచి పార్వతమ్మగారు అక్కడి నుంచి వంటింట్లోకి వెళ్ళింది, యింట్లో



అలికిడైతే.

"ఏరా అన్నయ్యా" అంటూ కనకమ్మ వొచ్చింది. తాంబూలాలుచ్చుకున్నారు అనాడు. ఇదంతా ఆమెకు కళ్ళక్కట్టినట్టు కనిపించింది. ఫలితం గూడా చూస్తున్నదేమో, కళ్ళంబడి నీళ్ళు వొచ్చె. చెంగుతో తుడుచుకుంది. ముసిలాయన యింతలో ఎందుకో పిల్చాడు. దొడ్డి వసారాలోకి అమె వెళ్ళిపోయింది.

"ఏమే అమ్మా!" అంది రామసీత.

"నిజమేనే అమ్మా. ఒద్దన్నాను" అని వెళ్ళింది పార్వతమ్మ. ఆమె గొంతుకలో ఏదో ఉండనిండి మాట పెగిలి రాలేదు.

రామసీత అత్తారింటికి ప్రయాణం అయింది. తను కుట్టిన ఊలు టోపీ కొడుక్కు తొడిగింది. నల్లని చొక్కా తొడిగింది. మొలకు గజ్జెలు కట్టింది. చేతిని వొత్తులు మెరుస్తున్నె. నెమ్మది నెమ్మదిగా చావ విరిగి పసుపురంగు తేలుతున్నాడు పాపాయి.

కొడుకు నెత్తుకుని తండ్రి దగ్గరికెళ్ళింది.

"మాహం బ్రహ్మ నిరాకుర్యాం, మామా బ్రహ్మ నిరాకరోత్– అనిరాకరణమస్తు. అనిరాకరణం మేఅస్తు" అని మంచంలో పడుకుని అప్పావుధాన్లు గారు గొణుక్కుంటున్నారు.

"నాన్నా, వెళ్ళొస్తా" నంది రామసీత.

ఆయన ఏదో చెప్పబోయారు. లేచి కూచున్నారు. మాట తడబడ్డది. పిల్లవాణ్ణి తండ్రి చేతికి యిచ్చింది. మనమణ్ణి ఎత్తుకున్నారు. ఆమె తండ్రి కాళ్ళకు నమస్కరించింది. తండ్రి వొరుగైపోయాడు.

"అమ్మా,'నేను సన్యసిద్దామనుకుంటున్నాను' అన్నాడు.

"ఈ వయస్సులో వొద్దునాన్నా" అంది.

"ఇదేనమ్మా వయస్సు. నా తండ్రి యజ్ఞం చేశాడు నా తాత బ్రహ్మీభూతుడు. నా మాతామహుడు ఆధానం చేశాడు. నేను వైశ్యదేవం అయినా చెయ్యలేకపోయాను. సన్యసిద్దామని వుందమ్మా" అన్నాడు.

రామసీత గంభీరురాలయింది. రక్తమాభిన్యం లేనివంశం. ఆ ప్రతిష్ఠ యివాళ్టికీ ప్రజ్వరిల్లుతోంది. ఆమెకు దరిద్ర నారాయణమూర్తి గాంధీగారు గుర్తుకొచ్చారు.

"నాన్నా, వొక్క మాట చెప్పనా?" అంది.

"చెప్పమ్మా" అన్నాడు తండ్రి.

"మనిషి కంటి దేముడెవరు నాన్నా" అంది.

తండ్రి ఆశ్చర్యంతో, ఆనందంతో కన్నులరమోడ్చాడు.

"సాటి మనిషిని హింసించి, హింసించి చంపి ఎన్ని యజ్ఞాలు చేస్తే ఏం నాన్నా" అంది.

అప్పావుధాన్లు గారు తెల్లపోయారు.

"నీ వొళ్ళు మాత్రం ఏం బావుంది నాన్నా. సన్యసించకు నాన్నా" అంది.

క్రీడారంగం క్విజ్ జవాబులు

(1) 'సర్ ఫ్రాంక్ వోరల్'
(2) హంగరీకి చెందిన "జూడిత్ పోల్గర్"
(3) మార్గరెట్ కోర్ట్ స్మిత్, 1961లో "కెన్ ఫ్లెచర్"తో కలిసి మిక్సెడ్ డబుల్స్‌లో, 1970లో స్త్రీల సింగిల్స్‌లో
(4) యాసిన్ మర్చంట్ (ఢిల్లీ '89)
(5) జూడీ షూలర్ (1972, మ్యూనిక్‌లో)
(6) లాలా అమర్‌నాథ్, సురీంగర్ అమర్‌నాథ్
(7) 1966 సం. మెయినుద్దౌలా గోల్డ్‌కప్‌లో (హైద్రాబాద్) వజీర్ సుల్తాన్ టీమ్ తరఫున
(8) సునీల్ గవాస్కర్, జెఫ్ బాయ్‌కాట్, సర్ గారీఫీల్డ్ సోబర్స్, అలెన్ బోర్డర్
(9) హార్స్ రైడింగ్, ఫెన్సింగ్, షూటింగ్, క్రాస్‌కంట్రీ రన్నింగ్, స్విమ్మింగ్
(10) ఉరుగ్వే

అప్పావుధాన్లు గారు మాట్లాడలేదు.

"నా ప్రాణాలు నీ మీదా, అమ్మ మీదా వుంటై. ఇప్పుడు ఈ మహారాజు (కొడుకు) మీదానూ. నీ ఆరోగ్యం వారానికో మాటన్నా రాయించునాన్నా. మేం జవాబన్నా రాయమనుకో. నా కోసం మీ ఆరోగ్యం రాయించాలి నాన్నా" అంది.

"అలాగే అమ్మా" అన్నాడు తండ్రి. మాట్లాడలేకపోయాడు.

"సన్యసించ వొద్దు నాన్నా" అంది.

అవుధాన్లు గారు తల వూపారు.

"బయలుదేరలేయే"– అంటూ అన్నగారు వొచ్చారు. "వెళ్ళొస్తానే అమ్మా" అని చెప్పింది. పిల్లాణ్ణి తల్లి చేతికిచ్చింది. తల్లికీ, వొదిన గారికీ పాదాభివందనం చేసింది. తల్లి దీవించింది. వొదినగారు కుంకం బొట్టు పెట్టింది. బండీ ఎక్కింది. దార్లో అన్న–

"రామసీతా!" అన్నాడు.

తలెత్తింది.

"నీవు ధైర్యంగా వుండు. నీకేమే, మొగ బిడ్డ కూడా పుట్టాడు" అన్నాడు. మొగపిల్లాణ్ణి కంటే అక్కడితో మెట్టు ఎక్కినట్టు. కోర్టు కెళ్ళినా ఢోకా లేదు అన్న మాట.

"నీవు ధైర్యంగా వుండు. ఆ పశువు, వాడెప్పుడూ అంతే. పిల్లాణ్ణి చూట్టానికైనా తల్లీ, కొడుకూ యిద్దర్లో ఒక్కరన్నా రాలేదు. వాళ్ళ వరస తెలుస్తూనే వుంది."

రామసీతకు ఏమనాలో తోచలేదు. అన్న కేసి చూస్తోంది.

"నీకేం ఫరవాలేదు. నీవు ఏమీ చెయ్యావు. ఏం చేసినా నేనున్నంత కాలం మరేమీ యిది లేదు" అన్నాడు.

"నాన్నా, అమ్మా కులాసా రాయవుట్రా" అంది ఆమె.

అత్తారింటి కొచ్చింది. ఆంజనేయులు ఊళ్ళోలేడు. ఎక్కడికో నాటకాలకని వెళ్ళాడు. కనకమ్మ వుంది. ఆవిడ దృష్టి తీసింది. ఎర్రనీళ్ళు తీసిపోసింది. ఉయ్యాల తొట్టి వేశారు.

బారసాల జరిగింది. అందరూ వచ్చారు. ఎల్లాగో అల్లా వోపిక చేసుకొని అప్పావుధాన్లుగారు కూడా వొచ్చారు. బారసాల పీటల మీద ముత్తవ పాపాయికి రెండెకరాలు చదివించింది. తాతగారు అల్లుడికి ఏరికోరి ఖద్దరు పంచెలు తెప్పించి మరీ పెట్టారు. అల్లుడు మారాడని ఆయనకి ఏం తెలుసు? ఎప్పుడో కూతురు చెప్పిన మాట గుర్తుంది ఆయనకు- అంతే.

* * * *

ఆంజనేయులుకు కొత్త పిచ్చి పట్టుకుంది. నాటకాలు, రాటం, ఏకులు, ఆసు, చిలపలూ మూలపడ్డాయి. వాకిట్లో ఓ పాత తుక్కు మోటారు ఒకటి వెలిసింది. దాన్ని అతను అన్ని అడ్డగోలు డొంకల్లోంచీ నడిపించుకు వచ్చాడు. ఇప్పుడతను కారు తోలగలడు. చిన్న సర్వీస్ ఒకటి పెట్టాట్ట.

కాపరం బస్తీకి తరలింది.

రామసీత వీపు గట్టిదనాన్ని పరిశీలించుకోవలసిన రోజులు వచ్చాయి. ఆంజనేయులు ఓ పట్టాన ఇంటికి రాడు. వొస్తే ఒకటి రెండు రోజులు కదలడు. ఎప్పుడూ చిరచిరలాడుతూ వుంటాడు.

రామ్మూర్తి (కొడుకు) అల్లరి చేస్తుంటే అతనికి ముద్దురాదు. కోపం వస్తుంది. రామసీతకు కోపం రాదు. ముద్దు వస్తుంది.

"వీడి గజ్జెల తాడు ఏం చేశా?" అన్నాడొక రోజు భార్యతో.

"జాగర్తగానే వుంది. ఏం?" అంది రామసీత.

"కావాలి"

"ఎందుకు?"

"డబ్బులు పుట్టించుకు రావాలి".

తాకట్టు పెడ్తారా, మంచి మాటే, ముందే చెప్పారు. నయం".

ఆంజనేయులు బలవంతాన ఆమె పెట్టి తీయబోయాడు. రామసీత అడ్డం వెళ్ళింది. ఆమెనొక్క తోపు తోశాడు. మళ్ళీ అడ్డం వెళ్ళింది. ఆంజనేయులుకు కోపం వచ్చింది కొట్టాడు.

దెబ్బతిన్న రామసీత త్రాచుపాము అయింది. కాని వెంటనే తలవంచుకుంది.

"ఏమైనా సరే వాడివి నేనివ్వనండీ" అంది ఏడుస్తూనే.

"నీ అబ్బ సొమ్మా?"

నోరు జారింది ఆంజనేయులికి అనేసాడు.

"ఆ నా అబ్బ సొమ్మే" అంది రామసీత నిప్పులు కక్కుతూ.

చేసేది లేక ఆంజనేయులు వెనుకడుగు వేశాడు. తన మెళ్ళో గొలుసు తీసి యిచ్చింది రామసీత మొగుడికి. ఆంజనేయులు నిర్విణ్ణుడైనాడు. పుచ్చుకోడమా, వద్దా అనుకున్నాడు. వొద్దనుకున్నాడు. తీసికెళ్ళి భార్యకిద్దామని లేచాడు. అవసరం నెత్తెక్కి తొక్కుతోంది. కారుకి టైరు కొనాలి. దర్జాగా తీసుకున్నాడు. చొక్కా తొడుక్కుని వెళ్ళిపోయాడు. అత్తగారు కిమిన్నాస్తి కళ్ళప్పచెప్పి చూస్తూ వూరుకుంది.

రామ్మూర్తికి రెండేళ్ళు నిండై. ప్రతి వాళ్ళనూ తిడతాడు. కొడతానంటాడు. కర్రముక్క పుచ్చుకుని బయలుదేరుతాడు. ఎప్పుడూ దిసమ్మొలగానే వుంటాడు.

"ఓ రామయ్య తండ్రీ నే వేగలేకపోతున్నానురా నీతో" అంటుంది. రామసీత.

"అమ్మా అమ్మా, వాళ్ళబ్బాయిని కొట్టిరానా?"

"తప్పు" అని కళ్ళు పెద్దవి చేస్తుంది రామసీత. ముక్కు మీద వేలు వేసుకుంటుంది.

"తప్పా?"

తెల్లపోతుంది. రామసీతకు తన కొడుకు కొడతా నని కర్రపుచ్చుకున్నప్పుడల్లా ఆమె ప్రాణాలు రువ్వు, రువ్వుమనేవి.

వో రోజున ఆంజనేయులు కూర్చుని వున్నాడు. రామ్మూర్తి "నాన్న, నాన్న" అంటూ దగ్గరికి వెళ్ళాడు. ఆంజనేయులు ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

"నాన్నా, వాళ్ళబ్బాయిని కొట్టి రానా?"

ఊ!"

రామ్మూర్తి లేచాడు. కర్రముక్క తీసుకున్నాడు. రామసీత ఇదంతా చూచింది. దబదబా వొచ్చింది.

"ఎక్కడికిరా?"

"అల్లింటికి"

"ఏడిశావు దా. నీకు జెండా చేసి పెట్టనా...."

"జెండా. జెండా. చేచి పెట్టు".

చీర ముక్క తుంచింది . మంచంలోంచి కాస్త నులక కోసి తెచ్చింది. ఎల్లాగో అల్లా జెండా చేసి ఇచ్చింది. రామ్మూర్తి నవ్వుతున్నాడు. జెండా చేతికి

రాగానే కిలకిలా నవ్వాడు. ఎగిరి గంతేశాడు. 'జై' అంది తల్లి. రెట్టింపు అల్లరితో 'జై' అని అరిచాడు, కొడుకు.

"ఎవర్నీ కొట్టకూడదు" అంది.

"జెండాతో కూడానా?"

"ఆ కొడితే జెండా కోప్పడుతుంది".

ఆంజనేయులు "బాగానే వుంది" అన్నాడు. గొంతికలో ఏ రసమూ ప్రస్ఫుటం కాలేదు. మాట్లాడకుండా రామసీత వెళ్ళిపోయింది.

మైనరు వున్నాడు గనుక ప్రామిసరీ నోట్లకు డబ్బులు రాలటంలేదు. పగడాల తావళమూ, పుస్తెలతాడూ, ముసిలమ్మ రుద్రాక్షల తావళమూ హారతి కర్పూరం అయింది. రైతు దగ్గరకి వెళ్ళి పై సంవత్సరం పంట కూడా తెచ్చుకొని తగలేయడం అయింది. ఆ మోటారుకారు "తేతే" అంటుందే కానీ తీసుకో అని ఒక్కనాడు అనదు. కారు కింది కర్చవుతోందో, మరేమవుతోందో గాని, బూడిదలో పన్నీరు చాలా పోశారు.

"జెండాకు జై"- రామ్మూర్తి అరుస్తూ ఆడుకుంటున్నాడు.

అప్పావుధాన్లు గారికి సుస్తీగా వుందని వుత్తరం వచ్చింది. ఆంజనేయులు వూళ్ళో లేడు. రామసీత కుప్పకూలింది. కనకమ్మ కాలు కాలిన పిల్లిలా తిరిగింది. నుంచో లేదు. కూచో లేదు.

"జెంకు జై!"

"రాముడూ, దా" అంది రామసీత. వొచ్చాడు.

"అరవకూడదు"

"నువ్వే చెప్పావుగా"

"ఇప్పుడు అరవకూడదు. తాతయ్యకు సుస్తీగా వుందట".

"అమ్మా, అరిస్తేనే పోతుంది. ఇందాక మేకపిల్ల భయపడిపోలా?"

రామసీతకు నవ్వు రాలేదు. 'అరవకూడదమ్మా' అంది. గదిలోకి వెళ్ళి రెండు మూడు చీరలూ, పిల్లాడికి బట్టలూ తీసుకుని మూట కట్టింది. కనకమ్మ వచ్చి సావిట్లో కూచుంది. ఆవిడ మొహాన కత్తి వేస్తే నెత్తురు చుక్క లేదు. ఎంత ఇధైనా రక్తసంబంధం, తల్లితోడు. పేగు తోడుతుంది. అన్నకు ఆ వయస్సులో సుస్తీ అంటే ఏమిటి? కళ్ళనీళ్ళను ఆపుకుంటుంది కనకమ్మ.

"బయలుదేరవూ అత్తయ్యా" అంది రామసీత.

"వాడు లేడే అమ్మా" అంది అత్తగారు.

"నేనుండలేను పోతున్నాను" అంది రామసీత.

వెళ్ళగానే కార్డుముక్క రాయి! వాడు రాంగానే నేనూ వొస్తానంది కనకమ్మ.

"వొక్కతవూ ఎలా వెళ్తా" వంది మళ్ళీ.

ఈ వంకను ప్రయాణం ఆగుతుంది కాబోలు ననుకుంది రామసీత.

"నోరుందికదా. అడుగుతాను, వెళ్తాను."

"బస్సుమీదే వెళ్తావా?"

"ఆ"

"......"

"నా పెట్టి అడుగున అయిదు రూపాయలు దాచా నిన్నాళ్ళూ. అది తీసుకు వెళ్తున్నాను. మీ అబ్బాయితో చెప్పండి. వారిని కూడా ఓసారి రమ్మని చెప్పండి. కూతురు నిచ్చుకున్నా, మేనమామే. వొస్తే ఎవ్వరూ నవ్వరు" అంది. పిల్లాణ్ని చంకనేసుకుని మూట పుచ్చుకుని బయలుదేరింది. సందు చివరిదాకా అత్తగారూ వచ్చింది. కోడలు అన్న చివరి మాటకు ఆమెకు భగ్గుమంది. ఐనా, ఇప్పుడు కాదని తమాయించుకుంది. "పిల్లాడు పుట్టినప్పుడు రాలేదని దెప్పడం, ఎంత ముసలిదాన్నైనా అర్థంకాకపోదు" అనుకుందామె.

తన యింటికి చేరేటప్పటికి వీధివాకిట్లో పెట్టుకుని ఏడుస్తూంటారేమో అని ఆమె బాధపడింది. చూపులన్నా అందుతయ్యో అందవో అని మధనపడింది. 'ఈ వయస్సులో తల్లి–' యిది గుర్తుకొచ్చి మరీ మరీ ఇదయింది. బిక్కమొహం పడ్డది.

తల్లి బావురుమంది. అప్పారావుధాన్లుగారు, ఆసన్నమృత్యువు. మంచాన్ని అంటిపెట్టుకుని వున్నారు. స్పృహ ఏమీ చెడలేదు. విరేచనాలు ప్రారంభమయినవి. పోసిన మందులు ఒంట పట్టడంలేదు.

"అమ్మాయి వొచ్చిందా?" అన్నారు.

"ఆ వొచ్చా నాన్నా"

"వొచ్చావా అమ్మా దా"

వివస్త్రుడు, నులక మంచం మీద గోనెపట్టాలో పడుకుని వున్నాడు. వేసే పాత్తిళ్ళగుడ్డ వేస్తున్నారు. తీసేది తీస్తున్నారు.

"నీ పిల్లాడేడి?"

"ఇదుగో"

"తాతయ్యా!" అని కొడుక్కి చూపించింది రామసీత.

"తాతయ్యా!" అన్నాడు రామ్మూర్తి.

తాతగారు కళ్ళెత్తి చూచారు. "నాన్నా, తాతయ్యకు సుస్తీ" అంది రామసీత. ఏడుస్తోంది.

"జెండాకు జై"– అరిచాడు రామ్మూర్తి.

"తాతయ్యా"

"ఊ"

"పోలా"

అందరూ నవ్వారు. తాతగారు నవ్వారు. రామసీత 'జై' అని అరిస్తే పోవటం ఏమిటో విప్పి చెప్పింది. వోరి భడవా అని అందరూ అంగలార్చారు. అప్పావుధాన్లు నవ్వారు. వెలిసిపోయిన గుడ్డ లాగుంది ఆ నవ్వు.


వైద్యుడు శేషాచార్లు వచ్చాడు. నాడి చూచాడు. పూర్ణిమ దాటదని చెప్పాడు. ముసిలమ్మ గొల్లుమంది.

మర్నాడు తండ్రి దగ్గర రామసీత కూచుంది. మిగతా అందరూ భోజనాలు చేస్తున్నారు. రోగిదగ్గర వుండటం, మిగతావాళ్ళు గబగబా అన్నాలు కానివ్వడం రివాజు అయింది.

"అమ్మా"

"ఏం నాన్నా"

"ఇవాళదాహం ఒకటి కొత్తమ్మా"



అల్లాగా అంది రామసీత ఉద్దరిణితో కాసిన్నీళ్ళు గొంతుకలో పోసింది

"అమ్మా"

"ఓయ్"

"ఇహ నేను సన్యసించవచ్చా అమ్మా"

రామసీత తెల్లబోయింది తానువద్దన్నది గుర్తుకొచ్చింది అందువల్లనే ఆగాడు కాబోలు తండ్రి అనుకుంది పెద్ద నిట్టూర్పు వచ్చింది మొహం గమ్మత్తుగా మారింది

"సన్యసించాలని వుందా నాన్నా?" అంది ఆ మాట అనటం అనవసరం అయినా ఆగలేక అంది

"ఆ రోజున–"

"అర్థమయింది నాన్నా"

"దొడ్డి వసారాలో పడుకుని వున్నాను నువ్వు వెళ్తూ వెళ్తూ వద్దన్నావు అప్పుడు ఎదురు చెపితే ఎక్కడ శపిస్తావో అనిపించిందమ్మా" అన్నాడు

రామసీతకు కళ్ళంబడి నీళ్ళు వచ్చాయి చెరుగుతో తుడుచుకుంది

"నీ వుసురు నాకు తగలకూడదు తగలనీకు–"

"అదేం మాటలు నాన్నా–" అంది రామసీత తండ్రి వినిపించుకోలేదు ఆయన చెప్పదలచుకున్నది చెప్పేస్తున్నాడు ఇక ఆగదు ఆ ప్రాణి

"మీ అమ్మ పేరనున్నది నీ పేర పెట్టించా తేతే అని రేపు వాడెక్కడ నిన్ను చంపుతాడో అని నీవు అమ్మడానికి వీల్లేకుండానూ, నీ పిల్లాడికి చెందేట్టూ రాయించా " అన్నాడు

రామసీత కొత్తలోకంలో వుంది తనని తల్చుకుని తండ్రి ఎంత కుళ్ళి కుళ్ళి ఏడ్చాడో, తండ్రి ముఖం పరీక్షగా చూచింది తపశ్శక్తి సంపన్నులయిన కళ్ళు, మాటలభావతను ఎరగని ఆ కళ్ళు యిటికరాయి ముక్కల్లాగా వున్నాయి

"అమ్మా!"

"ఆఁ"

"నన్నేమీ శపించకు" అని ఏడ్చాడు అప్పావుదాన్లుగారు అన్నగారు భోంచేసి వచ్చి చూచాడు తప్పిద్దామని అనుకుని కూడా ఏమి చెయ్యలేకా, ఆ దృశ్యం చూడలేక తలవంచుకుని బరువుగా వెళ్ళిపోయాడు

"జెండాకు జై" రామ్మూర్తి అరుస్తూ వొచ్చాడు తల్లి తాత మంచం దగ్గర వుంది

"తాతయ్యకు ఇంకా తగ్గలా" అన్నాడు

"వోరి భడవా" అన్నారు తాతగారు అది వారి ఆశీర్వచనం


అప్పావుధాన్లుగారు సన్యసించారు బ్రహ్మీభూతులూ అయ్యారు వారి చావు పెళ్ళితో సమానం ముసిలమ్మ మాటేగానీ, పచ్చని పండు ముత్తయిదువ పార్వతీదేవికి చేటు వచ్చింది కానీ, ఆయనకేం మహారాజు అన్నారు అందరూ

ఆంజనేయులు, కనకమ్మ వొచ్చారు వెళ్ళారు రామసీత మొగుడితో పాటు వెళ్ళలేదు తల్లికోసం అని వెళ్ళి పోయింది ఆంజనేయులుకి ఆస్తి వొచ్చిన సంగతి తెలిసింది అతనికేమి సంతోషం రాలేదు మనిషి చిక్కిపోయాడు వెనకటి నేవళంలేదు తోస్తే పడేట్టున్నాడు ఇంటికి అల్లుడు వచ్చినట్టు రాలేదు ఏదో, ఎవరో వచ్చినట్టు వచ్చాడు మేనమామ పోయాడని అతను ఏడ్చాడు కాని, ఏడ్చానని చెప్పినా ఎవరూ నమ్మేట్టులేదు దశమారింది

వొస్తావా? అనడిగాడు ఆంజనేయులు భార్యను

ఎల్లా రాను చెప్పండి అంది రామసీత

రామసీత మొహాన నవ్వూ నిండూ లేదు ఎండి వాడిపోయి వుంది



కోడలుందిగా అమ్మా అయినా ఆడ కూతుళ్ళు ఎన్నాళ్ళుంటారేం? ఆస్తి ఇచ్చిన తల్లయితే వుంటారేమొ" అంది కనకమ్మ అక్కడా, అక్కడా, నోరుందికదా అని అన్నట్టున్నె ఆ మాటలు ఎవరూ పట్టించుకోలేదు వాటిని

తల్లీ, కొడుకూ వెళ్ళిపోయారు

రామసీత పుట్టింట్లోనే వుండి పోయింది

★ ★ ★ ★ ★ ★

రెండు మూడు నెలలు గడిచై! ముసిలమ్మ మరి మంచం దిగలేదు ఆవిడా రోజులు వెళ్ళదీస్తోంది

చిన్నప్పుడు తల్లి చేసిన దానికి తిరిగి చేసి రుణం తీర్చుకుంటోంది రామసీత

మనోహరమైన ప్రవాదలు గాలిలో తేలి వొస్తున్నవి

రామసీతకు అక్కడ ఎవడో వున్నాడట వాణ్ణి విడిచి రాలేదట దీనికి ఇంట్లో అందరూ హర్షించారుట అందుకే అల్లా ఆస్తి రాసి ఇచ్చారట లేకపోతే కాపరానికి రాదా అనట

రంకు కట్టడం తేలిక మరొకరికి రంకు కట్టుతూంటే చెవులు దోర పెట్టుకుని వింటుంటారు ఇకిలిస్తారు పోతారు నమ్మితే నమ్మనూ నమ్ముతారు ఆలోచించరు ఆలోచిస్తే ఆ వెకిలి తృప్తి పోతుందేమో అని భయం

కట్టబడిన మనిషి?

రామసీత చెవులనూ పడ్డవి ఆ మాటలు ఆమె ఏమనుకుందో ఏమో పెదవి విప్పలేదు

తల్లిక్కాస్త నయంగా వుంది 'నేసిహ ఇంతేనమ్మా కాపురం చెడగొట్టు కోకు అందావిడ వెళ్తాలెస్తూ అంది రామసీత వెళ్ళకపోతే ఏమ న్నాడు అన్నగారు వొదినగారు ఎటూ అనలేక పోయింది ఆవిణ్ని అన్నవాళ్ళు పురుగులు పడి చస్తారని కసితీరా అంది ఆమె ఆడబిడ్డలు వెనకేసుకొచ్చి అన్నదంటే నిజమై వుంటుందనైనా అనుకోరు కాబోలు ప్రపంచం

తల్లే కూతుర్ని బలవంతాన ప్రయాణం చేయించింది తల్మిని విడిచి కూతురు వెళ్ళలేక పోయింది ఎదురు గాలిలో ముందుకెళుతూన్న జెండా లాగా ఆమె అత్తింటికి వెళ్ళింది

పాత్ర సామగ్రి కూడ సర్వమంగళం అయింది ఓ పంచ నుంటున్నారు మరో పైపంట కూడా ముందే తెచ్చి అప్పులు కొన్ని తీర్చారు వొకటో రెండో వరాలున్నె రామసితను చూచి అత్తగానీ, మొగుడు గానీ ఆదరించ లేదు సత్రంలోకి ఎవరో వచ్చి వెళుతుంటే చూచినట్టు చూచారు

'యిల్లా వున్నారే మంది రామసీత మొగుణ్ణి ఆంజనేయులు వులకలేదు, పలకలేదు ఆ రాత్రి ఎల్లాగో అల్లా మూతుడుచు కున్నారు ఉప్పు వుంటే పప్పులేదు పులుసుంటే కారం లేదు ఆ రాత్రి

భార్యాభర్తలు ఎడమొహం పెడమొహంగానే వున్నారు

భర్తగదా అని దగ్గరకు పోబుద్ధి పుట్టలేదామెకు చేసుకున్న భార్య కదా అని అతనూ పిలువలేదు చాప పరుచుకుని, కొడుకుని దగ్గరెట్టుకుని పడుకుంది పసి వెధవ జెండాను పట్టుకునే పడుకున్నాడు

తెల్వారింది దుద్దులూ, ముక్కుపుడకలూ తీసింది అత్తగారి చేతికిచ్చింది

'ఎందుకు?

కావలసినవి కొనుక్కుందాం అంది రామసీత

"నాకు తెలీదు మీ ఆయనకు ఇవ్వు అయినా ఇవేం చాలుతై?

"మంగళ సూత్రం ఉందిహ' అంది

"అది కూడా తీయాలనుకోకు తల్లీ వాడింకా నన్ను దాటేయాలి నీకు పుణ్యముంటుంది' అంది అత్తగారు ఏడుస్తూన్న గొంతికతో

రామసీత నొచ్చుకుందో, ఏమయిందో తెలీదు ఆమె ఏ వుద్దేశ్యంతో ఆ మాట అందో అది దుమ్ము అయింది

భర్తకు ఆ రెండూ ఇచ్చింది 'అక్కర్లేదు' అన్నాడతను అంజనేయులు గొంతిక పొడి అరి పోయింది అల్లా మాటలు వొస్తూన్నె రాత్రి తను పరకాయించి చూడలేదు బూడిద గుమ్మడికాయ రంగు వొస్తోంది మనిషి ఎండి పోతున్నాడు

"మీ ఇష్టం" అని వాటిని అక్కడే పెట్టింది ఇవతలకి రాబోతూంది

"వాడు వెళ్ళమంటెనె వచ్చావా?' అన్నాడు దగ్గుతెర వచ్చింది కళ్ళి వుమ్మేశాడు. ఆయాస పడుతున్నాడు

"వాడెవడు అంది రామసీత

"అదే – నీ కొత్త మొగుడు"

రామసీత భరించ లేక పోయింది వెనక్కు తిరిగింది అంజనేయులు మళ్ళీ దగ్గి కళ్ళి వుమ్మేశాడు


ఇంట్లోకి వచ్చింది గాంధీగారి బొమ్మా, రాముడి బొమ్మా ఇంకా బజారు కెళ్ళలేదు వోమూల మేకుని అంటి పట్టుకున్నవి ఆమె కొడుకుని ఎత్తుకుని సరాసరి అక్కడికి వొచ్చింది పరాలకు దణ్ణం పెట్టింది తల్లితో పాటు కొడుకూ దణ్ణం పెట్టాడు

'పరాత్పరా చాలు ఈ మాటలు' అంది గొంతిక వొణికింది 'వైధవ్యం వచ్చినా సంతోషిస్తాను ఈ కాపరానికి ఒక దణ్ణం" అనుకుంది లెంపలు వేసుకుంది కొడుకూ తల్లిని చూచి లెంపలేసుకున్నాడు

ప్రభూ, ఒక్క దణ్ణం అని నిట్టూర్చింది రామసీత

(1946 – 1947 వ్యయ ఉగాది సంచిక నుంచి)

●



సింగిల్ విండో చాలదు డబుల్ డోర్ కావాలి!

ఇది ఓ వాగ్బాణం అనుకోండి దీన్ని మరో వాగ్బాణంతో మీరు ఉపసంహరించాలి– ఆ "రిపార్టీ" గుచ్చుకోవాలే గాని బాధించకూడదు. రసభరితంగా వుండాలే గాని అశ్లీలం కొట్టవచ్చి నట్టుండరాదు. కార్డు మీద మాత్రం రాయాలి. ఈ వాక్యం పైన రాసి మీ ప్రతి వాక్యం దాని క్రింద రాయండి. మీ పూర్తి చిరునామా ముఖ్యం. ప్రచురించిన రెంటికి రు. 25, రు. 15 చొప్పున బహుమతి వుంటుంది!- ఈ విషయంలో సంపాదకునిదేతుది నిర్ణయం.

5-2-'90 లోగా అందేలాగా రిపార్టీలు పంపించాలి

చాలా మంది వెంటనే "రిపార్టీ"ల వర్షం కురిపించారు. కొన్ని మాత్రం ఎంపిక చేసి వేస్తున్నాం. బహుమతులు పొందిన రెండూకాక– మరికొన్ని యిక్కడ వేశాము. తతిమ్మా వారి "వాగ్బాణాలు" స్థలాభావం చేత వేయలేక పోయాం. లాటరీ తీసి కొందరి పేర్లు మాత్రం వేస్తున్నాం! ఒకసారి బహుమతి రాలేదని నిరుత్సాహపడక మళ్ళీ ప్రయత్నించండి.

– ఎడిటర్

"సే సారీ అండ్ బి హ్యాపీ!"

* రు. **25** బహుమతి పొందిన రిపార్టీ :

"పార్టీ మార్చి సే సారీ అండ్ గెలిచి బి హ్యాపీ!"

-ఎన్. నారాయణరెడ్డి (అనంతపురం)

* రు. **15** బహుమతి పొందిన రిపార్టీ :

"సారీ చెప్పడమా? అది మా వంశ చరిత్రలోనే లేదు. అయామ్‌సారీ!"

-టి. విజయలక్ష్మి (గుర్జూరు)

మరికొన్ని వాగ్బాణాలు

"యూ...బ్రింగ్ శారీ అండ్ ఐ బి హ్యాపీ!"

- వి.కె.విశ్వనాధ్ (వరంగల్)

"అయిన ఆలస్యానికి సారీ, అందించే ఆనందానికి హ్యాపీ!"

-వి.వి. పార్వతీశం (వరంగల్)

లక్కీ పేర్లు

సురేష్‌కుమార్ (నెల్లూరు), పి. పవన్‌కుమార్ (హనుమకొండ), ట. రవిందర్ రెడ్డి (కొత్తవాడ), ఋషి (హిమాలయ), భానుప్రసాద్ (ఏలేశ్వరం), ఎన్.ఆర్. సుబ్రమణ్యం (సత్యనారాయణపురం), రఫీ (అయితానగర్), బి. రాధాకృష్ణ (వరంగల్), ఎన్. శ్రీనివాసమూర్తి (నెల్లూరు), ఎ. శారద (హైదరాబాద్), కె. శ్రీవాణి (గుళ్లపల్లి), వి.ఎన్. ప్రియదర్శిని (పోరుమామిళ్ల).

సినిమా... సినిమా...

"ఇద్దరూ ఇద్దరే"

"డిసెంబర్ 21 నుంచి నెలాఖరు వరకు హైదరాబాద్‌లో రెండో షెడ్యూల్ జరిగింది. ఇంకో మూడు షెడ్యూల్స్ ఉంటాయి. ఎ. ఎన్. ఆర్. సరసన కె. ఆర్. విజయ, నాగార్జున సరసన రమ్యకృష్ణ జోడీలు," అన్నారు ఎ. కోదండరామిరెడ్డి. ఈయన దర్శకత్వంలో వెంకట్ అక్కినేని, యార్లగడ్డ సురేంద్ర నిర్మిస్తున్న అన్నపూర్ణ స్టూడియోస్ అండ్ ఎస్. ఎస్. క్రియేషన్స్ "ఇద్దరూ ఇద్దరే" చిత్రంలో రంగనాథ్, గొల్లపూడి మారుతీరావు, కోట శ్రీనివాసరావు, బాబూ మోహన్, అనంతరాజ్ ప్రభృత నటవర్గం. గణేష్‌పాత్రో సంభాషణలకర్త, వేటూరి, సీతారామశాస్త్రి గీతాలను రాజ్–కోటి స్వరపరిచారు. పి. ఎస్. ప్రకాష్ ఛాయ, సూపర్ సుబ్బరాయన్ సాహసాలు, తార– సుందరం నృత్యాలు, సదాశివరావు సంయుక్త దర్శకత్వం, డి. వెంకటరత్నం కూర్పుతో అక్కినేని వెంకటరత్నం నిర్మాణ సారథి.

"ప్రేమా జిందాబాద్"

జంధ్యాల రచన, దర్శకత్వంలో బి. ఎ. వి. శాండిల్య, వి. భూపాల్‌రెడ్డి నిర్మించే సంగీత ఆర్ట్ ఫిలిమ్స్ "ప్రేమా జిందాబాద్" చిత్రంలో రాజేంద్రప్రసాద్, ఐశ్వర్య, శుభలేఖ సుధాకర్, కోట శ్రీనివాసరావు, వేలు, బ్రహ్మానందం, ధర్మవరపు సుబ్రహ్మణ్యం, అశోక్‌కుమార్, శశికుమార్, గుంటూరు శాస్త్రి, సుబ్బరాయశర్మ, శ్రీనివాస్ పాత్రధారులు. ఆదివిష్ణు, పార్థసారథి కథ, మాధవపెద్ది సురేష్ సంగీతం, బాల్కీ ఛాయ, రమణి శిల్పం, శాస్త్రి సహకార దర్శకత్వం, జానకిరాం ప్రొడక్షన్, గౌతంరాజు కూర్పుతో ఎస్. రామచంద్రారెడ్డి, పి. రవీందర్‌రెడ్డి సహనిర్మాతలు. శివ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. సమర్పణ: యు. ఫయాజ్.


"అంకితం"

"గురుశిష్యుల సంబంధ బాంధవ్యాలకు భారతంలోని ఒక ఘట్టం ప్రేరణ. దీనికి ప్రణయాన్ని జోడిస్తూ, సంగీత ప్రధాన చిత్రంగా గోదావరి తీరంలో షూటింగ్ ముగించాం. విజయశాంతి చెల్లెలు విజయరేఖ సుపర్బ్‌గా నటించింది. ఓలేటి పార్వతీశంను సంభాషణల రచయితగా పరిచయం చేస్తున్నాం," అన్నారు కె. రాఘవ. ఈయన నిర్మించే ప్రతాప్ ఆర్ట్ ప్రొడక్షన్స్ "అంకితం" చిత్రంలో సురేష్, చారుహాసన్, గొల్లపూడి మారుతీరావు, విజయ్, మాణిక్‌రావు, సుధారాణి, విజయశాంతి ఇతర పాత్రధారులు. సి. నారాయణరెడ్డి గీతాలు, యువరాజ్ సంగీతం, నాగరాజ్ ఛాయ, మల్లిశెట్టి సహకార దర్శకత్వంతో కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం ; బందెల ఈశ్వరరావు.


"ప్రజాప్రతిఘటన" ఫిబ్రవరిలో

"తమిళ హిట్ చిత్రానికి తెలుగు సేత," అన్నారు వీరమాచనేని కృష్ణమూర్తి. ఈయన సమర్పించే శ్రీ లక్ష్మీదేవి కంబైన్స్ "ప్రజా ప్రతిఘటన" చిత్రంలో అర్జున్, రూపిణి, ముచ్చెర్ల అరుణ, మోహన్ నటరాజ్, మోహనప్రియ నటించారు. విజయరత్నం మాటలు, పాటలు రాశారు. గంగై అమరన్ సంగీత దర్శకుడు. బిల్లా కృష్ణమూర్తి దర్శకత్వం నెఱపిన ఈ చిత్రానికి కాంచనబాబు, ప్రభాకర్ నిర్మాతలు.

"ప్రేమా జిందాబాద్"తో



ధర్మవరపు, ఐశ్వర్య, రాజేంద్రప్రసాద్, సుధాకర్, కోట



[illegible]

బాలకృష్ణహీరోగా యువ చిత్ర 9వ చిత్రం

"బాలయ్య సరసన శోభన, నిరోషా నాయికలు. ఊర్వశి శారద ఒక అపూర్వమైన పాత్ర ధరిస్తున్నారు," అన్నారు బహుజనరంజక చిత్రాలు నిర్మించే కె. మురారి. ఈ చిత్రంలో ఇతర పాత్రలను సత్యనారాయణ, అల్లు రామలింగయ్య, చిట్టిబాబు, అనంత్, అనంతరాజ్, రమాప్రభ ధరిస్తున్నారు. సంగీతం : కె.వి. మహదేవన్, సమర్పణ : కె. నరసింహంనాయుడు, స్క్రిన్ ప్లే, దర్శకత్వం : ఎ. కోదండరామి రెడ్డి.

"కర్తవ్యం"

"ఇండియన్ పోలీస్ డిపార్టుమెంటులో తొలి అధికారిణి, ఆదర్శవంతురాలైన కిరణ్ బేడీ నిజ జీవితంలోని కొన్ని సంఘటనల ఆధారంగా రూపొందించబడిన కథ," అన్నారు ఎ. మోహన్ గాంధి. ఈయన దర్శకత్వంలో ఎ.ఎం. రత్నం నిర్మించే సూర్యా మూవీస్ "కర్తవ్యం" చిత్రంలో విజయశాంతి, వినోద్‌కుమార్, సాయికుమార్, పి.ఎల్. నారాయణ, సంజీవి, పి.జె. శర్మ, మోహన్, వేలు, నిర్మల, మీనా పాత్రధారులు. పరుచూరి సోదరులు, వేటూరి, రాజ్-కోటి, టి. ప్రసాద్‌బాబు, త్యాగరాజన్, సోమనాథ్, రామలింగం, చక్రం, శరత్‌కుమార్, గౌతంరాజు తెర వెనుక కృషి చేస్తున్నారు.

"నవయుగం"

"రాజేంద్రప్రసాద్ సరసన కల్పన హీరోయిన్. వినోద్‌కుమార్ మరో ముఖ్య పాత్రధారి" అన్నారు టి. కృష్ణ మెమోరియల్ పిక్చర్స్ అధినేత ఎం. నాగేశ్వరరావు. ఈ సంస్థ ద్వితీయ చిత్రం "నవ యు గం" ఎం.వి.ఎస్. హరనాథరావు మాటలు, కృష్ణ-చక్ర సంగీతం, ఆర్. రామారావు ఛాయతో ఆదిత్య దర్శకుడు.

-జి.వి.జి.

సీరియల్

వజ్రసంకల్పం

సాతవాహన

(గత సంచిక తరువాయి)

జీపు దుమ్ము లేపుకుంటూ యెనభై కిలోమీటర్ల స్పీడులో వచ్చి ఆగింది.

వంతెన ముఖద్వారం దగ్గర కాపలా వున్న ఇద్దరు గార్డ్స్ మెషీన్‌గన్స్ సర్దుకుంటూ ఎటెన్షన్లో నిలబడి సెల్యూట్ చేశారు.

నల్లగా తళతళలాడుతున్న దేహాల్తో రెండు వేటకుక్కలు జీపులోంచి తారాజువ్వల్లా కిందికు రికాయి. చూస్తేనే భయం గొలిపేలా వున్నాయవి. ఆ రెండింటి తోకలూ పొట్టిగా కత్తిరించబడి వున్నాయి. ఎంతటి భయంకరమైన వేటకుక్క అయినా శత్రువుమీద ఛార్జ్ చేస్తూ పైకి వురికేటప్పుడు దాని తోక శత్రువు చేతుల్లో చిక్కుకుంటే యేమీ చెయ్యలేదు. అందుకే వేటకుక్కల తోకలు శత్రువు చేతుల్లో చిక్కకుండా పొట్టిగా కట్ చేయడం జరుగుతుంది.

జాతి సంపదకు గ్రహణం పడితే,
జనజీవన సూర్యుడు అస్తమిస్తే,
ఆలోచన అవుతుంది ఆయుధాగారం!
ఉద్విగ్నమవుతుంది వజ్రసంకల్పం!!

ఆ రెండు వేటకుక్కల మెడల్లోనూ వజ్రాలు పెట్టికుట్టిన ఖరీదైన బెల్టులు కట్టబడివున్నాయి.

ఆ బెల్ట్స్‌కు ఎటాచ్ చెయ్యబడిన పొడవాటి కళ్ళేల వంటి తోలుపట్టాలు కుడిచేతిలో పట్టుకుని ఆ వేటకుక్కల వేగాన్ని కంట్రోల్ చేస్తూ జీపులోంచి దిగాడు వజ్రపాణి.

అతని స్వరూపం యిప్పుడు పూర్తిగా మారిపోయింది.

కాళ్ళకు హంటర్స్‌షూలు, ఖాకీపాంటు, ఖాకీ చొక్కా టక్ చేసుకున్నాడు. ఎండ మొహానికి తగలకుండా ఖాకీరంగు రాబిన్‌హుడ్ హాట్ పెట్టుకున్నాడు.

పూర్తిగా వేటగాడి గెటప్‌లో వున్నాడతను.

దానికి తగినట్టుగానే అతని వీపుకు పొడవాటి రైఫిల్ వేలాడుతోంది.

జీపు దిగుతూనే గార్డ్స్‌చేసిన సెల్యూట్ స్వీకరిస్తూ వంతెన మార్గం తెరవమన్నట్టుగా కీవిగా సైగచేశాడతను.

వెంటనే ఒక గార్డ్ పరిగెత్తుకుంటూ వెళ్ళి కొండశిఖరం అంచున యేర్పాటు చేయబడిన ఎలివేటింగ్ మెషీన్ హేండిల్ గిరగిరా తిప్పడం ప్రారంభించాడు.

ఆ మరుక్షణం కిటకిటమన్న శబ్దంతో



రాజకీయ సారథ్యం!

ప్రస్తుతం చిత్రరంగంలో శత్రుఘ్న సిన్హా, రాజ్‌బబ్బర్‌లు అత్యంత సంతోషంతో వున్నారు. శ్రీ వి.పి.సింగ్ ప్రధాని కావడంతో ఈ వయసు మీరిన హీరోల వూహలు వూపిరి పోసుకుంటున్నాయి. ఇప్పుడు వీరిద్దరికీ రాజకీయాలలో మునిగితేలే అవకాశం లభించింది. అలా అని వారేమీ రాజకీయరంగంలోకి ఒకసారిగా దూకరట. మరికొందరు ప్రముఖులతో చేరి ఒక కమిటీగా ఏర్పడి వాళ్ల నాయకునికి (వి.వి.సింగ్ కాక మరెవరు?) ఎక్కడ ఆయన తప్పటడుగు వేస్తున్నాడో! అయన ఏమి చేయాలో! సలహాలు ఇస్తారట. అంటే వీరిద్దరు రాజకీయ దర్శకుల పాత్ర పోషిస్తున్నారన్నమాట-భేష్!

పాటు అప్పటి వరకూ ఆ కొండ శిఖరానికి అంటిపెట్టుకుని వేలాడుతూ వుండిపోయిన ఇరవై అడుగుల బ్రిడ్జికనెక్టర్ బలమైన మోకుల సహాయంతో బరువుగా పైకి లేవనారంభించింది. మూడు నిమిషాల వ్యవధిలో ఆ కొండ శిఖరానికి అవతలున్న అసలు వంతెన వరకూ వున్న ఖాళీని పూరిస్తూ లేచి బల్లపరుపుగా నిలబడిపోయింది.

ఆ బ్రిడ్జ్ కనెక్టర్ లేకుండా అవతలివైపున్న వంతెన చేరుకోవడం ఎవరికైనా అసాధ్యం.

వంతెనకు కనెక్షన్ యేర్పడగానే ఆ వేట కుక్కలు రెండూ ఒకేసారి ముందుకురికాయి. వజ్రపాణి వాటి కళ్ళేలు బలంగా బిగించి పట్టుకుని చకచకా ముందుకు నడిచాడు.

రెండున్నర కిలోమీటర్ల పొడవైన నాటు వంతెన. బలమైన మోకుతోనూ, అడివి దుంగలతోనూ కట్టబడింది. వేటకుక్కలతో సహా వజ్రపాణి హంటర్స్ బూట్ల చప్పుడు చేసుకుంటూ ముందుకు నడుస్తుంటే వుయ్యాల వూగినట్టుగా వూగుతోంది.

ఆ వంతెన మీద ఒకేసారి నలుగురైదుగురికంటే పోలేరు. అంతకంటే యెక్కువమంది దానిమీద నిలబడితే వంతెనకు కట్టిన మోకులు తెగిపోయే ప్రమాదం వుంది. డైమండ్‌ఫీల్డ్స్ నుంచి యెవరైనా తిరుగుబాటుదారులు పారిపోవడానికి ప్రయత్నించకుండా వుండేందుకు వీలుగా ఆ వంతెనని అంత బలహీనంగా కట్టించాడు వజ్రపాణి.

వంతెన ఈ చివరి నుంచి ఆ చివరికి చేరుకోవాలంటే ఎవరికైనా చాలాసేపు పడుతుంది. వజ్రపాణి ఆ చివరికి చేరుకునేటప్పటికే అవతలివైపు బ్రిడ్జ్‌కనెక్టర్ పైకిలేచి తన స్థానంలో తాను నిల్చుంది.

వంతెనకు అవతలివైపు మరో జీప్ సిద్ధంగా వుంది.

జీపు పక్కనే నిలబడివున్న నలుగురు గార్డ్స్ వజ్రపాణిని చూస్తూనే సెల్యూట్ చేశారు.,

వాళ్ళ సెల్యూట్ కూడా స్వీకరిస్తూ వజ్రపాణి ఠీవిగా ముంధుకు నడిచాడు. అతని రెండు కుక్కలూ చెంగున పైకెగిరి జీపెక్కి కూర్చున్నాయి. వజ్రపాణి డ్రైవింగ్ సీట్లో కూర్చుని జీపుస్టార్ట్ చేశాడు. ఆ మరుక్షణం దుమ్ము లేపుకుంటూ శరవేగంతో జీపు ముందుకు దూసుకుపోయింది.

డైమండ్ ఫీల్డుతో యే మాత్రం



సంబంధం లేకుండా విడిగా యేర్పాటు చేయ బడి వున్న మార్గమది.

వజ్రపాణి ఎనభై మైళ్ళ స్పీడుతో జీపు నడిపిస్తూ హెలిపేడ్ వున్న చోటుకు పదిని మిషాల్లో చేరుకున్నాడు.

విశాలమైన స్థలంలో యేర్పాటు చేయ బడివున్న ఆకర్షణీయమైన హెలిపేడ్ అది. హెలికాప్టర్ దిగవలసిన చోటును సూచిస్తూ తెల్లని పెయింట్‌తో నేలమీద గుర్తులు గీయ బడి వున్నాయి. హెలిపేడ్ పరిసర ప్రదేశాల్లో అందమైన పూలమొక్కలతో కృత్రిమ మైన తోటవేశారు.

అక్కడికి సమీపంలోనే అద్దాలతో ఆకర్షణీయంగా కట్టిన గ్లాస్‌హౌస్ ఒకటుంది. హెలికాప్టర్‌లో వజ్రపాణి డైమండ్ ఫీల్డ్స్‌ను సందర్శించే వి.ఐ.పి. విజిటర్లకు విశ్రాంతిభవనం ఆ గ్లాస్‌హౌస్.

వజ్రపాణి హెలిపేడ్ చేరుకుంటూనే అక్కడే వున్న పదిమంది గార్డ్స్ వర్సగా నిలబడి అతనికి సెల్యూట్ చేశారు.

వజ్రపాణి సెల్యూట్ స్వీకరిస్తూ రిస్టు వాచీ చూసుకున్నాడు.

హెలికాప్టర్ రావడానికి ఇంకా సరిగ్గా మూడు నిమిషాలు టైముంది.

సరిగ్గా అదే సమయంలో గ్లాస్‌హౌస్ లోంచి ఓ వ్యక్తి కుంటుకుంటూ అక్కడి కొచ్చాడు.

"హలో బాస్!"

అతన్ని చూస్తూనే వజ్రపాణి మొహం ప్రసన్నంగా మారింది.

ఆ వ్యక్తిపేరు బైరాగి.

వజ్రపాణికి దాదాపు కుడిభుజం వంటి వాడు.

చూడ్డానికి సన్నగా రివటలా మాసిన గడ్డంతో అమాయకంగా కనిపించినా చాలా ప్రమాదకరమైన వ్యక్తి. అతనికి ఓ కాలు కొద్దిగా కుంటి. వజ్రపాణికి సంబంధించిన పూర్తి వివరాలు తెలిసిన వ్యక్తి బైరాగి ఒక్కడే.

అంతేకాదు.

డైమండ్ ఫీల్డ్స్‌లోనూ డైమండ్ ఫీల్డ్స్ వెలుపలా వజ్రపాణి వ్యవహారాలు నడిపించే ఏకైక వ్యక్తి కూడా బైరాగే.

"హలో బైరాగీ!" ఛీర్‌ఫుల్‌గా అన్నాడు వజ్రపాణి.

గారపళ్ళు బయటపెట్టి అదోలా నవ్వేడు బైరాగి.

"వజ్రపాణి ది గ్రేట్ కూడా ఒక్కోసారి మోసపోతారని నాకిప్పుడే తెలిసింది బాస్!"

అతను చెబుతున్నదేమిటో వజ్రపాణికి బోధపడలేదు.

"ఏమిటి వాగుతున్నావు బైరాగీ?"

బైరాగి గారపళ్ళు బయటపెట్టి మరోసారి వికారంగా నవ్వేడు.

"మనం చేస్తున్న చాలా పనులకు ముసుగేయడానికి పనికొచ్చిన మేనీటర్ మూడురోజుల క్రితమే చంపబడిందన్న వార్త మీదాకా రాకుండా మనవాళ్ళే దాచిపెట్టారు" అన్నాడు.

ఆ మాట వింటూనే వజ్రపాణి వులిక్కిపడ్డాడు.

"మేనీటర్ని చంపేశారా? ఎవరు?!!!"

అంతులేని ఆశ్చర్యంతో ప్రశ్నించాడు.

"అది నాకూతెలీదు. ఎవడో పులిరాజట. అడవిలో మూడు రోజుల్నించీ ఆ పులిరాజు గురించే చర్చ!"

వజ్రపాణి కనుబొమలు ముడివేశాడు.

పులిరాజు!

ఎవరతను?!!!

అంతలోకే అతని కళ్ళు ఎర్రగా మారేయి.

"మేనీటర్ చచ్చిపోయిన సంగతి నాదాకా ఎందుకురాలేదు?" తీవ్రంగా అడిగాడు.

"అది నన్నడక్కండి బాస్. మేనీటర్ చచ్చిపోయిన సంగతి అడవిలో అందరికీ తెలుసు. ఆ సంగతి తెలియనట్టే నటిస్తూ మనవాళ్ళు మీరు చెప్పిన ప్రకారం మల్లిని మేనీటర్ తినేసిందని అందరితోనూ చెబుతున్నారు. నిజానికి మల్లిని మేనీటర్ తినే అవకాశమే లేదు."

"డామిట్! బ్లడీఫూల్స్! ఎందుకలా చేశారు? అడవిలో మనమీద ఎవరికైనా అనుమానం వస్తే? వాళ్ళ ఆడపిల్లల్ని మనం చంపుతున్నామని తెలిస్తే అడవిలో తిరుగుబాటు లేచే ప్రమాదం వుందని తెలీదా?"

బైరాగి భుజాలెగరేశాడు.

"ఆ విషయం నాకు తెలీదున్నానుగా బాస్. బహుశా మీకు చెప్పే ధైర్యం లేక

వజ్రసంకల్పం నేపథ్యంలో....

సహజ సిద్ధమైన ముత్యాలకూ కృత్రిమ ముత్యాలకూ తేడా ఏమిటి ?

ముత్యాలు కొన్ని సహజమైనవని కొన్ని కృత్రిమంగా తయారయినవనే సంగతి మనకు తెలుసు. అయితే, ప్రస్తుతం ప్రకృతి సహజమయిన ముత్యాలు దొరుకుతున్నాయా అనే అనుమానం మనకు కలుగుతుంది. పూర్వం మధ్యధరా సముద్రంలో, ఎర్ర సముద్రంలో, పర్షియన్ జలసంధిలో, సిలోన్ సముద్రంలో, హిందూమహాసముద్రంలో, వెనిజులా తీరప్రాంతాలలో ప్రకృతిసిద్ధంగా ముత్యాలు దొరుకుతుండే వి కానీ ప్రస్తుతం ఇటువంటి సహజమయిన ముత్యాలు దొరకటంలేదనే చెప్పవచ్చు.

మరో సందేహం ఏమిటంటే-సహజసిద్ధమయిన ముత్యాలు, కృత్రిమంగా తయారు చేసిన ముత్యాలకంటే విలువయినవా?

ముత్యాలపై సామాన్యుని ప్రశ్నలు

కావు. సహజసిద్ధమయిన వాటికి, కృత్రిమమయిన వాటికి పెద్దగా తేడా కనిపించదు. ప్రత్యేకమయిన లక్షణాలున్న సహజమయిన ముత్యాలకు మాత్రం విలువ ఎక్కువే కానీ అటువంటివి దొరకడం అరుదు.

కృత్రిమమయిన ముత్యాలు ఆకారంలో పెద్దగా ఉంటాయా? - జపాన్ నీటిలో తయారయ్యే ముత్యాల వ్యాసం సాధారణంగా 5 నుండి 6 మిల్లీమీటర్లు వరకు ఉంటుంది. కొన్నింటికి మాత్రం 8 నుండి 10 మి.మీ. వరకు వుంటుంది. ఆస్ట్రేలియా, బర్మా


ఇంతవరకూ సాగిన కథ - *19* : విశ్వధరవర్మకు తండ్రి అనంతరం మిగిలిన బీడు భూమిలో బావి త్రవ్వుతుండగా దొరికిన అపురూప వజ్రాన్ని అతని దాయాది అయిన వజ్రపాణి - అడ్డువచ్చిన విశ్వధరవర్మ పెద్ద కొడుకు రాజేంద్రవర్మను, అతని కుటుంబాన్ని చంపి - చేజిక్కించుకుంటాడు. విశ్వధరవర్మ చిన్న కొడుకు నరేంద్రవర్మకు ఉరిశిక్ష పడుతుంది. నగ్నదేవత మైలమ్మ చేతిలో కీలుబొమ్మఅయిన వజ్రపాణితన హవేలీలో బందీ అయిన మల్లిని అనుభవించి చంపేస్తాడు. చిన్నోడి ద్వారా వృద్ధుడు వజ్రపాణి వజ్రపు గనుల రహస్యాన్ని తెలుసుకుని అతినిపై వజ్రకాయుడ్ని యుద్ధానికి పురికొల్పుతాడు.

నీటిలో 18 మి.మీ. వ్యాసం కంటే పెద్దగా ఉన్న ముత్యాలను తయారుచేసే వీలుంది.

కృత్రిమమయిన ముత్యాలన్నీ గుండ్రంగా ఉంటాయా ?- ఉండవు. ఆయిస్టర్ చేపలపై కూడా ముత్యాలు కొంత ప్రయత్నంతో సహజంగానే ఏర్పడతాయి. వీటిలో తేడా లుంటూనే ఉంటాయి. ఆయిస్టర్‌ను కట్ చేయడం వల్ల ముత్యం సగంగా మిగులుతుంది. సాధారణంగా ఇటువంటివి ఉంగరాలలో, చెవి రింగులలో పొదగడానికి ఉపయోగపడతాయి.

కొన్ని ముత్యాలకు కేషి, విత్తనపు ముత్యాలనే పేరు. ఇవి ఇసుక రేణువుకంటే కాస్త పెద్దగా ఉంటాయి. కృత్రిమ ముత్యాలను తయారు చేసేటప్పుడు ఇవి సహజంగా ఏర్పడుతుంటాయి.

మనం గుండ్రంగా ఉన్నాయనుకునే ముత్యాలు కూడా పూర్తిగా గుండ్రంగా ఉండవు. పూర్తి గుండ్రంగా ఉన్న ముత్యాలు అతి అరుదుగా కనిపిస్తాయి. కొన్ని అండాకారంలో ఉంటే మరికొన్ని కాస్త గుండ్రంగా ఉంటాయి.



ముత్యాలలో ఎన్నెన్నో రంగులు వుంటాయి!

సౌందర్య దేవత కార్చిన కన్నీటి బొట్టు ఘనీభవిస్తే ముత్యమౌతుందట. వెన్నెల కిరణాలు ఒకచోట చేరితే వజ్రంలా కనిపిస్తుందట. ఇవి కవుల వర్ణనలు. ముత్యాలను, వజ్రాలను చూస్తే అందరికీ కవిత్వం రాకపోయినా పండితుని నుండి పామరుని వరకు ఎవరికయినా హృదయం స్పందించక మానదు. వీటిని కొనడానికి ప్రధాన కారణం ఇదే. అంతేకాకుండా మారే ఫాషన్లకు అనుకూలంగా మారుతూ, ఎటువంటి నగకయినా కొత్త కాంతినిస్తూ, సంపద రూపంగా ఉండటంవల్లే ముత్యాలకు ఆదరణ ఎక్కువ.

ముత్యాల నెన్నుకోవడం ఎలా?

షాపులో ఒక సైజున్న రెండు ముత్యాలను చూసి కొనుగోలుదారు వాటి ధరలనడిగితే ఒకదాని ధర 1500 రూపాయలని మరోదాని ధర 15,000 రూపాయలనే సమాధానం వినాల్సి ఉంటుందొక్కొక్కసారి. రెండింటి ధరలో ఇంత వ్యత్యాసం ఎందుకుంటుంది? వీటి విలువలు నిర్ణయిండానికి కొన్ని లక్షణాలను కొలబద్దలున్నాయి. క్లుప్తంగా చెప్పకుంటే ఆ లక్షణాలను ఆరించిటిని పేర్కొనవచ్చును.

1. ప్రకాశం : అద్దంలా మెరుస్తుండే ముత్యం యొక్క ఉపరితలందాని కాంతి, ప్రకాశాలను తెలుపుతుంది. నెయికర్ పొరలు ఎంత పట్టంగా ఉంటే అంతగా ప్రకాశంగా ఉంటుంది. దీనికో ప్రయోగం కూడా చేయవచ్చు. ముత్యంపై వెలుగుపడకుండా మీ తలను అడ్డుగా పెట్టి ముత్యాన్ని ఆరంగుళాల దూరంలో ఉంచి చూస్తే కాంతి ఎంత ప్రకాశవంతంగా ప్రతిబింబిస్తే ప్రకాశం అంత ఎక్కువగా ఉన్నట్లు లెక్క.

2. తేజం : పైన పేర్కొన్నది ఉపరితల ప్రకాశ శక్తి. తేజం అంటే ముత్యం లోపల ఉండే కళ. నెయికర్‌లో పలుచని పొరలవల్ల ఈ తేజం ఏర్పడుతుంది.

3. మసకలు : ముత్యాలపై మచ్చలు, గీతలు, ఎగుడు దిగుడులో లేకుండా ఉండాలి. ఎంత మసకగా ఉంటే ముత్యం విలువ అంత తగ్గుతుంది.

4. రంగు : ముత్యాలలో చాలా రంగులుంటాయనే సంగతి చాలా మందికి తెలియదు. ప్రధానంగా ముత్యాలలో తెలుపు, గులాబీ, క్రీమ్, ఆకుపచ్చ, బంగరం, నలుపు రంగులలో ముత్యాలుంటాయి. సాధారణంగా గులాబీ, నలుపు, లావెండర్ రంగులకు విలువ ఎక్కువ.

5. పరిమాణం : ముత్యం పెద్దదయిన కొలదీ విలువ కూడా పెరుగుతుంది.

6. క్రమ ఆకారం : ముత్యం ఎంత క్రమ ఆకారంలో ఉంటే అంత విలువ ఎక్కువ ఉంటుంది. ○

అలా చేశారేమో!"

"బ్లడీపెల్!" వజ్రపాణి కోపంగా యింకేదో అనబోయాడు.

అంతలో ఆకాశంలో హెలికాప్టర్ శబ్దం వినిపించింది.

"ఆల్‌రైట్! ఆ విషయం తర్వాత మాట్లాడుకుందాం!" దృష్టి ఆకాశం వైపుకు తిప్పుతూ అన్నాడు.

ఆకాశంలో తూనీగలాగా ఎగురుకుంటూ వస్తోంది హెలికాప్టర్.

కొద్ది క్షణాల్లోనే నెమ్మదిగా కిందికి దిగుతూ వచ్చి హెలిపేడ్‌మీద లాండయ్యిందది. గాలితోపాటే అక్కడున్న వాళ్ళ క్రాపులు చెదరగొట్టిన దాని ప్రొపెల్లర్స్ సడన్‌గా ఆగిపోయాయి.

వజ్రపాణి కుక్కల్ని బైరాగికి అప్పగించి నవ్వుమొహంతో ముందుకు నడిచాడు.

"వెల్‌కం! వెల్‌కమ్ మైడియర్ ప్రిన్సెస్, మెల్‌కం! దిసీజ్ ఇన్డీడ్ ఎ గ్రేట్ ప్లెజర్!" అభివాదం చేస్తున్నవాడిలా ముందుకు వంగుతూ అన్నాడు.

హెలికాప్టర్లోంచి హైహీల్స్ ధరించిన సుతిమెత్తని పాదం ఒకటి నేలమీదికి దిగింది.

9

సుందర్‌దాస్ షాపులో వజ్రపుటుంగరం

వజ్రసంకల్పం

కొనుక్కొచ్చిన రెండోరోజు పింకీగానీ ప్రభుగానీ తమ తమ అపార్ట్‌మెంట్స్‌లోంచి పగలంతా బయటికి రానేలేదు.

వాళ్ళిద్దరూ ఒకే బిల్డింగులో రెండు వేర్వేరు అపార్ట్‌మెంట్స్‌లో వుంటున్నారు.

ఆ బిల్డింగుకు యెదురుగా వున్న బిల్డింగ్ లోంచి ఆ రోజు పగలంతా జూడా, డేవిడ్‌లు పింకీ అపార్ట్‌మెంటుని బైనాక్యులర్స్ గుండా ఒకరి తర్వాత ఒకరు గమనిస్తూనే వున్నారు.

పింకీ ఆ పగలంతా యేదో లావుపాటి ఇంగ్లీషు థ్రిల్లర్ చదువుతూ వుండిపోవడం వాళ్ళకు కనిపిస్తూనే వుంది. ప్రభు ఈలోపల ఒక్కసారి కూడా ఆ అపార్ట్‌మెంట్లో అడుగుపెట్టిన పాపాన పోలేదు.

"జూడా!"

"ఊ?"

"ఇంతకీ యేం జరుగుతోందంటావ్?"

"ఏమీ జరగట్లేదు. ఏం జరగబోతోంది అన్నదే ప్రశ్న!"

"ఎందుకు యేమీ జరగట్లేదంటావ్?"

"బావుంది! ఆ సంగతి నాకు తెలిస్తే ఇక్కడ గంటల తరబడి బైనాక్యులర్స్ పట్టుకుని పడిగాపులు కాసే ఖర్మ నాకెందుకంట?" విసుక్కున్నాడు జూడా.

"అదికాదు జూడా.!"

"మరేమిటి?"

"వాళ్ళేదైనా చెయ్యదల్చుకుంటె ఈ పాటికిబైటికి యెందుకు రాలేదంటావ్? వాళ్ళా వుంగరం కావాలనే కొనుక్కున్నారేమో!"

"డేవిడ్!"

"ఊ!"

"సీది మట్టిబుర్ర!"

"ఆదేం?"

"యాభై వేల రూపాయల వజ్రపుటుంగరం షోకుకోసం పింకీ కొంటుందంటే నేన్నమ్మను. ఆ కొనుగోలు వెనక యేదో మర్మం వుంది!"

"అదేమిటంటావు?"

"ఆ వుంగరం కొనుక్కోవడానికి వాళ్ళు సెట్ చేసుకున్న పద్ధతి చూడు."

"ఏమిటది?"

"మొదట ఫారిన్ కార్లో వెళ్ళారా- ఎవర్దో ఫారిన్‌కారు అదేపనిగా పట్టుకొచ్చి అందులో షాపింగ్‌కెళ్ళే అవసరమేముంది? షాపు వాళ్ళకు తాము కోటీశ్వరులన్న అభిప్రాయం కలిగించడానికై వుండాలి!"

"పాయింటే!"

"అక్కడ వాళ్ళతో చెప్పుకున్నట్టు ఆ వుంగరం తమ కోసమే అయితే పెళ్ళి జరగబోతున్న దాఖలా లేవీ?"

"ఇదీ పాయింటే!"

"పింకీలాంటి కిలాడీ పిల్ల యాభై వేలు పెట్టి వుంగరం కొనదు."

"ఇది కూడా పాయింటే!"

"వుంగరం కొన్నాక క్యాష్ పేచెయ్యక చెక్కెందుకిచ్చినట్టు?"

"అవునవును ఆ పాయింటు నేనే చెప్పాను!" ఆనందపడిపోతూ చెప్పాడు డేవిడ్.

జూడా అతని మాట ఖాతరు చెయ్యలేదు.

"అన్నింటికన్నా ముఖ్యమైన ప్రశ్న- ఈరోజు బ్యాంక్ హాలిడే! రేపు కూడా బ్యాంక్ హాలిడే! షాపు వాళ్ళు ఆ చెక్ మార్చుకునేందుకు రెండురోజులు గ్యాప్ వచ్చేలా పింకీ యెందుకు చేసింది? అక్కడే యేదో మర్మముంది!"

"మర్మంలేదు యేమీ లేదు. ఆ చెక్కు షాపు వాళ్ళు మార్చుకునే లోపల వీళ్ళు వుడాయిస్తారు- ఆ చెక్కు చెల్లదు."

జూడా తల అడ్డంగా వూపేడు.

"మరి యిప్పటికే వుడాయించలేదేం?"

డేవిడ్ తెల్లమొహం వేశాడు.

"లేదు డేవిడ్! వాళ్ళేదో చెయ్యబోతున్నారు. అదేమిటో మనం తెలుసుకోవాలి" అన్నాడు జూడా.

ఆ మాట అంటూనే హఠాత్తుగా అతను తన కుర్చీలో నిటారుగా అయ్యాడు.

"ఏమైంది? పింకీ బైటికొస్తోందా? అడిగాడు డేవిడ్."

జూడా తల అడ్డంగా వూపాడు.

"పింకీ కాదు! ప్రభు ఆ బిల్డింగ్‌లోంచి బైటికొస్తున్నాడు. ట్రిమ్‌గా డ్రస్ చేసుకున్నాడు. పింకీ లేకుండా అతనొక్కడే బయల్దేరాడంటే యేదో విశేషమే వుండాలి. డేవిడ్! నువ్వో పనిచెయ్యాలి. వెంటనే వెళ్ళి మన కార్లో ప్రభుని వెంబడించు. నేనిక్కడే వుండి పింకీని గమనిస్తూ వుంటాను. క్విక్!"

"రైరో!"

డేవిడ్ హుషారుగా లేచి ఆ గదిలోంచి బయటికి పరిగెత్తాడు.

(ఇంకా వుంది)



పనిలో నిమగ్నమై వున్న శ్రీమతి ప్రీతి భాటియా


అనాధ శ్రేయస్సుకై చేతి పనులు

నాగపూర్‌లో నిమదర్ తెరస్సా యొక్క శాంతి భవన్‌లో కేకుల, పంచదార బొమ్మల ప్రదర్శన ఏర్పాటు చేయబడింద ఈ ప్రదర్శనశాలలో చేతితో చేసిన కేకులకు, పంచదారతో చేసిన జంతువుల బొమ్మలు, చక్కని ఎంబ్రాయిడరీలకు విశేష జనాదరణ లభించి విరివిగా అమ్ముడుపొయ్యాయి

వీటి అమ్మకంపై వచ్చిన రు 41,653 లు అనాదలకు, ఆశ్రితులకు నిలయమైన శాంతిభవన్‌కు విరాళంగా ఇవ్వబడింది విశేషమేమిటంటే ఈ కేకులు, పంచదార బొమ్మలు అడిషనల్ కమీషనర్ అరుణ్ భాటియా సతీమణి శ్రీమతి ప్రీతి బాటియా స్వహస్తాలతో తయారు చేసి శాంతిబవన్‌కు విరాళంగా ఇచ్చారు

శ్రీమతి ప్రీతి ఈ చేతి పనులలో విదేశాలలో తర్ఫీదు పొందారు ఆమె విదేశాలలో ఇలాంటి ప్రదర్శనలు ఏర్పాటు చేసి వున్నారు


అవీ-ఇవీ-అన్నీ




వి. జి. కె. చారి అస్తమయం

ప్రఖ్యాత ఎడిటరు, భగవత్కవి శ్రీమాన్ వెంజమూరి గోపాలకృష్ణమాచార్యులు (65) 1990 జనవరి, 4వ తారీఖున మృతిచెందారు.

శ్రీ వి. జి. కె. చారి శ్రీ వెంకటేశ్వరుని పరమభక్తులు, తిరుమల కొండను 126 సార్లు కాలినడకన ఎక్కిన దీక్షాతత్పరులు. వీరు భక్తి పారవశ్యంతో శ్రీనివాసునిపై వేలాది గీతాలను రచించి స్వయంగా గానం చేసారు. సుప్రసిద్ధ నేపథ్య గాయకులందరు వీరి భక్తి గీతాలను గానం చేశారు. వీరికి ఐదుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. శ్రీమతి రంగమణిదేవి వీరి ఐహిక, ఆధ్యాత్మిక జీవిత భాగస్వామిని.



ప్రముఖ సాంస్కృతిక సంస్థ కళాసాగర్ (మద్రాసు) లో కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శిస్తున్న సుప్రసిద్ధ సినీతార - నర్తకి ప్రభ రమేష్.



హైదరాబాద్‌లోని శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయంలో దాశరథి సంస్మరణ సభలో ప్రముఖకవి, పత్రికా రచయిత శ్రీ గజ్జెల మల్లారెడ్డికి దాశరథి సాహితీ సత్కారం జరిపినప్పటి చిత్రం. ఇందులో శ్రీ ఎం.ఎల్. నరసింహారావు (భాషా నిలయం కార్యదర్శి) శ్రీ దేవులపల్లి రామానుజరావు, శ్రీ గజ్జెల మల్లారెడ్డి, శ్రీమతి నాయని కృష్ణకుమారి, శ్రీ దాశరథి రంగాచార్య ఉన్నారు.

సీరియల్

శత్రుసంహారం

లల్లాదేవి

(గతసంచిక తరువాయి)

ఇంతవరకూ సాగిన కథ - *20* : వైమానికదళ పైలెట్ రాహుల్ తల్లి, భార్య కారు ప్రమాదంలో మరణిస్తారు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలు రాహుల్ సేకరిస్తుండగా కారవెల్లీ విమాన ప్రమాదానికి సంబంధించిన క్రూ బాక్స్‌లోని ఇండికేటర్‌ను దొంగిలించిన దుండగులకోసం పోలీసులు దర్యాప్తు జరుపుతుంటారు. దుండగుల విష వలయం నుంచి బయటపడిన పీయూష రాహుల్ సెక్రటరీగా చేరిందని తెలిసి మండిపడతాడు అలయన్స్ సంస్థ అధినేత దేవిప్రసాద్. అల్లర్లు జరిపి అరెస్టయిన సైతాన్ దళంలోని ఇబ్రహీం సహా అందర్నీ విడిచిపెట్టమని హోంమంత్రి కమీషనర్‌ను ఆదేశిస్తాడు.

"వింగ్ కమాండర్ ఆహూజాస్పీకింగ్"

"నమస్తేసర్! మీరు బాగున్నారా?"

"బాగానే ఉన్నాను. రేపు బయల్దేరుతున్నావా?"

"నో సర్! నాకు మరి కొన్ని నెలలు శలవుకావాలి"

"కొన్నినెలలా? సర్ ప్రయిజింగ్! శలవు యిస్తానన్నా యింటికి వెళ్ళేందుకు యిష్టపడే వాడవికాదు కదా? ఇదేమిటి?"

"పరిస్థితులు అలా ఉన్నాయి సర్"

"ఏదయినా ఆపదలో ఉన్నావా? మా సాయం కావాలా?"

"ఆపదలోనే ఉన్నాను. కాని సాయం అక్కరలేదు సర్! నేనే చూచుకుంటాను. సైనికుడు తోడుకావాలన కూడదు కదా!"

"అదేమిటో నాకు చెప్పు నా బాధ్యత తీర్చుకుంటాను"

"సర్! నాలో రగులుతున్న కసి ద్వేషం బాధ ఇవన్నీ పైకి చెప్పుకుంటే వాటి శక్తి తగ్గిపోతుంది. ఎవరికీ చెప్పదలుచుకో లేదు."

"నువ్వు ప్రమాదాల్లోకి వెడుతున్నావా?"

"సైనికుడుగా ముందుకే పోతాను"

"పరిస్థితి విపరిస్తే నీకోసం నేను కూడ సెలవు పెడతాను"

"వొద్దు సర్! నేను ఒంటరిగానే పోరాడ దలిచాను"

"దట్స్‌గుడ్! సైనికుడుగానే నిన్ను అభినందిస్తున్నాను. డబ్బేమయినా కావాలా? పంపమంటావా?"

"అవసరమయినప్పుడు ముందుగా మిమ్మల్నే అడుగుతాను సర్!"

"ధ్యాంక్యూ! నువ్వు విజయం సాధించి త్వరగా తిరిగిరావాలని కోరుకుంటున్నాను. దేవుడు నీకు తోడుగా ఉంటాడు"

"ధ్యాంక్యూ సర్" రిసీవర్ దింపేసి తల ప్రక్కకు మరల్చి చూచాడు సుషమ్న టాయ్‌స్ ముందుంచుకుని ఆడుకొంటోంది చాలరోజుల క్రితం తాను కొనియిచ్చిన 'మిక్కి మౌస్' అంటే పాపకు యింకా మోజు తగ్గ లేదు. ఆ తరువాతకూడ ఎన్నో కొని యిచ్చాడు.

కాని ఆమె దృష్టిలో తండ్రి కొని యిచ్చిన మిక్కిమౌస్‌కి చాల ప్రాధాన్యత ఉంది. బొమ్మ పాతబడి పోతున్నా దానిమీద ఆమెకున్న ప్రేమ మాత్రం రంగు మాయలేదు.

దానితోనే యిప్పుడు కూడ ఆడుతోంది.

"పాలుతాగావా స్వీటీ?" అని అడిగాడు రాహుల్!

"లేదు పపా! మీరుకూడ వస్తారని ఎదురు చూస్తోంది ఆంటీ"

"వెడదాంపదమ్మా!" పాపని చేతుల్లోకి తీసుకున్నాడు. మెట్లు మీదుగా దిగి క్రింది హాలులోకి వచ్చారు.

డైనింగ్‌టేబిల్ మీద అన్నీసర్ది వారి రాకకోసమే ఎదురు చూస్తోంది తన్వి! ఆ ఇద్దరురావడం గమనించి చిరునవ్వు నవ్వింది.

"బావా! నువ్వు ప్రక్కనుంటే కాని పాలు కూడ త్రాగ నంటోంది పాప! మీరు డ్యూటీకి వెడితే వెంట తీసుకు పోవాల్సిందే!" అంది. ఈ మాటలు విని పాప దిగులుగా ముఖం పెట్టి మళ్ళీ అడిగింది.

"మీరు వెళ్ళిపోతారా పపా!"

"లేదు స్వీటీ! నిన్ను విడిచి నేను వెళ్ళను"

తన్వి వంక చూచింది పాప! "పపా ఎక్కడికీ వెళ్ళరు. వెవ్వెవ్వె" అంటూ వెక్కిరించింది.

"తప్పమ్మా! ఆంటీ చాల మంచి వారుకదా! అలా అనకూడదు"

"సారీ! ఆంటీ! ఇంకెప్పుడూ మిమ్మల్ని వెక్కిరించనులే!"

"ముందు బ్రేక్‌ఫాస్టు తీసుకో!" జామ్ రాసిన రొట్టెముక్కా, ఉడికిన గ్రుడ్డు ఉన్న ప్లేటు అందించింది తన్వి!

"నేను ఎప్పుడు వచ్చినా ఆ సమయానికి మీరు బ్రేక్‌ఫాస్ట్ తీసుకుంటూ ఉంటారేమిటి?" అని అడిగాడు అప్పుడే చెన్నుడు వస్తూ!

రాహుల్ నవ్వాడు.

"నువ్వే ఆ సమయానికి వస్తున్నావనుకుంటాను. రాకూర్చో" అంటూ ఆహ్వానించాడు. చెన్నుడు వారితో కలిసి బ్రేక్‌ఫాస్ట్ తీసుకునేందుకు అంతగా బ్రతిమాలించుకో లేదు

పూర్తి అయిం తరువాత పాపను తీసుకుని వెళ్లిపోయింది తన్వి.

"రాహుల్! ఈ పూట శివాలయం దగ్గరకు పోదామని అన్నావు కదా!"

"అనవసరం, యిబ్రహీం జైలులో ఉన్నాడు'

"అయితే అతన్ని కలుసుకోవటం కష్టమే అనుకుంటాను"

"కష్టనష్టాలదేముంది? మనసుంటే మార్గం కూడ ఉంటుంది"

"శుభస్య శీఘ్రం. బయల్దేరు మరి" అన్నాడు. డ్రెస్ అయేందుకు తన గదిలోకి నడిచాడు. మిక్కీమౌస్ యిచ్చేయ్యమని పాపని అడుగుతున్నాడు చెన్నుడు. యివ్వనని మారాంచేస్తోంది సుషుమ్న!

"మరొక బొమ్మ అయితే యిస్తావా?"

"యిస్తాను"

"ఇది మాత్రం యివ్వవా?"

"ఇవ్వను"

"ఏమిటి దీని స్పెషాలిటీ?"

"పపా నాకు కొని యిచ్చారు"

"అన్నీ పపాయే కొనియిచ్చారు కదా?" చెన్నుడు క్రాస్ ఎగ్జామినేషన్ భరించలేక పాప బిక్కముఖం వేసింది. రాహుల్ బయటకు అడుగుపెట్ట బోతూ ఉండగా టెలిఫోన్ రింగ్ అయింది మళ్ళీ!

"హలో ఎవరు?" అన్నాడు హడావిడిగా!

"నింపాదిగా మాటాడు. నింపాదిగా విను! నింపాదిగా ఆలోచించు"

"ఎవరునువ్వు? నీ లిమిట్స్‌దాటి మాటాడు తున్నావు"

"నాకు లిమిట్స్ ఉండవు. అనుకున్నది సాధించడమే నా లిమిటేషన్"

"ఓ నువ్వా బాస్టర్డ్! ఎప్పుడు బయట కొచ్చావు?"

"కొద్ది గంటలక్రితమే వచ్చాను, ఏం భయంగా ఉందా?"

"భయం నాకెందుకు? నీ గురించే బాధ పడుతున్నాను. పోలీసుల రక్షణనించి వచ్చావంటే విమానంలోంచి సముద్రంలో పడ్డావన్నమాట"

"అంత గొప్పవాడివా?"

"ఒక సాధారణ పైలట్‌ని. నీకు నా గురించి నింపాదిగా తెలుస్తుంది"



"అంతకన్నా ముందే నేను ఒక సంగతి తెలియ చెప్తాను"

"నువ్వు చేసిన పాపాలకి నీకొక భయంకరమయిన శిక్ష సిద్ధంగా ఉంది. అది అనుభవించేలోగా నువ్వు చెప్పదలుచుకున్న వన్నీ నాతోనే చెప్పుకో! ప్రొసీడ్" అన్నాడు రాహుల్!

"క్రూబాక్స్ ఇండికేటర్ భద్రంగా దాచావు"

"దాని గురించి నాకు తెలియదు"

"పీయూషకి ఆశ్రయమివ్వటం రెండో తప్పు"

"నేను చేయాల్సిన మూడో తప్పు మిగిలే ఉంది అది నీ చావు"

"నా మనసులో ఉన్న మూడు ముచ్చటయిన మాటల్నీ నువ్వే చెప్పేస్తున్నావు. ఆగాగు. ముందు పీయూషని చంపుతాను, రెండు పాపని కిడ్నాప్ చేస్తాను మళ్లా. నువ్వు ఆపలేవు. మూడు నిన్ను చంపుతాను"

"ఇందులో ఏఒక్కటీ నువ్వు చెయ్యలేవు"

"ఛాలెంజ్ విసురుతున్నావా? ఈ మూడుపనులూ చేసి యిండికేటర్ సాధిస్తాను"

"బస్తీమే సవాల్! నువ్వేమీ చెయ్యలేని దద్దమ్మవి" రెచ్చగొట్టాడు రాహుల్.

"అయితే కాసుకో! ఈ సాయంత్రంలోగా పట్టపగలు పీయూషని చంపేస్తాను. చాతనయితే రక్షించుకో!" బయటపడిపోయాడు.

"ఆమె దగ్గరకుకూడా సాయంత్రంలోగా చేరుకోలేవు నువ్వు. ఎందుకంటే పీయూషని ఛంబల్ అడవుల్లో దాచాను"

"మూర్ఖుడా! ఇలాంటి కాల్ అండ్ బుల్ కథలు నమ్మి మోసపోతాననుకున్నావా? హోటల్ ఫ్లారిడా మూడవ అంతస్థులో ఆమెను దాచావు. రూంనెంబరు తెలుసుకోటానికి మరో యిరవై నిమిషాలు పడుతుంది వెంటనే చంపేస్తాం. ఇప్పుడా హోటల్‌ను నా మనుషులు ఎన్‌సర్కిల్ చేసి ఉన్నారు. మా అనుమతి లేని మనుషులు రాకపోకలు సాగించలేరు. అర్థమయిందా యిబ్రహీం తడాఖా!" ఉక్రోషంతో చెప్పేశాడు.

వెంటనే రిసీవరు దింపేశాడు రాహుల్. బయటకు పరుగుతీశాడు. చెన్నుడు గురించి పట్టించుకోకుండా బయటకు పరుగుతీయడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది.

"ఏమయింది? ఏమయింది?" తన్వి అడుగుతోంది.

"టెలిఫోన్‌లో ఏవో క్రొత్త సంగతులు తెలిసి ఉంటాయి"

"మళ్లీ ఏం జరుగుతుందో? బావకేమవుతుందో?" అంటూ కుప్పకూలిపోయింది తన్వి. చెన్నుడి బుర్ర పనిచేసింది.

"బహుశా ఏదో ప్రమాదం జరుగుతూ ఉందని తెలిసింది. దాన్ని ఆపేందుకు గజేంద్రమోక్షంలో విష్ణుమూర్తిలా పరుగెత్తాడు." అన్నాడు

"ప్రమాదం వస్తే పాపకేకదా" కన్నీరు నింపుకొని పాపను గుండెలకు హత్తుకుంది తన్వి. చెన్నుడికి ఐడియా వచ్చింది.

ఇంకా క్షణమైనా ఆలస్యం చెయ్యకుండా పాపని తీసుకున్నాడు. ఆమెను వేరేచోటికి తీసుకుపోవాలన్నా తన శక్తిచాలదు. ఎవరయినా దాడిచేసినా తాను రక్షించలేడు.

మెట్లక్రింద చాకలికి బట్టలు వేసే షెల్ఫ్ కన్పించింది.

"పాపా! నాకొక మాట యిస్తావా అమ్మా?"

"చెన్నుడు అంకుల్ మీరు కంగారు పడిపోతున్నారు ఎందుకు? ఒళ్లంతా చెమటలు పడుతున్నాయేమిటి?"

"నాకొక ప్రామిస్ చెయ్యాలమ్మా నువ్వు"

"ఏమిటో చెప్పండి అంకుల్"

"నిన్ను ఈ షెల్ఫ్‌లో కూర్చోపెడతాను. మళ్లీ నేను పిలిచేంతవరకు పలకకూడదు. బయటకు రాకూడదు."

"ఓ అలాగే ! దాగుడుమూతలు ఆడుకుందామా?"

"అవునమ్మా! తమాషా ఆటకాదు. నిజంగా దాగుడుమూతలాట ఆడుకుందాం" అన్నాడు చెన్నుడు.

"అలాగే దాక్కుంటాను" అంది సుషమ్న

"ఎంత గొడవ జరిగినా మాట్లాడకూడదు"

"మాట్లాడను చెన్నుడు అంకుల్! గాడ్ ప్రామిస్"

"వెరిగుడ్ ! అయితే బాక్స్‌లో కూర్చో" పాపను ఎత్తి చాకలికి బట్టలు వేసే షెల్ఫ్‌లో కూర్చోపెట్టాడు. తన్వి నాలుగయిదు చీరలు తెచ్చి దానిలో వేసింది. పైమూత దింపేశారు. వెనుదిరగగానే "అంకుల్! చెన్నుడు అంకుల్! ఆంటీ! ఆంటీ!! అన్న కేకలు విన్పించినాయి. తిరిగి వచ్చాడు. మూత ఎత్తగానే లేచి నిలబడింది సుషమ్న. వీధి వాకిలి తడుతున్న చప్పుడు అయింది. శత్రువులు వచ్చేశారు. చెన్నుడు విపరీతంగా కంగారుపడిపోయాడు.

"ఏమయిందమ్మా! లోపల భయంగా ఉందా? కూర్చోలేవా?" కంగారుగా కంఠస్వరాన్ని తగ్గించి అడిగాడు.

"అదికాదు అంకుల్! నా మిక్కీమౌస్ టేబిల్ మీద వుండిపోయింది. దాన్ని యివ్వరా?"అంది. చెన్నుడు గాలిపీల్చాడు. వాకిలి తలుపులు ఎవరో బాదుతున్నారు. కేకలుపెడుతున్నారు. చెన్నుడు పరుగున వెళ్లి మిక్కీమౌస్ పాపకి యిచ్చాడు.

"యింక చప్పుడు చేయను చెన్నుడు అంకుల్. గాడ్ ప్రామిస్! దొంగలొచ్చేశారు. ష్...ష్...ష్... మీరు వెళ్లిపొండి" అనేసి, షెల్ఫ్‌లో కూర్చుంది సుషమ్న. మళ్లా బట్టలు సర్ది తలుపువేసేశాడు. అప్పటికే ఒళ్లంతా చెమటతో తడిసిపోయింది. శత్రువులు తలుపుల మీద ఎటాక్ చేశారు.

వారు ప్రయోగించిన బలానికి భళ్లున తలుపులు ఊడిపడ్డాయి. అయిదురు వ్యక్తులు విసురుగా లోనికి వచ్చారు. వారిదగ్గర ఆయుధాలు సిద్ధంగా ఉన్నాయి. ముఖాల్లో అన్నింటికి సిద్ధపడి వచ్చిన తెగింపు కన్పిస్తోంది.

"మీరిద్దరుకదలకండి. రాహుల్ ఎక్కడ?" అడిగాడు యిబ్రహీం.

"బయటకు వెళ్లిపోయాడు"

"నేను యిచ్చిన ట్రాప్‌లో పడ్డాడన్న మాట. మంచిదే అయింది. పాప ఎక్క

ఓజోన్ కవచ రక్షణ ఒప్పందం

ప్రపంచ వోజోన్ కవచ రక్షణకు సంబంధించిన ఒప్పందం 1987 లో కుదిరింది. ఈ ఒప్పందం అమలుపై ఏర్పాటైన ఐక్యరాజ్యసమితి పరిసరాల కార్యక్రమ బృందం (యు.ఎన్.ఇ.పి.) యిటీవల నైరోబీలో సమావేశ మయిందట.

ఈ వోజోన్ కవచ రక్షణ ఒప్పందం అమలులో అభివృద్ధి చెందుతున్న దేశాలు తమవంతు కర్తవ్యాన్ని నిర్వహించటంలో సహకరించేందుకు కావలసిన ఆర్థిక చర్యల గురించి చర్చించేందుకు ఈ బృందం సమావేశమైంది.

వోజోన్ కవచాన్ని తినివేస్తున్న రసాయన పదార్థాల వాడకాన్ని వచ్చే పదేళ్లలో 50 శాతం తగ్గించే లక్ష్యంతో ఈ ఒప్పందం కుదుర్చుకోవడం జరిగింది.

దురదృష్టవశాత్తు యిప్పటివరకు కొన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలు మాత్రమే ఈ ఒప్పందాన్ని అంగీకరించాయని, తమ అవసరాలకు తగినన్ని వనరులు లేకపోవటమే ఇందుకు కారణమని యు.ఎన్ ఇ పి. ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు ఆవేదన వ్యక్తం చేశారు. వోజోన్ కవచ రక్షణ కృషిలో ప్రపంచ సహకారం అవసరమని ఆయన అన్నారు.

డుంది?" అన్నాడు క్రూరంగా.

"తనతోపాటే తీసుకుపోయాడు"అన్నాడు చెన్నుడు.

"కథలు చెప్పొద్దు. ఆపదలో ఉన్న మనిషిని కాపాడేందుకు పోయేవాడు పాపను వెంటపెట్టుకు పోతాడా? నమ్మేందుకు అంత దద్దమ్మని అనుకున్నావా? ఈ ఇంటి మీద దాడిచేయాలనుకున్నాను కాబట్టే తెలివిగా అతన్ని యింటిలోంచి తప్పించేశాను. నీ తెలివితేటలు నాదగ్గర ప్రదర్శించకు.

పాప ఎక్కడుందో చెప్పు. లేకపోతే చస్తావు" అంటూ రైఫిల్ బట్ తో అతని మూతిమీద కొట్టాడు ఇబ్రహీం!

పైపన్ను విరిగి పెదవిలో గుచ్చుకుపోయింది. చివ్వున రక్తం చిమ్మింది. చెన్నుడు కళ్ల వెంట నీళ్లు తిరిగాయి.

"చెప్పు పాప ఎక్కడ?"

"నాకు తెలియదు" మరో దెబ్బ పడింది.

"చెప్తావా లేదా? పాప ఎక్కడ?" ఇంకో దెబ్బ పడింది. కెవ్వున అరిచి క్రింద పడిపోయింది తన్వి. రక్తధారలతో సొమ్మసిల్లి పడిపోతున్నాడు చెన్నుడు.

అతన్ని నిలబెట్టి చిత్రహింసలు పెట్టడం ప్రారంభించారు. కాని చెన్నుడు మాత్రం పెదవి కదపలేదు.

"ఇల్లంతా గాలించండి. ఇండికేటర్ దొరికితే మంచిది. లేకపోతే పాపని తీసుకు రండి" అని ఆదేశించాడు ఇబ్రహీం. సైతాన్ దళం విరుచుకుపడింది ఇంటిమీద!

* * * *

ఇబ్రహీం ఇచ్చిన యిరవై నిమిషాలకి ముందుగానే హోటల్ ఫ్లొరిడాకు చేరుకున్నాడు. 'లిఫ్ట్ రిపేరులో ఉంది' అన్న బోర్డు చూసి మెట్ల మీదుగా పరుగుతీశాడు.

త్రీజీరోఫైవ్ తలుపులు మూసి ఉన్నాయి. కాలింగ్ బెల్ నొక్కాడు. నిమిషంలో తలుపులు తెరుచుకున్నాయి. ఈ యిరవై సెకన్లు అరవై యుగాలుగా గడిచాయి.

ఎదురుగా కన్పించింది పీయూష!

తాని సురక్షితమయిన చోటులో ఉన్నాననే విశ్వాసంతో హాయిగా విశ్రాంతితీసుకుందామె.!తాను యిష్టపడని దుష్టజీవితానికి దూరంగా వుండగలిగాననే తృప్తి వల్ల కళ్లలోకి బాగా చురుకుతనం వచ్చింది.

"రాహుల్ ! ఎందుకలా ఉన్నారు?"

"ప్రశ్నలతో కాలాన్ని వృధాచెయ్యకు. ఫాలోమీ!" అంటూ కారిడార్ లో పరుగు లాంటి నడకసాగించాడు రాహుల్.

"లగేజ్ అంతా రూంలో ఉండిపోయింది రాహుల్" అతనిని అనుసరిస్తూనే అంది పీయూష.

"జీవితంకన్నా ఆ వస్తువులు విలువైనవి కావు" ఆమె చెయ్యి పుచ్చుకుని మెట్లమీదుగా పరుగు తీశాడు. ఇంక మాటాడినా ప్రయోజనం ఉండదని అతన్ని అనుసరించిందామె.

రోడ్డుమీదికి వచ్చి టాక్సీలో కూర్చున్నారు.

"అసలేమయిందో చెప్పు రాహుల్."

"నువు చాలా అదృష్టవంతురాలివి. సకాలంలో ప్రమాదంనించి తప్పుకోగలుగుతున్నావు" అన్నాడు నిట్టూర్చి.

"ప్రమాదం ఏమిటి? ఏమైనా తెలిసిందా?" జరిగిందంతా ఆమెకు వివరించి చెప్పాడు. క్షణం పీయూష భృకుటి ముడివడింది. వెంటనే ఆమె మనసులోని ముడులన్నీ విప్పుకున్నాయి.

"రాహుల్! ప్రమాదం వచ్చింది నాకు కాదు. నీకు. నువ్వు చాలా పొరబడ్డావు" అన్నదామె కంగారుగా.

"వాట్ డుయూ మీన్?"

"అవును రాహుల్! ఇబ్రహీం గొప్ప

మోసగాడు. అతను చేయదలచుకున్న పనిలో వీరోచితంగా ముందుకుపోడు. ఒకచోట ఆపరేషన్ నిర్ణయించుకుంటే మరొక చోట ఏదో జరుగుతున్న విధంగా భయోత్పాతాన్ని సృష్టిస్తాడు.

అసలు వ్యక్తుల్ని ఏదో వైపు దారి మళ్ళిస్తాడు. అది అతని స్వభావం. ఎన్నో పనులు కలిసిచేశాం. అతని టార్గెట్ నేను కాదు. ఇండికేటర్ అన్నింటికన్నా ముఖ్యం. నీ యింటి మీద దాడిచేయాలనుకుని నిన్నిలా దారి తప్పించి ఉంటాడని నా అనుమానం" అంటూ వివరించింది పీయూష!

ఈ మాటలు వింటూనే రాహుల్ గుండెలు గుభిల్లు మన్నాయి అతన్ని రెచ్చగొట్టి అసలు విషయం తెలిసుకోగలిగానని అనుకున్నాడతను. కాని ఇబ్రహీం మోసపోయినట్లు నటించి తననే తెలివిగా దారి తప్పించాడు.

ఈ విషయం అర్థమవగానే అతనిలో దుఃఖం ఆరాటం తరంగంలా వువ్వెత్తున లేచినాయి. కారు ఎంత వేగంగా ముందుకు పోతున్నా అతని మనసు ఆందోళనతో నిండిపోతూనేవుంది. ఇంటిముందు కారు ఆగక ముందే క్రిందికి దూకి పరుగు తీశాడు. శివకృప కాంప్లెక్స్‌లోనివారంతా ఆయింటిముందున్నారు. అతనికి బయము, దిగులు రెట్టింపు అయాయి.

పిచ్చిగా వాకిలివైపు పరుగులు తీశాడు.

రక్తపు మడుగులో దీనంగా పడివున్నాడు చెన్నుడు. గొంతుకోసిన గువ్వలా తెలివి తప్పి పడివుంది తన్వి. సుషుమ్న ఎక్కడా కనిపించలేదు. ఇంటిలోని సామగ్రి అంతా చెల్లా చెదురుగా పడివుంది. చుట్టూవున్నవారు కేవలం నిమిత్తమాత్రుల్లా చూస్తున్నారు.

"నా పాప ఏమయింది?" గొంతు చీరుకపోయేలా అరిచాడు ఎవరూ బదులు చెప్పలేదు ముఖాలు చూచుకుంటున్నారు.

"స్వీటీ! ఓ స్వీటీ?" దిక్కులు పగిలిపోయేలా అరిచాడు. మూత పైకెత్తుకుని షెల్ఫ్‌లోనే లేచి నిలబడింది సుషుమ్న. ఆమె ముఖం మీదినుంచి చీరలు క్రిందికి జారివున్నాయి. బేబి ముఖం ఎవరికి కనిపించలేదు. ఆ గదిలో ఏం జరిగిందో ఆ పాపకీ కన్పించలేదు. కిలకిలా నవ్వింది పాప.

"దోబూచ్ పపా! దోబూచి ఆటలో నన్నెవరూ తెలుసుకోలేకపోయారు చూచారా? నేనే గెలిచాను" అంది హుషారుగా! ఎడారిమీద వానజల్లు పడినట్లుగా అన్పించింది. పరుగుపరుగున వెళ్ళి పాపను చేతుల్లోకి తీసుకున్నాడు రాహుల్. బలంగా గుండెలకు హత్తుకున్నాడు చెంపలమీదుగా కన్నీరు కారుతున్నాయి అతని ముఖంలో రెండు రంగులు రెండు భావాలు. రెండు మెరుపులు మనసులో రెండు తీవ్ర స్పందనలు.

పాపను ఎత్తుకొని చెన్నుడి దగ్గరకు వచ్చాడు. అతని శరీరంమీద రెండు గాయాలున్నాయి. ప్రాణం పోలేదు. కారులోకి చేర్పించారు. పగలంతా వైద్యమూ, సపర్యలు జరిగాయి. సాయంత్రానికి ఇద్దరికీ తెలివి వచ్చింది.

ఆ ఇద్దరూ కోలుకుంటారని నమ్మకం వచ్చినా పీయూషని, పాపని రక్షించుకొనే అవకాశాలు తగ్గిపోతున్నాయనే ఆలోచన క్రమక్రమంగా సన్నగిల్లుతోంది. ధైర్యం దిగజారుతోంది.

హాస్పిటల్‌లోవున్న ఆ గది వాకిలి దగ్గర మోల్డామీద దిక్కుతోచనివాడిలా కొన్ని గంటలు కూర్చుండిపోయాడు. చెన్నుడి కుటుంబ సభ్యుల రాగాలు ఇంకా తగ్గలేదు.

పీయూష గదిలో చేతులు కట్టుకుని పచారులు చేస్తుంది. కొంత సేపు అయింతర్వాత అతనికో విచిత్రమైన ఆలోచన వచ్చింది రౌడ్స్ తిరిగేందుకు వచ్చిన డాక్టర్‌ని అడిగాడు.

"ఈ రాత్రికి వీ రిద్దరికి తోడుగా ఎవరుండాలి డాక్టర్"

"ఇంకేమీ భయంలేదు. ఎవరైనా ఒకరుంటే చాలు".

"నేనుంటాను బాబూ!" అంటూ చెన్నుడు కుటుంబ సభ్యులు ఒకరిమీద మరొకరు పోటీలు పడుతున్నారు. ఆ విషయం తెలుసుకొనే బాధ్యతని వారికే వదిలేసి బయల్దేరాడు రాహుల్.

తెలిసిన ఓ పోలీసాఫీసర్‌కి ఫోన్‌చేసి సాయుధుడయిన గార్డుని ఎస్కార్ట్‌గా పిలిపించుకున్నాడు. అతను వచ్చాడు.

కారు డ్రైవ్ చేస్తున్నాడు రాహుల్. ప్రక్కనే కూర్చుంది పీయూష. వెనుక సీట్లో గార్డు ప్రక్కనే కూర్చుంది సుషుమ్న.

"పోలీస్ అంకుల్! ఈ మిక్కీమౌస్ పపా కొనిపెట్టారు. చాలా బాగుందికదూ!?" అని అడుగుతోంది.

"అవునమ్మా చాలా బాగుంది" అంటున్నాడు గార్డు. ప్రతివారినీ తాను ప్రేమించే మిక్కీమౌస్ గురించి ఆలోచించేలా చేస్తుంది సుషుమ్న. ఒక కంట వారిని గమనిస్తున్న రాహుల్ నవ్వుకున్నాడు.

ఒక వీధి మలుపులో దీపకాంతులు అంతగా విస్తరించనిచోటున కారును నిలిపివేశాడు రాహుల్. గార్డును వదిలేసి మిగిలిన యిద్దరితో కారు దిగి నడవటం ప్రారంభించాడు.

ఆ లైన్‌లో దీపాలు దూర దూరంగా

వున్నాయి.

రెండు ఫర్లాంగులు నడిచాక పెద్ద ఆవరణలో వున్న చిన్న పెంకుటిల్లు సమీపించారు. సుషుమ్న భయంగా చూస్తుంది. ఆ యింటిలో తక్కువ కాంతిలో దీపాలు వెలుగుతున్నాయి. బాగా దగ్గరకు పోయాక ఒక బోర్డుమీద వెలిసిపోయిన అక్షరాలు కనిపిస్తున్నాయి. యశోద అనాధాశ్రమం!!

బయటి గదిలో ఒక వృద్ధురాలు కూర్చుని వుంది.

"యశోదమ్మగారూ!" అని పిలిచాడు రాహుల్.

"ఎవరుబాబూ నువ్వు."

"ఫ్లయిట్ లెఫ్టినెంట్ రాహుల్‌ని వచ్చానండీ!"

"సువ్వానాయనా! రారా! ఎంతకాలానికి వచ్చావు? అమ్మగారు ఈమధ్య కనిపించటం మానేశారు. బాగున్నారా? శలవుమీద వచ్చావా? ఈ యిల్లు ఎలా గుర్తుపట్టావు."

"అమ్మగారు పోయారండీ! మీ గురించి చాలా ఉత్తరాల్లో వ్రాస్తూ వుండేవారు. సమాజంపట్ల నా బాధ్యత గురించి తెలుసుకోటానికి మీలాంటివారిని ఆదర్శంగా తీసుకోవాలని చెప్తూవుండేవారు. ఎప్పుడో ఒకసారి మిమ్మల్ని చూడాలనుకున్నాను. ఇప్పుడు అవసరంకూడా వచ్చింది!"

"ఏమిటన్నావు? అవుసరంవచ్చిందా?"

"అవును యశోదమ్మగారూ! ఎవరి దృష్టినీ ఆకర్షించని చోటుకదా యీ అనాధాశ్రమం. మీరు నాపాపని కొంతకాలం కాపాడాలి" అంటూ పరిస్థితిని వివరించాడు.

అంతా విన్నతర్వాత యశోదమ్మగారు తలాపంకించారు.


"అర్థమైందినాయనా! నువ్వు తిరిగివచ్చి అడిగేవరకు ఈ పాప ఎవరికీ కనిపించదు. సరేనా?"

"పాప ఈ ఆశ్రమంలో ఉండకూడదు. ఇంకా రహస్యమైన చోటుకి వెళ్లిపోవాలి. నాకు ప్రతిరోజూ వార్త అందుతుండాలి. అలా ఏర్పాటు చేయండి."

"అలాగే నాయనా! తండ్రి, బంధువులు వుండికూడా అనాధాశ్రమంలో ఆశ్రయం పొందవలసిన ఈ పాప విషయమంతా నేను చూచుకుంటాను. నువ్వు నిశ్చింతగా వుండు."

పాప లేకుండా తిరిగి వచ్చినవారిని విచిత్రంగా చూస్తున్నాడు గార్డు.

(ఇంకావుంది)



భారతదేశంలోని బ్రహ్మాండమైన విగ్రహం!

కళలకు కాణాచి కర్ణాటక రాష్ట్రము. దాని రాజధాని అందాల నగరము బెంగుళూరుకు 95 మైళ్ల దూరంలో 'శ్రావణ బెళగొళ' అనే చిన్న పట్టణ మున్నది. ఇది సముద్ర మట్టానికి 3500 అడుగుల ఎత్తున ఉంది. ఇక్కడ ఇంద్రగిరి అనే కొండ. దీని ఎత్తు 468 అడుగులు. కొండపై కెక్కడానికి 600 రాతిమెట్లున్నాయి. అక్కడ ఆ కొండ శిఖరంపై ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన జైనముని 'బాహుబలి' బ్రహ్మాండమైన ఏకశిలా విగ్రహ ముంది. దీన్ని క్రీ.శ. 983వ సంవత్సరము, చాపుండరాయుడనే మంత్రి నిర్మింప జేశాడు.

ఈ విగ్రహం ఎత్తు 58 అడుగులు. ముక్కు పొడవు 3 అడుగులు. ఇది పూర్తి నగ్నంగా వున్నట్లు చెక్కబడింది. మానవుణ్ని భవబంధాలు చుట్టుకొని వుంటాయనడానికి సూచనగా, ఈ విగ్రహం కాళ్లు, చేతులకు తీగలు చుట్టుకున్నట్లు మలిచారు. ప్రపంచములో ఎత్తులో ఇది రెండవది; కాని నాణ్యతలో పనితనములో, అందములో ప్రథమమట.

ఇది బాహుబలి విగ్రహము. ఈ భాహుబలినే గోమతేశ్వరుడని, దిగంబరస్వామి అని పిలుస్తారు. దాదాపు వెయ్యేళ్ల క్రితం నిర్మింపబడ్డా, యిప్పటికీ చెక్కు చెదరక వాతావాపాలకు తట్టుకొని, నిల్చియుంది శిల్పరాజము. పంద్రెండేడ్ల కొకసారి మహాకుంభాభిషేక మహోత్సవము జరుగుతుంది. ఆ వుత్సవానికి ప్రపంచమందరి దేశదేశాలనున్న జైనులందరు కదలివచ్చి బాహుబలి దర్శనం చేసుకుంటారు.

-శ్రీమతి ఏ. విజయలక్ష్మీరెడ్డి

పుస్తకాల పేజీ

★ ముత్యాలసరం

కథా సంకలనం సంకలన కర్త ఎం ఆర్ వి సత్యనారాయణమూర్తి, వెల ఎనిమిది రూపాయలు, పుటలు 49, ప్రతులకు రమ్య సాహితీ సమితి, పెనుగొండ- 534320, పశ్చిమ గోదావరి జిల్లా

★ శ్రీ లలితా సహస్రనామస్తోత్రమ్

వెల పది రూపాయలు, పుటలు 67, ప్రతులకు పురాణపండ రాదాకృష్ణమూర్తి, జయశ్రీటాకీస్‌కు కుడి వైపు సందు, రాజమండ్రి-4

★ శ్రీ లలితా స్తోత్ర మంజరి

వెల పది రూపాయలు, ప్రతులకు పురాణపండ రాదాకృష్ణమూర్తి, రాజమండ్రి-4

★ హిమబిందువులు

రచయిత బాల బాస్కర్, పుటలు 44, వెల మూడు రూపాయలు, ప్రతులకు శ్రీ సాయిరామ్ ప్రింటింగ్ వర్క్స్, విజయవాడ-4

★ పాలకడలి

రచయిత నాదెళ్ల జనార్ధనరావు, పుటలు 76, వెల ఆరు రూపాయలు, ప్రతులకు నాదెళ్ల జనార్ధనరావు, 1-10-217/ ఆర్ 19, ఆర్ ఆర్ గోపాల్ బిల్డింగ్స్, బేగంపేట, హైదరాబాద్- 500016

★ శ్రీ సత్యసాయి శతకము

రచన "చేతన", పుటలు 27, వెల ఐదు రూపాయలు, ప్రతులకు శ్రీ వాణి పబ్లికేషన్స్, కేరాఫ్ మేడిపల్లి రామనాధశర్మ, హెచ్ నెం 5-1-116, సుగ్గులవారి తోట, ఖమ్మం, శ్రీ యమ్వీ లక్ష్మీనారాయణ, ఆంధ్రోపన్యాసకులు, శీలం సిద్ధారెడ్డి జ్యోతి కళాశాల, ఖమ్మం-3

ప్రజల ఎదురుతెన్నులు పాలకుల తీరు తెన్నులు

(శ్రీ వడ్డే శోభనాద్రీశ్వరరావు లోక్‌సభలో చేసిన ఆంగ్ల ప్రసంగాల అనువాద గ్రంథం.) అనువాదకుడు : డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, పుటలు: 352, వెల: ముప్పదిరూపాయలు, ప్రతులకు: వి. వి. ఎ. ప్రసాద్, 11-321, శ్రీనగర్ కాలనీ, విజయవాడ-520 008

లోక్‌సభ సభ్యుడు శ్రీ వడ్డే శోభనాద్రీశ్వరరావు పార్లమెంటులో చేసిన అనేక ఆంగ్ల ప్రసంగాలను డాక్టర్ ప్రసాద్ అందరికి అర్థమయ్యే రీతిలో తెలుగులోకి అనువదించేందుకు విశేష కృషి జరిపి సఫలీకృతులయ్యారు.

రిజర్వేషన్ల పేరుతో సమాజంలో విషక్షత పనికిరాదని, ఉగ్రవాదాన్ని నిర్మూలించాలని, అవినీతిని రూపు మాపాలని - యిలాగే వివిధ రంగాలకు చెందిన అనేక ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకు రావటమే కాకుండా వాటి పరిష్కారానికి అనేక సూచలను అందజేశారు.

కేంద్ర, రాష్ట్ర సంబంధాలకు అద్దంపట్టే ఈ ప్రసంగాలు అటు ప్రజా ప్రతినిధులకు యిటు సామాన్య ప్రజానీకానికి ఎంతో ఉపయుక్తం కాగలవు. వీటిని తెలుగులోకి అనువదించిన డాక్టర్ యార్లగడ్డ అనువాదంకూడా బాగుంది.

(1) చరిత్ర పురుషులు- చారిత్రక సంఘటనలు

రచన- ఎం డి సౌజన్య ప్రచురణ- జనప్రియ పుస్తకమాల

ప్రతులకు- పల్లవి పబ్లికేషన్స్, విజయవాడ-2

సోక్రటీజ్, ఆర్కిమెడిస్, లియొనార్డోడావిన్సీ, రాజారామమోహన్‌రాయ్, బెర్నార్డ్‌షా, గాంధీ రామానుజమ్, హిట్లర్ మొదలైన చరిత్ర పురుషుల జీవితాలలో ముఖ్య సంఘటనలు ఈ పుస్తకంలో క్లుప్తంగా కూర్చబడ్డాయి

(2) ప్రపంచ అద్భుతాలు

రచన- ఎం డి సౌజన్య, కె వి ఎన్ ఎమ్ ప్రసాద్

ప్రచురణ- జనప్రియ పుస్తకమాల

ప్రతులకు- పల్లవి పబ్లికేషన్స్, విజయవాడ-2

బిగ్‌బెన్ గడియారం, పీసాటవర్, బెర్ముడా ట్రయాంగిల్, తాజ్‌మహల్, ఆంగకర్ వాట్ వంటి అనేక ప్రపంచ అద్భుతాలు కొన్ని ఈ పుస్తకంలో వివరించబడ్డాయి'

★ శ్రీమాత

రచయిత మానాప్రెగ్గడ వేంకట సుబ్బరాయకవి, "శ్రీనివాస జ్యోతిషాలయమ్", తాడేపల్లిగూడెం- 534101(ప గో జిల్లా)

★ రేపటి గీతం

కవితా సంకలనం రచయిత వై నాగేంద్రరావు, పుటలు 24, వెల ఐదు రూపాయలు, ప్రతులకు వై నాగేంద్రరావు, కేరాఫ్ కోణార్క ప్రింటర్స్, పెండెం వారి వీది, కావలి- 524201

★ అక్షరోదయం

రచయిత మోదు రాజేశ్వరరావు, పుటలు 49, వెల ఐదు రూపాయలు, ప్రతులకు బుక్‌సెంటర్, మెయిన్‌రోడ్, విశాఖపట్నం-1, లిటరరీ బ్యాంకు, ఎ-187, గాంధీగ్రాం, విశాఖపట్నం-5

★ భగవాన్ మహావీర్

కవితా సంకలనము పుటలు 40, వెల ఐదు రూపాయలు, ప్రతులకు శ్రీ సంబవ్‌నాధ్‌జైన్ శ్వేతాంబర్ మూర్తి పూజక్ సంఘ్ టెంపుల్ స్ట్రీట్, విజయవాడ-1

★ దృశ్యం

వచన కవితాసంపుటి రచయిత సాదనాల వేంకటస్వామి నాయుడు, పుటలు 72, వెల పదిహేను రూపాయలు, ప్రతులకు ఎస్ వి ఎస్ నాయుడు, 46-11-41, దానవాయిపేట, రాజమండ్రి- 533103, నవయుగ బుక్ హౌస్, కోటి, హైదరాబాద్- 5^0001

○


జాతీయ కవి ముదిగొండ



ఆకాశవాణి న్యూఢిల్లీ కేంద్రం నిర్వహించే అఖిల భారతీయ కవి సమ్మేళనంలో ఆకాశవాణి 'జాతీయ కవి'గా గుర్తించిన డాక్టర్ ముదిగొండ శివప్రసాద్ పాల్గొన్నారు దేశసమగ్రత, సమైక్యతలు యితివృత్తంగా ఈ కవి సమ్మేళనం ఏర్పాటయింది. అన్ని ఆకాశవాణి కేంద్రాలూ ఈ తెలుగు కవితను తమ తమ భాషానువాదాలతో ప్రసారం చేసాయి

శ్రీ శివప్రసాద్ యిప్పటికి 30 నవలలు, రెండు ఖండకావ్య సంపుటాలు ప్రచురించారు వీరు వ్రాసిన 'శ్రీ పదార్చన'కు రాష్ట్ర ప్రభుత్వ అవార్డు కూడా లభించింది. తెలుగు భాషకు ప్రాతినిధ్యం వహిస్తూ ఈ కవి సమ్మేళనంలో శ్రీ శివప్రసాద్ పాల్గొనటం ఆంధ్రులకు గర్వకారణమనే చెప్పాలి

సాహితీ పజిల్ — గెల్చుకోండి రు. 200



గళ్ల నుడికట్టు-22

ఆధారాలు

నిలువు

1 చంద్రుడు ఈరోజు అందంగా ఉంటాడు
3 ఇంద్రత్వం పోయి అజగరమయ్యాడు
4 భూతము పని అయిపోయింది.
8. కపాలం గలవాడు శివుడు
9. విశేషంగా కొమ్ములుంటే నక్షత్రం
10 ఇది పడుచువారికి పైల ఒక అక్షరం తగిలించండి బాగుంటుంది.
11 10, నిలువే దీనికి ఆధారం
14. రామాయణంలో వీని రాయబారం ప్రసిద్ధం.
15 పూర్వం యుద్ధాలలో ఇది ప్రముఖమైన ఆయుధం.
17 ఇది కలవాడు భోగి

అడ్డం

2. మీరజాలగలడా నా...సత్యాపతి.
5. సముద్రఘోషను ఇలా అంటారు.
6 ఇది మానవుడు దేవుడ్ని చేరే మార్గం
7 12 మంది సూర్యుల్లో ఒకడు.
12 దివ్యూరి రామిరెడ్డి ఉమ్మర్ ఖయామ్
13 భీముడు వంటవాడు
16 జగమే మాయ
18 ధనువును ఎక్కుపెట్టండి ఆవు వస్తుంది
19 ఈ గుణాన్నిబట్టి త్యాగయ్య కాపేరు పెట్టారు
20 మానవ ప్రగతికి ఇవి పవిత్రమయిన ప్రదేశాలు

ఆధారాలున్నాయి. నుడికట్టు గళ్లు నింపండి! ఈ కూపన్ కత్తిరించి మీ చిరునామా రాసి పంపండి. ఆల్ కరెక్టు సొల్యూషన్ పంపిన వారికి రు.200/-లు బహుమతి లభిస్తుంది-ఒకరికన్నా ఎక్కువమంది కరెక్టు ఆన్సర్లు పంపితే వారికి బహుమతి మొత్తం పంచడం జరుగుతుంది. తుది నిర్ణయం సంపాదకునిదే. -ఎడిటర్

ముగింపు తేది: 29-1-'90

ఆంధ్రసచిత్రవారపత్రిక

పంపినవారి పేరు...

పూర్తి చిరునామా...

....పిన్ కోడ్.............

–కూర్పు. పంగలి వి. కృష్ణారావు

గళ్ల నుడికట్టు-20

ఫలితాలు: బహుమతులు

వందలాదిమంది పాఠకులు అత్యంత ఉత్సాహంతో ఈ పోటీలో పాల్గొన్నారు. వారందరికీ మా అభినందనలు. సరైన సమాధానాలు ఈసారి ఎనిమిది మంది మాత్రమే పంపగలిగారు. బహుమతి మొత్తం రు. 200/-లను ఈ ఎనిమిది మందికి పంచడం జరిగింది. ఒక్కొక్కరికి రు. 25/-ల వంతున త్వరలో ఈ బహుమతులు నగదు రూపంలో వారికి పంపే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఒకరు ఎన్ని కూపన్ లైనా పంపవచ్చును. కాని తెల్లకాగితంమీద వ్రాసిన కూపన్ లు చెల్లవు. పత్రికలో కూపన్ నేనింపి పంపాలి. మీ జవాబులు మా వద్దగల సీల్డు జవాబుకి సరిపోవాలి. ఒక పజిల్ లో ఒకరికి ఒక బహుమతికంటే ఎక్కువరాదు. - ఎడిటర్

■	1 అ	■	2 అ	3 ప	ర్ణ	■	4 ఊ	■
5 క	ప్ప	ము	■	ర	■	6 ఊ	ర్ధ్వ	క
■	ము	■	7 త	శు	ప్ర	■	శ్వ	■
8 మ	■	9 త	■	పు	■	10 ని	■	11 స
12 త	మ్మి	చూ	వి	■	13 శ	కుం	తో	ల
ము	■	కి	■	14 నా	■	జం	■	క
■	15 కా	■	16 వా	టు	ము	■	17 ల	■
18 స	మ్మ	తి	■	క	■	19 ప్ల	వం	గం
■	న	■	20 సో	ము	డు	■	గం	■

సరైన జవాబులు పంపినవారి పేర్లు

గొల్లపూడి హైమవతి (హైదరాబాద్), అలపర్తి హైమవతి (నందివెలుగు), రమాదేవి (విజయవాడ), ఎస్. శ్రీవల్లి (రేపల్లె), ఎస్.సిహెచ్. శాస్త్రి (ఖమ్మం), కె. లలిత (సికింద్రాబాద్), కె. సరోజిని (ముదిగుబ్బ), పి.వి. సుబ్బారావు (పాలకొల్లు).

సంక్రాంతి సంచిక

ఎన్నాళ్ళ నుంచో రాని మా (మీ) పత్రిక కోసం ప్రతి రోజూ 'బుక్ స్టాల్స్'లో చూచేవాడిని ఈ రోజొస్తుంది, రేపొస్తుంది అని సరిపెట్టుకుంటూ వుండేవాడిని ఎంతకూ రాకపోయే సరికి ఇక పత్రిక రాదనుకునే సమయంలో హఠాత్తుగా (10-1-90) లైబ్రరీలో దర్శనమిచ్చింది అయినా పాత పత్రికేమో అనుకున్నాను ముఖచిత్రం చూస్తే సంక్రాంతి సంచిక అని చూచి ఎంత సంతోషించానో చెప్పడానికి మాటలు రావటం లేదు నా అభిమాన శీర్షికలు టిట్ ఫర్ టాట్, యువతా కవితా, ప్రశ్నావళి, శీర్షికలంటే చాలా యిష్టం ఫోటో వ్యాఖ్య 'పోటీ' లేకపోవడం ఏం బాగలేదు. కనీసం ఇక ముందైనా వారం వారం వుంటే బాగుంటుంది ఇకపోతే దెయ్యాల కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన ఒక ఆత్మకథ బాగుంది కాకపోతే రచయిత్రి 'సస్పెన్స్'ను మధ్యలోనే చెప్పేశారు చివరలో చెప్పి వుంటే ఇంకా బాగుండేది రచయిత్రి ఆకుమళ్ళ పద్మారాజ్యలక్ష్మి'ని ఎక్కడో చూసినట్టుంది రచయిత్రికి నా హృదయ పూర్వక అభినందనలు

టి రాంప్రసాద్,
ప్రొద్దుటూరు

విరహం

చాలాకాలం తర్వాత నా అభిమాన ఆంధ్రపత్రికను చూడగానే ఎగిరి గంతేశానంటే మీరు నమ్మరేమో గాని ఇది పచ్చినిజం ఇన్నేళ్ళ ఎడబాటును ఎలా భరించానా ననిపిస్తుంది క్రొత్త సం లో కొత్త అందాలతో వెలువడి నా బాహువుల్లో బందీ అయింది 1989 లో మాయమై 1990 లో కనబడటం సం ర కాలం అనిపిస్తుంది ఈ తప్పిపోయిన వార్త పత్రికల్లో రేడియోల్లో, టి వి లో ప్రకటన ఇవ్వాలనుకుని అభిమానం అడ్డొచ్చి ఆగిపోయాను ఇదంతా మీకు సుత్తి లాగా ఉందేమో గాని నా విరహబాధ మీకేం తెలుసండి

12-1-90 సంచిక చాలా అందంగా ఉండి అఖిలాంధ్ర పాఠకులకు ఆనందాన్ని పంచి ఇస్తుంది ఈ వారంలో ముఖ్యంగా "పృథ్వికైనా, అగ్నికైనా దేనికైనా దేశరక్షణే లక్ష్యం!" ఫ్లైట్ ఎన్నో వివరాలతో, ఫోటోలతో చాలా విజ్ఞానదాయకమైన విషయాలు అందించినందులకు థాంక్స్ ముఖ్యంగా అన్నిరకాల పాఠకులు నచ్చే మెచ్చే విధంగా నూరు పేజీలతో, నాలుగు రూపాయలకే అందించే పత్రిక నా అభిమాన రచయిత్రి శ్రీమతి మన్నెం శారదగారి 'సూపర్ హీరో' ప్రారంభించినందులకు వారికీ, మీకు నా నూతన సం ర శుభాకాంక్షలతో -

—పోలోజు వెంకటాచారి
బోడుప్పల్

ఈ వారం సలహా

ఎక్కడ పడితే అక్కడ ఉమ్మడం యిండియన్ కల్చర్! కాకపోతే బస్సులో నుంచి ఉమ్మేముందు కిటికీ దగ్గర నిర్భాగ్యుడెవరైనా వుంటాడు. కేకేసి మరీ ఉమ్మండి.

వీక్లీ పోస్ట్

చాలాకాలం

నూతన సంవత్సర శుభాకాంక్షలతో రచయిత కె కె రఘునందన వ్రాయునది చాలా కాలానికి ప్రత్యక్షమైన ఆంధ్రపత్రికను చూసి చాలా ఆనందించాను అందులో కథల, నవలికల పోటీ చూసాక ఎనలేని ఆనందం కల్గింది కానీ కథల పోటీ ఆఖరి తేదీ 16-1-90 దాకా యిచ్చారు మార్కెట్లోకి రావటమే లేటు కదా! కేవలం 5 రోజుల్లో కథ గానీ, నవలిక గాని పంపటం, అది మీకు చేరటం ఎంత వరకూ సాధ్యమో ఆలోచించండి దయచేసి చివరి తేదీని ఒకనెల దాకా పొడిగిస్తారని ఆశిస్తున్నాం

కె కె ఆర్
రామతీర్థం

(దినపత్రికలో ప్రకటించాం. ఎ)

దస్తా

(20-10-89 - 12-1-90) వెలువడిన పత్రికను సర్వాంగసుందరంగా తీర్చిదిద్ది మా ముందుకు పంపిన ఎడిటర్‌ని ప్రశంసించాలంటే దస్తా పేపర్లు కావాల్సిందే

—కాళహస్తి వెంకటశేషగిరిరావు
నెల్లూరు

దూరం-దగ్గర

అనివార్య కారణాల వలన పాఠకులకు కొద్ది వారాలు దూరంగా ఉన్నా వారి అభిమానానికి మాత్రం దూరం కాలేకపోయింది "ఆంధ్రసచిత్ర వారపత్రిక" సాధారణంగా ఒక పత్రిక టేస్ట్‌ని బట్టి అభిమానిస్తారు పాఠకులు కానీ ఆంధ్రపత్రిక మాత్రం పాఠకుల టేస్ట్‌కి అనుగుణంగా నడుచుకుంటూ వారి అభిమానాన్ని పొందుటలో తన ప్రత్యేకతను నిలబెట్టుకొంటుంది

12-1-90 సంచికతో మరల మార్కెట్లోకి అడుగుపెట్టి ప్రతి పాఠకుడ్నీ పలకరించింది పత్రిక ఇక మార్కెట్లోని ఇతర పత్రికలు వెలవెలబోతాయి ఆంధ్రపత్రిక రాకతో "టానా సంయుక్త సాహితీ పోటీ"కి ఎంతటి ప్రశంసలైనా అందించవచ్చు పాఠకులకు మంచి రచనలు అందించాలనే మీ కృషికి అభినందనలు సూపర్ హీరో మరో మంచి సీరియల్ అవుతుంది

అనపర్తి రాంబాబు- తుని

తపస్సు

మా అభిమాన "ఆంధ్ర సచిత్ర వార పత్రి"కను బుక్ స్టాల్‌లో చూడగానే చాలా కాలంగా తపస్సు చేసిన వ్యక్తికి దేవుడు ప్రత్యక్షం అయినంత ఆనందం కల్గింది ఆరు కథలు, నాల్గు సీరియల్స్, ఇంకా అనేక వినూత్నమైన శీర్షికలతో ఈ వారం పత్రిక శోభాయమానంగా ఉంది ముఖ్యంగా డి ఆర్ డి ఒ డైరెక్టర్ "విజ్ఞానశ్రీ" డాక్టర్ "ఎ పి జె అబ్దుల్ కలామ్" గారితో ప్రత్యేక ఇంటర్వ్యూ ఈ వారం పత్రికకే హైలైట్ "జగన్ మిత్ర" గార్కి మా ప్రత్యేకాభినందనలు పత్రికలోని ప్రతి పేజీ మీ కృషికి తార్కాణంగా నిలిచిందంటే అతిశయోక్తి కాదు ఇకముందు కూడా ఇంతటి ఉన్నతమైన నాణ్యతా విలువలతో, ఆలస్యం చేసి మాబోటి పాఠకుల బాధించకుండా క్రమం తప్పకుండా పత్రి వెలువరిస్తారని ఆశిస్తూ .

—కె. ప్రభాకరరావు
భద్రాచల

వజ్ర సంకల్పం

అనుకోకుండా ఈమధ్య ఆంధ్రపత్రిక చదివాన పత్రిక మొత్తం చదివిన తర్వాత అర్థమైంది ఎంత బావుందో! నిజంగా ఈ పత్రిక చదవనందుకు బాధపడి పోయాను కవర్ పేజి ... చివరి పేజి వరకు సరికొత్తదనంగా ఉ... అద్భుతమైన సీరియల్స్, యువతను ... శీర్షికలూ, మంచి మంచి కథలూ ప్రతి... నూతనంగా ఉంది ముఖ్యంగా శాత...హనగా 'వజ్రసంకల్పం' సీరియల్ 'ఫెంటాస్టిక్‌గా' ఉంది థాంక్స్ టు ఎడిటర్ అండ్ రైటర్

—కె మురళి, ఏటూరునాగారం

పండుగ

ఆంధ్ర సచిత్ర వార పత్రిక తిరిగి స్టాల్స్‌లో చూసాం (తీసుకున్నాం చదివాం చాలా బావున్నది "ఇస్యూ") నిజంగా మా అందరికీ (తెలుగు వారికి) నిజంగా పెద్ద పండుగ సంక్రాంతే అయినా ఈసారి చాలా పెద్ద పండుగగా మా కనిపించింది 'వీక్లీ' స్టాల్స్‌లో చూడ్డంతోను

—సాంబు,ఆర్టిస్ట్, మద్రాసు

○

Editorial Adviser: S. RADHAKRISHNA, Editor VEERAJI.
Printed and Published by S NAGESWARARAO for Nageswara Rao Estates Ltd.,
at the Andhra Patrika Press, Gandhi Nagar, Vijayawada-520003
Phones Editorial 75667, Business 61247, 61248